

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 9

సోమవారం 1-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మంచిమాట

ఆయురన్నం ప్రయచ్ఛతి

ఏదైనా ప్రమాదం నుండి కాని, భయంకరమైన వ్యాధి నుండి కాని బయట పడితే భూమి మీద నూకలు మిగిలి ఉన్నాయి అంటారు. అంటే ఆ వ్యక్తి ఇంకా కొంత తినవలసి ఉంది. అది పూర్తిగా ఖర్చు అయ్యే వరకు బతికి ఉంటాడు. ఒకవేళ ఎవరయినా అర్థాంతరంగా శరీరం వదిలితే ఆ వ్యక్తికి నూకలు చెల్లిపోయాయి అంటారు. దీనినే శాస్త్రాలు 'ఆయురన్నం ప్రయచ్ఛతి' అని చెప్పటం జరిగింది.

అంటే మనిషికి ఆయువు ఉంటే అదే బతకటానికి కావలసిన ఆహారాన్ని తెచ్చి పెడుతుంది. ప్రాణం నిలబడటానికి కావలసినంత ఆహారం ప్రకృతి సమకూర్చుతుంది. ఆయువు తీరితే ఎదురుగా ఉన్న ఆహారం చేతి వరకు, చేతిలో ఉన్న ఆహారం నోటిదాకా రాదు. నోటిలో పెట్టుకున్నాక మింగకుండా ప్రాణాలు వదిలిన వారు కూడా ఉన్నారు. ఇటువంటి దానికి ఉదాహరణగా ఎరతో పాటు గాలం కూడా నోటిలో గుచ్చుకుని, ప్రాణాలు కోల్పోయే చేపలు, బోనులో పెట్టిన విషాహారాన్ని తిని చనిపోయే ఎలుకలు నిదర్శనం. ఆయువు ఉంటే బతకటానికి కావలసిన ఆహారం సమకూరుతుంది అనటానికి రాతిలో ఉన్న కప్పని ఉదాహరణగా చెపుతూ ఉంటారు.



అన్నం అంటే తినేది, తినబడేది అని అర్థం. జీవుల చేత తినబడుతూ ఉంటుంది. ఆయువు ఉన్నంత వరకు తినబడుతూ ఉంటుంది. ఆయువు తీరితే తనే తింటుంది. ఏ ఆహారమైతే ప్రాణాలు నిలబెడుతున్నదో, అదే ప్రాణాంతకం అవుతుంది. పరిమితంగా, కావలసినంత మాత్రమే తిన్నప్పుడు బలాన్ని కలిగిస్తుంది. అపరిమితంగా తింటే ముందు ఆరోగ్యం చెడి, ప్రాణహాని కూడా కలుగుతుంది. అందుకే ఏదైనా ప్రయోజనం కోసం కొంతకాలం శరీరం ధరించి ఉండవలసి వస్తే ఆహారాన్ని తగ్గిస్తారు. ఎందుకంటే తాము తెచ్చుకున్న నూకలు మిగుల్చుకోవటానికి. ఈ రోజుకి కూడా చెత్తకుప్పలలో అపస్మారక స్థితిలో ఉన్న పసికందులని చూసి అనాథాశ్రమాలకి అప్పచెప్పటమో, తామే పెంచుకోవటమో, ఎవరికైనా పిల్లలు లేని వారికి ఇవ్వటమో చూస్తూనే ఉన్నాం. అన్ని ఉన్నవారు ఏమౌతున్నారో కూడా ప్రత్యక్ష నిదర్శనాలున్నాయి కదా!

దాక్షిణాత్యులకి, ముఖ్యంగా తెలుగు వారికి అన్నం అంటే వరి అన్నం అనే అర్థం. కాని, 'అత్' అనే ధాతువుకి తిను అని అర్థం. అన్నం అంటే తినేది ఏదైనా అని అర్థం. గోధుమ ప్రధాన ఆహారంగా ఉన్న వారికి అన్నం రొట్టెలు. జొన్న ప్రధాన ఆహారమైతే జొన్నసంకటి, జొన్నరొట్టెలు అన్నం. పాముకి ఎలుక అన్నం. ఆ ఎలుకకి మన వంటింట్లో ఉన్నవన్నీ అన్నమే. కాకపోతే పుస్తకాలు, బట్టలు. ఒక ప్రాణి బతక వలసి ఉంటే ఏదో విధంగా దానికి కావలసిన అన్నం (ఆహారం) దొరుకుతుంది. ఉండవలసినది ఆయువు. ఆహారం ఏదో ఒక రకంగా దొరుకుతుంది.

> ఎవరైనా వృద్ధాప్యంలో ఎక్కువగా తినేస్తు ఉంటే "తిననీయండి. తెచ్చుకున్నది పూర్తి చేయాలి కదా!" అంటారు. అంటే తెచ్చుకున్న ఆహారం పూర్తిగా వెచ్చించబడితే కాని ఆయువు తీరదు. ఆయుర్దాయానికి ఆహారానికి ఉన్న సంబంధాన్ని గుర్తించారు కనుకనే పెద్దలు ఆయుర్దాయం ఉంటే అన్నం పుడుతుంది అని అంటారు. విశ్వామిత్రుడు, మేనక తమకి జన్మించిన బిడ్డని వదిలి వెడితే పక్షులు ఆ పసికందుని కాపాడాయి. శకుంతాల చేత కాపాడబడటం వల్ల ఆ బిడ్డ శకుంతల అయింది. ఆమె జీవించి ఉండాలి కనుక పక్షులు తమకు తోచిన ఆహారాన్ని అందించాయి. అడవి జంతువుల చేత పెంచబడిన ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలు.

– డా.ఎన్.అనంతలక్ష్మి

బౌద్ధవాణి

సమజీవనం

వసంత రుతువు వచ్చేసింది. వనమంతా పూలతో పరిమళిస్తోంది. హిమాలయ ప్రాంతంలో కోలియులకు చెందిన కక్కరవస్తు నగరం అది. ఆ నగర సమీప వనంలో విశాలమైన రావిచెట్టు కింద కూర్చొని ఉన్నాడు బుద్ధుడు తన భిక్షు సంఘంతో. కోలియ యువకుడు దీర్ఘజాణుడు కూడా వచ్చి బుద్ధుని దగ్గరే కూర్చుని తన సందేహాలు తీర్చుకుంటున్నాడు. 'భగవాన్! లోకంలో హితకారి, సుఖకారి అయిన నాలుగు ధర్మాల గురించి చెప్పండి?' అని అడిగాడు. ఆ ప్రశ్నతో అక్కడ ఉన్న భిక్షువులందరూ సర్దుకు కూర్చున్నారు. అంతలో కొద్దిదూరంలో రైతులు లయబద్ధంగా అరిచే అరుపులు వినిపించాయి.

కావళ్ళకు ధాన్యం మోపులు కట్టుకుని, భుజాన మోస్తూ, వేగంగా నడుస్తూ ఉన్నా రైతులు 'ఓహోం.. ఓహోం..'' అంటూ అరుస్తూ, ఆ వూపులో వేగంగా పోతున్నారు. వారి మధ్యలో ఉన్న రైతు కావడిని కాస్త ముందుకు సర్దుకున్నాడు. దానితో వెనుక బలం పెరిగింది. గట్టు దాటే సమయంలో వెనక్కు పడిపోయాడు. మరలా లేచి కావడిబద్దను భుజానికి ఎత్తి, ముందూ, వెనుకల బరువులు సర్దుకుని వారితో నడక సాగించాడు. కానీ, వెనుకపడ్డాడు. రైతులు వెళ్ళిపోయారు.

''దీర్ఘజాణా; ఈ లోకంలో హితాన్ని, సుఖాన్ని కూర్చే ఉత్థాన సంపద, ఆరక్ష సంపద, కళ్యాణ మిత్రత, సమజీవనం– అనే నాలుగు సంపదలు ఉన్నాయి'' అన్నాడు. ''భగవాన్! వాటి గురించి చెప్పండి'' అడిగాడు దీర్ఘజాణుడు నమ్రతగా. ''దీర్ఘజాణూ! వృత్తి ద్వారా సంపాదించేది ఉత్థాన సంపద. పశుపాలనం, వ్యవసాయం, వాణిజ్యం, శిల్పకళ, ఉద్యోగం... సోమరితనాన్ని వీడి ఈ వృత్తులు నిర్వహించడంలో నేర్పరి అవుతారు. ఇలా సాధించుకున్నదే ఈ సంపద''

''అలాగే! ఒకరు తమ కండబలాన్ని ఉపయోగించి, నిరంతరం శ్రమించి, కష్టపడి చమటోడ్చి, సంపద కూర్చుకుంటాడు. తాను శ్రమించి పొందిన ఈ సంపదని రాజులు, దొంగలు కాజేయకుండా, అగ్నికి ఆహుతి కాకుండా, వరదపాలు కాకుండా రక్షించుకుంటాడు. దీన్నే ఆ రక్ష సంపద అంటారు.



''మరి, దీర్ఘజాణూ! మిత్రులు కూడా మనకు సంపదే! శీలవంతులు, సదాచారులు, శ్రద్ధావంతులు, ప్రజ్ఞానులు, త్యాగబుద్ధి కలిగిన మిత్రులు ఉంటే... మనం కూడా వారిలా శీలసంపద పొందుతాం. శ్రద్ధా సంపద సాధిస్తాం. సదాచారులై జీవిస్తాం. ఇలా శీల, జ్ఞాన సంపదలు మనకు మంచి మిత్రుల వల్ల వస్తాయి. అందుకే కల్యాణ(మంచి) మిత్రులు కూడా మనకు ఒక సంపదే.

ఇక, సమజీవనం అంటే అన్నింటికంటే మనకు హితకారి. కొందరు ఆడంబరాల కోసం తమ ఆదాయానికి మించి వ్యయం చేస్తారు. ఇంకొందరు ఎక్కువ ధనం ఉన్నప్పటికీ పిసినారితనం చూపుతారు. వీరిద్దరూ మోసే కావడి ఏదో ఒకవైపు బరువు పెరిగో, తరిగో సమతుల్యత కోల్పోతుంది. దానివల్ల మోసేవాడి భుజం పట్టు తప్పుతుంది. కావడి పడిపోతూ... మోసేవారినీ పడేస్తుంది.''

''దీర్ఘజాణూ..! అలా కాకుండా ఆదాయ వ్యయాలను సరితూచుకుంటూ జీవించే వారే 'సమజీవనం' సాగించేవారు. విలాసాలూ, విందులూ, ఇతరులతో పోల్చుకుని అతిగా వ్యయం చేయడం మాని, అవసరాల మేరకు జీవిస్తే... కొద్దిగా ఆదాయం కూడా సమకూరుతుంది. వారి జీవితం నిశ్చింతగా సాగుతుంది; దీర్ఘజాణూ! సకల గృహస్తులకు ఈ సమజీవనం చాలా అవసరం! ఎందుకంటే... ఇదే హితం! ఇదే సుఖం!'' అన్నాడు బుద్ధుడు. దూరం నుండి రైతులు కావళ్ళు మోస్తూ లయబద్ధంగా అరుస్తున్న అరుపులు వినిపిస్తున్నాయి! ధీర్ఘజాణు వంగి బుద్ధుని పాదాలకు నమస్కరించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

గుర్రాలు మాట వినవు...

ధర్మాచరణకు ప్రధానమైన ప్రతికూల పరిస్థితులు రెండు–అర్థము, కామము. ఇవి ధర్మాచరణకు నిరంతరం పరీక్ష పెడుతుంటాయి. అర్థము అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు, భోగ సంబంధమైన సమస్త వస్తువుల రాశిని అర్థము అనవచ్చు. తనకు సుఖాన్నిచ్చే మంచం, కుర్చీ, ప్రయాణించే వాహనం ఏదయినా కావచ్చు. కామము అంటే – కోర్కె వేరు, అవసరం వేరు. రెండింటికీ మధ్య సున్నితమైన భేదం ఉంది. అవసరం తీరకపోతే పాపం అడ్డు వస్తున్నదని గుర్తు. దానిని తీసేయగలిగిన శక్తి ఒక్క భగవంతుడికే ఉంది. పాపం పోవడానికి యజ్ఞ యాగాదులు చేస్తారు. సంతానం కోసం అశ్వమేధం.. వంటివి.

మనం ఒక కోరిక కోరుకుంటున్నాం. అది అవసరం కూడా. దానికి భగవంతుడిని ఆశ్రయించడం తప్పు కానేకాదు. భగవంతుడు ఏమంటాడంటే... నాలుగు రకాల భక్తులు నన్ను ఎప్పుడూ ఆశ్రయించి ఉంటారు. చాలా ఆర్తి కలిగినవాళ్ళు, అసలు భగవంతుడెవరని తెలుసుకోవాలన్న కుతూహలం ఉన్న వాళ్ళు. మంచి పనులు చేయడానికి ధన సహాయం కోరుకుంటున్న వాళ్ళు. తత్త్వతః పరమాత్మను ఎరుకలోకి తెచ్చుకుని స్తోత్రం చేసేవాళ్ళు. చివరి తరగతి భక్తులగురించి శంకరాచార్యులవారు ఏమంటారంటే... సముద్ర కెరటం సముద్రాన్ని స్తోత్రం చేస్తే ఎలా ఉంటుందో తత్త్వాన్ని అవగతం చేసుకుని జ్ఞాని భగవంతుడిని స్తోత్రం చేయడం అలా ఉంటుంది –అని. ఎక్కడో కోటానుకోట్లలో ఒక్కరే కారణజన్ములుంటారు. వారికి జన్మతః వైరాగ్యం ఉంటుంది. వారికి అర్థకామముల మీద ఎటువంటి తపనా ఉండదు. ఒకవేళ ఏదయినా మనసులో ఏర్పడినా, ధర్మాన్ని రక్షించడానికి ఇలా చేద్దామన్న ఆలోచనే తప్ప వ్యక్తిగతంగా ఏమీ ఉండదు. ఏకాకిగా తనలో తాను రమిస్తూ ఉంటాడు. దేనినీ కోరుకోడు. అతడు జీవన్ముక్తుడు.



కానీ అందరూ ఆ స్థితిలో ఉంటారా !!! ఉండరు. ధర్మానికి పెద్ద పరీక్ష అర్థము. ఒక కోరిక తీర్చుకోవడానికి పరుగులు తీయడం.. చివరకు తీర్చుకుంటాడు. అది తీరిపోయింది కనుక మళ్లీ ఆ కోరిక పుట్టదు– అని చెప్పలేం. మామిడిపండు తినాలని ఆరాటపడి, చివరకు అది దొరికి తిన్న తరువాత.. అది అక్కడితో ఆగదు. అదే పండు మళ్ళీ మళ్లీ కావాలనిపించవచ్చు, ఏ పండయినా సరే అని మళ్ళీ పరుగులు మొదలు కావచ్చు. ఇది ఎలా ఉంటుంది అంటే నేతి పాత్ర పట్టుకుని వెళ్ళి అగ్నిహోత్రాన్ని చల్లార్చడానికి ప్రయత్నించినట్లు ఉంటుంది. ప్రజ్వరిల్లే అగ్ని మీద నెయ్యి చల్లితే, అది ఆరదు, మరింత విజృంభిస్తుంది. కోరికలూ అంతే. అవి ఉపశమించే అవకాశం ఉండదు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మరి అర్థకామములు లేకుండా మనిషి ఎలా ఉంటాడు? అది సాధ్యం కాదు. అవి ఉండితీరతాయి. ఎవరికయినా భోగం అనుభవించాలన్న కోరిక ఉంటుంది. దానిని తీర్చుకోవడానికి అవసరమయిన సాధనసంపత్తిని సమకూర్చుకోవాలన్న కోరికా ఉంటుంది. దానికి సనాతన ధర్మం ఒక చక్కటి పరిష్కారం చూపింది. అర్థకామములను ధర్మంతో ముడిపెట్టింది. ఇప్పుడు ధర్మబద్ధమైన కామము, ధర్మబద్ధమైన అర్థము.. ఇవి మోక్షానికి కారణమవుతాయి తప్ప బంధాలకు, కోరికలు అపరిమితంగా ప్రజ్వరిల్లడానికి కారణం కావు. అప్పుడు మనిషి జీవితం, కుటుంబ జీవనం, సామాజిక వ్యవస్థ అన్నీ క్రమబద్ధంగా ఉంటాయి, నియంత్రణలో ఉంటాయి. చెలియలికట్ట దాటే సాహసం చేయవు.

సినిమా



● నాగచైతన్య

● పూజా హెగ్డే

పదేళ్ల తర్వాత...

హీరో నాగచైతన్య, హీరోయిన్ పూజా హెగ్డే మరోసారి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. 2014లో విడుదలైన 'ఒక లైలా కోసం' సినిమాలో వీరిద్దరూ జంటగా నటించారు. దాదాపు పదేళ్ల తర్వాత మరోసారి జోడీగా నటించనున్నారని టాక్. ప్రస్తుతం చందు మొండేటి దర్శకత్వంలో 'తండేల్' సినిమా చేస్తూ బిజీగా ఉన్నారు నాగ చైతన్య. ఆ తర్వాతి చిత్రాన్ని 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో చేయనున్నారట. నాగచైతన్య కోసం మిస్టరీ, పౌరాణిక, థ్రిల్లర్ అంశాలతో కథ రెడీ చేస్తున్నారట కార్తీక్ దండు. ఈ చిత్రంలో నాగచైతన్య సరసన పూజా హెగ్డేని కథానాయికగా తీసుకోవాలని మేకర్స్ అనుకుంటున్నారని భోగట్టా. ఇక 2022లో విడుదలైన 'ఆచార్య' సినిమా తర్వాత ('ఎఫ్ 3'లో ప్రత్యేక పాట చేశారు) మరో తెలుగు సినిమా కమిట్ కాలేదు పూజాహెగ్డే. నాగ చైతన్యతో నటించే తాజా చిత్రం ఆమెకు తెలుగులో పెద్ద కమ్‌బ్యాక్ అవుతుందని టాక్. ప్రస్తుతం బాలీవుడ్‌లో 'దేవా' అనే సినిమా చేస్తున్నారు పూజా హెగ్డే.



● రష్మిక

ఐదు భాషల్లో డబ్బింగ్

'నేను సూడలేదని ఓ పులుపెక్కిపోతాండవట కదా..' అంటూ 'పుష్ప' సినిమాలో రష్మికా మందన్నా అదో రకం మాస్ స్టయిల్‌లో చెప్పిన డైలాగ్ చాలా పాపులర్ అయిన విషయం తెలిసిందే. ఈ కూర్గ్ బ్యూటీ 'పుష్ప' కోసం చిత్తూరు యాస నేర్చుకుని మరీ ఆ సినిమాలో తాను చేసిన శ్రీవల్లి పాత్రకు డబ్బింగ్ చెప్పారు. ఇక ఈ మధ్యకాలంలో సంచలన విజయం సాధించిన 'యానిమల్'కి హిందీలోనూ, ఆ చిత్రం తెలుగు, కన్నడ అనువాదాలకూ తన పాత్రకు సొంత గొంతు వినిపించారు. ఇప్పుడు ఏకంగా ఐదు భాషలు మాట్లాడారు రష్మికా మందన్నా. తాను లీడ్ రోల్ చేస్తున్న 'గర్ల్ ఫ్రెండ్' చిత్రం టీజర్‌కి తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ హిందీ భాషల్లో డబ్బింగ్ చెప్పారు రష్మిక. ఆమె మలయాళం మాట్లాడటం ఇదే తొలిసారి. ఐదు భాషల్లోనూ రష్మిక డబ్బింగ్ చెప్పిన విధానం అద్భుతం అని కొనియాడుతున్నారు 'గర్ల్ ఫ్రెండ్' చిత్ర దర్శకుడు రాహుల్ రవీంద్రన్. ఈ నెల 5న రష్మిక పుట్టినరోజు సందర్భంగా ఐదు భాషల టీజర్ విడుదల కానుంది. మరి.. రష్మికతో టీజర్‌కి డబ్బింగ్ చెప్పించిన రాహుల్ పూర్తి పాత్రకు ఆయా భాషల్లో డబ్బింగ్ చెప్పిస్తారేమో చూడాలి.



● విజయ్ దేవరకొండ

నా ప్రేమ విఫలమైంది!

'నా ప్రేమ విఫలమైంది' అంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు హీరో విజయ్ దేవరకొండ. ఆయన హీరోగా రూపొందిన 'ఫ్యామిలీ స్టార్' ఈ నెల 5న రిలీజవుతోంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు విజయ్ దేవరకొండ. ''జీవితంలో అందరూ ఏదో ఒక సమయంలో రిలేషన్‌షిప్‌లో ఉంటారు. నా ఫ్రెండ్స్‌లో కూడా పలువురు ప్రేమలో పడ్డారు. అయితే కొన్ని కారణాల వల్ల భాగస్వామితో విడిపోయి, ఎంతో బాధ పడ్డారు. ఆ తర్వాత మరొకరి ప్రేమలో పడి సంతోషంగా ఉన్నారు. ఒకరితో బ్రేకప్ అయ్యాక మరొకరితో ప్రేమలో ఉండటం సహజమే. అయితే ఒకే టైమ్‌లో ఇద్దరితో లవ్‌లో ఉండటాన్ని ప్రోత్సహించను. మహిళలపై నాకు చాలా గౌరవం ఉంది. ఒకరితో ప్రేమలో ఉన్నప్పుడు వేరే అమ్మాయిని నా జీవితంలోకి ఆహ్వానించను. గతంలో నేనొక అమ్మాయిని ప్రేమించాను. కానీ, ఆ ప్రేమ విఫలమైంది'' అన్నారు. కొత్త దర్శకులకు చాన్స్ ఇవ్వడం గురించి ఇదే ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''ప్రస్తుతానికి కొత్త దర్శకులతో పని చేయాలనుకోవడం లేదు. అనుభవం లేకపోతే మేకింగ్, బడ్జెట్ మేనేజ్ చేయడం కష్టం. ఒక్క మూవీ చేసిన దర్శకుడితో అయినా పని చేస్తా. ఎందుకంటే వారికి మేకింగ్‌పై అవగాహన ఉంటుంది. అయితే వారి గత సినిమా హిట్టా? ఫట్టా అనేది మాత్రం ఆలోచించను'' అన్నారు.

వినోదాల నాట్యం

సూర్య తేజ ఏలే, మీనాక్షీ గోస్వామి జంటగా 'దొరసాని' మూవీ ఫేమ్ కేవీఆర్ మహేంద్ర దర్శకత్వం వహించిన చిత్రం 'భరతనాట్యం'. పాయల్ సరాఫ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి హీరో ఆనంద్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరై, ''క్రైమ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన 'భరతనాట్యం' హిట్ అవ్వాలి'' అన్నారు. ''ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు నటి, దర్శక–నిర్మాత జీవితా రాజశేఖర్. ''భరతనాట్యం' మూవీ కడుపుబ్బా నవ్వించేలా ఉంటుంది'' అన్నారు కేవీఆర్ మహేంద్ర, పాయల్ సరాఫ్. ''మహేంద్రగారు ఈ సినిమాని అద్భుతంగా తీశారు'' అన్నారు సూర్యతేజ ఏలే.



● మీనాక్షి, సూర్యతేజ

నాకు దేశీయుడే ఇష్టం

''విదేశీ యువకుడు వద్దు... నాకు దేశీ పార్ట్‌నరే కావాలి'' అంటున్నారు కృతీ సనన్. టబు, కరీనా కపూర్‌తో కలిసి కృతి నటించిన హిందీ చిత్రం 'క్రూ' ఇటీవల విడుదలైంది. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కెనడియన్ నటుడు ర్యాన్ గోస్లింగ్ ప్రస్తావన రాగా, ''శ్వేత జాతీయులు హాట్‌గా ఉండొచ్చు. కానీ ఇప్పటివరకూ నేను ఏ విదేశీయుడికీ ఆకర్షితురాలిని కాలేదు. భారతీయుడితోనే డేటింగ్ చేస్తా'' అని చెప్పారు కృతి. 'ఇండియన్ ఎందుకు ఇష్టం అంటే' అంటూ అదే ఇంటర్వ్యూలో కృతీ సనన్ చెబుతూ – ''నాకు భారతీయులంటేనే ఇష్టం. దేశీ వ్యక్తితో డేటింగ్‌కి ఇష్టపడతాను. మరీ ముఖ్యంగా అతనికి హిందీ అర్థం కావాలి. ఎందుకంటే నేను ప్రతిసారీ ఇంగ్లిష్ మాట్లాడలేను. అలాగే ఇంగ్లిష్ పాటలకు డ్యాన్స్ చేయలేను. నాతో కలిసి పంజాబీ, హిందీ పాటలకు డ్యాన్స్ చేసే భారతీయుడు కావాలి. అలాంటి వ్యక్తితో డేటింగ్ నాకు అభ్యంతరం లేదు'' అన్నారు. ఇదిలా ఉంటే.. కృతీ సనన్ ఆల్రెడీ కబీర్ బహియా అనే వ్యక్తితో ప్రేమలో ఉన్నారనే టాక్ ఉంది. క్రికెటర్ ధోనీకి కబీర్ సన్నిహితుడని, కృతీకంటే కబీర్ పదేళ్లు చిన్నవాడని బాలీవుడ్ టాక్.



● కృతీ సనన్

వెల్‌కమ్ టు అంజనాద్రి

ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన 'హనుమాన్' సినిమా ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో తేజా సజ్జ, అమృతా అయ్యర్ జోడీగా నటించారు. కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన 'హనుమాన్' సంక్రాంతి కానుకగా జనవరి 12న రిలీజై, పాన్ ఇండియా స్థాయిలో భారీ హిట్ సాధించి, అద్భుతమైన వసూళ్లు రాబట్టింది. 'హనుమాన్'కి కొనసాగింపుగా 'జై హనుమాన్' వస్తుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా స్పెషల్ గ్లింప్స్‌ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. చుట్టూ అందమైన కొండలు.. మధ్యలో పెద్ద నది.. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని చూపిస్తూ 'వెల్‌కమ్ టు అంజనాద్రి 2.0' అని పేర్కొన్నారు. అలాగే 'హ్యాష్‌ట్యాగ్ జై హనుమాన్'తో పాటు 'హనుమాన్' మూవీ నుంచి 'రఘునందన..' అనే పాటను కూడా జత చేశారు. 'జై హనుమాన్'లో ఆంజనేయ స్వామి పాత్రను ఒక స్టార్ హీరో చేస్తారని ప్రశాంత్ వర్మ చెప్పారు. దాంతో ఆ స్టార్ హీరో ఎవరు? అనే ఆసక్తి అందరిలో నెలకొంది. 2025లో ఈ సినిమా రిలీజ్ కానుంది.



● 'జై హనుమాన్' పోస్టర్

పైలం పిలగా...

సాయి తేజ, పావని కరణం జంటగా ఆనంద్ గుర్రం దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పైలం పిలగా'. రామకృష్ణ బొద్దుల, ఎస్‌కే శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని గాయకుడు, సంగీత దర్శకుడు రామ్ మిర్యాల విడుదల చేశారు. ''వ్యవసాయం చేయలేక, వలస పోయి కార్పొరేట్ బానిస అవలేక.. ఉన్న ఊళ్లోనే వ్యాపారవేత్తగా మారి పది మందికి పని కల్పించి అంబానీలా కోట్లు సంపాదించాలని కలలు కనే ఓ మధ్య తరగతి యువకుడి కథే ఈ చిత్రం'' అన్నారు మేకర్స్.




● పావని, సాయితేజ

డే డ్రింకర్‌తో నో నో...

''పొద్దున్నే పొద్దున్నే నిద్ర లేవడం లేవడమే పెద్ద రూమర్ విన్నాను'' అంటూ సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు హాలీవుడ్ నటి సిడ్నీ స్వీనీ. జానీ డెప్ హీరోగా రూపొందనున్న తాజా చిత్రం 'డే డ్రింకర్'లో హీరోయిన్‌గా సిడ్నీ స్వీనీ నటించనున్నారనే ప్రచారం హాలీవుడ్‌లో జరుగుతోంది. ఈ వార్తను ఉద్దేశించే నో నో... అంటూ సిడ్నీ పై విధంగా స్పందించారు. అది మాత్రమే కాదు... ''రూమర్స్ వస్తుంటాయి. వాటిని వదిలేయండి. మీరు (ప్రేక్షకులు) మాత్రం థియేటర్‌కు వెళ్లి ఈ మధ్య విడుదలైన నా 'ఇమ్మాక్యులేట్' మూవీ చూడండి'' అన్నారు సిడ్నీ. మైఖేల్ మోహన్ దర్శకత్వంలో సిడ్నీ స్వీనీ లీడ్ రోల్‌లో సైకలాజికల్ హారర్ మూవీగా రూపొందిన 'ఇమ్మాక్యులేట్' మంచి టాక్‌తో దూసుకెళుతోంది.



● సిడ్నీ స్వీనీ


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 9

సోమవారం 1-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



విశాఖలో ఢిల్లీ గెలుపు


ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఐపీఎల్ 17వ సీజన్‌లో గెలుపు బోణీ కొట్టింది. డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో ఆదివారం విశాఖలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. 12లో



ప్రమాదంలో ప్రజాస్వామ్యం

మోదీ పాలనలో రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ నాశనమవుతున్నాయని విపక్ష ఇండియా కూటమి నేతలు ఆరోపించారు.

వివరాలు 6లో ▸



గవర్నర్ పదవి ఆషామాషీ కాదు

గవర్నర్లు రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలని, ఆ పదవి ఆషామాషీ కాదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న అన్నారు.

వివరాలు 6లో ▸



అవినీతిపరుల కూటమి

అవినీతిపై తాము పోరాడుతుంటే..వారేమో పరిరక్షిస్తున్నారని విపక్షాల 'ఇండియా' కూటమిపై ప్రధాని మోదీ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



200 స్థానాలు గెలిచి చూపించండి

400 ఎంపీ స్థానాలు గెలుస్తామంటున్న బీజేపీ 200 సీట్లు గెలిచి చూపించాలని బెంగాల్ సీఎం మమత సవాల్ విసిరారు.

వివరాలు 6లో ▸

మాస్ లీడర్

58 నెలలుగా తమకు కాపు కాసిన నాయకుడి కోసం జనం ఆరాటం

కళ్లారా చూసేందుకు పరితపిస్తున్న ప్రజానీకం.. రోడ్ షోలో ఊరూరా ఘన స్వాగతం

- మండుటెండైనా.. అర్ధరాత్రయినా ఆత్మీయ నేత కోసం ఉప్పొంగుతున్న అభిమానం.. మూడు జిల్లాల్లో అతి పెద్ద ప్రజా సభలుగా ప్రొద్దుటూరు, నంద్యాల, ఎమ్మిగనూరు సభలు
- పేదలకు మరింత గొప్ప భవిష్యత్తు కోసం అసమాన్యుడు చేస్తున్న యుద్ధ కవాతు.. మాటకు కట్టుబడి.. నిబద్ధతతో నిలబడే నేతను గుండెల్లో దాచుకుంటున్న జనం
- 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర దేశ చరిత్రలో మహోజ్వలఘట్టంగా నిలుస్తుందంటున్న పరిశీలకులు
- చంద్రబాబు కూటమి వెన్నులో వణుకు పుట్టించేలా సాగుతున్న బస్సు యాత్ర
- మాటపై ఎన్నడూ నిలబడని బాబును ఛీకొడుతున్న జనం.. టీడీపీ సూపర్ సిక్స్ హామీలనుఏమాత్రం పట్టించుకోని వైనం
- చంద్రబాబు కుట్రలను చిత్తు చేసేందుకు తామంతా సిద్ధమంటూ లక్షల మంది సెల్‌ఫోన్ టార్చిలైట్లు వెలిగించి సభలలో సీఎం జగన్‌కు సంఘీభావం

10లో



అవ్వాతాతలకు మళ్లీ.. అవే అవస్థలు

సామాజిక పింఛన్‌దారులకు కష్టాలు తెచ్చిపెట్టిన బాబు బ్యాచ్
వలంటీర్లపై నిమ్మగడ్డ సంస్థ ఫిర్యాదుతో ఈసీ ఆంక్షలు

2019 ఆగస్టులో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో 55 నెలలుగా ఇళ్ల వద్దే పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు

ప్రతి నెలా క్రమం తప్పకుండా ఠంచన్‌గా ఉదయాన్నే చేతికి డబ్బులు

చంద్రబాబు హయాంలో కార్యాలయాల చుట్టూ పడిగాపులే

ఏ గ్రామంలో ఎప్పుడిస్తారో నాడు తెలియని దుస్థితి

3లో


ఫైల్

పింఛన్లపై బాబు డబుల్ గేమ్

- అటు అడ్డుపడి ఈసీకి ఫిర్యాదు
- ఇటు పంచాలంటూ లేఖలు
- ప్రజాగ్రహంతో బాబు బృందంలో ఆందోళన

3లో

వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు కక్షకు పరాకాష్ట

బీ టీంతో వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు దొంగ దెబ్బ

సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ ఫక్తు టీడీపీ కార్యకర్త

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

ఫ్యాక్ట్‌చెక్

'ఓట్లాట మీ ఓటి కుండదే'

- రైతులపై కపట ప్రేమతో రామోజీ మొసలి కన్నీరు
- చంద్రబాబు భజనలో దిగజారిన పచ్చ పత్రిక
- సేద్యానికి 9 గంటలు విద్యుత్ ఇచ్చినా నాలిక మడతలే
- కొన్ని ప్రాంతాల్లో రైతుల విజ్ఞప్తి మేరకు రెండు విడతలు
- చంద్రబాబు హయాంలో రోజుకి నాలుగు గంటలు ఇవ్వడమే గగనం
- వాస్తవాలను దాచిపెట్టి ఈనాడు తప్పుడు రాతలు

5లో

పర్యాటకంపై రామోజీ నాటకం

- దేశంలోనే పర్యాటక ఆకర్షణలో అగ్రగామి రాష్ట్రాల్లో ఏపీ ఒకటి
- రిషికొండ బ్లూఫ్లాగ్‌తో పాటు లేపాక్షికి యునెస్కో తాత్కాలిక గుర్తింపుతో ప్రపంచ ఖ్యాతి
- అత్యుత్తమ టూరిజం పాలసీతో జీఐఎస్‌లో పెట్టుబడుల వెల్లువ
- 177 ఒప్పందాల ద్వారా రూ.17,127 కోట్లు పెట్టుబడులు
- వాస్తవాలకు 'పచ్చ' గంతలు కట్టి రామోజీ పిచ్చి రాతలు

10లో

'ప్రగతి' రథంపై 'పచ్చ' బురద

- బాబు హయాంలో నెలనెలా అప్పులే ఆర్టీసీకి గతి
- డొక్కు బస్సులతో నిత్యం తిప్పలే
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చర్యలతో ఆర్టీసీలో నవశకం
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం.. కొత్త బస్సుల కొనుగోలు వేగవంతం.. ఇప్పటికే 1,406 కొత్త బస్సుల కొనుగోలు
- మరో 10,625 బస్సుల కొనుగోలుకు ఆమోదం
- బస్సుల నిర్వహణకు భారీగా నిధులు

14లో

టాప్-5 రాష్ట్రాల్లో ఏపీ

జీఎస్‌డీపీ పెరుగుదలలో ఏపీకి నాలుగో స్థానం

నికర రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో తలసరి ఆదాయం పెరుగుదలలో మూడో స్థానం

దశాబ్ద కాలంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి 1.9 రెట్లు పెరుగుదలతో నాలుగో స్థానం

అదే సమయంలో రాష్ట్ర తలసరి ఆదాయం 1.8 రెట్లు పెరుగుదలతో మూడో స్థానం

పెరుగుతున్న తలసరి ఆదాయం అసమానతల నిర్మూలనకు నిదర్శనం

ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్ర స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం పెరుగుదలలో ఆంధ్రప్రదేశ్ టాప్ ఐదు రాష్ట్రాల్లో ఉంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలలో ఏపీ దేశంలోనే నాలుగో స్థానంలో ఉండగా.. తలసరి ఆదాయం పెరుగుదలలో మూడో స్థానంలో ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. వివిధ రాష్ట్రాల్లో 2012 నుంచి 2022 వరకు దశాబ్ద కాలంలో జీఎస్‌డీపీ, తలసరి ఆదాయాల పెరుగుదలపై ఎస్‌బీఐ తన రీసెర్చ్ నివేదికను గురువారం విడుదల చేసింది. కోవిడ్ తరువాత దేశ స్థూల ఉత్పత్తికి (జీడీపీకి) రాష్ట్రాల వారీగా వెయిటెడ్ కంట్రిబ్యూషన్ పాయింట్లు పెరిగిన తీరును కూడా నివేదిక వెల్లడించింది. ఇలా పెరుగుతున్న తలసరి ఆదాయం అట్టడుగు స్థాయి అసమానతల నిర్మూలనకు నిదర్శమని పేర్కొంది. కోవిడ్ తరువాత

మిగతా 2వ పేజీలో ▶

అద్వానీకి భారతరత్న ప్రదానం

బీజేపీ దిగ్గజ నేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ (96) 'భారత రత్న' పురస్కారం అందుకున్నారు. ఆదివారం ఢిల్లీలోని అద్వానీ నివాసంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తదితరులు పాల్గొన్నారు.

6లో





వడగాడ్పుల వార్నింగ్ బెల్..

వచ్చే నాలుగు రోజులూ 3-5 డిగ్రీలు పెరిగే అవకాశం

రాయలసీమలో నెల రోజుల ముందే ప్రభావం

కోస్తాంధ్రలోనూ పెరగనున్న ఉష్ణతాపం

పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోనూ తీవ్రతరం

14లో

కూటమిలో కుతకుత


- రాష్ట్రంలో ఎక్కడా నేతల మధ్య కనిపించని ఐక్యత
- క్షేత్రస్థాయిలో నేతల అసంతృప్తి ప్రకంపనలు
- జగ్గయ్యపేటలో తాతయ్యకు టికెట్‌పై మండి పడుతున్న కేడర్
- అధిష్టానంపై అసంతృప్తితో టీడీపీకి మాజీ ఎమ్మెల్యే చాంద్ బాషా రాజీనామా

- వివరాలు 14లో

విద్యుత్ రంగంలో సరికొత్త అధ్యాయం

వైఎస్ జగన్ పాలనలో విస్తరించిన ఎనర్జీ ప్రాజెక్టులు

- విద్యుత్ రంగ అభివృద్ధి, తక్కువ ఖర్చుతో సరఫరాకు ప్రణాళికలు
- ఈ ప్రాజెక్టుల ద్వారా పెద్దఎత్తున యువతకు ఉద్యోగాలు.. అధికారంలోకి వచ్చాక అందుబాటులోకి 1600 మెగావాట్ల థర్మల్ యూనిట్లు
- ఇంధన ప్రాజెక్టులపై రూ.9.57 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు
- 44,240 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్లాంట్ల ఏర్పాటు
- వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం 'సెకీ' నుంచి 7 వేల మెగావాట్ల విద్యుత్
- సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఏపీ



- వివరాలు 2లో

ఇదండీ సంగతి





ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఆపత్కాలంలోనూ ఆదుకున్న దేవుడు

మాది మధ్యతరగతి కుటుంబం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి గ్రామానికి చెందిన మాకు కొద్దిపాటి భూమి ఉన్నా... పంటలు పండిన దాఖలాల్లేవు. ప్రతి ఏటా పెట్టుబడి పెట్టడం... ఆనక పరిస్థితులు అనుకూలించక నష్టపోవడం మాకు అలవాటైపోయింది. ఈ పరిస్థితుల్లో అప్పులు తప్పేవి కాదు. గత ప్రభుత్వం మాకు ఏ విధంగానూ సాయమందించిన దాఖలాల్లేవు. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత అందించిన నవరత్నాల ద్వారా మా కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంది. నా భార్యకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750లు, వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.600, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.6,204 అందాయి. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏడాదికి రూ. 13,500 వంతున,



వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ. 24వేలు అందింది. అంతేగాకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ వచ్చింది. కోవిడ్ వంటి ఆపత్కాలంలో కూడా సంక్షేమ పథకాలు అందించిన మహానుభావుడు జగనన్న. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది.

– భళ్ల సాయిమల్లికార్జున, అప్పనపల్లి
(యేడిద బాలకృష్ణ, విలేకరి, మామిడికుదురు)

పైసా ఖర్చు లేకుండా సచివాలయ ఉద్యోగాలు

ఉన్న ఊళ్లో ఉపాధి లేక ప్రస్తుతం విజయనగరం జిల్లా రేగిడి మండలం మడ్డువలస రిజర్వాయర్ ముంపు గ్రామం కొట్టిశ నుంచి 2001లో పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట గ్రామానికి వలస వచ్చాం. నేను బీఏ, బీఈడీ చేసినా ప్రభుత్వ ఉద్యోగం దొరకక ఒక ప్రైవేటు పాఠశాలలో టీచర్ పనిచేస్తూ ఇద్దరు పిల్లల్ని చదివించుకున్నాను. నాకు రెండెకరాల భూమి, ఇల్లు ఉంది. పిల్లలు ఇద్దరూ పదో తరగతి పాసయిన తరువాత ఉన్నత చదువులు చదివించేందుకు శక్తి చాలక డిప్లమోలు చేయించాను. అబ్బాయి మణికృష్ణ అగ్రికల్చర్ డిప్లమో, అమ్మాయి కీర్తిప్రియ ఫిషరీస్ డిప్లమో చేశారు. అదృష్టవశాత్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయాలు ఏర్పాటు చేయడంతో మా పిల్లలు ఇద్దరికీ సచివాలయ ఉద్యోగాలు వచ్చాయి. అబ్బాయి నూకలవాడ సచివాలయం, అమ్మాయి వెంగాపురం సచివాలయాల్లో



ఉద్యోగాలు చేస్తున్నారు. ఉద్యోగాలకు ఎవరి చుట్టూ తిరగలేదు. ఎవరికీ ఒక్క పైసా అయినా ఇవ్వలేదు. పూర్తిగా మెరిట్‌తోనే తప్ప లంచాలకు, సిఫార్సులకు తావులేకుండా నియామకాలు జరిగాయి. ఇంతటి పారదర్శకంగా మా పిల్లలకు ఉద్యోగాలు కల్పించిన ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– ఎ.పోలినాయుడు, బలిజిపేట
(పి.కోటేశ్వరరావు, విలేకరి, సీతానగరం)

ప్రభుత్వ సాయంతో చేపల వ్యాపారం

ఈ ప్రభుత్వం అందించిన సాయంతో చేపల వ్యాపారం ప్రారంభించాను. రోజూ వెయ్యి రూపాయల వరకు సంపాదిస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాను. మాది విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం. నేను మణికంఠ డ్వాక్రా గ్రూప్‌లో సభ్యురాలిగా ఉన్నాను. వైఎస్సార్ ఆసరా ద్వారా ఇప్పటివరకు రూ.72 వేలు లబ్ధిపొందాను. చేయూత ద్వారా ఏటా 18,750 వంతున వచ్చింది. నా భర్త కొండకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందుతోంది. మా అబ్బాయి మత్స్యకార భరోసా ద్వారా రూ.50 వేలు వచ్చాయి. మనుమడు అప్పలరాజుకు



విద్యాదీవెన కింద రూ.24 వేలు, మనుమరాలు పూర్ణకు అమ్మఒడి ద్వారా ఏడాదికి రూ. 15వేలు వంతున ప్రభుత్వం నుంచి పొందాము. ఈ ప్రభుత్వం అందించిన పథకాల వల్ల వచ్చిన డబ్బుతో చేపల వ్యాపారం చేస్తున్నాను. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో చేపలు కొని తగరపువలస ప్రైవేట్ మార్కెట్‌కు వెళ్లి విక్రయిస్తాను. రోజుకు రూ.400 నుంచి రూ.1000 ఆదాయం వస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో మా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది. మళ్లీ ఈ ప్రభుత్వమే రావాలి.

– గరికిన ధనలక్ష్మి, పెదనాగమయ్యపాలెం
(గేదెల శ్రీనివాసరెడ్డి, విలేకరి, తగరపువలస)

కోడ్ ముగిసేదాకా.. సచివాలయాల్లోనే పింఛన్లు

- ఈసీ ఆదేశాలతో నూతన మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- సచివాలయాల వద్ద సిబ్బందితో కొనసాగనున్న కార్యక్రమం
- 3వ తేదీ నుంచి పెన్షన్ల పంపిణీ చేపట్టేలా అధికారుల ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల ద్వారా ఇంటివద్దే పింఛన్ల పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం బ్రేక్‌లు వేసినందున తిరిగి ఎన్నికల కోడ్ ఎత్తివేసే వరకు వచ్చే రెండు మూడు నెలల పాటు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే పింఛన్ల పంపిణీని లబ్ధిదారుల ఇంటి వద్ద కాకుండా గ్రామ, వార్డు సచివాలయాల వద్ద చేపడతారు. సచివాలయాల వద్ద సిబ్బంది లబ్ధిదారుల ఆధార్ లేదా ఐరిస్ వివరాలను నిర్ధారించుకుని పెన్షన్లు అందచేస్తారు. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆదివారం మార్గదర్శకాలను జారీ చేసింది. ఆర్థిక సంవత్సరం ముగింపుతో పాటు బ్యాంకులకు వరుసగా సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి అవ్వాతాతలకు పింఛన్ల పంపిణీని ప్రారంభించాలని వారం క్రితమే ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. గతేడాది కూడా ఏప్రిల్‌లో మూడో తేదీ నుంచి పింఛన్ల పంపిణీ మొదలైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం శనివారం జారీ చేసిన తాజా ఆదేశాల మేరకు మూడో తేదీ నుంచి పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సెర్ప్ అధికారులు వెల్లడించారు.

- కోడ్ కారణంగా సచివాలయాల వద్ద జరిగే పింఛన్ల పంపిణీలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సచివాలయాల సిబ్బంది అందరి సేవలను వినియోగించుకోవాలని సెర్ప్ తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. వలంటీర్ల ప్రమేయం లేకుండా కేవలం సచివాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో మాత్రమే పింఛన్ల పంపిణీని కొనసాగించాలని స్పష్టం చేసింది.
- గతంలో మాదిరిగానే సచివాలయాల వద్ద కూడ లబ్ధిదారులకు ఆధార్ అనుసంధానంతో కూడిన బయోమెట్రిక్ లేదా ఐరిస్, ముఖ గుర్తింపు విధానంలోనే పింఛన్ల పంపిణీ జరుగుతుంది.
- ఎవరైనా లబ్ధిదారులకు ఆధార్ అనుసంధానంతో కూడిన బయోమెట్రిక్ విషయంలో ఇబ్బందులు తలెత్తితే అలాంటి వారికి ప్రత్యేకంగా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఆధర్యంలో రియల్ టైం బెనిఫిషీయర్స్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్(ఆర్‌బీఐఎస్) విధానంలో పింఛన్ల పంపిణీ చేపట్టాలని ఆదేశించింది.
- పింఛన్లు పంపిణీ చేసే సమయంలో ఎటువంటి పబ్లిసిటీ చేయరాదు. ఫోటోలు, వీడియోలు తీయకూడదు. ఎన్నికల కోడ్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదు తరలింపుపై అంక్షలు ఉన్నందున పింఛన్ల డబ్బులను బ్యాంకు నుంచి డ్రా చేసే బాధ్యతను గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శితో పాటు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు అప్పగించగా వార్డు సచివాలయాల్లో అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలతో పాటు వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీలకు అప్పగించారు.
- సచివాలయాల వారీగా బ్యాంకుల నుంచి నగదు డ్రా వివరాలను సంబంధిత నియోజక వర్గ ఎన్నికల రిట్నరింగ్ అధికారులకు ఆయా మండల ఎంపీడీవోలు లేదా మున్సిపల్ కమిషనర్లు ముందుగానే తెలియజేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. సచివాలయాలవారీగా విడుదల చేసే డబ్బుల వివరాలతో కూడిన ధృవీకరణ పత్రాలను ప్రభుత్వమే జారీ చేస్తుంది.



- గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది అందరికి కొత్తగా పింఛన్ల పంపిణీకి సంబంధించి ఆన్‌లైన్ లాగిన్‌లను అందుబాటులో ఉంచుతున్నామని, తమ మొబైల్ ఫోన్లలో పింఛన్ల పంపిణీ యాప్‌ను సిబ్బంది డౌన్‌లోడ్ చేసుకోవాలని సెర్ప్ సూచించింది. ఆయా సచివాలయాల పరిధిలో పింఛన్ లబ్ధిదారులందరి వివరాలు అక్కడ పనిచేసే సిబ్బంది మొబైల్ యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

వాటిని సంబంధిత మండల ఎంపీడీవోలు లేదా మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌లో అందుబాటులో ఉంటాయి.

- పింఛన్ల పంపిణీ కోసం సచివాలయాల సిబ్బంది వద్ద అదనంగా ఫ్రింగర్ ప్రింటర్లను అందుబాటులో ఉంచుతున్నారు.
- గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది అందరూ పింఛన్ల పంపిణీలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ఏ రోజు ఎంత మందికి ఇచ్చారనే వివరాలను సేకరించడంతోపాటు సంబంధిత రోజు మిగిలిపోయే నగదును తిరిగి స్వాధీనం చేసుకునే బాధ్యతను వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు లేదా వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీలకు అప్పగించారు.

వలంటీర్లకు ఇచ్చిన ఫోన్లు, సిమ్‌లు వెనక్కి తీసుకోండి

జిల్లా కలెక్టర్లకు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఆదేశం

సాక్షి, అమరావతి: ఎన్నికల నేపథ్యంలో పింఛన్లు సహా ఇతర అన్ని సంక్షేమ పథకాల నగదు పంపిణీ విధుల నుంచి గ్రామ, వార్డు వలంటీర్లను దూరంగా ఉంచుతూ, వారికి ప్రభుత్వం అందజేసిన సెల్ ఫోన్లు, సిమ్‌లు, ట్యాబ్‌లు వంటి ఇతర పరికరాలన్నింటినీ స్వాధీనం చేసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆదివారం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని వలంటీర్ల వద్ద నుంచి ఆయా పరికరాలను స్వాధీనం చేసుకునేలా కలెక్టర్లు ఆదేశాలు జారీ చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. కోడ్ నిబంధన మేరకు ఆయా పరికరాలను జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించాలన్నారు.

పేదలపై ఇంత కక్ష ఎందుకు బాబూ?

- జాతిపిత ఆశయాలను సీఎం జగన్ నెరవేరుస్తుంటే ఇన్ని అడ్డంకులా?
- పేదలకు పెన్షన్లు ఇస్తున్న వలంటీర్లపై కత్తికడతారా?
- చంద్రబాబు వైఖరిపై యూకేలో గాంధీ విగ్రహం వద్ద ప్రవాసాంధ్రుల నిరసన

సాక్షి, అమరావతి: జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ఏపీ సీఎం జగన్ ఆచరణలో అమలు చేస్తుంటే, చంద్రబాబు మాత్రం పేదలపై కక్ష పెంచుకుంటున్నారని యూకేలోని పలువురు ప్రవాసాంధ్రులు పేర్కొన్నారు. 'గ్రామ స్వరాజ్య స్థాపనలో భాగంగా సీఎం జగన్ వలంటీర్ల వ్యవస్థ తెచ్చారు. వారు ఇంటింటికీ వెళ్లి పేదలకు పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు, అలాంటి వారిపై ఇంతగా కక్షకడతారా?' అని చంద్రబాబును ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్రకు మద్దతు తెలుపుతూ వైఎస్సార్‌సీపీ యూకే సోషల్ మీడియా విభాగం ఆధ్వర్యంలో లండన్ ఇల్ఫోర్డ్ లోని శ్రేయాస్ హోటల్లో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు, పురందేశ్వరి, పవన్ కళ్యాణ్ కలిసి సిటిజన్ ఫోరం ఫర్ డెమోక్రసీ సంస్థ ద్వారా కోర్టుల్లో పిటిషన్లు వేసి పేదలకు వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారన్న విషయం మీడియా ద్వారా తెలుసుకొని, లండన్ పార్లమెంట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.



యూకేలోని గాంధీ విగ్రహం వద్ద ప్రవాసాంధ్రుల నిరసన

ఏపీలో సమూల మార్పులు

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యూకే కన్వీనర్లు డాక్టర్ ప్రదీప్ చింతా, ఓబులరెడ్డి పాటకోట మాట్లాడుతూ గ్రామాల్లో సీఎం జగన్ సమూల మార్పులు తెచ్చారన్నారు. అక్కచెల్లెమ్మలకు రూ.2.70 లక్షల కోట్లు బటన్ నొక్కి వారి అకౌంట్లలోకి జమ చేశారని, ఒక్క పైసా లంచం లేకుండా, ఎక్కడా వివక్ష లేకుండా అర్హులందరికీ పథకాలు అందించారని గుర్తుచేశారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, సున్నావడ్డీ, విద్యా దీవెన, వసతి దీవెన, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, పెన్షన్ కానుక, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, జగనన్న చేదోడు, జగనన్న తోడు, 31 లక్షల ఇళ్ల పట్టాలు కల్యాణమస్తు, షాదీ తోఫా సైతం ఇలా అనేక పథకాలు పేదలకు అందించారని వివరించారు. అందుకే సిద్ధం బస్సు యాత్ర విజయవంతంగా సాగుతోందన్నారు. ఏపీలో కూటమి నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని గాంధీకి విన్నవించామన్నారు. తొలుత వారు సిద్ధం పోస్టర్లు పట్టుకొని సీఎం జగన్ బస్సు యాత్రకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు జై జగన్, జోహార్ వైఎస్సార్, ఎన్నికలకు మేం అంతా సిద్ధం, వైనాట్ 175 అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అక్కడి వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్ర రెడ్డి అలవల, నారాయణరెడ్డి బూర్ల, మలిరెడ్డి కిషోర్, భూమిరెడ్డి కార్తీక్, పాలెం క్రాంతి, శ్రీనివాస్ తాళ్ల, శ్రీనివాస్ రెడ్డి దొంతిబోయిన, ప్రతాప్ భీమిరెడ్డి, వజ్రాల రాజశేఖర్, పూర్ణచంద్ర దుగ్గెంపూడి, శ్రీకాంత్ ముక్కు, ఆవుల వంశీకృష్ణ, కంభంపాటి వినయ్, కిరణ్ కొరికాన, వీర పులిపాకల, శ్యామ్, చాగంటి మణికంఠేశ్వర పలువురు ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు.

జీవితాల్లో శాంతి, దయ, ప్రేమను నింపాలి

ప్రజలకు సీఎం జగన్ ఈస్టర్ శుభాకాంక్షలు



సాక్షి,అమరావతి: సత్యంలో ఉన్న శక్తిని, విశ్వాసాన్ని ప్రపంచానికి చాటిన మహిమాన్వితమైన పర్వదినం ఈస్టర్ అని సీఎం జగన్ పేర్కొన్నారు. 'మనందరి జీవితాల్లో శాంతి, దయ, ప్రేమను ఈ ఈస్టర్ నింపాలని కోరుకుంటున్నాను. ఈ సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు' అంటూ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

నేడు మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఇలా..

సాక్షి,అమరావతి/సాక్షి, పుట్టపర్తి: మేమంతా సిద్ధం 5వ రోజు సోమవారం (ఏప్రిల్1) షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల ఆదివారం విడుదల చేశారు. యాత్రలో భాగంగా సీఎం జగన్ ' శ్రీసత్యసాయి జిల్లాలోని సంజీవపురం వద్ద ఏర్పాటు చేసిన రాత్రి బస ప్రాంతం నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి బత్తలపల్లి, రామాపురం, కట్ట కిందపల్లి, రాళ్ళ అనంతపురం, ముదిగుబ్బ, ఎన్ఎస్‌పీ కొట్టాల, మలకవేముల మీదుగా పట్నం చేరుకుంటారు. పట్నం నడింపల్లి, కాళసముద్రం, ఎర్ర దొడ్డి మీదుగా కుటాగుళ్లకు చేరుకుని మధ్యాహ్న భోజన విరామం తీసుకుంటారు. అనంతరం బయలుదేరి కదిరి చేరుకుంటారు. అక్కడ పీవీఆర్ ఫంక్షన్ హాల్ లో మైనారిటీ సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మోటుకపల్లె మీదుగా జోగన్నపేట, ఎస్.ములకలపల్లె, మీదుగా చీకటిమనిపల్లెలో రాత్రి బసకు వెళతారు.

సోషల్ మీడియాను ఊపేస్తోన్న 'ఉయ్ లవ్ జగన్'

సాక్షి, అమరావతి: సీఎం జగన్ పరిపాలన మీద మరో పాట విడుదలైంది. సీఎం వైఎస్ జగన్ సంక్షేమంపై విడుదలైన పాటలన్నీ ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రెండ్‌ను క్రియేట్ చేస్తున్నాయి. తాజాగా విడుదలైన 'ఉయ్ లవ్ జగన్' పాట రిలీజ్ అయిన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యింది. ఈ పాటలో సీఎం జగన్ ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని, సీఎం జగన్‌పై ప్రజలకు ఉన్న అభిమానాన్ని చక్కగా వివరించారు.

ప్రశాంత ఎన్నికలకు సర్వ సన్నద్ధం


- ఎన్నికలకు పోలీసు శాఖ పూర్తి బందోబస్తు
- 1.14లక్షల మంది రాష్ట్ర పోలీసులు
- 52 కంపెనీల రాష్ట్ర పోలీసు బలగాలు
- 491 కంపెనీల అదనపు బలగాలు
- ఇప్పటికే 100 కంపెనీల కేంద్ర బలగాలు రాక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శాసన సభ, లోక్‌సభ ఎన్నికలకు పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది. ఎన్నికలు ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలోని 175 శాసన సభ నియోజకవర్గాల్లో 46,165 పోలింగ్ కేంద్రాల్లో మే 13న పోలింగ్ జరుగుతుంది. అదనంగా 887 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. వాటిపై కేంద్ర ఎన్నికల కమిషన్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పోలింగ్‌కు ముందు, పోలింగ్ అనంతరం రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చేపట్టాల్సిన చర్యలపై పోలీసు శాఖ సమీక్షించింది. సున్నితమైన పోలింగ్ కేంద్రాల పరిధిలో మరింత పటిష్టంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సూచనల మేరకు పోలీసు బందోబస్తు ఏ విధంగా ఉండాలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రానికి చెందిన 1,14,950 మంది సివిల్ పోలీసులు, 52 కంపెనీల సాయుధ బలగాలు పోలింగ్ విధుల్లో పాల్గొంటాయి. వీటికి అదనంగా 491 కంపెనీల కేంద్ర బలగాలు అవసరమని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ఎన్నికల కమిషన్, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆమోదించాయి. కేంద్ర పోలీసు బలగాల నుంచి 465 కంపెనీలు, పొరుగు రాష్ట్రాల నుంచి 26 కంపెనీల బలగాలను రాష్ట్రానికి కేటాయించాలని నిర్ణయించారు. ఒక్కో కంపెనీలో 72 మంది సాయుధ పోలీసులు ఉంటారు. ఆ ప్రకారం 491 కంపెనీల ద్వారా మొత్తం 35,352 మంది సాయుధ కేంద్ర పోలీసులు రాష్ట్రంలో ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. ఇప్పటికే 7,200 మందితో కూడిన 100 కంపెనీల బలగాలు రాష్ట్రానికి చేరుకున్నాయి. మిగిలిన బలగాలు ఏప్రిల్‌లో దశలవారీగా రాష్ట్రానికి చేరుకుంటాయి.

విద్యుత్ రంగంలో సరికొత్త అధ్యాయం

వైఎస్ జగన్ పాలనలో విస్తరించిన ఎనర్జీ ప్రాజెక్టులు

సాక్షి, అమరావతి: విద్యుత్ రంగంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తోంది. విద్యుత్ రంగాన్ని ఉజ్వలంగా తీర్చిదిద్దడంతోపాటు భవిష్యత్ తరాలకు తక్కువ ఖర్చుతో విద్యుత్ సరఫరా, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన దిశగా సాగుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో సహాయపడే పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించింది. గత ఐదేళ్లుగా ప్రణాళికాబద్ధంగా విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పుతోంది. విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టులను స్థాపించడానికి పునరుత్పాదక ఇంధన ఎగుమతి విధానం 2020ని ప్రభుత్వం ప్రకటించింది. పవన, సౌర, చిన్న జల, పారిశ్రామిక వ్యర్థాలు, వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులను కొత్తగా నెలకొల్పేందుకు తోడ్పాటునందించింది. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతో, ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న ప్రాజెక్టులతో రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించిన విద్యుత్ రంగ ప్రగతి

- రాష్ట్రంలో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంలో భాగంగా నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డీఎస్‌టీపీఎస్)లో 800 మెగావాట్ల యూనిట్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. ఎన్‌టీటీపీఎస్‌లో 800 మెగావాట్ల యూనిట్ సీవోడీ పూర్తి చేసుకుని అందుబాటులోకి వచ్చింది. ఈ 1,600 మెగావాట్లతో కలిపి జెన్‌కో థర్మల్ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం 6,610 మెగావాట్లకు పెరిగింది.
- ప్రపంచంలోనే అతిపెద్ద 5,230 మెగావాట్ల ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక శక్తి నిల్వ ప్రాజెక్టుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఓర్వకల్, పాణ్యం మండలాల సరిహద్దులోని పిన్నాపురంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నంద్యాల జిల్లాలో రూ.25,850 కోట్ల విలువైన మూడు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ఇటీవల సీఎం వైఎస్ జగన్ భూమి పూజ చేశారు. వీటి ద్వారా 5,300 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఎన్‌హెచ్‌పీసీతో కలిసి ఏపీ జెన్‌కో నెలకొల్పనున్న పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల ద్వారా మరో 2 వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.
- దాదాపు 44,240 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. 8,025 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు ఇప్పటికే ప్రైవేట్ పెట్టుబడిదారులకు కేటాయించింది. గ్రీన్‌కో గ్రూప్ ద్వారా నంద్యాల, కర్నూలు జిల్లాల్లో 2,300 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఏఎం గ్రీన్ ఎనర్జీ (ఆర్సెలర్ మిట్టల్ గ్రూప్) 700 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు పునాది పనులు పురోగతిలో ఉన్నాయి.
- వ్యవసాయానికి వచ్చే 30 ఏళ్ల పాటు 9 గంటల పగటిపూట ఉచిత విద్యుత్‌ను కొనసాగించడం కోసం 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.
- సౌర విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే ఏపీ ఐదో స్థానంలో నిలిచిందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ ప్రకటించింది. 2019లో 241.50 మెగావాట్లు, 2020లో 337.02 మెగావాట్లు, 2021లో 335.375 మెగావాట్లు, 2022లో 113.685 మెగావాట్లు, 2023లో ఇప్పటివరకూ 13.8 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యం పెరిగింది.
- చిన్న జల శక్తి ప్రాజెక్టులు 2021లో 3 మెగావాట్లు, 2023లో 1.20 మెగావాట్లు కొత్తగా వచ్చాయి.
- పట్టణ ప్రాంతాల్లో పోగయ్యే చెత్త నుంచి విద్యుత్‌ను తయారు చేసే సాలిడ్ వేస్ట్ పవర్ ప్రాజెక్టులనూ రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పుతోంది. 2021లో గుంటూరులో 15 మెగావాట్ల ప్లాంటు, 2022లో విశాఖలో 15 మెగావాట్ల సామర్థ్యంతో మరో ప్లాంటు ప్రారంభమయ్యాయి. పరిశ్రమల వ్యర్థాల నుంచి కరెంటును ఉత్పత్తి చేసే 0.125 మెగావాట్ల ప్రాజెక్టు తూర్పుగోదావరి జిల్లాలో మొదలైంది.
- 2023 మార్చిలో జరిగిన వైజాగ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో దాదాపు రూ.9.57 లక్షల కోట్ల విలువైన ఇంధన రంగ ప్రాజెక్టులకు ప్రముఖ పెట్టుబడిదారులతో 42 అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. వీటి ద్వారా దాదాపు 1.80 లక్షల ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉంది.
- గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, ఇంధన సామర్థ్యం, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి రంగాలలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా ఏపీని ప్రభుత్వం నిలిపింది. రాష్ట్రంలో ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య కార్యక్రమాల ద్వారా దాదాపు రూ.3,800 కోట్లు విలువైన 5,600 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అయ్యింది. తద్వారా 4.76 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గాయి.

ఇంధన రంగంలో ఎన్నో అవార్డులు

ఇంధన భద్రతలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి పలు జాతీయ అవార్డులు లభించాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 'జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు'ను వరుసగా రెండేళ్లు రాష్ట్ర ప్రభుత్వం అందుకుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డులను రాష్ట్ర ప్రభుత్వం అందుకుంది. ఏపీ ట్రాన్స్‌కో, నెడ్‌క్యాప్, ఏపీకి మూడు ఎనర్షియా అవార్డులు వచ్చాయి. ఏపీఎస్పీడీసీఎల్‌కు రెండు జాతీయ అవార్డులు లభించాయి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల్లో మన రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు అత్యుత్తమమని కేంద్ర ప్రభుత్వానికి చెందిన రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) ప్రకటించింది. 'కన్స్యూమర్ సర్వీస్ రేటింగ్ ఆఫ్ డిస్కమ్స్' పేరుతో విడుదల చేసిన నివేదికలో ఏపీలోని మూడు డిస్కంలకు 'ఏ' గ్రేడ్ లభించింది. వీటన్నిటి సాధన వెనుక సీఎం జగన్ ముద్ర, ఆయన ప్రణాళికలు ఉన్నాయి.

టాప్-5 రాష్ట్రాల్లో ఏపీ

▶ మొదటి పేజీ తరువాయి

వాస్తవ జీడీపీలో ఏపీ ఏడు వెయిటెడ్ బేసెస్ పాయింట్లతో 12వ స్థానంలో ఉంది. కోవిడ్ సమయంలో దేశ జీడీపీ 5.7 శాతం ఉండగా అందులో జీడీపీకి ఏపీ వెయిటెడ్ కంట్రిబ్యూషన్ 0.3 శాతానికి పెరిగిందని నివేదిక తెలిపింది. కోవిడ్ అనంతరం 2022–23లో దేశ జీడీపీ 8.1 శాతం ఉండగా అందులో ఏపీ కంట్రిబ్యూషన్ 0.4 శాతానికి పెరిగింది. 1.1 శాతంతో మహారాష్ట్ర, ఆ తరువాత 0.7 శాతంతో ఉత్తరప్రదేశ్ ఉన్నట్లు నివేదిక తెలిపింది.

నికర స్థూల ఉత్పత్తిలో..

2012–2022 మధ్య గుజరాత్ నికర స్థూల ఉత్పత్తిలో తలసరి ఆదాయం పెరుగుదలలో తొలిస్థానంలో ఉండగా.. కర్ణాటక రెండు, ఏపీ మూడు, తెలంగాణ నాలుగు, అస్సాం ఐదో స్థానంలో ఉందని నివేదిక పేర్కొంది. ఈ కాలంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలలో గుజరాత్ మొదటి స్థానం, కర్ణాటక రెండు, అసోం మూడు, ఏపీ నాలుగో స్థానంలో ఉందని.. ఆ తరువాత తెలంగాణ, సిక్కిం, మధ్యప్రదేశ్ రాష్ట్రాలున్నాయని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వివరించింది. మరోవైపు.. టెక్నాలజీ వినియోగించడంలో దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని కూడా నివేదిక తెలిపింది.

2012 నుంచి 2022 వరకు రాష్ట్రాల స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) పెరుగుదల ఇలా..

రాష్ట్రం	పెరుగుదల రెట్లు
గుజరాత్	2.2
కర్ణాటక	2.0
అస్సాం	1.9
ఆంధ్రప్రదేశ్	1.9
ఒడిశా, తెలంగాణ.. సిక్కిం, మధ్యప్రదేశ్	1.9

గత దశాబ్ద కాలంలో నికర రాష్ట్రాల స్థూల ఉత్పత్తిలో తలసరి ఆదాయం పెరుగుదల..

రాష్ట్రం	పెరుగుదల రెట్లు
గుజరాత్	1.9
కర్ణాటక, ఏపీ	1.8
తెలంగాణ, అస్సాం	1.7

క్లుప్తంగా...

ప్రజలను ఇబ్బంది పెట్టడమే ఎల్లో బ్యాచ్ పని

నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ వరప్రసాదరావు మండిపాటు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజలను ఇబ్బంది పెట్టడమే చంద్రబాబు, ఎల్లో బ్యాచ్ పనిగా పెట్టుకున్నారని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. చంద్రబాబు సొంత మనిషి నిమ్మగడ్డ రమేశ్‌తో ఫిర్యాదు చేయించి వలంటీర్లను సంక్షేమ పథకాలు పంపిణీ చేయకుండా ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి తెచ్చారన్నారు. ఈసీ నిర్ణయంతో రాష్ట్రంలో ఇంటింటికీ పెన్షన్ పంపిణీకి అవరోధం ఏర్పడిందన్నారు. దీని వల్ల రాష్ట్రంలో ప్రధానంగా వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు పడాల్సి వస్తుందన్నారు.

టీడీపీ కోసం నిమ్మగడ్డ రాక్షస అవతారం

జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు



మధురవాడ(విశాఖ): అవ్వాతాతలు, దివ్యాంగులు ఒకటో తారీఖున వచ్చే పెన్షన్ డబ్బు కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తుంటారని, అది సకాలంలో అందకుండా చేసేందుకు నిమ్మగడ్డ రమేశ్ టీడీపీ కోసం రాక్షస అవతారం ఎత్తారని జనజాగరణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక కన్వీనర్ వాసు ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. నిమ్మగడ్డ టీడీపీతో కలిసి కుట్ర చేశారని విమర్శించారు. వలంటీర్‌లపై ఆంక్షలు విధించేలా చేసి టీడీపీ తన గొయ్యిని తానే తవ్వుకున్నదన్నారు.

ఈసీ ఆదేశాలు దురదృష్టకరం



కంకిపాడు(పెనమలూరు): ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం పెట్టాలని ఎన్నికల సంఘం ఆదేశించడం దురదృష్టకరమని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా అన్నారు. కృష్ణాజిల్లా ఈడుపుగల్లులో ఆయన ఆదివారం మాట్లాడారు. వలంటీరు వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని గుర్తుచేశారు. నిబంధనలను అతిక్రమించిన దాఖలాలు ఎప్పుడూ లేవన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులను దూరం చేసేలా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా ఎన్నికల సంఘం ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

విలేకర్లకు, బూత్ కన్వీనర్లకు టీడీపీ ట్యాబ్‌లు

తుని రూరల్: కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ప్రలోభాలకు తెర తీశారు. బూత్ కన్వీనర్లకు, మీడియా ప్రతినిధులకు బహుమతులిచ్చి ప్రసన్నం చేసుకుంటున్నారు. తుని మండలం తేటగుంట గ్రామంలో తుని టీడీపీ అభ్యర్థి యనమల దివ్య తండ్రి యనమల రామకృష్ణుడు అతిథి గృహంలో ఆదివారం శామ్‌సంగ్ ట్యాబ్‌లు అందజేశారు. యనమల దివ్య భర్త, కర్ణాటకకు చెందిన ఐఆర్‌ఎస్ అధికారి గోపీనాథ్ స్వయంగా 20 మంది విలేకర్లకు, 223 మంది బూత్ కన్వీనర్లకు ట్యాబ్‌లు అందజేశారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి దివ్య విజయానికి సహకరించాలని విలేకర్లను, గెలుపునకు కృషి చేయాలని బూత్ కన్వీనర్లను కోరినట్టు సమాచారం.

తాడిపత్రిలో రూ.1.31 కోట్లు స్వాధీనం

పోలీసుల అదుపులో వ్యాపారి, ఇద్దరు మహిళలు

తాడిపత్రి అర్బన్: అనంతపురం జిల్లా తాడిపత్రిలోని బంగారు వ్యాపారి షేక్ ఖాజీ మస్తాన్‌వలీ నుంచి అర్బన్ పోలీసులు రూ.1.31 కోట్లు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యాపారితో పాటు ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మస్తాన్‌వలీ తాడిపత్రి నుంచి ప్రొద్దుటూరుకు పెద్దమొత్తంలో నగదు అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో నిఘా పెట్టారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదరీతిలో సంచరిస్తున్న ఓ వ్యక్తితో పాటు మరో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1.31 కోట్ల నగదు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల సమాచారంతో ఐటీ అధికారులు రంగప్రవేశం చేశారు. ఆదివారం రాత్రి తాడిపత్రి అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసుల అదుపులో ఉన్న వారిని విచారణ చేపట్టారు. వారి ఇళ్లలో కూడా తనిఖీ చేసినట్లు సమాచారం.

పింఛన్లపై బాబు డబుల్ గేమ్

అటు అడ్డుపడి ఈసీకి ఫిర్యాదు.. ఇటు పంచాలంటూ లేఖలు



సాక్షి, అమరావతి: అటుపక్క సామాజిక పింఛన్లను అడ్డుకోవడం.. ఇటుపక్క సకాలంలో ఇచ్చేయాలంటూ ఎన్నికల సంఘానికి లేఖలు రాయడం! ఇదీ చంద్రబాబు రెండు నాలుకల వైఖరి! స్వార్థ ప్రయోజనాల కోసం దిగజారుడు రాజకీయాలు, పేదల నోట్లో మట్టి కొట్టే ఆలోచనలు తనకు మినహా మరెవరికీ ఉండవని మరోసారి రుజువు చేసుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో భాగంగా ప్రభుత్వం నియమించిన వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇంటివద్దే పింఛన్లు అందిస్తూ పాలనను ప్రతి గడపకూ చేరువ చేశారు. దేశంలోనే తొలిసారిగా సీఎం జగన్ తీసుకొచ్చిన ఈ వ్యవస్థపై చంద్రబాబు వేయని నింద లేదు, చేయని ఆరోపణ లేదు. వివక్ష, లంచాలు లేకుండా ప్రభుత్వ పథకాల ద్వారా పేదలు పారదర్శకంగా లబ్ధి పొందడం టీడీపీకి, ఎల్లో మీడియాకు కంటగింపుగా మారింది. చంద్రబాబు, ఆయన పార్ట్‌నర్ పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియా నిత్యం అభాండాలు వేయడమే పనిగా వ్యవహరించారు. వలంటీర్లు రాత్రిళ్లు వెళ్లి తలుపులు కొడుతున్నారని, వారి వల్ల ఆడపిల్లలకు రక్షణ లేదని, ఆ వ్యవస్థను రద్దు చేయాలని కుట్రపూరిత ఆరోపణలు చేశారు. పవన్ కళ్యాణ్ అయితే రాష్ట్రంలో వేలమంది యువతులు కనిపించకుండా పోయారని, అందుకు వలంటీర్లే కారణమంటూ దారుణంగా మాట్లాడారు. ఇలా అడుగడుగునా విపక్షం వేధించి అవమానించినా వలంటీర్లు పేదల సంక్షేమమే లక్ష్యంగా సేవాభావంతో విధులు నిర్వహించారు.

నిమ్మగడ్డ ద్వారా..

సంక్షేమ పథకాలను ప్రజలకు అందకుండా చేయడం ద్వారా ప్రభుత్వంపై బురద చల్లాలన్నది చంద్రబాబు కుతంత్రం. ఈ పనిని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌కు ఆయన ప్రత్యేకంగా అప్పగించారు. నిమ్మగడ్డ రాష్ట్ర ఎన్నికల అధికారిగా ఉన్నప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా, చంద్రబాబుకు అనుకూలంగా ఏ స్థాయిలో పని చేశారో అందరికీ తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ కోసం హఠాత్తుగా వాయిదా వేసి రాజ్యాంగాన్నే అపహాస్యం చేసిన చరిత్ర ఆయనది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూనే హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో చంద్రబాబు బినామీలు సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్‌ను కలసి చంద్రబాబు కోసం ఏం చేయడానికైనా వెనుకాడబోనని చాటుకున్నారు. పదవీ విరమణ తరువాత కూడా నిస్సిగ్గుగా చంద్రబాబుకు మేలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. అందుకోసం కొంతమందిని పోగుచేసి సిటిజన్ డెమొక్రటిక్ ఫోరం పేరుతో తెర వెనుక రాజకీయాలు నడిపారు. అందులో భాగంగానే వలంటీర్ల వ్యవస్థ లేకుండా చేసేందుకు కోర్టులో కేసు వేశారు. పింఛన్ల పంపిణీకి అడ్డుపడి ఈసీకి ఫిర్యాదులు చేశారు.

ప్రజాగ్రహంతో...

పింఛన్ల పంపిణీకి అడ్డంకులు సృష్టించడంలో సక్సెస్ అయిన చంద్రబాబు, నిమ్మగడ్డ కుట్రపూరిత రాజకీయాలతో వలంటీర్లను ప్రజలకు దూరం చేయగలిగామని చంద్రబాబు బృందం చంకలు గుద్దుకున్నా ఒకటో తేదీ రావడంతో వారిలో వణుకు మొదలైంది. చంద్రబాబు, నిమ్మగడ్డ నిర్వాకాల కారణంగా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ ఆగిపోయే పరిస్థితి నెలకొంది. దీనిపై ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నట్లు పసిగట్టిన చంద్రబాబు బృందం ప్లేటు ఫిరాయించింది. తాము అడ్డుకున్న కార్యక్రమం గురించి మళ్లీ వారే ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాయడం గమనార్హం. పింఛన్ల పంపిణీకి తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటూ అందులో పేర్కొన్నారు.

చంద్రబాబు జేబు సంస్థతో ప్రజలకు అన్యాయం

ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు జేబు సంస్థ అయిన సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ద్వారా వలంటీర్లపై విషం చిమ్మి ప్రజల కడుపు కొడుతున్నారని ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) నలమారు చంద్రశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. వలంటీర్ల వ్యవస్థ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలకంగా ఉందని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పైరవీలకు తావు లేకుండా అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను సకాలంలో అందజేస్తున్న వ్యవస్థపై చంద్రబాబు కక్షగట్టడం పేద ప్రజలకు అన్యాయం చేయడమేనని అన్నారు. వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు, పవన్ మొదటి నుంచి ద్వేషాన్ని వెళ్లగక్కుతూనే ఉన్నారని చెప్పారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంస్థ కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్ కుమార్ గతంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్నప్పటి నుంచి చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసిన వ్యక్తేనని తెలిపారు. వలంటీర్లను ఆపడం వల్ల ప్రజలకు అందే ఫలాలు ఉద్యోగుల ద్వారా పంపిణీ చేస్తే ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. దీనికంతటికీ పూర్తి బాధ్యత చంద్రబాబు, పవన్ కళ్యాణే వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ తన నిర్ణయాన్ని మరోసారి పరిశీలించి, వలంటరీ వ్యవస్థని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

మళ్లీ 'అవ్వ'స్థలు తప్పవా!

- మాపై దయ చూ'పింఛనే' లేరా!
- రేపటి నుంచి పింఛన్ ఇంటికి తెచ్చి ఇవ్వరంట నిజమేనా!
- వలంటీర్లను తీసేశారంట ఎందుకు బాబూ..!
- సచివాలయానికి వెళ్లి తెచ్చుకోవడం మా వల్ల కాదయ్యా..
- ఉప ముఖ్యమంత్రి ముత్యాల నాయుడు వద్ద ఓ అవ్వ ఆవేదన



పింఛను ఇంటికి తెచ్చి ఇవ్వరంట నిజమేనా అంటూ ముత్యాలనాయుడి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎరకమ్మ

నక్కపల్లి(అనకాపల్లి జిల్లా): రేపటి నుంచి పింఛన్ ఇంటికి తెచ్చి ఇవ్వరన్న వార్తలు అవ్వాతాతల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. టీడీపీ హయాంలో పడిన అవస్థలు జ్ఞప్తికి తెచ్చుకుని వారు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందేమోనని మదనపడుతున్నారు. ఇదే విషయంపై తన గోడు వెలిబుచ్చారు ఓ అవ్వ. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం చినదొడ్డిగల్లుకు వచ్చిన వైఎస్సార్ సీపీ అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు కురందాసు వృద్ధురాలు ఎరకమ్మ ఇంటికి వెళ్లారు. పింఛను వస్తుందా అంటూ ఆరా తీశారు. ఎరకమ్మ బదులిస్తూ ''ఇప్పటివరకు ప్రతినెలా ఒకటో తేదీ పొద్దుపొద్దునే వలంటీరు వచ్చి డబ్బులిస్తున్నాడు. రేపు ఒకటోతేదీ కదా పింఛను ఇంటికి తెచ్చి ఇవ్వరంట. మేమే సచివాలయానికి వెళ్లి తెచ్చుకోవాలంట. వలంటీర్లను తీసేశారంట నిజమేనా బాబూ! ఈ వయసులో సచివాలయం వరకు వెళ్లి తెచ్చుకోలేమయ్యా.. ఇంటికొచ్చి ఇచ్చేటట్టు చూడయ్యా'' అంటూ వేడుకుంది. ముత్యాలనాయుడు స్పందిస్తూ చంద్రబాబు వల్లే ఎన్నికల అధికారులు వలంటీర్లను రెండునెలలపాటు ఆపారు. జగనన్నకు ఓట్లు వేసి గెలిపిస్తే మళ్లీ వలంటీర్లు ఇంటికొచ్చి పింఛన్ ఇస్తారు. మీరంతా జగన్‌కే ఓట్లు వేయాలని'' అని వివరించారు. అవ్వ మాట్లాడుతూ ''నా ఓటు జగన్‌బాబుకే కొడుకా'' అని వెల్లడించింది. అదే గ్రామంలో అప్పారావు అనే వృద్ధుడూ పింఛన్ ఇంటికే తెచ్చివ్వాలని కోరాడు.

అవ్వాతాతలకు మళ్లీ.. అవే అవస్థలు

సాక్షి, అమరావతి: నడవలేని స్థితిలో ఉన్న లక్షల మంది అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధుల బారినపడ్డ ఫించన్‌దారులకు చంద్రబాబు బృందం మళ్లీ ఐదేళ్ల తర్వాత అవే అవస్థలు తెచ్చి పెట్టింది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐదేళ్లుగా ప్రతి నెలా ఇంటి వద్దే ఫించన్లు పొందుతున్న వారంతా ఇప్పుడు చంద్రబాబు హయాంలో మాదిరిగానే కార్యాలయాలకు చేరుకుని పెన్షన్లు డబ్బులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చంద్రబాబు కనుసన్నల మేరకు నడుచుకునే రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ నేతృత్వంలోని సిటిజన్ ఫర్ డెమొక్రసీ సంస్థ ఫిర్యాదుతో ఈసీ ఆదేశాల మేరకు కోడ్ ముగిసేదాకా ఫించన్ల పంపిణీ నుంచి వల్లంటీర్లను పక్కనపెడుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నాడు పండుటాకుల పడిగాపులు..

చంద్రబాబు అధికారంలో ఉండగా ఏ గ్రామంలో ఎప్పుడు పింఛన్ల పంపిణీ జరుగుతుందో అక్కడ లబ్ధిదారులకే తెలియని దుస్థితి నెలకొంది. నడవలేని స్థితిలో కూడా వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు కనీసం పది రోజులు పాటు పంచాయతీ కార్యాలయం, రచ్చ బండ దగ్గరకు చేరుకుని ఫించన్ల కోసం ఆరా తీయాల్సిన పరిస్థితి అందరికీ తెలిసిందే. పంపిణీ జరిగే రోజు సైతం గంటల తరబడి ఎండలోనే నిరీక్షించాల్సి వచ్చేది. వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టాక అవ్వాతాతలకు ఆ కష్టాలన్నీ తీరిపోయాయి. ప్రతి నెలా టంచన్‌గా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను డబ్బులు చేతిలో పెడుతున్నారు. 2019 ఆగస్టులో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు కాగా గత 55 నెలల్లో ఏ ఒక్క దఫా కూడా పింఛను డబ్బుల కోసం లబ్ధిదారులు గడప దాటాల్సిన అవసరం లేదు.



చంద్రబాబు హయాంలో పింఛన్‌దారుల అవస్థలు (ఫైల్)

వలంటీర్లపై ఆది నుంచి అక్కసే..

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మొదట నుంచి వలంటీర్లను వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. 'ఎందుకీ వలంటీర్లు..? మూటలు మోయడానికా..?' అని ఆరంభంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు తరువాత మగవాళ్లు లేని సమయంలో వలంటీర్లు ఇంటి తలుపులు తడుతున్నారంటూ నిందలు వేశారు. రాష్ట్రంలో మహిళల అదృశ్యానికి వలంటీర్లే కారణమంటూ పవన్ అభాండాలు వేశారు. తాజాగా నిమ్మగడ్డ నేతృత్వంలోని సిటిజన్ ఫర్ డెమొక్రసీ సంస్థ కేంద్ర ఎన్నికల సంఘానికి ఒకే నెలలో రెండు దఫాలు ఫిర్యాదులు చేయడంతో వలంటీర్లను పింఛన్ల పంపిణీ నుంచి దూరంగా ఉంచుతూ నిర్ణయం వెలువడింది.

బాబూ.. ఇదేమి కడుపు మంట

సాక్షి, నెట్‌వర్క్: ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే తలుపుతట్టి పింఛన్ సొమ్ము చేతిలో పెట్టే వలంటీర్లపై చంద్రబాబు తన అక్కసు తీర్చుకున్నారని పలువురు మంత్రులు మండిపడ్డారు. పింఛన్లు పంపిణీ చేయకుండా చంద్రబాబు వలంటీర్లను అడ్డుకోవడం వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులు, వితంతువులపై కక్ష సాధించడమేనంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనతో పేదల విషయంలో చంద్రబాబు నైజం ఏంటనేది మరోమారు బయటపడిందన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీ వ్యవస్థను నడిపిన చంద్రబాబు, నిస్వార్థ సేవకులైన వలంటీర్లను కూడా అదే దృష్టితో చూస్తున్నారన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, సమయం చూసి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

అవ్వాతాతలపై కసి తీర్చుకున్న చంద్రబాబు



వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేయడంపై ఈసీ ఆంక్షలు విధించడానికి చంద్రబాబే కారణం. అవ్వాతాతలపై చంద్రబాబు కసి తీర్చుకున్నారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంస్థ ముసుగులో నిమ్మగడ్డతో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ప్రజలకు మేలు చేసేది ఏదీ చంద్రబాబుకి, అతని తోక పార్టీలకు నచ్చదు.

– డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కోవిడ్ సమయంలో ఎక్కడున్నావ్ బాబూ



నిస్సహాయులకు ఇంటికి వెళ్లి పింఛన్ అందించే వలంటీర్లపై కోర్టుకు ఎక్కిన బాబుకు అవ్వాతాతల ఉసురు తప్పకుండా తగులుతుంది. నిమ్మగడ్డ రమేష్ చౌదరి ఎంత ఉన్నత పదవిలో ఉన్నా చంద్రబాబు కోసమే పనిచేస్తారు. కోవిడ్ సమయంలో వలంటీర్ వ్యవస్థ ప్రాణాలకు తెగించి పనిచేస్తే, చంద్రబాబు, నిమ్మగడ్డ హైదరాబాద్‌లో దాక్కున్నారు.

– మంత్రి సీదిరి అప్పలరాజు

వలంటీర్లపై టీడీపీ పెత్తందార్ల పగ



ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇళ్లకు చేర్చుతున్న వలంటీర్లపై టీడీపీ పెత్తందార్లు ఎన్నికల భయంతో పగ పెంచుకున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వలంటీర్లు పింఛన్ అందిస్తున్నారు. దీంతో అవ్వాతాతలు ఎంతో సంతోషంగా ఉన్నారు. అటువంటివారి ఆశలపై టీడీపీ పెత్తందార్లు, జనసేన పార్టీ నాయకులు నీళ్లు చల్లారు.

– మంత్రి పినిపే విశ్వరూప్

వలంటీర్లను చూస్తే చంద్రబాబుకు వణుకు



పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను దూరం చేయడం చంద్రబాబు పన్నాగమే. ఇన్నాళ్లు జగనన్నను చూస్తేనే చంద్రబాబు భయపడి అందరినీ కూటమిగా చేర్చుకున్నారనుకుంటే ఇప్పుడు వలంటీర్లను చూసి కూడా ఆయన భయపడుతున్నాడన్న విషయం స్పష్టమయ్యింది. వలంటీర్ అంటే చంద్రబాబు జన్మభూమి కమిటీల పేరుతో పెట్టిన గంజాయి మొక్క కాదు. జగనన్న పెట్టిన తులసి మొక్క.

– మంత్రి ఆర్కే రోజా


చంద్రబాబు అక్కసే కారణం



వలంటీర్లపై ఎలక్షన్ కమిషన్ తీసుకున్న నిర్ణయానికి వారిపై చంద్రబాబుకు ఉన్న అక్కసే కారణం. వలంటీర్లు నిస్వార్థ సేవలందిస్తుంటే చంద్రబాబు అండ్‌కో జీర్ణించుకోలేకపోతోంది. వలంటీర్ వ్యవస్థపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంస్థ చంద్రబాబు జేబు సంస్థే.

– ఎంపీ, మార్గాని భరత్‌రామ్

పేదల కడుపు కొట్టడమే



సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడి ముంగిటకు చేర్చే వలంటీర్లపై చంద్రబాబు అక్కసు వెళ్లగక్కుతున్నారు. అవ్వాతాతలు, దివ్యాంగులు గంటల కొద్దీ క్యూలో నిలబడి పెన్షన్ తీసుకునే దుస్థితి లేకుండా ఇంటివద్దకు వెళ్లి వలంటీర్లు పెన్షన్ అందిస్తున్నారు. వలంటీర్లు పింఛన్లు ఇవ్వకూడదని బాబు ఫిర్యాదు చేయడం పేదల కడుపు కొట్టడమే.

– ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు కక్షకు పరాకాష్ట

- సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ పక్కా టీడీపీ కార్యకర్త
- ఎన్నికలకు ముందే చంద్రబాబు నిజ స్వరూపాన్ని బయటపెట్టాడు
- బాబు చేసిన చండాలపు పని తిరిగి ఆయనకే తగిలింది
- అందుకే డ్యామేజ్ కంట్రోల్ కోసం లేఖలు రాస్తున్నారు
- ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని ఎవరు చెప్పారు?
- సచివాలయాల ద్వారానే పింఛన్ల పంపిణీ జరుగుతుంది
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించడంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ల వ్యవస్థపై కత్తికట్టిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు.. ఆయన బీ టీం అయిన సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ద్వారా దొంగదెబ్బ తీశాడని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఇది వలంటీర్లపై చంద్రబాబుకు ఉన్న కక్షకు పరాకాష్ట అని అన్నారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ పక్కా టీడీపీ కార్యకర్త అని తెలిపారు. ఆయన ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలో ఉంటే ప్రజా జీవితాన్ని ఎంత విధ్వంసం చేస్తాడో, ప్రజలను ఎంత రాచి రంపాన పెడతాడో అందరికీ తెలిసిందేనని అన్నారు. ఎన్నికల్లో ప్రజల తీర్పు కోరే సమయంలో రాష్ట్రంలోని ప్రజలకు ఇబ్బంది కలిగించడం ద్వారా చంద్రబాబు నిజ స్వరూపాన్ని మరోసారి బయటపెట్టుకున్నారని తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డి ఇంకా ఏమన్నారంటే..



ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే వలంటీర్లు అవ్వాతాతల వద్దకు వెళ్లి పింఛన్ ఇచ్చే విధానాన్ని ఎన్నికల కోడ్ పేరుతో ఆపించారు. గత నాలుగేన్నరేళ్లుగా మనుమడు జగన్ ఇస్తున్న పింఛన్ తీసుకుంటున్న వృద్ధులు ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. పింఛను కోసం అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు కాళ్లరిగేలా తిరిగిన 2014–19 మధ్య పాత రోజులు ఇంకా గుర్తుండే ఉంటాయి. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో ప్రజలందరూ గమనించారు. ఆయన చేసిన చండాలపు పని ఆయనకే చుట్టుకుంటుందన్న భయంతో ఆయనకు సంబంధం లేదంటూ కొత్త పల్లవి అందుకున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తున్నాడు. అధికారులు ప్రత్యామ్నాయం చూపకుండా ఎందుకు ఉంటారు? ఇది చంద్రబాబు ప్రభుత్వం కాదు. జగన్ ప్రభుత్వం. నిన్నటివరకూ రాష్ట్రంలో ఉద్యోగాలే లేవన్న వ్యక్తి ఇప్పుడు సచివాలయాల్లో 1.30 లక్షల ఉద్యోగులు ఉన్నట్లు లేఖలో ఒప్పుకున్నారు. ప్రభుత్వం దగ్గర డబ్బుల్లేవంటూ కొత్త ఆరోపణలు చేస్తున్నాడు. డబ్బుల్లేవని ఆయనకెవరు చెప్పారు? ఆర్థిక సంవత్సరం ముగింపు కాబట్టి ఒకటో తేదీకి ముందు డ్రా చేయడంలో ఇబ్బంది ఉంటుంది. రెండో తేదీన డ్రా చేసి మూడో తేదీ పంపిణీ చేస్తారు. ప్రతి ఏటా ఇదే జరుగుతుంది. ఖజానాలో డబ్బంతా బిల్లులు చేసుకున్నారంటూ అచ్చెన్నాయుడో కొత్త కథ అల్లాడు. మేం పెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారానే పింఛన్లు పంపిణీ జరుగుతుంది. కాకపోతే ఇప్పుడు సచివాలయం వద్దకు వెళ్లి తీసుకోవాలి. ఓట్ల కోసమే వలంటీర్ వ్యవస్థ పెట్టాలనే ఆలోచన సీఎం జగన్‌కు ఉంటే ఆ పనికే ఉపయోగించుకునేవాడు కానీ ఇంత సంక్షేమం చేయరు కదా? ఇదే వ్యవస్థ చంద్రబాబు హయాంలో పెట్టి ఉంటే 2.60 లక్షల జలగలు తయారయ్యేవి. ఆ జలగలతో చంద్రబాబు రివర్స్‌లో ప్రజల రక్తం పీల్చేవాడు.

పొత్తులో ఏం జరగబోతోందో ముందే చెప్పాం

సీఎం జగన్ ప్రజల్లోకి వెళ్తుంటే జన సునామీ ఎలా ఉంటుందో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఐదేళ్లుగా ఆయన చేసిన సేవకు రుణం తీర్చుకోడానికి సిద్ధంగా ఉన్నామని ప్రజలు చెప్తున్నారు. మేం ముందుగా చెప్పినట్లుగానే చంద్రబాబుతో పొత్తు పెట్టుకున్న పవన్ కళ్యాణ్‌ను, బీజేపీని మింగేశాడు. పొత్తులు, సీట్ల పంపకం, అభ్యర్థుల ఎంపికలో వారితో చంద్రబాబు ఎలా ఆడుకుంటున్నాడో అందరూ చూస్తున్నారు. చివరికి పవన్‌ని పిఠాపురం పొమ్మంటే అక్కడకు వెళ్లి దీనంగా ఇక్కడే ఉంటా అని బతిమిలాడుకుంటున్నాడు. ఆయన బయట తిరిగితే పిఠాపురం వాళ్లు నమ్మరు. రాష్ట్రమంతా తిరగాలంటే ఆయనకు 21 సీట్లే ఇచ్చాడు. వాటిలో కూడా 18 మంది టీడీపీ, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారే. పవన్ వెంట ఉన్న వాళ్లంతా పక్కకు పోయారు. కనీసం అభ్యర్థులను ఎంపిక చేసుకునే పరిస్థితి కూడా పవన్‌కు లేదు. బీజేపీదీ అదే పరిస్థితి. టీడీపీలో కూడా పాము సొంత పిల్లల్ని తిన్నట్లు మొదటి నుంచీ ఉన్న వారికి అన్యాయం చేశాడు. డబ్బులిచ్చిన వారు తెరమీదకు వస్తున్నారు. బీసీలు, మైనార్టీలను పెంచడం కోసం మా అభ్యర్థుల ఎంపికలో ఒక హేతుబద్ధత ఉంది. కానీ టీడీపీలో, పొత్తు పెట్టుకున్న పార్టీల్లో హేతుబద్ధత కనిపించదు. ఈసారి చంద్రబాబు తిప్పిన చక్రం ఆయన మెడకే చుట్టుకుంది. వీలైనంత సంపాదించుకుని వెళ్లాలని ప్రయత్నం చేస్తున్నాడు. అందుకే రోజూ జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేయాలని ప్రయత్నం చేస్తున్నాడు. ఇంతకు ముందు లోకేశ్‌కు ఈ రాష్ట్రంలో భద్రత లేదా? మేం సెక్యూరిటీ ఇస్తేనే కదా ఆయన రాష్ట్రంలో తిరిగింది? ఎన్నికల వేళ ఏమీ చేయలేక ఇలాం టివి రోజుకొకటి ఆరోపణలు చేస్తూ ముందుకు వెళ్తున్నారు.

బాబు, పురందేశ్వరి, పవన్ నీచ రాజకీయానికి పేదలు బలి

ఆ ముగ్గురి రాజకీయ ప్రేరేపిత సంస్థ 'సిటిజన్ ఫోరం ఫర్ డెమొక్రసీ'

3 నెలలపాటు పింఛన్‌దార్లకు నరకయాతన.. కారకులు వారే..

కూటమి కుట్రల్ని తిప్పికొట్టేలా ఎన్నికల్లో తెడ్డు కాల్చి వాతపెట్టాలి: మాజీ మంత్రి పేర్ని నాని

సాక్షి, అమరావతి: చంద్రబాబు, పురందేశ్వరి, పవన్ కళ్యాణ్ నీచ రాజయానికి రాష్ట్రంలోని పేదలు బలయ్యారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని వెంకటరామయ్య (నాన్ని) చెప్పారు. వలంటీర్లపై ఫిర్యాదు చేసిన 'సిటిజన్ ఫోరం ఫర్ డెమొక్రసీ' ఆ ముగ్గురి రాజకీయ ప్రేరేపిత సంస్థ అని, చంద్రబాబు జేబు సంస్థ అని అన్నారు. ఈ సంస్థ ద్వారా కోర్టుల్లో పిటిషన్లు వేయించి, రాష్ట్రంలో పేద ప్రజలకు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకున్నారని తెలిపారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అవ్వాతాతలకు, వితంతు అక్కచెల్లెమ్మలకు పింఛన్లు ఇవ్వరాదంటూ ఈ సంస్థ కోర్టులను ఆశ్రయించిందని



చెప్పారు. ఇక నుంచి 3 నెలలపాటు పింఛన్‌దార్ల నరకయాతనకు కారకులు వారేనని అన్నారు. కూటమి కుట్రల్ని తిప్పికొట్టేలా ప్రజలు ఈ ఎన్నికల్లో తెడ్డుకాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. పేర్ని నాని ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సిటిజన్ ఫోరం ఫర్ డెమొక్రసీ సంస్థ అధ్యక్షులు జస్టిస్ భవానీప్రసాద్, సెక్రటరీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఇద్దరూ బాబుకు సన్నిహితులని చెప్పారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన ఉన్నత హోదాలు అనుభవించారన్నారు. ఆ సంస్థలో మరో ముఖ్యుడు లక్ష్మణరెడ్డి వైఎస్సార్‌సీపీలో రెండుసార్లు పదవి పొంది, మూడోసారి పొడిగించలేదని పార్టీని, సీఎం జగన్‌ని తీవ్రమైన పదజాలంతో దూషించి, ఆ తర్వాత చంద్రబాబు పంచన చేరారని చెప్పారు. ఈ ముగ్గురూ ఏర్పాటు చేసిందే సిటిజన్ ఫోరం ఫర్ డెమొక్రసీ సంస్థ అని వివరించారు. రాష్ట్రంలో ఎన్నికల వ్యవస్థను ఈనాడు రామోజీ నడిపిస్తున్నట్లు ఉందన్నారు. సీఎం జగన్‌ని టార్గెట్‌గా చేసుకొని ఈనాడులో వార్త పడగానే రాష్ట్రంలోని అధికారులు గంగవెర్రులెత్తి, వెంటనే చర్యలు తీసుకుంటున్నారని, ఎవరి వత్తిడి వల్ల వారు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం మీద సీఎం జగన్ ఫొటో ఉంటే ఈనాడు పేపర్‌లో రాయగానే, అధికారులొచ్చి కప్పేస్తారని, దాని ఎదురుగా ఉన్న టీడీపీ కార్యాలయం మీద చంద్రబాబు ఫొటో ఉంటే ఈనాడులో రాయరు, అధికారులూ పట్టించుకోరని అన్నారు.

భువనేశ్వరి ప్రలోభాలపై చర్యలేవి?

చంద్రబాబు భార్య నారా భువనేశ్వరి గుండెల మీద సైకిల్ బ్యాడ్జ్ పెట్టుకుని టీడీపీ అభ్యర్థుల్ని పక్కనబెట్టుకుని రూ.3 లక్షల చెక్కు పంపిణీ చేశారని, ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనేనని అన్నారు. దీనిని ఓటర్లను ప్రలోభ పెట్టే కార్యక్రమం కింద పరిగణనలోకి తీసుకోవాలంటూ రాష్ట్ర ఎన్నికల అధికారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అర్జీ అందిస్తే, ఇప్పటివరకు భువనేశ్వరికి నోటీసు కూడా వెళ్లలేదన్నారు. ఆవిడ మాత్రం సైకిల్ బ్యాడ్జి పెట్టుకుని పక్కన టీడీపీ నాయకులతో కలిసి రూ. 3 లక్షల చెక్కులు పంపిణీ చేస్తూనే ఉన్నారన్నారు. ఫిర్యాదు చేసినా ఎన్నికల అధికారులు ఆవిడను ఎందుకు ఆపడం లేదని నిలదీశారు. భీమవరంలో చెప్పిన మాట నిలుపుకోలేకనే పవన్‌కళ్యాణ్ పిఠాపురం వచ్చాడా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రైవేటు ఆస్పత్రి కట్టిస్తానన్నాడంటేనే, కూటమి అధికారంలోకి రాదని అర్థమైందని చెప్పారు. ఎంతమంది కూటమి కట్టినా ప్రజల్లో సీఎం జగన్ పట్ల ప్రేమను చెరపలేరని తేల్చి చెప్పారు.



ఒక ధార్మిక మనిషిని తాకినప్పుడల్లా,
నాకు తప్పక చేతులు కడుక్కోవాలని అనిపిస్తుంటుంది.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 1 ఏప్రిల్ 2024

ఇండియా ప్రయాణం

భారత స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తిని ఒక ఆంగ్లేయుడి దృష్టి కోణంలో చూపే నవల 'ఎ పాసేజ్ టు ఇండియా'. ఆంగ్ల సాహిత్యంలో వెలువడిన ఇరవయ్యో శతాబ్దపు వంద గొప్ప నవలల్లో ఒకటిగా పరిగణన పొందిన ఈ రచనకు ఇది శతాబ్ది సంవత్సరం. తన బ్రిటిష్ రాజ్ అనుభవాలతో ఇ.ఎం. ఫార్‌స్టర్ 1924లో దీన్ని రాశారు. మరాఠా సంస్థానం దేవాస్ సీనియర్‌లో (ప్రస్తుత మధ్యప్రదేశ్‌లో భాగం) మూడో తుకోజీరావ్ పవార్ వ్యక్తిగత కార్యదర్శిగా ఫార్‌స్టర్ 1921–22 మధ్య పనిచేయడమే కాకుండా, అంతకు పదేళ్ల ముందు ఒక ఏడాది పాటు ఇండియాలో పర్యటించారు. ఆ అనుభవాల సారాన్ని నవలకు వాడుకున్నారు. శీర్షికను మాత్రం అమెరికన్ కవి వాల్ట్ విట్‌మన్ కవితా సంకలనం 'పాసేజ్ టు ఇండియా'(1871) ప్రేరణతో తీసుకున్నారు. ఈ నవలను ఎంతోమంది సినిమా తీయాలని ప్రయత్నించినా, ఫార్‌స్టర్ పడనీయలేదు, సమతూకం తప్పుతారేమోనని! ఆయన చనిపోయాక(1970) అది సాధ్యపడింది. అదృష్టవశాత్తూ టైటిల్‌లోనే ఇండియా అనే మాటను నవల కలిగివుందనీ, వైభవోపేతమైన ఇండియాను గొప్పగా తెరకెక్కించవచ్చనీ ఉత్సాహపడ్డారు డేవిడ్ లీన్. 'ఎ పాసేజ్ టు ఇండియా' పేరుతోనే, నవల వచ్చిన సరిగ్గా 60 ఏళ్ల తర్వాత 1984లో సినిమా వచ్చింది. ఆ సినిమాకు కూడా ఇది నలభయ్యో సంవత్సరం.

నల్లవాళ్లను చీవాట్లు పెట్టడం అతి మామూలు వ్యవహారంగా ఉండిన కాలం. మీదకు కారును తోలినా పశ్చాత్తాపం ప్రకటించాల్సినంతటి మనుషులు వీళ్లు కాదన్న అహంకారం తెల్లవాళ్లలో ఉన్న కాలం. 'సామాజిక మేళనం' అర్థంలేనిది అనుకునే కాలం. 'వాళ్లందరూ ముందు పెద్ద మనుషులుగా ఉందామనే వస్తారు... అందరూ ఒకేలా తయారవుతారు; చెడ్డగా కాదు, మెరుగ్గా కాదు. నేను ఏ ఆంగ్లేయుడికైనా రెండేళ్లు ఇస్తాను... ఆంగ్ల మహిళకైతే ఆరు నెలలే' అంటాడు డాక్టర్ అజీజ్. అయినా వాళ్లను ఆరాధించకుండా ఉండలేకపోవడం భారతీయుల బలహీనత అని అతడికి తెలుసు. అలాంటి కాలంలో అజీజ్‌తో స్నేహంగా ఉంటాడు హెడ్మాస్టర్ ఫీల్డింగ్. అజీజ్ తబ్బిబ్బయిపోతే, అదొక పెద్ద విషయంగా భావించడమే అర్థం లేనిదంటాడు. భార్య చనిపోయాక, ఇద్దరు పిల్లల్ని ఊళ్లో తల్లిదండ్రుల దగ్గర ఉంచి, సంపాదనంతా వాళ్లకే పంపుతుంటాడు అజీజ్. తనకు మించిన భారం అయినప్పటికీ తమ చంద్రాపూర్ పట్టణానికి వచ్చిన మిసెస్ మూర్, ఆమె యువ స్నేహితురాలు అడెలాను 'మరబార్' గుహల పర్యటనకు తీసుకెళ్తాడు అజీజ్. గుహలంటే అలాంటిలాంటివి కావు. ఎత్తైనవీ, చీకటైనవీ, నిర్జనమైనవీ. పరివారము, క్యాంపులు, ఖర్చులు! సిటీ మ్యాజిస్ట్రేట్ అయిన మూర్ కొడుక్కీ అడెలాకూ నిశ్చితార్థం అయివుంటుంది. తీరా అన్నీ ఒకేలా కనబడే ఆ చీకటి గుహల్లో, ఎండ మండిపాటులో, గుండె చప్పుడు సైతం ప్రతిధ్వనించే చోట మిసెస్ మూర్ అనారోగ్యం పాలవడమూ... విధిలేని పరిస్థితుల్లో అడెలా, అజీజ్ ఇద్దరే లోపలికి దారితీయడమూ, ఆ ఇరుకులో, ఆ గందరగోళంలో, ఆ భయంలో అజీజ్ తన మీద అత్యాచారం చేయబోయాడని రక్తమోడుతుండగా అడెలా కిందికి పరుగెత్తుకురావడమూ... తెల్లమ్మాయి మీద నల్లవాడి చేయా? ఆంగ్లేయులు పళ్లు కొరుకుతారు. నల్లవాడి మీద కేసు బనాయింపా? జనాలు వీధుల్లోకొస్తారు. కోర్టు కేసు సంచలనం అవుతుంది. ఇరుపక్షాలూ నిలబడి కలబడటమే తరువాయి!

కథ ఏ బిందువు దగ్గర వచ్చి ఆగుతుంది, అక్కడి నుంచి పాత్రలు ఎలా పరిణామం చెందుతాయన్నది ఇందులో ముఖ్యం. తెల్లవాడికీ, నల్లవాడికీ మధ్య స్నేహం నిలబడుతుందా? ఒక పక్షం వహించని సమదృష్టి సాధ్యమేనా? వీటన్నింటిని మించిన మానవీయ విలువంటూ ఉండగలదా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు ఇందులో మౌనంగా జవాబు దొరుకుతుంది. గుహల్లోకి ప్రవేశించినప్పటి నుంచీ తన తలలో మొదలైన హోరు వల్ల అడెలా స్థిరంగా ఉండలేదు. పొరబడ్డానేమో అని కేసు ఉపసంహరించుకున్నాక హోరు పోతుంది. ప్రతి తెల్లమనిషిలోనూ గుబులు రేపుతున్న భారతీయుల స్వాతంత్య్రోద్యమపు నినాదాల హోరుకు సంకేతంగా దీన్ని తీసుకోవచ్చేమో! కేసు ఉపసంహరణ తర్వాత అడెలా ఇరవై వేల రూపాయల జరిమానా చెల్లించాల్సి వస్తుంది. నిశ్చితార్థం రద్దవుతుంది. అంత జరిమానా కట్టాలంటే అడెలా సర్వనాశనమైపోతుందనీ, దాన్ని ఉపసంహరించుకొమ్మనీ కోరినప్పుడు రెండు పక్షాలకూ హీరోగా నిలిచే డ్రామా ఆడుతున్నావని ఫీల్డింగ్‌ను నిందిస్తాడు అజీజ్. కేసు వల్ల పోయిన తన ప్రతిష్ఠ మాటేమిటని నిలదీస్తాడు. తెల్లవాళ్ల మెహర్బానీ కోసం జెంటిల్‌మన్‌గా ప్రవర్తించాల్సిన అవసరం లేదనీ, వాళ్లతో కరాఖండిగానే వ్యవహరించడం తప్పదనీ అనుకుంటాడు.

'దయ, మరింత దయ, ఆ తరువాత కూడా మరింత దయ'ను మాత్రమే ఫార్‌స్టర్ నమ్మారు. 'నా దేశాన్ని మోసం చేయడమా, నా స్నేహితుడిని మోసం చేయడమా అని ఎంపిక చేసుకోవాల్సి వచ్చినప్పుడు, నా దేశాన్ని మోసం చేసే ధైర్యం నాకుంది' అన్నారు. భారతీయులు పుట్టుకతో తాత్వికులు; రిక్షాను లాగేవాళ్లు కూడా కర్మ, పునర్జన్మల గురించి మాట్లాడుతారని మురిసిపోయారు. ఉర్దూ, హిందీ భాషలంటే ఇష్టపడే ఫార్‌స్టర్ హైదరాబాద్‌లోని ఉర్దూ హాల్ నిర్మాణానికి విరాళమిచ్చారు. ఆ గుహల్లో నిజానికి ఏం జరిగిందనేది నవల లోపల గానీ, బయట గానీ ఎప్పుడూ ఆయన వెల్లడించలేదు. అర్థవంతమైన మర్మం. 'మనం ఎన్ని మానవ ప్రయత్నాలైనా చేయొచ్చు, కానీ ఫలితం ముందే నిర్ణయమైవుంటుంది' అంటాడు నవలలో ప్రొఫెసర్ గోడ్బోలే. అడెలా ఇండియాకు రావడం కూడా అందులో భాగమేనన్నది ఆయన భావన. ఫార్‌స్టర్ ఇండియాకు వచ్చినప్పుడే ఈ నవల పుట్టుక నిశ్చితమైవుంటుంది!

ఊహకు అందని ఉక్కిరిబిక్కిరి

కామెంట్



కరణ్ థాపర్

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో 'జరగని' ఒక ఘటన ఆనాటి బ్రిటిష్ ఆధిపత్యంలోని భారత సామ్రాజ్యాన్ని వణికించింది. మద్రాస్‌కు అభిముఖంగా ఉన్న పశ్చిమ దిశ ప్రాంతమంతటా భయభ్రాంతులు వ్యాపించాయి. సింగపూర్‌ను లొంగదీసుకున్న జపాన్‌కు తర్వాతి లక్ష్యం ఈ ప్రాంతమే అనుకోవడమే దీనికి కారణం. దాంతో నగరంలోని 8 లక్షల మందిలో 7 లక్షలమంది కట్టుబట్టలతో పారిపోయారు. మద్రాసు జూ లోని సింహాలు, పులులు, నల్ల చిరుతలు, ఎలుగుబంట్లు, విషసర్పాలను కాల్చి చంపారు... బాంబులు పడితే అవి ఆ గందరగోళంలో జనాల మీద పడకుండా! ఆ యుద్ధానికి అవి మూల్యం చెల్లించాయి. ఊహాత్మకమైన దండయాత్ర ముప్పునకే ఆనాటి ప్రభుత్వం అంతగా ప్రభావితం అయిందా? అవునని ఒప్పుకోక తప్పదు.

రెండో ప్రపంచ యుద్ధం ముగిసి ఎనభై ఏళ్లు అయినప్పటికీ, ఆ యుద్ధం గురించి మనకు తెలియనిది ఏముంటుందని చాలామంది అనుకుంటారు. అది తప్పు అని ముకుంద్ పద్మనాభన్ రుజువు చేశారు. అసలేనాడూ సంభవించకనే, నిజంగానే సంభవించిందన్నంతగా ఒక అసంబద్ధమైన కలవరానికి గురిచేసిన ఒకానొక ఘటనపై తాజాగా ఆయన పుస్తకం రాశారు. దాని పేరు: 'ద గ్రేట్ ఫ్లాప్ ఆఫ్ 1942: హౌ ద రాజ్ ప్యానిక్డ్ ఓవర్ ఎ జపనీస్ నాన్-ఇన్‌వేషన్'.


1942 ఫిబ్రవరిలో సింగపూర్ పతనానంతరం... అప్పటికింకా బ్రిటిష్ ఆధిపత్యంలోనే ఉన్న భారత సామ్రాజ్యానికి–మరీ ముఖ్యంగా మద్రాస్‌కు అభిముఖంగా ఉన్న పశ్చిమ దిశ ప్రాంతమంతటా భయభ్రాంతులు వ్యాపించాయి. మలయా ద్వీపకల్పానికి మద్రాసు దగ్గరగా ఉండటమన్నది... సింగపూర్ తర్వాత జపాన్ తదుపరి దాడి ఇక మద్రాసు మీదనేనన్న సూచనప్రాయతకు తావిచ్చింది.

అసలక్కడేమీ లేకుండానే, ఊరికే ఊహించుకుని భయపడ్డామని ప్రత్యేకించి మీరు గుర్తు చేసుకున్నప్పుడు ఆ భయాందోళన స్థాయి మరింతదైన గొప్ప దిగ్భ్రమను కలిగిస్తుంది. సింగపూర్ పతనం అయ్యే సమయానికి మద్రాసులోని మూడింట ఒక వంతు జనాభా ప్రాణభయంతో తట్టాబుట్టా వదిలి పారిపోయింది. ఆరు వారాల తర్వాత నగర జనాభా కేవలం 25 శాతమే మిగిలి ఉందని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' రాసింది. పాల్ జయరాజన్ అనే ఐసీఎస్ అధికారి అంచనా ప్రకారమైతే మద్రాస్ జనాభా 13 శాతానికి తగ్గిపోయింది. దానర్థం 8 లక్షల మందిలో 7 లక్షలమంది కట్టుబట్టలతో నగరాన్ని వదిలి వెళ్లారని! 'ఈ లెక్క నమ్మశక్యమైనదిగా కనిపించకున్నా, నమ్మశక్యం కానిది గానూ అనిపించడం లేదు' అని ముకుంద్ పద్మనాభన్ వ్యాఖ్యానించారు.

పుస్తకంలో ఆహ్లాదం కలిగించే కథలు చెప్పుకోదగినన్ని ఉన్నప్పటికీ, వాటిల్లో ఒక్కటి కూడా మద్రాసులో జరిగిన దానిని మించి అద్భుతమైనదేమీ కాదు. ''సింహాలు, పులులు, నల్ల చిరుతలు, ఎలుగుబంట్లు, విషసర్పాలను వెతికి మరీ కాల్చి చంపారు. జపాన్ విసిరే బాంబులు కనుక జంతు ప్రదర్శన శాలలను, వాటి కదలికలను నియంత్రించి ఉంచిన ఆవరణలను (ఎన్‌క్లోజర్‌లు) ధ్వంసం చేసినప్పుడు, వాటి నుంచి క్రూర జంతువులు స్వేచ్ఛగా బయటికి ఉరికి, మనుషుల మీద పడకుండా నివారించటానికి ముందస్తుగానే వాటిని చంపేయాలన్న ఆదేశాలు అమలు అయ్యాయి.'' చూస్తుంటే ఆనాటి జరగని ఘటనకు అత్యధిక మూల్యం చెల్లించుకున్నది జంతువులే అనిపిస్తోంది.



జపాన్‌కు సింగపూర్ సేనల లొంగుబాటు: 1942



నిజంగా ఇటువంటిదే లండన్‌లో జరిగింది. ''1939 సెప్టెంబర్ ఆరంభంలో, యుద్ధం మొదలైన మొదటి వారం... విస్తుగొల్పేటంతటి స్థాయిలో 4 లక్షల నుంచి 7 లక్షల 50 వేల దాకా పిల్లులు, శునకాలను చంపేశారని అంచనా.'' అంటే, బ్రిటిష్ ప్రజలు తమ పెంపుడు జీవులను త్యాగం చేయటానికి కూడా సంకోచించనంతగా ప్రేమిస్తారు!

మద్రాసు గవర్నరు పారిపోయి ఉండకపోవచ్చు. కానీ మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు చేసింది కచ్చితంగా పారిపోవటమే! సర్ సిడ్నీ వాడ్స్‌వర్త్ ''రెండు కార్లలో తన సతీమణి, డ్రైవరు, బట్లరు, కుక్, మూడు పెంపుడు శునకాలతో అనంతపురం బయలుదేరారు. తమ వాహనాల పైభాగాన పరుపులను కట్టి, వాటిల్లో పింగాణీపాత్రలు, గిన్నెలు, బట్టలు, న్యాయశాస్త్ర గ్రంథాలు, వెండి దీపాల వంటి అవసరమైన, విలువైన సామగ్రిని కుక్కేశారు''. తిరిగి రెండు వారాల తర్వాత ఆయన వెనక్కు వచ్చారు. ఒక మంచి ఉల్లాసభరితమైన సెలవు సమయాన్ని గడిపాక!

ఐ.సి.ఎస్. అధికారులు మద్రాసును విడిచిపెట్టి పోలేదు. బదులుగా వారు జపాన్ సేనలకు చుక్కయినా దక్కకుండా ఉండేందుకు 'గొప్ప' మార్గాలనే కనిపెట్టారు. చెట్టినాడు రాజా సాహచర్యంలో పాల్ జయరాజన్ మద్రాస్ క్లబ్బుల్లో పీకల దాకా మద్యం సేవించారు. తర్వాత, వారంతా కలిసి ''మిగిలిన మద్యాన్నంతా కాలువలో పారబోశారు''.

ఇక జపాన్ బాంబు దాడుల గురించి చింతించాల్సినంత భయంలేని ఢిల్లీలో కవి డబ్ల్యు.హెచ్. ఆడెన్ సోదరుడైన జాన్ బిక్నెల్ ఆడెన్ సౌత్ బ్లాక్‌ను రక్షించటానికి ఒక హాస్యాస్పదమైన తలతిక్క పథకాన్ని రూపొందించారు. సౌత్‌బ్లాక్ భవంతిని కనిపించనీయకుండా చేయటం కోసం దట్టమైన పొగ మేఘాలను సృష్టించే ఒక పరికరాన్ని తయారు చేశారు. అయితే అది కేవలం కాలుష్యాన్ని వెదజల్లడానికి మాత్రమే పనికొచ్చింది.

యునైటెడ్ ప్రావిన్సు (ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్)లో ఒక వదంతి అనియంత్రిత ఆందోళన గాడ్పులను వ్యాపింపజేసింది. ''ఒక జపాన్ మనిషి ఆకాశం నుంచి భూమిపైన జరుగుతున్న ఒక వేడుకలోని జనసమూహం మధ్యకు దిగి, వారిని ఉద్దేశించి ప్రసంగించి, తిరిగి అలాగే ఆకాశంలోకి వెళ్లిపోయాడు అనే కథ అది.'' కళ్లారా చూసినంతగా ఆ వదంతిని అంతా నమ్మేశారు.

చివరికొచ్చేసరికి పద్మనాభన్ ముఖ్యమైన ప్రశ్నలు లేవనెత్తారు. కానీ దురదృష్టవశాత్తూ వాటికి సమాధానాలు మాత్రం చెప్పలేదు. ''కేవలం ఊహాత్మకమైన దండయాత్ర ముప్పునకే భారతదేశం అంతగా ప్రభావితం అయిందా? పాలన యంత్రాంగం ఆ స్థాయిలో అప్రమత్తం అవాల్సి ఉండిందా? దేశవ్యాప్తంగా అంతగా కీకర బీకరలు అవసరమా?''

సహజంగానే విమర్శలు వచ్చాయి. ''టిబెట్‌లోకి ఉపసంహరించుకోవడానికి గానీ భారత ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుంటోందా? లేక, చివరికి మనం పామిర్ పర్వతాలను అధిరోహించి, ప్రపంచ పైకప్పును గానీ చేరుకోబోతున్నామా? ఇంకా ఎక్కడైనా ధైర్య సాహసాలు మిగిలి ఉన్నాయా?'' అని 'ద స్టేట్స్‌మన్' పత్రిక గొప్ప గద్దింపుతో ఉరిమింది. కానీ ఎవరూ ఆ ఉరుమును విన్నట్లు లేరు.

సరే, ఇంత జరిగినా 'ద గ్రేట్ ఫ్లాప్...' రావలసినంతగా ఎందుకు గమనింపునకు రాలేదు? ఎందుకంటే, ''ఇండియా వైపు నుంచి ఒక్క అధికారిక ప్రకటన, ఒక్క పరిగణన కూడా లేకపోవడం వల్ల!'' మద్రాసును వదిలి సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోయిన తన తాత గారి నుంచి, తన తల్లి నుంచి పద్మనాభన్ ఆనాటి విషయాలను తెలుసుకున్నారు. వారు చెప్పిన కథల్ని ఈయన మరింతగా తవ్వి పోశారు. తత్ఫలితంగా నాటి భయాలు ఎంత విస్తృతంగా, ఎంత అతిశయోక్తితో ఉండేవో, తరచు వాటి ప్రతిస్పందన ఎంత నవ్వు పుట్టించేలా ఉండేదో ఆయన కనుగొన్నారు.

ఇది కనుక మీకు డాడ్స్ ఆర్మీ (ప్రహసనం)ని గుర్తు చేసినట్లయితే, అలా గుర్తుకు రావటం తప్పేమీ కాకపోవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆందోళనకరమే!



ఇటలీలో 2023వ సంవత్సరంలో కేవలం 3,79,000 జననాలు సంభవించాయి. దేశ ఏకీకరణ జరిగిన 1861 తర్వాత ఇదే అత్యంత తక్కువ సంఖ్య.

– ఎలాన్ మస్క్, పారిశ్రామికవేత్త

గొప్ప పథకం



ప్రాచీన భారతదేశంలో, ఒక మఠంతో మనం ఒప్పందం చేసుకునే వీలుండేది. మీకు వారసులు లేకపోతే (లేదా వాళ్లను నమ్మకపోతే) కొంత ఆస్తిని వాగ్దానం చేయొచ్చు. వృద్ధాప్యం, అనారోగ్యాలు సంభవించినప్పుడు తప్పనిసరి సంరక్షణ, మఠపు ఆసుపత్రిలో చికిత్స దొరికేవి. శేష జీవితాన్ని ఏ చింతా లేకండా బతకొచ్చు. మంచి బీమా కదా?

– జోసెఫ్ టి. నూనీ, థింకర్

కనబడట్లేదా?



కోవిడ్ టీకాల వల్ల సగటు మానవ ఆయుర్దాయం విజయవంతంగా 45–50 ఏళ్లకు తగ్గిపోయింది. టీకాల అనంతరం గుండెపోట్లు పెరిగాయి. సత్యం మన కళ్లముందు ఇంత స్పష్టంగా కనబడుతున్నప్పటికీ, ప్రభుత్వం, మీడియా దీన్ని నిరాకరిస్తూనే ఉన్నాయి.

– ప్రీత రామ్‌దాస్, పాలీమర్ సైంటిస్ట్

పన్ను చెల్లించాలా?



రాజకీయ పార్టీలు ఎందుకు పన్ను చెల్లించాలి? డబ్బులను విరాళాల రూపంలో సేకరించినప్పుడు, ఆటోమేటిగ్గా పన్ను నుంచి మినహాయింపు పొందాలికదా? రాజకీయ పార్టీలకు డబ్బుల ప్రవాహం ఉండనప్పుడు పన్ను ఎందుకు? తప్పు అనిపిస్తోంది.

– కె. సుజాతా రావు, మాజీ ఉన్నతాధికారి

సత్యకాలపు మనుషులు



నా భర్తకు ఏ రాజకీయనాయకుడు ఏ పార్టీలో చేరుతున్నారో తెలియదు. ఆయనకు ఈ తరపు క్రికెటర్లు ఎవరో కూడా తెలీదు. ఆయన సోషల్ మీడియాలో కూడా లేరు. పనికి వెళ్తారు, ఇంటికొస్తారు, భోంచేస్తూ నచ్చిన సినిమా చూస్తారు, మాతో రాత్రి నడకకు వస్తారు, నిద్రపోతారు. ఆయనలాంటి వాళ్లు ఇంకా ఉన్నారు.

– అనామిక ఎ., వ్యాఖ్యాత

భూమికి భారం కాకుండా...



భూ చరిత్రలో ఎన్నడూ లేనంత దుష్టత్వం ఇప్పుడు ప్రపంచంలో నెలకొంది. ఊహించని ప్రదేశాల్లో భూగ్రహం అనూహ్య చర్యలు చూపడం మొదలుపెడితే అప్పుడు రాగాలు తీయొద్దు. నిజానికి మనుషుల్లో కొందరికి ఈ అందమైన గ్రహాన్ని ఇంటిగా కలిగివుండే అర్హతే లేదు.

– ఫ్రాంక్ హూగెర్‌బీట్స్, పరిశోధకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

ఖండిస్తున్నాం!

''ఇటీవలి కాలంలో పెరుగుతున్న మతపరమైన అసహన సంస్కృతికి అనుగుణంగా కొన్ని మతోన్మాద శక్తులు సోషల్ మీడియానీ, ఇతర సాధనాలనూ దుర్వినియోగం చేస్తూ, స్త్రీల పట్ల అశ్లీలమైన, అసభ్యకరమైన భాషను వాడుతూ ప్రగతిశీల మహిళా మేధావులు, రచయిత్రులు, జర్నలిస్టులు, యాక్టివిస్టులు, కళాకారులను లక్ష్యంగా చేసు కొని నీచమైన దాడులు చేస్తున్నాయి.

వీరి దృష్టిలో స్త్రీలు వంటింటి కుందేళ్లుగానే జీవించాలి. స్త్రీలు దేశంలో ఏర్పడుతున్న మత, రాజకీయ పరిణామాల గురించి ఆలోచించడం, తమ భావాలను వ్యక్తపరచడం ఈ అప్రజాస్వామిక, సంప్రదాయవాద సమర్థక మూకలకు నచ్చదు. స్త్రీలు తమ ఇష్టాలకు అనుగుణంగా కట్టు, బొట్టు, వేష, భాషలు చేసినప్పుడల్లా ఈ అరాచకులు రంగంలోకి దిగి, వ్యక్తిగతంగా కాల్ చేసి, తలుచుకుంటే వారి ఇళ్లపై దాడులు చేయగలమనీ, ప్రాణహాని తలపెట్టగలమనీ బెదిరింపులకు పూనుకుంటున్నారు. ఈ చర్యలను మేం ఖండిస్తున్నాం.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఏ) ఈ దేశ పౌరులందరికీ వాక్ స్వాతంత్య్రాన్ని ఇచ్చింది. ఫలానా విధంగా అభిప్రాయాలు వ్యక్తపరచకూడదనీ, ఫలానా విధంగానే బతకాలనీ శాసించడం రాజ్యాంగ విరుద్ధం. ఈ ప్రాథమిక హక్కుని ప్రభుత్వంతోబాటు ఎవరూ హరించడానికి వీలులేదు. ఈవిధంగా బెదిరింపులకు, దాడులకు పాల్పడే శక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, అట్టి శక్తుల దూకుడును కట్టడి చేయాలనీ ప్రభుత్వ వర్గాలను, పోలీసు వ్యవస్థను కోరుతున్నాం.''

– పౌరహక్కుల సంఘం, తెలంగాణ; మానవ హక్కుల వేదిక, విప్లవ రచయితల సంఘం, చైతన్య మహిళా సంఘం, హైదరాబాద్ విమెన్ రైటర్స్ ఫోరమ్, సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్, మంచి సినిమా గ్రూపు, వాయిస్ ఫర్ జండర్ జస్టిస్, భూమిక, సాహితీ వేదిక (ఢిల్లీ), మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం, మహిళా మరియు ట్రాన్స్ జండర్ సంస్థల ఐక్య కార్యాచరణ వేదిక, పీఓడబ్ల్యూ, అంకురం; ఇంకా పలువురు కవులు, రచయితలు, కార్యకర్తలు, న్యాయ నిపుణులు.

ఇది భూగర్భ జలాలకు ఎసరు!

అభిప్రాయం



డా॥ కె.బి. గోపాలం

భారతదేశపు పొలాలలో సూర్యుడి మీద ఆధారపడి నడిచే పంపుల విప్లవం బలంగా సాగుతున్నది. 2026 సంవత్సరం నాటికి 30 లక్షల కన్నా ఎక్కువ మంది రైతులు భూమిలో నుంచి నీటిని సోలార్ పవర్ పంపులతో తోడబోతున్నారు. అంటే నీళ్లు ఏ ఖర్చు లేకుండా వస్తాయి. ఎంత కావాలంటే అంత దొరుకుతాయి. పంటలు బాగా పండుతాయి. బతుకులు మారుతాయి. అయితే ఇదంతా భూమిలో ఉన్న నీరు అయిపోయేదాకా మాత్రమే కొనసాగుతుంది.

రాజస్థాన్ అంటే ఎడారి రాష్ట్రం అని అందరికీ తెలుసు. కనుకనే అక్కడ మరే రాష్ట్రంలో లేనన్ని సోలార్ పంపులు పనిచేస్తున్నాయి. గడచిన పదేళ్లలో ప్రభుత్వం వారే కనీసం లక్షమంది రైతులకు సబ్సిడీ కింద సోలార్ పంపులు ఇప్పించారు. ఆ పంపులు ఇప్పుడు కనీసం 10 లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తున్నాయి. వ్యవసాయం కోసం వాడే సాగునీటిలో 25 శాతం ఈ పంపుల నుంచే వస్తున్నది. ఫలితంగా భూమిలో నీటి టేబుల్ బాగా తగ్గిపోతున్నది. వాడుకుంటున్న నీటికి సమంగా తిరిగి నీరు చేరడానికి అంతగా వర్షాలు మాత్రం రావడం లేదు.

ఫలితంగా నేలలో 400 అడుగుల దాకా చుక్క కూడా తడి లేకుండా ఆరిపోయిందని లెక్క తేలింది. అంతకుమించిన లోతు నుంచి పంపులు నీళ్లు తోడలేవు. కనుక చాలా పంపులు పని లేకుండా పడి ఉన్నాయి. తరిగిపోతున్న నీటి నిల్వలను వాడుకోవడానికి పోటీ మొదలైంది. ధనవంతులైన రైతులు మరింత బలమైన పంపులను తెచ్చుకుంటున్నారు. ఆ పని చేతకానివారు చూస్తూ ఊరుకోవాలి. లేదా పెద్ద పంపులు ఉన్న రైతుల వద్ద నీళ్లు కొనాలి.

ఈ నీళ్ల కరువు పరిస్థితి ఒక్క రాజస్థాన్‌లో మాత్రమే కాదు. నీటి ఎద్దడి ఉన్న మిగతా రాష్ట్రాలన్నింటిలో కూడా ఇదే పరిస్థితి నెమ్మదిగా పెరుగుతున్నది. అదే రకంగా ఆఫ్రికా మరికొన్ని చోట్ల కూడా సోలార్ పంపుల వాడకం పెరుగుతున్నది. వెలుగు ఉన్నంత కాలం ఈ పంపులు పనిచేస్తూనే ఉంటాయి. ఫలసాయాలు పెరుగుతున్నాయి. వ్యవసాయం లాభసాటిగా ఉంటున్నది. కానీ సౌరశక్తితో నడిచే ఈ వ్యవసాయ విప్లవం భూగర్భజలాలను రాను రాను కనుమరుగు చేస్తున్నది. భూమి లోపలి నీటి నిల్వలు ఎండిపోతున్నాయి, సోలార్ పంపుల వాడకంవల్ల కలిగే లాభం కన్నా రానున్న నష్టం మరీ ఎక్కువగా ఉంది అంటున్నారు ప్రపంచ బ్యాంకు ఆర్థిక నిపుణురాలు సౌమ్యా బాలసుబ్రమణ్య.



ప్రపంచ బ్యాంకు వారి విధానాల కారణంగా 20వ శతాబ్దిలో పంట పొలాలకు కృత్రిమ పద్ధతుల ద్వారా సాగునీటిని అందించడం అన్న కార్యక్రమం బలంగా సాగింది. జలాశయాలు, కాలువలు పెద్ద ఎత్తున కట్టి వాడుకున్నారు. ఎక్కువ దిగుబడి నిచ్చే కొత్తరకాల పంటల ద్వారా హరిత విప్లవం బాగా సాగింది. పెరుగుతున్న ప్రపంచ జనాభాకు తిండి అందింది. అయితే ఈ విధానా లకు ఒక పరిధి ఉందని అర్థం అయింది. నదులు ఎండి పోయినాయి. పెట్టుబడులు కూడా ఎండిపోయినాయి. ఉష్ణ మండలం పొడి ప్రాంతాలలో గత మూడు దశాబ్దాలుగా రైతులందరూ నీటి కోసం భూగర్భ వనరుల మీద ఆధారపడడం మొదలైంది. ఈ పరిస్థితి అటు మెక్సికోలో మొదలు మధ్యప్రాచ్యం, దక్షిణ ఆసియాలోని వేడి ప్రాంతాలలో బాగా కనిపించింది.

ప్రపంచ బ్యాంకు వారు భూగర్భ జలాల వాడకం గురించి ఒక పరిశీలన చేశారు. రాళ్ల ప్రాంతాలలో వేసిన బోరు బావుల ద్వారా ప్రపంచంలోని సాగునీరు నలభయి మూడుశాతం వరకు అందుతున్నది అని తెలిసింది. భూమిలోని నీటిలో 70 శాతం వ్యవసాయానికే వాడుతున్నారు. ఏడాదికి రెండు వందల క్యూబిక్ మైళ్ళ నీరు ఈ రకంగా వాడుక అవుతున్నది. వర్షం వల్ల భూమిలోకి చేరే నీరు మాత్రం దీనికన్నా కనీసం 70 క్యూబిక్ మైళ్ళు తక్కువగా ఉంది. 40 దేశాలలో సుమారు 1700 బావుల మీద పరిశీలన జరిపి లెక్కలు తీశారు. నీటి వనరులు భయంకరంగా తరిగిపోతున్నాయి అని తెలిసింది.

క్యాలిఫోర్నియా యూనివర్సిటీలోని జలశాస్త్ర నిపుణులు స్కాట్ జషేకో చేసిన పరిశీలన ప్రకారం భారతదేశంలోని భూగర్భ జలాలు ఏటా మూడు అడుగుల ప్రకారం కిందకు పోతున్నాయి. ఇదే పరిస్థితి ఇరాన్, అఫ్ఘానిస్తాన్, స్పెయిన్, మెక్సికో, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, చిలీ, సౌదీ అరేబియా మరికొన్ని దేశాలలో కూడా కనిపిస్తున్నది.

భవిష్యత్తులో పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతున్నదని అంటున్నారు నిపుణులు. ప్రపంచమంతటా ఆహార భద్రత విషయంగా ఈ నీటి ఎద్దడి అన్నది పెద్ద సమస్యగా మారిపోతున్నది. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయంలో వ్యవసాయ భవిష్యత్తును గురించి పరిశీలిస్తున్న మేహా జైన్ అనే పరిశోధకురాలు తెలియజేశారు.

ప్రభుత్వాలు మాత్రం సౌర విద్యుత్ ద్వారా భూగర్భ జలాల వాడకాన్ని ఆపడానికి బదులు మరింత ప్రోత్సహిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి అంటున్నారు నిపుణులు. ఇది అందరికీ అపాయకరమైన పరిస్థితి.

వ్యాసకర్త సైన్స్ అంశాల రచయిత

పరోపకారమే పరమ సుఖం

మనిషి కష్టజీవి. శారీరకమైనదైనా లేక బుద్ధితో చేసేదైనా కష్టం చేస్తూ కాలం గడపడం మనిషికి దేవుడు కల్పించిన సహజ ప్రకృతి. కష్టం ఉన్న చోట సహజంగానే స్వార్థం ఉంటుంది. తాను కష్టపడి ఆర్జించిన సొమ్ము తనవాళ్ళకు మాత్రమే చెందాలనే ఆలోచన విపరీతం అనిపించుకోదు. కనుకనే కుటుంబం అనే వ్యవస్థలో వ్యక్తులు కష్టపడి సంపాదించి కూడబెట్టడం జరుగుతుంది. అలా కూడబెట్టిన సంపదతో సుఖించేది తనవాళ్ళే అన్న భావన కష్టం చేసే వ్యక్తి చిత్తానికి ఆనందాన్ని, ఊరటను కలిగిస్తుంది. అయితే, అలా సంపాదించి సంపదను నిరుపయోగం చేయడం, నేలమాళిగల పాలుచేయడం సరైన పని కాదనీ, అలా చేయడం వలన చిత్తం ఎప్పటికైనా అశాంతి పాలవుతుందే తప్ప సాంత్వన చేకూరదనీ ఆధ్యాత్మిక దృక్పథం ఉపదేశిస్తుంది. కొన్ని శతాబ్దాలుగా ఈ ఆధ్యాత్మిక దృక్పథం మనిషి ఆలోచనలో మెదులుతూ వస్తున్నదనడానికి 'మనిషి ఎంత సంపాదించినప్పటికీ ఆ సంపాదనలో అతడికి ఉపయోగపడేది మాత్రం అతడు ఎంత తింటాడో అంత మాత్రమే!' అనే అర్థంలో తెలుగునాట స్థిరపడిపోయిన సామెతలు సాక్ష్యంగా నిలుస్తాయి. ఆ సామెతలలో ఒక వినసొంపైన సామెతను ఆలంబనగా చేసుకుని 'కుచేలోపాఖ్యానము' కావ్యం, ప్రథమాశ్వాసంలోని ఒక కంద పద్యంలో ఆ కావ్యకర్తయైన గట్టు ప్రభువు సంగతినంతా సంక్షిప్తీకరించి చెప్పాడు:



కాంతలు మేనులు సతమని
వంతులతో గూర్తు రఖిల వస్తువుల నరుల్
ఎంత గడించిన గూటికి
నెంతటివాడైన గాటి కిందునిభాస్యా!

యవ్వనం, సుఖం శాశ్వతం అన్న భ్రమ మనసును ఆవహించగా ఎన్నెన్నో పాట్లుపడి డబ్బు, వస్తువులు గడించి కూడబెడతారు. అయితే 'ఎవడు ఎంత సంపాదించినా అందులో అతడికి ఉపయోగపడేది ఎంత?' అని ప్రశ్న వేసుకుంటే 'తాను ఆ పూటకు తిన్నంత!' అని ఎలాగైతే సమాధానం వస్తుందో, అలాగే 'ఎవడు ఎంతటి మహామహుడైనా, వీరుడైనా, శూరుడైనా చివరికి చేరేది ఎక్క డికి?' అనే ప్రశ్నకు 'శ్మశానానికే!' అనే సమాధానం కూడా అంత కచ్చితంగానూ వస్తుంది. కనుకనే 'ఎంత గడించినా కూటికే, ఎంతటివాడైనా కాటికే!' అనే సామెతలో వాస్తవాన్ని నిక్షిప్తం చేసి చెప్పిన మన పూర్వీకులు, ఆ సామెత ద్వారా కూడబెట్టడంలో కూడా విజ్ఞతను పాటించి కొంతలో కొంతైనా సంపదను తోటివాడి అవసరానికి ఉపయోగపడేలా చేసి సుఖపడమని హితవు పలికారు.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.సప్తమి సా.4.37 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** మూల రా.7.07 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.5.33 నుండి 7.05 వరకు, తదుపరి తె.4.32 నుండి 6.04 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.29 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** ప.12.41 నుండి 2.13 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.59, **సూర్యాస్తమయం:** 6.08.

క్లుప్తంగా...

ధన బలం ఉన్న వారికే టికెట్లు: ఎంపీ జీవీఎల్



సాక్షి, విశాఖపట్నం: దక్షిణాది రాష్ట్రాల్లో అన్ని పార్టీలు ధన బలం ఉన్న వారికే టికెట్లు ఇస్తున్నాయని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ నేత జీవీఎల్ నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. ఆర్థిక స్తోమత లేకే ఈ ఎన్నికల్లో తాను పోటీకి దూరంగా ఉంటున్నట్టు సాక్షాత్తు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. పేదరికం ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికలు ఒకింత నిజాయితీగా జరుగుతుంటే.. ఆర్థికంగా బలంగా ఉన్న రాష్ట్రాల్లో ధన ప్రవాహం బాధాకరమన్నారు. సామాజిక సమీకరణల కంటే కుటుంబ నేపథ్యం వల్లే తనకు విశాఖ సీటు దక్కకుండా పోయిందని పేర్కొన్నారు. '2014లో విశాఖ లోక్‌సభ స్థానాన్ని గెలిచాం. మళ్లీ బీజేపీకే ఇవ్వాలని కేంద్రాన్ని కోరినా కేటాయించలేదు. పార్టీకి కంచుకోటలాంటి విశాఖలో బీజేపీ పోటీ చేయడం లేదన్న బాధ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో బాగా ఉంది. రెండు మూడు రోజుల్లో వారిని కలిసి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తా' అని పేర్కొన్నారు.

విశాఖ సౌత్ జనసేన అభ్యర్థిగా వంశీకృష్ణ

ఇంకా రెండు స్థానాలకు పెండింగే

సాక్షి, అమరావతి: పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన విశాఖపట్నం సౌత్ (దక్షిణ) నియోజకవర్గ అభ్యర్థిగా సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఖరారు చేస్తూ ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. కాగా, మూడు పార్టీల కూటమిలో జనసేనకు మొత్తం 21 స్థానాలు కేటాయించగా, ఇప్పటివరకు మొత్తం 19 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. కాగా.. అవనిగడ్డ, పాలకొండ స్థానాలకు నేటికీ అభ్యర్థులను ఖరారు చేయలేదు.

ఐదుగురితో ఎన్నికల పర్యవేక్షణ కమిటీ

జనసేన పోటీ చేస్తున్న అసెంబ్లీ, పార్లమెంటరీ స్థానాల్లో ఎన్నికల పర్యవేక్షణకు ఐదుగురు సభ్యులతో రాష్ట్రస్థాయి కమిటీని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నియమించారు. 21 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాల్లో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, సమన్వయం, ప్రచార వ్యవహారాలతోపాటు పోల్, బూత్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని ఆ పార్టీ పేర్కొంది.

పిఠాపురంలో అర్ధాంతరంగా ముగిసిన పవన్ పర్యటన

ఆకస్మికంగా హైదరాబాద్‌కు పయనం



పిఠాపురం: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తన పిఠాపురం పర్యటనను అర్ధాంతరంగా ముగించారు. కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి శాసనసభకు పోటీ చేస్తున్న ఆయన..4 రోజుల పాటు ఇక్కడే ఉండి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు తొలుత ప్రకటించారు. శనివారం ఇక్కడకు వచ్చిన ఆయన స్థానిక టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వర్మను కలిశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సభ నిర్వహించారు. అదే రోజు ఇక్కడి సుప్రసిద్ధ ఆలయాలను దర్శించాలని అనుకున్నారు. కానీ, దానిని మర్నాటికి వాయిదా వేసుకుని ఆయా ఆలయాలను ఆదివారం దర్శించుకున్నారు. పాదగయ క్షేత్రాన్ని సందర్శించి, కుక్కుటేశ్వరస్వామిని, రాజరాజేశ్వరిదేవిని, దత్తాత్రేయుని, పురుహూతికా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి వాహనానికి ప్రత్యేక పూజలు చేయించారు. శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఔదుంబర వృక్షానికి కొబ్బరి కాయ ముడుపు కట్టారు. స్థానికంగా అన్ని కార్యక్రమాలనూ వాయిదా వేసుకుని, సాయంత్రం హైదరాబాద్ వెళ్లిపోయారు.

పెన్షన్లు సకాలంలో అందించాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో వలంటీర్ల ద్వారా పెన్షన్లు పంపిణీ నిలిపివేయడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్లు పంపిణీ ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల కమిషన్‌కు శ్రీనివాసరావు ఆదివారం లేఖ రాశారు. పెన్షన్ల పంపిణీకి గ్రామ, వార్డు సచివాలయాలు, రెవెన్యూ ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయాలు దూరంగా ఉన్న చోట గ్రామ పంచాయతీ కార్యాలయాల సిబ్బందిని కూడా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రైవేటు ఆస్పత్రులకు సింగిల్ విండో అనుమతులివ్వాలి

కాకినాడ రూరల్: ప్రైవేటు ఆస్పత్రుల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు ఇచ్చి ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (అప్నా) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అప్నా పదో రాష్ట్ర స్థాయి సమావేశం కాకినాడలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అప్నా నూతన అధ్యక్షుడిగా కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ వై.కల్యాణ్ చక్రవర్తి ఎన్నికయ్యారు.

'ఓట్లాట మీ ఓటి కుండదే'

అన్నదాత ఎప్పుడో గెలిచాడు


జగన్ ఓట్లాటలో ఓడిన రైతు!

సాక్షి, అమరావతి: 'ఉచిత విద్యుత్ ఇస్తే తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందే' అంటూ ఎద్దేవా చేసి.. తాను అధికారంలో ఉన్నన్నాళ్లూ కనీసం రోజుకి మూడు,నాలుగు గంటలు కూడా వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వకుండా..రైతులను అష్టకష్టాలు పెట్టారు చంద్రబాబు. అలాంటి నయవంచకుడిని భుజానకెత్తుకుని..ఆయన ప్రాపకం కోసం భజన వార్తలు రాస్తూ రామోజీ రోజురోజుకీ దిగజారిపోతున్నారు. ప్రతి రోజూ అవాస్తవాలను అచ్చేస్తూ అడుగడుగునా అబద్ధాలు చెప్పుకొస్తూ నిస్సిగ్గుగా ప్రస్తుత ప్రభుత్వంపైనా, సీఎం వైఎస్ జగన్‌పైనా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే 'జగన్ ఓట్లాటలో ఓడిన రైతు!' శీర్షికతో ఓ నిరాధార వార్తా కథనాన్ని గురువారం అచ్చేశారు ڈ్రామోజీ. ఆ కథనం వెనుక వాస్తవాలను పరిశీలిస్తే..అసలు నిజాలు ఇలా ఉన్నాయి.

ఆరోపణ: అనంతపురం జిల్లా కణేకల్ మండలం ఉద్దేహాళ్ గ్రామంలో లోకన్న అనే రైతు విద్యుత్ సమస్య కారణంగా మూడెకరాల్లో పైరు పశువుల మేత కింద వదిలేశారు. ఇదే గ్రామంలో మరో రైతు ఎర్రిస్వామికి చెందిన పదెకరాల్లో నాలుగెకరాల పైరు ఎండిపోయింది. రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో 1200 ఎకరాల్లో వివిధ పంటలు ఎండిపోయాయని అంచనా.

వాస్తవం: లోకన్న, అనే రైతుకు ఆరెకరాల పొలం ఉంటే దానికి నీరందించడానికి ఒకే బోరు ఉంది. కానీ ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు తక్కువగా ఉండటం వల్ల ఆ బోరు నుంచి నీరు సరిగ్గా రావడం లేదు. దీని వల్ల అన్ని ఎకరాలకు సరిపడా నీరు అందించలేకపోతున్నారు. ఇదే పరిస్థితి ఎర్రిస్వామిది కూడా. ఈ కారణంగానే కొంత పొలాన్ని వారు వదిలేయాల్సి వచ్చింది. అంతే తప్ప కరెంటు అందక కాదు. కానీ ఈనాడు మాత్రం వాస్తవాన్ని వక్రీకరించి తమకు అనుకూలంగా అచ్చేసుకుంది. అలాగే 1,200 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని అధికారిక ధ్రువీకరణలేమీ లేకుండా కాకి లెక్కలు రాసేసుకుంది.

ఆరోపణ: కర్నూలు జిల్లా తుగ్గలికి చెందిన కౌలు రైతు గుండాల ఆంజనేయులు సాగునీరు పూర్తిగా అందదని ముందే గ్రహించి నాలుగెకరాల్లో రెండెకరాలు బీడుపెట్టారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు, ఉదయం పది గంటలకు రెండు విడతల్లో విద్యుత్ ఇవ్వడం వల్ల నీరు చాలక దిగుబడి దెబ్బతిందని ఆయన వాపోతున్నారు.

వాస్తవం: నాలుగెకరాలు కౌలుకి తీసుకున్న రైతుకి రెండెకరాలకే నీరందుతుందని ముందే తెలిసిందంటే దానికి కారణం బోరు నుంచి వచ్చే తక్కువ నీరని ఏ రైతుకైనా ఇట్టే అర్థం అవుతుంది. ఇక రెండు విడతల్లో విద్యుత్ కూడా రైతుల విజ్ఞప్తి మేరకే అధికారులు ఇస్తున్నారు. అయినా ఈనాడు చెప్పినట్లు తెల్లవారు జామున నాలుగు గంటలకు, ఉదయం పది గంటలకు విద్యుత్ ఇవ్వడం అంటే రైతులకు అనుకూలంగా ఉండే సమయాల్లో ఇస్తున్నట్టే. గ్రామాల్లో ఏ రైతైనా నాలుగు గంటలకే నిద్రలేచి పొలానికెళ్లి పశువులను, పంట పనులను చూసుకోవడం పరిపాటి. చంద్రబాబు హయాంలో అర్ధరాత్రి పన్నెండు గంటల నుంచి తెల్లవారు జామున 3 గంటల మధ్య ఇచ్చేవారు.అది కూడా ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు. ఆ పరిస్థితి ఇప్పుడు లేదని ఈ రాతలతో ఈనాడే ఒప్పుకుంది. కాదంటారా డ్రామోజీ.

ఆరోపణ: థర్మల్ ప్లాంట్లు పరిగెత్తుతూనే ఉన్నాయి. ఒత్తిడి పెట్టి ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఏముంది.

వాస్తవం: రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు గతంతో పోల్చితే అత్యంత భారీగా సామర్థ్యాన్ని పెంచుకున్నాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రంలో గతేడాది మార్చిలో 800 మెగావాట్ల యూనిట్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమైంది. ఎస్‌టీటీపీఎస్‌లో ఎనిమిదో యూనిట్ సీఓడీ డిసెంబర్‌లో జరిగింది. దీంతో జెన్‌కో థర్మల్ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం 5,810 మెగావాట్ల నుంచి 6,610 మెగావాట్లకు పెరిగింది. అలాగే డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ ఆపరేషన్, మెయింటెనెన్స్ యూనిట్ల లభ్యత శాతం 2022–23 ఆర్థిక సంవత్సరంలో 69.90 శాతం ఉంటే, 2023–24లో 75.83 శాతానికి పెరిగింది. డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ స్టేజ్–4 యూనిట్ హీట్ రేట్ 2,517 కిలో వాట్ అవర్ నుంచి 2,436 తగ్గింది. అదే విధంగా డాక్టర్ ఎన్‌టీఆర్ ఆర్టీపీపీ స్టేషన్ యూనిట్ల లభ్యత 67.85 శాతం నుంచి 75.68 శాతానికి మెరుగుపడింది. ఫలితంగా సామర్థ్యాన్ని మించి దాదాపు 10 మెగావాట్ల అధిక విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. దీంతో ఏపీ మొత్తం విద్యుత్ డిమాండులో ఏపీజెన్‌కో 45 నుంచి 50 శాతం వరకూ సమకూర్చుతోంది.

ఆరోపణ: కృత్రిమ మేధనూ ఏమార్చిన ప్రభుత్వం.. డిమాండ్ తగ్గిందని తప్పుడు లెక్కలు.

వాస్తవం: విద్యుత్ డిమాండ్, సరఫరాకు సంబంధించి ఖచ్చితమైన లెక్కలను విద్యుత్ సంస్థలు ఏ రోజుకారోజు సిద్ధం చేస్తున్నాయి. ఇందులో ఎలాంటి దాపరికం లేదు. ప్రస్తుతం (గురువారం నాటి బులిటెన్ ప్రకారం) రాష్ట్రంలో రోజువారీ డిమాండ్ 234.406 మిలియన్ యూనిట్లుగా నమోదవుతోంది. ఇది గతేడాది ఇదే సమయానికి జరిగిన వినియోగం 218.322 కంటే 7.37 శాతం ఎక్కువ. దాచాలనుకుంటే గతేడాది కంటే డిమాండ్ ఇప్పుడు ఇంత ఎక్కువగా ఉందని చెప్పాల్సిన అవసరం లేదు. ఉన్నది ఉన్నట్లు రోజువారీ పవర్ బులిటెన్‌లో స్పష్టంగా ఇస్తున్నారంటే అంతకన్నా పారదర్శకత ఇంకేముంది. మరోవైపు ఇంత డిమాండ్ ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, డిమాండ్‌కు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు వినియోగదారులకు కరెంట్ సరఫరా చేస్తున్నాయి. కృత్రిమ మేధను ఉపయోగించి పవర్ ఫోర్‌కాస్ట్ ద్వారా డిమాండ్‌ను అంచనా వేసి షార్ట్‌టెర్మ్ టెండర్ల ద్వారా రాష్ట్ర ప్రజలకు విద్యుత్ లోటు రాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. దీనివల్లనే ప్రతిరోజూ బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేయగలుగుతోంది.

ఆరోపణ: ఎన్నికల ఏడాది కావడంతో గృహ విద్యుత్ వినియోగదారులకు కోతలు పెడితే ఓట్లకు నష్టం కలుగుతుందని సీఎం ఆలోచన. పీక్ డిమాండ్ సమయంలో అధిక ధరకు విద్యుత్ కొనాలన్నా దొరికే పరిస్థితి లేదు.ప్రత్యామ్నాయంగా సేద్యానికిచ్చే విద్యుత్‌లో రోజుకు రెండు గంటలు కోతలు పెట్టారు. వ్యవసాయ విద్యుత్ కోసం రూ.10058 కోట్లు వెచ్చించినా ఫలితం లేదు.

వాస్తవం: మధ్యాహ్నం పీక్ డిమాండ్ 12476 మెగావాట్లుగా ఉంది. ఇది గతేడాది ఇదే సమయానికి 10643 మెగావాట్లు మాత్రమే ఉండేది. అంటే 17.22 శాతం పెరిగింది. సాయంత్రం పీక్ డిమాండ్ కూడా 8965 మెగావాట్లుగా ఉంది. దీనికి తగ్గట్లు రోజుకి 39.687 మిలియన్ యూనిట్లను యూనిట్ సుమారు రూ.9 చొప్పున వెచ్చించి రూ.34.116 కోట్లతో ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. విద్యుత్ దొరకడం లేదు.. కొనడం లేదనడం అవాస్తవమని ఇక్కడే తేలిపోయింది కదా రామోజీ. అలాగే రాష్ట్రంలో ఎక్కడా సేద్యానికి విద్యుత్ కోత లేదు. నిజానికి ఇది గత ప్రభుత్వ హయాంలో ఉండేది. ప్రస్తుతం వ్యవసాయానికి పగటిపూటే 9 గంటలు విద్యుత్ అందుతోంది. భవిష్యత్తులోనూ వ్యవసాయ ఉచిత విద్యుత్ అందించడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో 7 వేల మెగావాట్ల విద్యుత్ యూనిట్ రూ.2.49 చొప్పున 25 ఏళ్లపాటు కొనుగోలు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంది. ఈ విద్యుత్ కొనుగోలుకు అయ్యే ఖర్చు కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.అలాగే నాణ్యమైన వ్యవసాయ విద్యుత్ సరఫరా కోసం రూ.10058 కోట్లు వెచ్చించడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, లో, హై ఓల్టేజీతో మోటార్లు దెబ్బతినడం వంటి సమస్యలు తగ్గాయి. రైతుల బాగుకోసం, వ్యవసాయాన్ని పండుగ చేయడం కోసం ఆలోచించే నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏముంది.

బ్యాంకుల మోసగాడు ఎంపీ అభ్యర్థా?

- బీజేపీ ముసుగులో ఉన్న టీడీపీ నేత సీఎం రమేశ్
- అడ్డగోలు సంపాదనతో అనకాపల్లి ప్రజలను కొనాలనుకుంటున్నాడు
- స్థానికేతరులను జిల్లా ప్రజలు అంగీకరించరు
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు


చినదొడ్డిగల్లు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ముత్యాలనాయుడు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): బ్యాంకులను మోసగించి, సంతకాలు ఫోర్జరీ చేసి వేల కోట్లు దోచుకున్న వ్యక్తి కూటమి అనకాపల్లి అభ్యర్థి అంటూ సీఎం రమేశ్‌పై డిప్యూటీ సీఎం, అనకాపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు నిప్పులు చెరిగారు. ఆదివారం ఆయన నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతబయలు వద్ద అభిమానులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తాను పదవులు కొనుక్కోలేదన్నారు. జగనన్న తనకు రెండుసార్లు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే గెలిచానని, మంత్రి పదవి ఇచ్చి డిప్యూటీ సీఎంను చేశారన్నారు. ఆయన రుణం తీర్చుకోలేనిదన్నారు. పెత్తందార్లకు, పేదలకు మధ్య పోటీ జరుగుతోందని, జగనన్న సైన్యంగా ఎదుర్కొనేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దిగుమతి మోసగాళ్లకు అనకాపల్లి నియోజకవర్గ ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. ఈ ప్రాంతంతో పరిచయం లేని, ముక్కుముఖం తెలియని వ్యక్తిని ఇక్కడ పోటీ చేయించి ఈ ప్రాంత సంపదను తన బినామీ ద్వారా దోచుకోడానికే చంద్రబాబు కుట్రలు పన్నారన్నారు. స్థానికేతరులను అనకాపల్లి ప్రజలు ఓడిస్తారని, గతంలో అల్లు అరవింద్, సూకారపు సూర్యప్రకాశరావులకు పట్టిన గతే సీఎం రమేశ్‌కూ పడుతుందన్నారు. బీజేపీ ముసుగులో ఉన్న టీడీపీ నాయకుడు సీఎం రమేశ్ అని ముత్యాలనాయుడు చెప్పారు. బీజేపీ అభిమానులు ఇది గమనించాలన్నారు. చీటింగ్ ఫోర్జరీ కేసులనుంచి బయటపడేందుకే సీఎం రమేశ్ బీజేపీలో చేరాడన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ పేదలకు పెత్తందార్లకు జరుగుతున్న యుద్ధంలో బీసీలు, ఎస్సీలు, ఇతర వర్గాలవారు జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. జగనన్న అధికారంలోకి రాకపోతే సంక్షేమ పథకాలన్నీ రద్దవుతాయన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎంపీగా ముత్యాల నాయుడు, ఎమ్మెల్యేగా కంబాల జోగులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ పాల్గొన్నారు.

బాలశౌరి రాజకీయ బ్రోకర్

- చంద్రబాబుకు వృద్ధుల ఉసురు తగులుతుంది
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డ: మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఓ రాజకీయ బ్రోకరని, నియోజకవర్గాల్లో గ్రూపులు కట్టి, నాయకుల మధ్య గొడవలు పెట్టి పబ్బం గడుపుకోవడమే ఆయన నైజమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ధ్వజమెత్తారు. ఆదివారం కృష్ణా జిల్లా అవనిగడ్డలో మీడియాతో మాట్లాడుతూ.. 2004 ఎన్నికల్లో బాలశౌరికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజకీయ భిక్ష పెడితే, 2019లో ఆయన తనయుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి రెండోసారి ఎంపీగా గెలిపించారని గుర్తుచేశారు. అవనిగడ్డ నియోజకవర్గంలో అభివృద్ధి జరగకూడదనే ఉద్దేశంతో ఏటిమొగ–ఎదురుమొండి వారధి, అవనిగడ్డ–కోడూరు రోడ్డుకు టెండర్లు వేయకుండా బాలశౌరి అడ్డుకున్నారని విమర్శించారు. మచిలీపట్నం పార్లమెంటరీ స్థానం నుంచి మంచి వ్యక్తి, మనసున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు వైఎస్సార్‌సీపీ తరపున పోటీలో ఉన్నారని, ఈ సారి ఎంపీ సీటుతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

వృద్ధుల పాపం తగులుతుంది

వలంటీర్ల ద్వారా ప్రతినెలా 1వ తేదీనే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దే సీఎం వైఎస్ జగన్ పింఛన్లు అందిస్తున్నారని, మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ను అడ్డం పెట్టుకుని వలంటీర్ సేవలను ఆపించిన చంద్రబాబుకి వృద్ధుల ఉసురు తగులుతుందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. పేదలకు రాజకీయ భవితవ్యం ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్రక్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే సీటు ఇస్తే ట్రక్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే సీటా అంటూ చంద్రబాబు హేళనగా మాట్లాడటం ఆయన కుల దురహంకారానికి నిదర్శనమన్నారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ.. 2004లో మందపాకల కాలువ పనులు చేయిస్తానని బాలశౌరి హామీ ఇస్తే నమ్మి ఓట్లేయించానని, 2019లో మరోసారి ఎంపీ అయినా ఆ పని చేయించలేదని విమర్శించారు.

పవన్.. మత విద్వేషాలు రెచ్చగొట్టవద్దు

- పిఠాపురం నియోజకవర్గంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టవద్దు
- జనసేన అధినేతకు ఎంపీ వంగా గీత హెచ్చరిక



పిఠాపురం: ఆధ్యాత్మిక కేంద్రమైన పిఠాపురంలో ఏదో జరిగిపోతోందని, ఆలయాలపై దాడులు జరుగుతున్నాయంటూ మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయవద్దని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు కాకినాడ ఎంపీ, వైఎస్సార్‌సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు సభలో పవన్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడారు. గెలిస్తే ఎలా అభివృద్ధి చేస్తారో చెప్పకుండా లేనిపోని ఆరోపణలతో మతపరమైన అంశాలను తెరపైకి తీసుకుని వచ్చి, వాటితో సంబంధం లేని పిఠాపురానికి అంటగట్టాలని చూడవద్దని పవన్‌కు హితవు పలికారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా తాను ఇప్పటి వరకూ 100 ఆలయాలను అభివృద్ధి చేయించానని చెప్పారు. పిఠాపురం పాదగయ, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానాన్ని పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి చేయించానని తెలిపారు. తమ హయాంలో జరిగిన ఆలయాల అభివృద్ధిని చూసి మాట్లాడాలన్నారు. ఎక్కడా ఎప్పుడూ జరగని ఆలయ విధ్వంసాలను ఈ ప్రాంతానికి అంటగట్టి మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టి, అన్నదమ్ముల్లా కలసిమెలసి ఉండే పిఠాపురం నియోజకవర్గ ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తే స్థానికులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. దేశ విదేశాల నుంచి లక్షలాదిగా భక్తులు వచ్చే పిఠాపురం ప్రాంతంపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. తాము అభివృద్ధి చేసి చూపించామని, తమకు సీఎం జగన్ ఉన్నారని, ఆయన అండతో మరింత అభివృద్ధి చేసుకుంటామని ఇక్కడి ప్రజలు అంటూంటే.. ఇక్కడ ఏమీ జరగలేదని, వైఎస్సార్ సీపీ వాళ్లను నిలదీయండని అనడం పవన్ చేతగానితనమని విమర్శించారు. ఒకటో తేదీ వస్తే చాలు.. తలుపు తట్టి పింఛన్లు పంపిణీ చేసే వలంటీర్లతో ఆ పనిని నిలిపివేయించడం దారుణమన్నారు.

క్యాష్ కొట్టు.. టికెట్ పట్టు

- ధనికులపైనే చంద్రబాబుకు ప్రేమ.. పేదలంటే బాబుకు చులకన
- టిప్పర్ డ్రైవర్‌కు టికెట్ ఇస్తే అవమానకరంగా మాట్లాడుతున్నారు
- మోదీతో పొత్తు దేని కోసమో... చంద్రబాబు ప్రజలకు చెప్పాలి
- విజయవాడ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబుపై ఎంపీ కేశినేని నాని ఫైర్


మీడియాతో మాట్లాడుతున్న కేశినేని నాని

ఆటోనగర్(విజయవాడ తూర్పు): పెద్దమొత్తంలో ఎవరు డబ్బు ముట్టచెబితే వారికే చంద్రబాబు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్‌లు కేటాయిస్తున్నారని విజయవాడ వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) ఆరోపించారు. క్యాష్ కొట్టు.. టికెట్ పట్టు అనే సిద్ధాంతాన్ని చంద్రబాబు అవలంభిస్తున్నారని విమర్శించారు. ఆదివారం విజయవాడ 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. విజయవాడ తూర్పునియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుకు ధనికులంటేనే ప్రేమని, పేదలంటే చాలా చులకన భావంతో వ్యవహరిస్తారని అన్నారు. పేదలు పచ్చగా ఉంటే బాబు సహించలేరని విమర్శించారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడటానికి నాడు నందమూరి తారకరామారావు తెలుగుదేశంపార్టీని స్థాపించారని, ఆ పార్టీ సిద్ధాంతాలను చంద్రబాబు సప్త సముద్రాల్లో కలిపేశారని మండిపడ్డారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టిప్పర్ డ్రైవర్‌కు అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే దానిపై పబ్లిక్ మీటింగ్‌లో హేళనగా మాట్లాడారని దుయ్యబట్టారు. దీంతో పేదలు ఎమ్మెల్యే, ఎంపీలుగా ఉండకూడదన్న బాబు నైజం మరోసారి బయటపడిందన్నారు. నాడు ఎన్‌టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ గురించి ఆంధ్రా నుంచి ఢిల్లీ వరకు లారీలపై జెండాలు కట్టుకొని ప్రచారం చేసింది లారీ యజమానులేనని ఆయన గుర్తుచేశారు.

మోదీతో చంద్రబాబు పొత్తు దేని కోసం...

నరేంద్ర మోదీతో చంద్రబాబు ఎందుకు పొత్తు పెట్టుకున్నాడో రాష్ట్ర ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసమా.. రైల్వేజోన్ కోసమా.. లేదా రాజధానికి రూ.లక్ష కోట్లు తీసుకురావడానికా.. కడప ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు తీసుకురావడానికా, చంద్రబాబు మీద ఉన్న కేసులను మాఫీ చేయడానికా అనేది ప్రజలకు స్పష్టంగా చెప్పాలని నిలదీశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమానికి రూ.2.66 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. ప్రజా సంక్షేమానికి గతంలో ఎవరూ ఇంతపెద్ద మొత్తంలో ఖర్చుచేయలేదన్నారు. జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, మేమంతా సిద్ధం అనే కార్యక్రమానికి బ్రహ్మరథం పడుతున్నారని వివరించారు.

టీడీపీ నేతకే ఇచ్చేసేనా?

- అవనిగడ్డ అభ్యర్థి ఎంపికలో అయోమయం
- జనసేన ఆశావహులను కాదని టీడీపీ నేతల వైపు పవన్ చూపు
- తెరపైకి మండలి, రాధా పేర్లు
- పార్టీ శ్రేణుల్లో పెరుగుతున్న అసహనం


బుద్ధప్రసాద్


వంగవీటి రాధా


బండ్రెడ్డి రామకృష్ణ

సాక్షి, మచిలీపట్నం: కృష్ణాజిల్లా అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి ఎంపికపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అయోమయంలో పడ్డారు. ఇక్కడ పార్టీలోని ఆశావహులను కాదని టీడీపీ నేతల వైపు ఆయన చూస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనికి బలం చేకూరుస్తూ జనసేన రోజుకో పేరుతో ఫోన్ సర్వేలు చేయిస్తుండడం పార్టీ శ్రేణుల్లో అసహనం పెంచుతోంది. గతనెలలో జనసేనలో చేరిన అవనిగడ్డకు చెందిన కాంట్రాక్టర్ విక్కుర్తి శ్రీనుతోపాటు ఎడ్లంకకు చెందిన ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్, జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, జనసేన మచిలీపట్నం నియోజకవర్గ కన్వీనర్ బండి రామకృష్ణ ఈ సీటును ఆశిస్తున్నారు. బండ్రెడ్డి రామకృష్ణ సొంతూరు నాగాయలంక మండలం మర్రిపాలెం. ఈయన తొలి నుంచీ పార్టీలో ఉన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా ఇంతకాలం పార్టీకి సేవలందించానని తనకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే బందరు అసెంబ్లీ టికెట్ టీడీపీకి కేటాయించడంతో తనకు అవనిగడ్డలో అవకాశం ఇవ్వాలని బండి రామకృష్ణ అడుగుతున్నారు. ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ ఇంగ్లాండ్‌లో ఉద్యోగం చేసుకుంటూ.. హోటల్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఆయన ఇంత వరకు పార్టీలో చేరలేదు. టికెట్‌పై స్పష్టమైన హామీ ఇస్తే చేరతానని చెబుతున్నట్టు సమాచారం. బాపట్ల జిల్లాకు చెందిన సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు కూడా అవనిగడ్డ టికెట్ కోసం తీవ్రంగా యత్నిస్తున్నారు.

రేసులో ముందున్న టీడీపీ నేతలు

ఈ సీటు కోసం జనసేన నుంచి టీడీపీ నేతలూ పోటీ పడుతున్నారు. ఇక్కడ వంగవీటి రాధాకృష్ణను బరిలోకి దించుతారని కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ఇక్కడ మండలి బుద్ధప్రసాద్‌కే టికెట్ ఇవ్వాలని టీడీపీ నేతలు రాజీనామాలు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి పెద్ద సంఖ్యలో చేరికలు


ఎమ్మెల్యే ప్రతాప్, మాజీ ఎమ్మెల్యే రామకోటయ్య సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన చిన్నం వర్గీయులు


పర్చూరు అంబేడ్కర్ నగర్‌లో పార్టీలో చేరిన 200 కుటుంబాలతో ఎమ్మెల్యే అభ్యర్థి బాలాజీ

నూజివీడు/పర్చూరు (చిన గంజాం): ఇటీవల సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య అనుచరులు, కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, చిన్నం రామకోటయ్యల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు జిల్లా నూజివీడులో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. వారందరికీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలంలోని పర్చూరు అంబేడ్కర్ నగర్‌లో 200 కుటుంబాలు పర్చూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి.



ఇండియా కూటమి ర్యాలీలో పాల్గొన్న నేతలు ఖర్గే, పవార్, సోనియా, రాహుల్, భగవంత్ మాన్, ఫరూక్ అబ్దుల్లా, తేజస్వీ, కేసీ వేణుగోపాల్, చంపాయ్ సోరెన్, తిరుచ్చి శివ తదితరులు

అహంకారానికి అంతం తప్పదు

''సత్యం కోసం చేసిన యుద్ధంలో రామునికి అధికారం లేదు, వనరుల్లేవు. అయినా అవన్నీ ఉన్న రావణుడిపై గెలిచాడు. అధికారం శాశ్వతం కాదని, అహంకారం వీడాలని రాముని జీవితం నేర్పుతోంది. రాముని భక్తులమని ప్రకటించుకునే వారికి ఇది చెప్పాలనుకుంటున్నా. అహంకారం అణగక తప్పదు''

- కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

కేజ్రీవాల్, సోరెన్ అరెస్టులే నిదర్శనం • వ్యవస్థలను నాశనం చేస్తున్న మోదీ • మండిపడ్డ ఇండియా కూటమి నేతలు

రాంలీలా మైదానంలో భారీ బల ప్రదర్శన
నియంతృత్వాన్ని తరిమేద్దామంటూ పిలుపు
ఎన్డీఏ దోస్తులుగా ఈడీ, ఐటీ, సీబీఐ: ఖర్గే
మోదీ సొంత వ్యక్తులకు ఈసీలో చోటు
ఎన్నికల ఫిక్సింగ్‌కు యత్నం: రాహుల్
ప్రధానాకర్షణగా కేజ్రీవాల్, సోరెన్ భార్యలు
బీజేపీని ఓడించాలన్న సునీత, కల్పన

సాక్షి, న్యూఢిల్లీ: మోదీ పాలనలో దేశంలో రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ నాశనమవుతున్నాయని విపక్ష ఇండియా కూటమి ఆరోపించింది. దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని విపక్షాలను, నేతలను వేధిస్తున్నారని మండిపడింది. ఢిల్లీ సీఎం, ఆప్ సారథి అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ అరెస్టును తీవ్రంగా ఖండించింది. వారికి అండగా నిలుస్తామని ప్రకటించింది. నియంతృత్వ పాలనను తరిమికొట్టి దేశాన్ని కాపాడుకుందామంటూ పిలుపునిచ్చింది. ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ కూటమి మహా ర్యాలీ నిర్వహించింది. 'తానాషాహీ హటావో, లోక్‌తంత్ర్ బచావో (నియంతృత్వాన్ని రూపుమాపాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి)' పేరుతో జరిగిన ఈ ర్యాలీ విపక్షాల బల ప్రదర్శనకు వేదికగా మారింది. ఇండియా కూటమిలోని 28 పార్టీల నేతలు ఇందులో పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికలను మోదీ నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరుగుతున్న పోరుగా అభివర్ణించారు. దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి ఎన్నికల్లో విపక్షాలను నిర్వీర్యం చేసేందుకు అధికార బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రయత్నాలను అడ్డుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, పంజాబ్ సీఎం, ఆప్ నేత భగవంత్‌మాన్ సింగ్, అఖిలేష్ యాదవ్ (సమాజ్‌వాదీ), డెరిక్ ఒబ్రియాన్ (టీఎంసీ), తిరుచ్చి శివ (డీఎంకే), తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), శరద్ పవార్ (ఎన్సీపీ-పవార్), ఉద్ధవ్ ఠాక్రే (శివసేన-యూబీటీ), ఫరూక్ అబ్దుల్లా (ఎన్సీ), మెహబూబా ముఫ్తీ (పీడీపీ), సీతారాం ఏచూరి (సీపీఎం), డి.రాజా (సీపీఐ) తదితరులు వీరిలో ఉన్నారు. కేజ్రీవాల్ సతీమణి సునీత, హేమంత్ సోరెన్ సతీమణి కల్పన వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వారిద్దరూ రాజకీయాల్లోకి రావచ్చనే చర్చ ఊపందుకుంది. వారితో సోనియా వేదికపై చేతిలో చేయి కలిపి మాట్లాడారు. తన పక్కనే కూచోబెట్టుకున్నారు. విపక్షాలన్నీ ఒక్కటై బీజేపీని ఓడించాలని స్టాలిన్, ఫరూక్ అబ్దుల్లా పిలుపునిచ్చారు. స్టాలిన్ తరఫున ఆయన సందేశాన్ని డీఎంకే నేత తిరుచ్చి శివ చదివి వినిపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా పోరాడదామని శరద్ పవార్ అన్నారు. దేశం పెను సంక్షోభంలో ఉందని డి.రాజా అన్నారు. ఈ ర్యాలీతో రాజకీయాల్లో కొత్త శక్తి పుట్టిందని ఏచూరి అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే బీజేపీకి వ్యతిరేకంగా ఓటేయాలని అఖిలేశ్ పిలుపునిచ్చారు. తృణమూల్ విపక్ష ఇండియా కూటమిలోనే ఉందని ఒబ్రియాన్ చెప్పారు.

కూటమి డిమాండ్లు...

కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, విపక్ష నేతల అరెస్టులు, ఎన్నికల బాండ్ల పేరుతో బలవంతపు వసూళ్లు, విపక్షాలే లక్ష్యంగా ఆదాయ పన్ను నోటీసులు, నిత్యావసరాల ధరల పెరుగుదల, పెరుగుతున్న నిరోద్యగం, రైతులకు అన్యాయం వంటి ఏడు అంశాలపై కూటమి డిమాండ్లను ప్రియాంక చదివి ప్రస్తావించారు. విపక్షాలపై దర్యాప్తు సంస్థల చర్యలను నిలిపేయాలని కోరారు. బీజేపీ ఎన్నికల బాండ్ల క్విడ్ ప్రో కో వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ వేయాలని డిమాండ్ చేశారు.

ఆరెస్సెస్, బీజేపీ విషతుల్యం

''ఆరెస్సెస్, బీజేపీ విషం వంటివి. పొరపాటున కూడా వాటిని రుచి చూడొద్దు. ఇప్పటికే దేశాన్ని ఎంతో నాశనం చేసిన విచ్ఛిన్న శక్తులవి. మరింత సర్వనాశనం చేయకుండా చూడాల్సిన బాధ్యత విపక్షాలదే. పరస్పరం కుమ్ములాడుకోకుండా ఏకమైతేనే బీజేపీని ఓడించడం సాధ్యం. ప్రజాస్వామ్యం, నియంతృత్వాల్లో ఏది కొనసాగాలో నిర్ణయించే కీలక ఎన్నికలివి. ప్రజాస్వామ్యంపై మోదీకి నమ్మకం లేదు. అధికార వ్యవస్థలను విపక్షాలపైకి ఉసిగొల్పి బెదిరిస్తున్నారు. ప్రభుత్వాలను పడదోస్తున్నారు. హేమంత్ సోరెన్‌ను బీజేపీలో చేరనందుకే అరెస్టు చేయించారు. తనకు లొంగడం లేదనే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌నూ జైలుపాలు చేశారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. ఇలా ప్రతిపక్షాలకు బీజేపీతో సమానంగా ఎన్నికల్లో తలపడే అవకాశం లేకుండా చేస్తున్నారు. రూ.14 లక్షల నగదు డిపాజిట్లకు సంబంధించి కాంగ్రెస్‌కు ఏకంగా రూ.135 కోట్ల జరిమానా విధించారు. రూ.42 కోట్ల నగదు డిపాజిట్లు అందుకున్న బీజేపీకి అదే సూత్రం ప్రకారం రూ.4,600 కోట్ల జరిమానా విధించాలి''

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

నిర్ణాయక ఎన్నికలివి...

''అంపైర్లపై ఒత్తిడి పెట్టి, కెప్టెన్‌ను, ఆటగాళ్లను కొనేస్తే మ్యాచ్ గెలిచినట్టే. క్రికెట్లో దీన్ని మ్యాచ్ ఫిక్సింగ్ అంటారు. లోక్‌సభ ఎన్నికల వేళ అంపైర్లను (కేంద్ర ఎన్నికల కమిషనర్లను) ఎంపిక చేసిందెవరు? మ్యాచ్ మొదలైనా కాకముందే ఇద్దరు ఆటగాళ్లను (సీఎంలను) అరెస్టు చేయించిందెవరు? ఇవన్నీ చేసింది ఒక్కే ఒక్క శక్తి. ప్రధాని మోదీ! ముగ్గురు నలుగురు బిలియనీర్ల సాయంతో కలిసి ఇలాంటి చర్యలకు పాల్పడటం ద్వారా లోక్‌సభ ఎన్నికలను మ్యాచ్ ఫిక్సింగ్ చేసేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలను దేశమంతా గమనిస్తోంది. మ్యాచ్ ఫిక్సింగ్, ఈవీఎంల సాయంతోనే 400 సీట్లు నెగ్గుతామని బీజేపీ ధీమాగా అంటోంది. అదే జరిగితే దేశమే సర్వనాశనమవుతుంది. దేశ గుండె చప్పుడైన రాజ్యాంగం కనుమరుగవుతుంది. తద్వారా దేశాన్ని ముక్కలు చేయడమే బీజేపీ లక్ష్యం. మ్యాచ్‌ఫిక్సింగ్, ఈవీఎంలు, మీడియాను బెదిరించడం, కొనేయడం జరగకుంటే బీజేపీకి 180 సీట్లు కూడా రావు. కానీ ఇవేం ఎన్నికలు? విపక్షాలను నిర్వీర్యం చేసి నెగ్గజూస్తున్నారు. ప్రచార వేళ అతి పెద్ద విపక్షమైన కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపజేశారు. ఈడీ, ఐటీ, సీబీఐ బెదిరింపులు, బల ప్రయోగాలతో దేశాన్ని పాలించలేరు. కానీ దేశం గొంతును అణచలేరు. ప్రజల గళాన్ని అణచే శక్తి ప్రపంచంలోనే లేదు. మోదీ అసమర్థ పాలనలో దేశంలో నిరుద్యోగం 40 ఏళ్లలో గరిష్ట స్థాయికి చేరింది. దేశ సంపదంతా ఒక్క శాతం సంపన్నుల చేతిలో పోగుపడింది. ఈ నిరంకుశత్వాన్ని పారదోలేందుకు, రాజ్యాంగాన్ని కాపాడేందుకు జరుగుతున్న ఎన్నికలివి''

- కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ

కేజ్రీవాల్ సింహం: సునీత



''కేజ్రీవాల్ సింహం. ఆయనను ఎక్కువ రోజులు జైల్లో పెట్టలేరు. దేశ ప్రజలంతా ఆయన వెంట ఉన్నారు'' అని ఆయన భార్య సునీత అన్నారు. మోదీ ప్రభుత్వంపై ఆమె విరుచుకుపడ్డారు. ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. లోక్‌సభ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రకటించారు.

మా రక్తంలోనే పోరాటం: కల్పన



రాజ్యాంగ హక్కులన్నింటినీ మోదీ సర్కారు కాలరాస్తోందని జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పన మండిపడ్డారు. ''అధికారాన్ని పూర్తిగా గుప్పెట్లో పెట్టుకున్నామని కొన్ని పార్టీలు అపోహ పడుతున్నాయి. కానీ నిజమైన అధికారం ప్రజలదే. మేం గిరిజనులం. త్యాగం, పోరాటం మా రక్తంలోనే ఉన్నాయి. మా సుదీర్ఘ చరిత్రను తలచుకుని గర్వపడతాం'' అన్నారు.

అవినీతిపరుల కూటమి

విపక్షాలపై విరుచుకుపడ్డ మోదీ
- అవినీతిపరులను అవి కాపాడుతున్నాయి
- అవినీతి అంతమే ఎన్డీఏ మంత్రం
- అందుకోసమే నా పోరాటం
- మీరట్ ర్యాలీలో ప్రధాని

మీరట్/ లక్నో: సార్వత్రిక సమరానికి షెడ్యూల్ మొదలయ్యాక ఉత్తరప్రదేశ్ వేదికగా ప్రధాని మోదీ తొలి ఎన్నికల ప్రచార సభలో పాల్గొని విపక్షాల 'ఇండియా' కూటమిపై విమర్శల వాగ్బాణాలు సంధించారు. ఆదివారం మీరట్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ఈడీ అరెస్ట్‌తో కేజ్రీవాల్, జేఎంఎం చీఫ్ హేమంత్ సోరెన్ కటకటాల వెనక్కి వెళ్లిన వేళ ఢిల్లీ రాంలీలా మైదానంలో ఆదివారం విపక్ష 'ఇండియా' కూటమి 'లోక్‌తంత్ర బచావో' ర్యాలీ చేపట్టిన కొద్దిసేపటికే మోదీ విపక్షాల కూటమిపై విమర్శల జడివాన కురిపించారు. ''అవినీతిపై నేను పూర్తిస్థాయి యుద్ధం ప్రకటించగానే విపక్ష నేతలంతా కలిసి ఇండియా కూటమిగా పోగయ్యారు. నన్ను భయపెట్టొచ్చని భావించారు. కానీ నా భారతదేశమే నా సొంత కుటుంబం. అవినీతి నుంచి దేశాన్ని రక్షించేందుకు యుద్ధం మొదలుపెట్టా. అందుకే వాళ్లంతా ఇప్పుడు ఊచలు లెక్కపెడుతున్నారు. వాళ్లకు సుప్రీంకోర్టు నుంచి కూడా కనీసం బెయిల్ దొరకడం లేదు. ఈసారి రెండు శిబిరాల మధ్యనే సార్వత్రిక ఎన్నికల సమరం కొనసాగబోతోంది. నా మంత్రం 'భ్రష్టాచార్ హటావో' (అవినీతి అంతం). వాళ్ల తంత్రం 'భ్రష్టాచార్ బచావో' (అవినీతిని కాపాడుకోవడం). పేదల కోసం ఉద్దేశించిన డబ్బు అవినీతిపరులకు దక్కకుండా పదేళ్లుగా మా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అవినీతిని కూకటివేళ్లతో పెకలిస్తున్న ఎన్డీఏ ఒకవైపు ఉంటే, అదే అవినీతి నేతలను కాపాడేందుకు అలుపెరగక కష్టపడుతున్న 'ఇండియా' కూటమి నేతలు మరోవైపు ఉన్నారు. అవినీతికి అంతం పలకాలో వద్దో మీరే నిర్ణయించుకోండి' అన్నారు. ''అవినీతిపరులకు చెప్పేదొక్కటే. కుటుంబం లేదంటూ నన్నెంతగా అవమానించినా, ఎన్ని ఆరోపణలు గుప్పించినా, బీజేపీ నేతలపై దాడులు చేసినా అవినీతిపై నేను పోరాటం ఆపబోను. అవినీతికి పాల్పడింది ఎంత పెద్ద నేతలైనా సరే కఠిన చర్యలు ఖాయం. దేశాన్ని లూటీ చేసిన వారు తిరిగి ఆ సొమ్ము కక్కాల్సిందే. ఇదే మోదీ గ్యారెంటీ'' అని అన్నారు. ప్రజల కోసం ఆశల పల్లకీని మోసుకొచ్చామంటూ సభకు ముందు మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''పదేళ్లలో దేశవ్యాప్తంగా నా కుటుంబసభ్యులందరి ఆకాంక్షలూ తీర్చాం. కొంగొత్త కోరికలను తీర్చేందుకు మళ్లీ మీ ముందుకొచ్చాం. ఆశలు నెరవేర్చిన ఎన్డీఏ కూటమికే ఓటేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారు'' అన్నారు.



పదేళ్ల అభివృద్ధి ట్రైలరే

''ఈసారి లోక్‌సభ ఎన్నికలు కొత్త ప్రభుత్వాన్ని మాత్రమే ఎన్నుకోవు. ఈ ఎన్నికలు వికసిత భారత్‌కు పునాది వేయనున్నాయి. మూడోసారి ప్రభుత్వ ఏర్పాటుకు మేం ఇప్పటికే కసరత్తు ప్రారంభించాం. మా ప్రభుత్వం వచ్చే ఐదేళ్లకు మార్గసూచీని రూపొందిస్తోంది. ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి 100 రోజుల్లో అమలుజరపాల్సిన పనులపై ఆలోచిస్తున్నాం. గత పదేళ్లకాలంలో మీరు చూసిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమే. ఇప్పుడు దేశాన్ని మరింత శరవేగంతో అభివృద్ధి పథంలో ఉరకలెత్తిస్తాం. నేను పేదరికంలో జీవించా కాబట్టే పేదల గురించి తెల్సు నాకు. ప్రతి ఒక్క పేదవాడి బాధలు, కష్టాలను అర్థంచేసుకోగలను. అందుకే పేదలకు లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను రూపొందించి అమలుచేశాం. ఈ పథకాలు పేదల సాధికారతకు మాత్రమే బాటలు వేయవు. అవి పేదలకు ఆత్మగౌరవాన్ని తిరిగి తెచ్చి ఇచ్చాయి'' అని మోదీ అన్నారు. ''అయోధ్యలో రామాలయం అసాధ్యమని చాలామంది అన్నారు. నేడు రోజూ లక్షలాది మంది అయోధ్య రామాలయాన్ని దర్శించుకుంటున్నారు. ట్రిపుల్ తలాక్‌పై కఠిన చట్టం, ఆర్టికల్ 370 రద్దు, మహిళా రిజర్వేషన్ బిల్లుకు మోక్షం అసాధ్యమన్నారు. మేం చేసి చూపాం' అని మోదీ అన్నారు.

ఈసారి రిషి గెలవడం కష్టమే

- కన్జర్వేటివ్ పార్టీ ఓటమి ఖాయం
- బ్రిటన్ ఎన్నికల సర్వేలో వెల్లడి

లండన్: బ్రిటన్‌లో ఇప్పటికిప్పుడు సాధారణ ఎన్నికలు జరిగితే భారత సంతతికి చెందిన రిషి సునాక్‌తోపాటు ఆయన కేబినెట్‌లోని సగానికి పైగా మంత్రులకు పరాజయం తప్పదని ముందస్తు సర్వేలో తేలింది. అధికార కన్జర్వేటివ్ పార్టీకి 100 పార్లమెంట్ స్థానాలు కూడా దక్కడం గగనమేనని, అదే సమయంలో ప్రతిపక్ష లేబర్ పార్టీ 468 సీట్లు గెలుచుకుని, 286 సీట్ల మెజారిటీ సాధిస్తుందని కూడా అంచనా వేసింది. బెస్ట్ ఫర్ బ్రిటన్ తరఫున సర్వేషన్ సంస్థ 15,029 మందితో తాజాగా సర్వే జరిపింది. ఇందులో పాల్గొన్న వారిలో 45 శాతం మంది ప్రతిపక్ష లేబర్ పార్టీకే ఓటేశారు. పాయింట్ల వారీగా చూస్తే అధికార కన్జర్వేటివ్ పార్టీ కంటే లేబర్ పార్టీ 19 పాయింట్లు ముందంజలో ఉంది. గత ఏడాది డిసెంబర్‌లో చేపట్టిన పోలింగ్‌తో పోలిస్తే ఇది మూడు పాయింట్లు ఎక్కువ. కన్జర్వేటివ్ పార్టీ 100 లోపే సీట్లు గెలుచుకోవడం, అంటే 250 ఎంపీ స్థానాలను కోల్పోవడం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారవుతుందని నిర్వాహకులు విశ్లేషిస్తున్నారు. సొంత సీటు రిచ్‌మండ్ అండ్ నార్త్‌అల్లెర్టన్‌లో ప్రధాని రిషి సునాక్‌కు లేబర్ పార్టీ కంటే 2.4 శాతం మాత్రమే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. ఈ పోలింగ్‌లో ఎటు వైపూ మొగ్గు చూపని 15 శాతం మంది ఓట్లను పరిగణనలోకి తీసుకోలేదని 'సర్వేషన్' తెలిపింది. కన్జర్వేటివ్ పార్టీ పరిస్థితి ముున్ముందు మరింత దారుణంగా ఉంటుందని ఓ విశ్లేషకుడు అన్నారు. ఇలా ఉండగా, మే 2వ తేదీన స్థానిక కౌన్సిళ్లు, మేయర్ ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ పేలవమైన ఫలితాలను సాధించిన పక్షంలో ప్రధాని రిషి సునాక్‌పై సొంత పార్టీలోనే తిరుగుబాటు రావడం ఖాయమని కూడా అంటున్నారు.

గవర్నర్ పదవి ఆషామాషీ కాదు

- వారు రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న

హైదరాబాద్: ఎన్నికైన ప్రభుత్వాలు పంపిన బిల్లులను గవర్నర్లు ఆమోదించకుండా జాప్యం చేస్తున్న ఘటనలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఆమె పంజాబ్ గవర్నర్ తీరును ఉదహరించారు. ఒక రాష్ట్ర గవర్నర్ చర్యలు, లోపాలను రాజ్యాంగ న్యాయస్థానాల ముందు పరిశీలనకు తేవాల్సిరావడం రాజ్యాంగం ప్రకారం ఆరోగ్యకరమైన ధోరణి కాదన్నారు. ఇటువంటివి సాధ్యమైనంత మేర తగ్గాలని అభిప్రాయపడ్డారు. ఒక పని చేయమని లేదా చేయవద్దని గవర్నర్లకు న్యాయస్థానాలు చెప్పాల్సి రావడం ఇబ్బందికరమైన అంశమన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీలో జరిగిన సదస్సులో జస్టిస్ బీవీ నాగరత్న ప్రసంగించారు. 2016లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నోట్ల రద్దు అంశాన్ని ప్రస్తావిస్తూ జస్టిస్ నాగరత్న..రూ.500, రూ.1,000 నోట్ల రద్దును బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చుకునేందుకు ఒక మార్గంగా భావించానన్నారు. నోట్ల రద్దుకు సానుకూలంగా సుప్రీంకోర్టు ధర్మాసనం వెలువరించిన మెజారిటీ తీర్పును జస్టిస్ నాగరత్న వ్యతిరేకించిన విషయం తెలిసిందే.

అద్వానీకి భారతరత్న

ఆయన నివాసంలో అందజేసిన ముర్ము

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ దిగ్గజం, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ (96) భారత రత్న పురస్కారం అందుకున్నారు. ఆదివారం ఢిల్లీలోని అద్వానీ నివాసంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. అద్వానీకి భారతరత్న ప్రదాన కార్యక్రమంలో పాల్గొనడం తనకు చాలా ప్రత్యేకమైన సందర్భమని మోదీ అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారతరత్న ప్రదాన సమయంలో కూర్చొని ఉండటం ద్వారా రాష్ట్రపతిని మోదీ ఘోరంగా అవమానించారని కాంగ్రెస్ మండిపడింది.

లంకకు దీవినే రాసిచ్చిన ఇందిర

మోదీ ఆరోపణలు.. తిప్పికొట్టిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: దాదాపు అర్ధ శతాబ్దం క్రితం నాటి ద్వీపం ధారాదత్తం ఉదంతం సార్వత్రిక ఎన్నికల వేళ మొట్టమొదటిసారిగా తెరమీదకొచ్చింది. దేశ భద్రతను ఏమాత్రం పట్టించుకోకుండా, స్పృహలేకుండా ఇందిరాగాంధీ ప్రభుత్వం శ్రీలంకకు కచ్చాతీవు ద్వీపాన్ని అప్పగించిందని ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) ద్వారా తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై సంపాదించిన అధికారిక పత్రాలు తాజాగా ఒక జాతీయ వార్తసంస్థ కథనం ద్వారా వెలుగు చూశాయి. అధికార, విపక్షాల పరస్పర ఆరోపణలతో ఈ భౌగోళిక, దౌత్య అంశం ఒక్కసారిగా రాజకీయరంగు పులుముకుని పెద్ద చర్చనీయాంశమైంది. కచ్చాతీవు అంశంపై ఆదివారం మోదీ 'ఎక్స్' వేదికగా నాటి కాంగ్రెస్, డీఎంకే ప్రభుత్వాలపై విమర్శలు ఎక్కుపెట్టారు. 'కళ్లు తెరిపించే ఘటన ఇది. కచ్చాతీవు ద్వీపంపై పరిపాలనా హక్కులను ఎంత నిర్లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వదులుకుందనేది కొత్తగా వెలుగుచూసిన నిజాలతో వెల్లడైంది. ఇది ప్రతి ఒక్క భారతీయుడికి ఆగ్రహం తెప్పించే విషయం. కాంగ్రెస్‌ను ఎన్నటికీ నమ్మొద్దని ప్రజల మనసుల్లో స్థిరపడిపోయింది. దేశ ఐక్యత, సమగ్రత, ప్రయోజనాలను కాంగ్రెస్ పణంగా పెట్టి 75 ఏళ్లు దాటిపోయింది. కాంగ్రెస్ పెద్ద తప్పు చేసింది. ఆ పాపం వల్లే నేడు తమిళనాడు జాలర్లు ఇప్పటికీ ఆ దీవి సమీపంలో చేపలు పట్టుకోలేకపోతున్నారు. అటుగా వెళ్తే శ్రీలంక తీరగస్తీ బలగాలు అరెస్ట్‌చేసి జైలులో పడేస్తున్నాయి' అని మోదీ ఆరోపించారు.

అది స్నేహపూర్వక ఒప్పందం: ఖర్గే

మోదీ వ్యాఖ్యలకు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే దీటుగా బదులిచ్చారు. '' మీ ప్రభుత్వం సైతం బంగ్లాదేశ్‌తో ఒప్పందం చేసుకుని 111 ప్రాంతాలను బంగ్లాకు, 55 ప్రాంతాలను భారత్‌కు పరస్పరం బదిలీచేసుకున్న విషయం మర్చిపోయారా?. 1974 సంవత్సరంలో జరిగింది కూడా అచ్చంగా అలాంటి ఒడంబడికే'' అన్నారు.

ఎమిటీ కచ్చాతీవు కథాకమామిషు?

కచ్చాతీవు తమిళనాడులోని రామేశ్వరం నుంచి శ్రీలంక దిశగా 55 కిలోమీటర్ల దూరంలో పాక్ జలసంధిలో ఉన్న 163 ఎకరాల అతి చిన్న ద్వీపం. మధ్యయుగంలో శ్రీలంకలోని జాఫ్నా అధీనంలో ఉండేది. బ్రిటిష్ వారి రాకతో శ్రీలంక, భారత్ రెండింటి ఏలుబడిలోకి వచ్చింది. 1948 దాకా తమిళనాడులోని రామనాథపురం జమీందారీ కింద ఉండేది. తర్వాత మద్రాస్ రాష్ట్ర పాలనలోకి వచ్చింది. చేపల వేట పెరగడంతో అది తమదంటే తమదని శ్రీలంక, భారత్ ప్రకటించుకున్నాయి.

ఎలక్షన్ బీట్



ఎన్నికల విచిత్రం

ఆదివారం ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి ర్యాలీ వేదిక నుంచి కేజ్రీవాల్ ఫ్లెక్సీని తొలగిస్తున్న దృశ్యం. ఇది ఒక వ్యక్తి కేంద్రంగా జరుగుతున్న ర్యాలీ కాదనే ఉద్దేశంతో ఈ చర్య చేపట్టినట్టు తెలుస్తోంది.

200 స్థానాలు గెలిచి చూపించండి

బీజేపీకి తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ సవాల్

పశ్చిమ బెంగాల్: 400 లోక్‌సభ స్థానాలు గెలుస్తామంటున్న బీజేపీకి దమ్ముంటే 200 సీట్లు గెలిచి చూపించాలని పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సవాల్ విసిరారు. 2021లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 200కు పైగా స్థానాలు గెలుస్తామని బీరాలు పోయారని, 77 దగ్గరే ఆగిపోయారని గుర్తు చేశారు. పార్టీ కృష్ణానగర్ అభ్యర్థి మహువా మొయిత్రా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కృష్ణానగర్‌లో ఆమె మాట్లాడారు. పార్లమెంటులో బీజేపీకి వ్యతిరేకంగా మహువా మొయిత్రా పోరాటాన్ని ప్రశంసించారు. పశ్చిమ బెంగాల్లో కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ చేతులు కలిపాయని ఆరోపించారు. ''రాష్ట్రంలో ఇండియా కూటమి ఉనికిలో లేదు. ఇక్కడ లెఫ్ట్-కాంగ్రెస్-ఐఎస్ఎఫ్ అభ్యర్థులకు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే'' అన్నారు. పౌర సవరణ చట్టం (సీఏఏ) అమలును బెంగాల్లో తిరస్కరిస్తున్నట్టు మమత పునరుద్ఘాటించారు. సీఏఏపై ప్రజల మనసుల్లో భయాలు ఆమె సృష్టిస్తున్నారని బీజేపీ ఎంపీ సామిక్ భట్టాచార్య విమర్శించారు.

సుమలతతో కుమారస్వామి భేటీ

బెంగళూరు: జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఆదివారం మాండ్య సిట్టింగ్ ఎంపీ సుమలత అంబరీశ్‌తో భేటీ అయ్యారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సుమలత బీజేపీ టిక్కెట్‌ను ఆశించారు. అయితే, పొత్తులో భాగంగా బీజేపీ మాండ్య,, కోలార్, హస్సన్ సీట్లను జేడీఎస్‌కు కేటాయించింది. జేడీఎస్ తరఫున హెచ్‌డీ కుమారస్వామి మాండ్య నుంచి బరిలోకి దిగనున్నారు. అయితే, వచ్చే ఎన్నికల్లో పోటీకి దిగే విషయమై ఏప్రిల్ 3వ తేదీన మద్దతుదారులతో చర్చించి, నిర్ణయం ప్రకటిస్తానంటూ సుమలత రెండు రోజుల క్రితం ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే కుమారస్వామి ఆదివారం సుమలతతో ఆమె నివాసంలో భేటీ అయ్యారు. ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరినట్లు అనంతరం కుమారస్వామి చెప్పారు. ఏప్రిల్ 4న మాండ్య స్థానానికి నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. 2019 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన బహు భాషా నటి సుమలత బీజేపీ మద్దతుతో, అప్పటి సీఎం కుమారస్వామి కుమారుడు నిఖిల్‌పై విజయం సాధించారు.

దక్షిణాదిన మెరుగైన ఫలితాలు.. 370 సీట్ల లక్ష్యాన్ని సాధిస్తాం: గడ్కరీ

నాగ్‌పూర్: దక్షిణ భారత దేశంలో మెరుగైన ఫలితాలను సాధించడం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 370 స్థానాలను గెలుచుకుంటుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదివారం ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ 400 పైగా సీట్లను సాధిస్తుందన్నారు. మోదీ మూడో విడత ప్రధాని అవుతారన్నారు. విపక్షాలు ముందు తమ మధ్య విభేదాలను సరిదిద్దుకోవాలని ఎద్దేవా చేశారు. బీజేపీకి కేవలం ఇద్దరే ఎంపీలున్నప్పుడు కూడా సానుభూతి కోసం పాకులాడలేదని చెప్పారు.

ఇండియా కూటమిని వీడిన అప్నాదళ్(కె)

లక్నో: ప్రతిపక్ష పార్టీల 'ఇండియా' కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు అప్నాదళ్(కామెరవాది) ఆదివారం ప్రకటించింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని ఏఐఎంఐఎంతో కలిసి పోటీ చేయనున్నట్లు తెలిపింది. తమ రెండు పార్టీలు కలిసి పీడీఎం న్యాయ్ మోర్చాను ఏర్పాటు చేశాయని పేర్కొంది. వెనుకబడిన, దళిత, ముస్లిం వర్గాల ప్రజలకు న్యాయం కోసం పనిచేస్తామని పేర్కొంది. సమాజ్ వాదీ పార్టీతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు అప్నాదళ్(కె) నేత పల్లవీ పటేల్ చెప్పారు. ఆదివారం పల్లవీ పటేల్ తన తల్లి కృష్ణా పటేల్, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీతో లక్నోలో మీడియాతో మాట్లాడారు. బిహార్ రాష్ట్రం కౌశాంబి జిల్లాలోని సిరాంతు నియోజకవర్గం నుంచి పల్లవీ పటేల్ ఎస్పీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు.

రాజ్‌గఢ్‌లో బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు

కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్

మధ్యప్రదేశ్: రాజ్‌గఢ్ నియోజకవర్గంలో బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలు జరిగేందుకు ప్రయత్నిస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ తెలిపారు. 400 మంది బరిలో ఉంటే ఎన్నికలు బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహిస్తారని, అందుకే 400 మందితో పోటీ చేయించేందుకు తాను ప్రయత్నిస్తున్నానని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ లోకసభ స్థానం నుంచి పోటీచేస్తున్న దిగ్విజయ్.. చాలా కాలం తరువాత ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. 'వాదా నిభావో యాత్ర' ఎనిమిదిరోజుల పాదయాత్రలో మొదటి రోజైన ఆదివారం సుస్నేర్ జిల్లా కచ్నరియా గ్రామంలో కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ఈవీఎం ద్వారా జరగాలా? బ్యాలెట్ పేపర్ ద్వారా జరగాలా అని ప్రజలను ఆయన ప్రశ్నించగా.. 'బ్యాలెట్ పేపర్' అంటూ వారు స్పందించారు. 400 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేస్తేనే అది సాధ్యం అవుతుందన్నారు. ఈవీఎంల వల్లే భారతీయ జనతాపార్టీ ఎన్నికల్లో గెలుస్తోందని ఆయన మరోమారు విమర్శించారు.

బీజేడీలో చేరిన బీజేపీ ఎమ్మెల్యే

భువనేశ్వర్: ఒడిశాలో బీజేపీ ఎమ్మెల్యే సుకాంత నాయక్ బీజేడీలో చేరారు. బీజేపీతో సరిపడక తిరిగి వచ్చానన్నారు. ఆయన శుక్రవారం బీజేపీని వీడటం తెలిసిందే. 2014లో ఆయన బీజేడీ టికెట్‌పైనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 ఎన్నికల ముందు బీజేపీలో చేరి గెలిచారు. మాజీ ఎమ్మెల్యే బృందావన్ మాఝీ కూడా బీజేడీలో చేరారు. బీజేడీ మాజీ ఎమ్మెల్యే కోరేయ్ ఆకాశ్ దాస్ నాయక్ బీజేపీలో చేరారు.

కాంగ్రెస్‌కు మళ్లీ ఐటీ నోటీసులు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి ఆదాయ పన్ను శాఖ నుంచి తాజాగా నోటీసులు అందాయి. 2014-15 నుంచి 2016-17 సంవత్సరం వరకు జరిగిన లావాదేవీలపై రూ.1,745 కోట్ల పన్ను చెల్లించాలంటూ పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తాజా నోటీసులతో కలిపి కాంగ్రెస్‌కు ఐటీ శాఖ పంపిన పన్ను నోటీసుల మొత్తం రూ.3,567 కోట్లకు చేరింది. 2014-15కు రూ.663 కోట్లు, 2015-16కు రూ.664 కోట్లు, 2016-17కు రూ.417 కోట్ల పన్ను చెల్లించాలని తాజా నోటీసుల్లో పేర్కొన్నారు. పార్టీలకు పన్ను మినహాయింపులను ఎత్తేసినందున కాంగ్రెస్ ఆదాయంపై పన్ను విధించినట్లు అధికారవర్గాలు తెలిపాయి.

సాక్షి విజయవాడ సిటీ


ఎన్టీఆర్ జిల్లా

సోమవారం। 1। ఏప్రిల్। 2024



నిత్యాన్నదానానికి లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 513.40 అడుగుల వద్ద ఉంది. ఇక్కడ నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఆశీర్వదించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి పంచాయతీ రామరాజ్యనగర్‌లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, మైలవరం అభ్యర్థి తిరుపతిరావు ఎన్నికల ప్రచారం చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహరి (మంగళ)
విజయవాడ	6.25	4.43
జగ్గయ్యపేట	6.28	4.49
మచిలీపట్నం	6.24	4.42
గుడివాడ	6.25	4.43

న్యూస్‌రీల్

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యోపాసన సేవ చేస్తారు. రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ చేయగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

అలరించిన నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఎం.గాయత్రి శిష్య బృందం ఆంధ్రనాట్య ప్రదర్శన చేసింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై ఆదివారం సాయంత్రం ఆంధ్రనాట్య ప్రదర్శన చేయగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శిష్యబృందంలోని విద్యార్థులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నాట్య ప్రదర్శన ఇచ్చారు. బృందంలోని గుణసింధు, తిలోత్తమ, లీలలాస్య, పలువురు విద్యార్థుల నాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

గోవర్ధనోద్ధరణ అలంకరణలో నారసింహుడు

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో ఆదివారం గోవర్ధనోద్ధరణ అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవాన్ని ఆలయ ఈఓ రామకోటిరెడ్డి పర్యవేక్షించగా కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన శనగల రామహనుమాన్, శేషాంజనేయగోపాల్ వ్యవహరించారు. ఆస్థాన కైంకర్య పరులుగా దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి చెందిన వాసిరెడ్డి మల్లేశ్వరరావు (రాజేష్) వ్యవహరించారు.

'వలంటీర్ల'పై చంద్రబాబు అండ్ కో అక్కసు

ఎమ్మెల్సీ అరుణకుమార్



నందిగామ టౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే వలంటీర్లపై చంద్రబాబు అండ్ కో అక్కసు వెళ్లగక్కుతున్నాయని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్ల సేవలు నిలిపే వరకు చంద్రబాబుకు, ఇతర టీడీపీ నాయకులకు నిద్ర పట్టలేదన్నారు. పేదలకు మంచి జరుగుతుంటే ప్రతిపక్ష నేతలకు కడుపు మండుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అనుచరుడిగా ఉన్న నిమ్మగడ్డ రమేష్‌తో ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయించి వలంటీర్ల సేవలను నిలిపివేయడం బాధాకరమని తెలిపారు. ఈ చర్యతో అవ్వాతాతలు, వికలాంగులకు తీరని అన్యాయం చేయడమే కాకుండా వారి బాధలు, ఇబ్బందులను మళ్లీ వారికి గుర్తు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నందిగామలో అభివృద్ధి పనులు చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసి అడ్డుకున్నారని మండిపడ్డారు. మంచి చేయడం ప్రతిపక్ష టీడీపీకి ఇష్టం లేదని రానున్న ఎన్నికల్లో నిరుపేదల సత్తా ఏంటో చూస్తారని తెలిపారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

రైతుకు.. యంత్ర సేవ

- సాగుకు ఊతం
- యంత్రాలు, యంత్ర పరికరాలు అందజేత
- 40 శాతం రాయితీ .. 50 శాతం బ్యాంకు రుణంతో భరోసా
- ఎన్టీఆర్ జిల్లాలో 'యంత్రసేవ'లో రైతుకు రూ.11.83 కోట్ల రాయితీ



వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ట్రాక్టరును పొందిన జి.కొండూరు మండలంలోని వెలగలేరు రైతులు(ఫైల్)

జి.కొండూరు: సాగు అవసరాలను తీర్చి తక్కువ ధరకే యంత్ర ఉపకరణాలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని కింద రైతులకు నలభై శాతం రాయితీతో నిష్పక్షపాతంగా ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, ఇతర యంత్ర పరికరాలను పంపిణీ చేసింది. 10 శాతం రైతు గ్రూపు వాటాతో ప్రభుత్వం అందించే 40 శాతం రాయితీతో ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా రైతులకు 50 శాతం రుణాలను మంజూరు చేయించింది. యంత్ర పరికరాల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు రైతులకు ఎంతో మేలు చేశాయి. దీనిపై రైతుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది

గ్రూపులుగా ఏర్పడి..

ఈ పథకం కింద యంత్రాలు, యంత్ర పరికరాలను పొందడానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కొక్క రైతు భరోసా కేంద్రాన్ని ఒక యూనిట్‌గా వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరి కోత యంత్రాలను అందించడానికి రెండు లేదా మూడు రైతు భరోసా కేంద్రాలను ఒక యూనిట్‌గా క్లస్టర్ యంత్ర సేవా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఒక్కొక్క యంత్ర సేవా కేంద్రంలో ముగ్గురు లేదా ఐదుగురు రైతులు సభ్యులుగా ఒక గ్రూపుగా ఉన్నారు. ఇలా ఒక్కొక్క యంత్ర సేవా కేంద్రానికి రూ.15 లక్షల విలువ చేసే ట్రాక్టరు, యంత్ర పరికరాలను అందజేశారు. క్లస్టర్ యంత్ర సేవా కేంద్రంలో ఏర్పడిన రైతు గ్రూపునకు రూ.25లక్షల విలువ చేసే వరికోత యంత్రాన్ని అందజేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 291 కేంద్రాలకు రూ.32.84కోట్ల విలువైన యంత్రాలను రైతులకు ఇచ్చారు. దీనిలో ప్రభుత్వం నుంచి రూ.11.83 కోట్ల రాయితీని రైతులు పొందారు.

ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం వివరాలు

ఈ ఏడాది సాగుభూమి	3,13,177ఎకరాలు
రైతులు	1,08,859
రైతు భరోసా కేంద్రాలు	267
యంత్ర సేవా కేంద్రాలు	257
క్లస్టర్ లెవెల్‌లో	34
అందజేసిన పరికరాలు	1,667
వరికోత యంత్రాలు	35
అందజేసిన ట్రాక్టర్లు	183
పంపిణీ చేసిన మొత్తం వ్యవసాయ పరికరాలు	
అసలు ధర	రూ.32.84కోట్లు
ప్రభుత్వం అందించిన రాయితీ	రూ.11.83కోట్లు.

వివక్ష లేకుండా

రాష్ట్ర ప్రభుత్వం కుల, మత, రాజకీయ వివక్షకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అందజేస్తోంది. ఇదే పద్ధతిని వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో కూడా అమలు చేశారు. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి పథకాన్ని అమలు చేయడంతో ప్రతి ఒక్కరికీ మేలు జరిగింది. గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేసి ఈ ప్రభుత్వం అమలు చేసిన పథకంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వివక్షకు తావులేకుండా యంత్రాలు ఇస్తున్నారు



వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ట్రాక్టర్ మంజూరైంది. గత ప్రభుత్వంలో వారికి నచ్చినట్లు ఇచ్చారు. కానీ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివక్షకు తావులేకుండా అర్హతను బట్టి ట్రాక్టర్లు, వరికోత మిషన్లు, వ్యవసాయ పరికరాలు ఇస్తున్నారు.

–మండల శేషయ్య, రైతు, మునగపాడు, జి.కొండూరు మండలం

ఏసు క్రీస్తు సర్వశక్తిమంతుడు

మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ ఏలేటి విలియం జయరాజ్



ఈస్టర్ సందర్భంగా సమష్టి దివ్యబలి పూజ సమర్పిస్తున్న గురువులు

గుణదల (విజయవాడ తూర్పు): మానవాళిని రక్షించడానికి పునరుత్థానుడైన ఏసుక్రీస్తు సర్వశక్తిమంతుడని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ ఏలేటి విలియం జయరాజ్ అన్నారు. ఈస్టర్‌ను పురస్కరించుకుని ఆదివారం పుణ్యక్షేత్రంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి రక్షణకు ఆయన ఈ లోకానికి అరుదెంచారని వివరించారు. ఏసుక్రీస్తు సిలువ త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. ఆయనపై విశ్వాసం ఉంచిన భక్తుల జీవితాలకు దీవెనలు లభిస్తాయని పేర్కొన్నారు. అనుదిన ప్రార్థన, బైబిల్ పఠనం వంటివి ఆచరిస్తే దేవునిపై భక్తిభావం పెరుగుతుందన్నారు. క్రీస్తు మార్గాన్ని అనుసరిస్తే సకల ఆశీర్వాదాలు లభిస్తాయన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ గురువులు, భక్తులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో అభివృద్ధి పనులపై సమీక్ష



అధికారులతో సమావేశమైన ఈవో కె.ఎస్.రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న అభివృద్ధి పనులపై ఈవో కేఎస్ రామరావు ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మహామండపం నాలుగో అంతస్తులోని ఈవో చాంబర్‌లో జరిగిన సమావేశంలో అభివృద్ధి పనులు, బడ్జెట్, ఆర్జిత సేవలతో పాటు గత వారం రోజుల్లో దేవస్థాన ఆదాయం వంటి అంశాలపై చర్చించారు. భక్తుల వాహనాల పార్కింగ్‌పై సుదీర్ఘంగా చర్చించారు. ప్రసాదాల కౌంటర్లు, టికెట్ల విక్రయ కౌంటర్లతో పాటు పారిశుద్ధ్యంపై అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం, ఆలయానికి ఆదాయం పెంపు వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ఏప్రిల్‌లో జరిగే ఉత్సవాలు, పూజలు, ఆర్జిత సేవల్లో భక్తుల భాగస్వామ్యం మరింత పెంచడానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఈఈ కోటేశ్వరరావు, ఎల్. రమాదేవి, ఏఈవోలు వెంకటరెడ్డి, ఎస్.రమేష్‌బాబు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, సూపరింటెంటెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతి రోజూ కార్డియాలజీ ఓపీ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం నుంచి ప్రతి రోజూ గుండె జబ్బు రోగులకు ఔట్‌పేషెంట్ విభాగంలో ఓపీ వైద్యసేవలు అందిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. గతంలో వారంలో మూడు రోజులు మాత్రమే ఓపీ వైద్యసేవలు అందుబాటులో ఉండేవన్నారు. ఆసుపత్రి ఆవరణలో గతంలో జిల్లా క్షయ వ్యాధి కేంద్రం ఉన్న ప్రదేశంలో కార్డియాలజీ ఓపీ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఓపీ విభాగంలోనే గుండె జబ్బుకు అవసరమైన ఈసీజీ, 2డి ఎకో, ట్రెడ్‌మిల్ టెస్టులన్నీ కూడా చేస్తారన్నారు.

రంజాన్ ఘుమఘుమలు



పంజాసెంటర్‌లో కొనుగోలుదారులకు హలీమ్ అందజేస్తున్న దుకాణదారులు.. (ఇన్‌సెట్‌లో) హలీమ్

- రోజా పాటించిన ముస్లింలకు హలీమ్ బలవర్ధకమంటున్న మత పెద్దలు
- హైదరాబాద్ పాతబస్తీని తలపిస్తున్న వించిపేట పరిసరాలు
- హలీమ్, కబాబు, ఫలుదాలతో సందడి చేస్తున్న దుకాణాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రంజాన్ మాసం ఉపవాసదీక్షలతో పాటుగా కమ్మని పసందైన రుచులను తీసుకొచ్చింది. రంజాన్ సందర్భంగా పాతబస్తీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హలీమ్ దుకాణాలు పలు రుచులతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. 'పశ్చిమ'లోని వించిపేట, పంజా సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఏటా రంజాన్ మాసంలో ప్రత్యేక దుకాణాలను ఏర్పాటు చేయడం ఆనవాయితీ. గతంలో తక్కువ సంఖ్యలో దుకాణాలు కనపడితే, ఇప్పుడు వన్‌టౌన్‌లో సుమారు 50కు పైగా షాపులు ఏర్పాటయ్యాయి. వీటిలో అందిస్తున్న ప్రత్యేక వంటకాలు ముస్లింలనే కాకుండా అన్ని వర్గాలను అలరిస్తున్నాయి.

హలీమ్‌తో సత్వరశక్తి

ముస్లింలు రంజాన్ నెలలో తెల్లవారుజామున నాలుగు నుంచి సాయంత్రం 6.40 గంటల వరకూ సుమారు 14 గంటలకు పైగా ఉపవాస దీక్షలో ఉంటారు. ఆహారంతో పాటు ఎటువంటి ద్రవాలను తీసుకోరు. ఉపవాస దీక్ష ముగించేసరికి శరీరానికి శక్తి అవసరమవుతుంది. సాధారణంగా డ్రైఫ్రూట్స్‌తో ఉపవాస దీక్ష విరమించినా ఆ తర్వాత తీసుకునే ఆహారంలో హలీమ్‌కు ప్రాధాన్యమిస్తారు. హలీమ్‌లో పోషక విలువలతో పాటుగా తేలికగా జీర్ణమయ్యే గుణం ఉండటమే దీనికి కారణం. కేవలం సాయంత్రం వేళల్లోనే లభించే హలీమ్ రుచులను ఆస్వాదించడానికి నగర ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. హలీమ్ తినడానికి జిల్లా పరిసర ప్రాంతాల నుంచి కూడా జనం వన్‌టౌన్‌కు తరలివస్తున్నారు.

ఆరేడు గంటల పాటు తయారీ

హలీమ్‌ను తయారు చేయడానికి సుమారు ఆరేడు గంటలు పడుతుందని తయారీదారులు చెబుతున్నారు. దీని తయారీలో పొట్టేళ్ల మాంసం, గోధుమలు, నెయ్యి, వివిధ సుగంధ ద్రవ్యాలతో పాటుగా మినప్పప్పు, పెసరపప్పు వంటి తొమ్మిది రకాల పప్పులు, మసాలా దినుసులను వినియోగిస్తారు. వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన దుకాణాల్లో అధిక శాతం హలీమ్‌ను అందిస్తున్నాయి. గతంలో కేవలం హైదరాబాద్‌కు మాత్రమే హలీమ్ రుచులు పరిమితమయ్యేవి. గడిచిన 20 సంవత్సరాలుగా నగరంలో కూడా హలీమ్ అందుబాటులో ఉంది. దీన్ని రూ.200 నుంచి విక్రయిస్తున్నారు. ఇతర చికెన్ వంటకాలు ఆకట్టుకుంటున్నాయి.

ప్రత్యేకంగా ఫలుదా



రంజాన్ రుచుల్లో ఫలుదా ఐస్‌క్రీమ్ ప్రత్యేకతను చాటుకుంటుంది. ఇక్కడి దుకాణాల్లో హలీమ్ తర్వాత ఫలుదాను అందించే దుకాణాలే అధికంగా ఉన్నాయి. సబ్జాగింజలు, సేమ్యాలు, వివిధ ఫ్లేవర్స్ కలిగిన క్రీమ్‌లతో ఐస్‌క్రీమ్‌ను ప్రత్యేకంగా అప్పటికప్పుడు తయారు చేసి ఇస్తుంటారు. వాటిపై డ్రైఫ్రూట్స్‌ను అద్ది అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

నాణ్యతలో రాజీ లేదు



హలీమ్ తయారీలో నాణ్యత విషయంలో రాజీలేదు. ఈ వంటకంలో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. హలీమ్ మంచి బలవర్ధకమైన ఆహారం. అంతేకాకుండా రంజాన్ మాసంలో దాని రుచి మరింత అధికంగా ఉంటుంది. దీంతోపాటు అనేక ఇతర వంటకాలు కూడా అందుబాటులో ఉంచాం.

–మొహమ్మద్ అన్వర్, మెహివిష్ హలీమ్ సెంటర్ యజమాని

పల్లె చెంతకే మెరుగైన వైద్యం

- ఎన్టీఆర్ జిల్లాలో 257, కృష్ణాలో 357 విలేజ్ హెల్త్ క్లినిక్స్
- ప్రతి సచివాలయం పరిధిలో ఒక హెల్త్ క్లినిక్
- అందుబాటులో టెలిమెడిసిన్ సేవలు
- వరంలా ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష శిబిరాలు



కవులూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య పరీక్షలు(ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): పల్లె ప్రజలకు చెంతనే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు(వెల్నెస్ సెంటర్) ప్రజలకు వరంలా మారాయి. చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా అక్కడ పరీక్షలు చేయించుకోవడం, అవసరమైన వైద్యం పొందగలుగుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీతో బాధపడేవారు తరచూ పరీక్షలు చేయించుకునే అవకాశం ఏర్పడింది. గర్భిణులు, బాలింతలకు అవసరమైన పరీక్షలు, పిల్లల టీకాలకు వెల్నెస్ కేంద్రాలు వేదికలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం వెల్నెస్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటుచేసింది. అక్కడ పనిచేసే మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు తమ వద్దకు వచ్చే వారికి అవసరమైన సేవలు అందిస్తున్నారు.

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో..

ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఒక విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేయగా ఎన్టీఆర్ జిల్లాలో 257, కృష్ణాలో 357 ఉన్నాయి. వాటిలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్‌తో పాటు, ఏఎన్ఎం, ఆశ, హెల్త్ అసిస్టెంట్ అందుబాటులో ఉంటారు. అక్కడ 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. వ్యాధి పీడితులను అవసరమైతే టెలిమెడిసిన్ విధానం ద్వారా వైద్యుడితో మాట్లాడిస్తారు. అత్యవసరమైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆస్పత్రి, టీచింగ్ ఆస్పత్రులకు వెళ్లాలని సిఫారసు చేస్తున్నారు.

గ్రామీణులకు వరంలా..

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు గ్రామీణులకు వరంలా మారాయి. ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో వారంలో రెండుసార్లు కుటుంబ డాక్టర్ క్యాంపులు నిర్వహిస్తుండగా, స్పెషలిస్టు వైద్యులతో ఆరోగ్య సురక్ష క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. అసాంక్రమిక, సాంక్రమిక వ్యాధుల బారిన పడిన వారికి మందులు అందజేస్తున్నారు. కుటుంబ డాక్టర్ కార్యక్రమంలో అనారోగ్యంతో మంచంపై ఉన్న వారి ఇంటికే వెళ్లి వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు. కుటుంబ డాక్టర్ కార్యక్రమం గ్రామీణులకు వరంలా మారింది.

నిర్వహణ ఇలా

- రోజూ క్లినిక్‌లకు వచ్చే రోగులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఇస్తారు.
- జాతీయ , రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తున్నారు.
- గర్భిణులు, బాలింతలకు అవసరమైన పరీక్షలు, వైద్య సేవలు సకాలంలో అందేలా హెల్త్ క్లినిక్‌ల సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు.
- హెల్త్ క్లినిక్ పరిధిలోని అంగన్‌వాడీలు.. పాఠశాలలను సందర్శిస్తూ అనారోగ్యం, రక్తహీనత, ఎదుగుదల లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వైద్యం పొందేలా చూస్తారు.
- హెల్త్ క్లినిక్ పరిధిలో మంచినీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ, క్లోరినేషన్ వంటి వాటిని పరిశీలిస్తారు.
- వారి పరిధిలోని పారిశుద్ధ్య, దోమల నివారణతో పాటు, డ్రైడే ఫ్రైడే నిర్వహణకు కృషి చేస్తున్నారు.
- వారంలో రెండు రోజులు బుధ, శనివారాల్లో ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తారు.
- ఇక్కడి ఎంఎల్‌హెచ్‌పీలకు అత్యవసర వైద్యం, బేసిక్ లైఫ్ సపోర్టు విధానాలపై ఇటీవల ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పాము కాటుతో వస్తే ఏం చేయాలి, పాయిజన్ కేసులు వస్తే ఎలా వ్యవహరించాలి.. గుండె ఆగినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

స్క్రీనింగ్‌తో ఎంతో ఉపయోగం



గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. దీంతో మధుమేహం, రక్తపోటును తొలిదశలో గుర్తించవచ్చు. చాలా మంది తమకు మధుమేహం ఉన్నా గుర్తించలేక పోతున్నారు. వ్యాధులు ఉన్నట్లు తెలిసినా మందులు సక్రమంగా వాడటం లేదు. దీంతో దుష్ఫలితాల బారిన పడుతున్నారు. రక్తపోటు, మధుమేహులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ వాటిని అదుపులో ఉంచుకోవాలి. గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు విస్తరించడంతో అది సాధ్యమవుతుంది.

–డాక్టర్ ఎం.శ్రీకాంత్, మధుమేహ నిపుణుడు

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల సందడి



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో పొంగళ్లతో భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న తిరుపతమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ నుంచి సైతం వందలాది వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది. గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి



విస్సన్నపేట: మండలంలోని నరసాపురం గ్రామంలో చాట్రాయి రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీ కొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రెడ్డిగూడెం మండలం ముచ్చెనపల్లి గ్రామానికి చెందిన మేడా యాకోబు(60) చాట్రాయి నుంచి తన టీవీఎస్ వాహనంపై నరసాపురం వైపు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో వారిలోని ఒక హోంగార్డు తలకు తీవ్ర గాయాలైన సంఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన అమర్లపూడి రవికుమార్(46) అనే వ్యక్తి నగరంలో హోంగార్డుగా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దంపతుల మధ్య విభేదాలు రావడంతో కొంతకాలం నుంచి వారిద్దరూ వేరుగా జీవిస్తున్నారు. అయితే రవికుమార్ ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని గత 18 ఏళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో సదరు మహిళ తన బంధువు అయిన నాని అనే వ్యక్తితో కలిసి ఉంటుంది. దీన్ని జీర్ణించుకోలేని రవికుమార్ మార్చి 16న న్యూఆర్ఆర్‌పేటలో వారిద్దరిని అడ్డగించి గొడవపడి కొట్టాడు. దీనిని మనసులో పెట్టుకున్న నాని ఆదివారం రవికుమార్ ఉంటున్న ఇంటిలోకి ప్రవేశించి, రాయితో తలపై గాయపర్చాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణానదిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనైశ్వర స్వామి దేవాలయం సమీపంలో కృష్ణానదిలో ఒక వ్యక్తి మృతదేహం తేలియాడుతున్నట్లు ఆదివారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని నీటి నుంచి వెలికి తీశారు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పది స్పాట్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి పది జవాబు పత్రాల మూల్యాంకనం
- జిల్లాకు 1.69 లక్షల సమాధాన పత్రాలు కేటాయించే అవకాశం
- స్పాట్‌లో పాల్గొననున్న 1,100 మంది సిబ్బంది
- ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్(ఫైల్)

ఎన్టీఆర్ జిల్లా స్పాట్‌కు నిర్దేశించిన సిబ్బంది	
డెప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు	01
స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జి	01
అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు	14
ఏపీసీఓలు	07
చీఫ్ ఎగ్జామినర్లు	166
అసిస్టెంట్ ఎగ్జామినర్లు	650
స్పెషల్ అసిస్టెంట్లు	280

పటమట(విజయవాడపశ్చిమ): రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా మార్చి 18వ తేదీ నుంచి 178 పరీక్ష కేంద్రాల్లో పది పరీక్షలు ప్రారంభమైన విషయం విదితమే. సుమారు 33 వేల మంది విద్యార్థులు రెగ్యులర్, ప్రైవేట్‌గా పరీక్షలు రాయాల్సి ఉండగా, సరాసరిన 98 శాతానికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇప్పుడు అధికారులు జవాబు పత్రాల మూల్యాంకనంపై దృష్టి పెట్టారు. గత విద్యా సంవత్సరంలో జిల్లా కేంద్రమైన విజయవాడ బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలోని రెండు ప్రాంగణాల్లో స్పాట్ వేల్యుయేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. గతేడాది ఏప్రిల్ మాసంలో 10 రోజుల పాటు స్పాట్ వేల్యుయేషన్ నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకు జవాబు పత్రాల మూల్యాంకనాన్ని నిర్వహించనున్నారు. గతేడాది నిర్వహించిన బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాల ఆవరణలోనే ఈ ఏడాది కూడా స్పాట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి వచ్చిన పరీక్ష పేపర్ల కోడింగ్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టనున్నారు.

చేరుకుంటున్న జవాబు పత్రాలు

ఈ ఏడాది వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1.69 లక్షల జవాబు పత్రాలను మూల్యాంకనం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు. ఇప్పటికే పూర్తయిన పది పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలు వివిధ జిల్లాల నుంచి దఫదఫాలుగా వస్తున్నాయి. ఇప్పటి వరకు తెలుగు, కాంపోజిట్ తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, పీఎస్ సబ్జెక్టులకు సంబంధించిన జవాబు పత్రాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. అదే విధంగా కొన్ని సబ్జెక్టులకు చెందిన జవాబు పత్రాలు రావాల్సి ఉంది. ఆయా జిల్లాలకు జిల్లా విద్యాశాఖ అధికారి క్యాంప్ ఆఫీసర్‌గా, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ డెప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. వీరితో పాటు అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొననున్నారు.

కేటాయింపులు పూర్తి..

జిల్లాలో జరిగే మూల్యాంకనం కోసం వివిధ జిల్లాల నుంచి 1,69,666 జవాబు పత్రాలు నగరానికి రానున్నాయి. ఇప్పటికే చాలా పత్రాలు నగరానికి చేరుకున్నాయి. తెలుగు – 28,357, సంస్కృతం – 7,670, హిందీ – 26,550, ఇంగ్లిషు – 27,851, గణితం – 20,816, పీఎస్ – 22,468, బయాలజీ – 25,432, సోషల్ – 10,522 పేపర్లను జిల్లాకు కేటాయించారు. ఈ సంఖ్య స్పాట్ జరిగే రోజుల్లో కొంచెం పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

సబ్జెక్టుల వారీగా విధులు

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధులకు ఆయా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమిస్తూ ఇప్పటికే ఉత్తర్వులను సిద్ధం చేసే పనిలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఉంది. స్పాట్ వేల్యుయేషన్ ఉత్తర్వులను సంబంధిత ఉపాధ్యాయులకు ఇప్పటికే అందినట్లు సమాచారం. ఏడు సబ్జెక్టులు, ఒకేషనల్ పరీక్షలు కలిపి మొత్తం ఎనిమిది రోజులు పాటు మూల్యాంకనం చేస్తారు. ఒకటి రెండు రోజులు అటుఇటుగా మూల్యాంకనం పూర్తి చేసి ఫలితాలను ప్రకటించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

అన్ని చర్యలు చేపట్టాం..



జిల్లాలో జరిగే పది మూల్యాంకనానికి అన్ని చర్యలు చేపట్టాం. బిషప్ అజరయ్య హైస్కూల్‌కు చెందిన రెండు ప్రాంగణాల్లో ఈ స్పాట్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేశాం. స్పాట్‌లో పాల్గొనే సిబ్బందికి ఎక్కడా అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. నిర్ణీత సమయంలో మూల్యాంకనం పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం.

– యూవీ సుబ్బారావు, డీఈఓ, ఎన్టీఆర్ జిల్లా

స్పాట్‌లో పాల్గొనే సిబ్బందికి నిబంధనలు..

స్పాట్ విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. స్పాట్ ప్రాంగణంలో అనుసరించాల్సిన విధి నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అందరికీ అవగాహన కలిగించే రీతిలో అధికారులు తెలియజేశారు. సెల్‌ఫోన్, స్మార్ట్‌ఫోన్లు, వైట్‌నర్, ఎరేజర్ తదితర వస్తువులను మూల్యాంకనం గదిలోకి తీసుకువెళ్లరాదు. ప్రతి రోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూల్యాంకనం జరుగుతుంది. మూల్యాంకన సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎటువంటి తప్పిదాలు జరిగినా బాధ్యత వహించాల్సి ఉంటుంది.

క్రెడాయ్ వాల్ ఆఫ్ కైండ్‌నెస్ ప్రారంభం



పేద విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న క్రెడాయ్ సభ్యులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వ్యాపారంతో పాటు సంఘ సేవను ప్రథమ కర్తవ్యంగా క్రెడాయ్ కొనసాగిస్తోందని క్రెడాయ్ జాతీయ సంయుక్త కార్యదర్శి సౌత్‌జోన్ బి.రాజ శ్రీనివాస్ అన్నారు. గురునానక్ నగర్‌లో క్రెడాయ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన వాల్ ఆఫ్ కైండ్‌నెస్‌ను ఆయన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజసేవే అభిమతంగా క్రెడాయ్ అనేక సేవా కార్యక్రమాలను సీఎస్సార్ కార్యక్రమం కింద నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగానే గురునానక్ నగర్‌లో వాల్ ఆఫ్ కైండ్‌నెస్ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ ప్రాంగణం ద్వారా నిరుపేదలకు చేయూత ఇవ్వనున్నామని, సహృదయంతో అందించిన దుస్తులు, చెప్పులు, పుస్తకాలు, పాత వస్తువులను నిత్యం స్వీకరించి వాటిని అవసరం ఉన్న నిరుపేదలకు అందజేస్తామన్నారు. క్రెడాయ్ రాష్ట్ర చైర్మన్ ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ సంఘసేవలో క్రెడాయ్ ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. క్రెడాయ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ రమణరావు మాట్లాడుతూ.. వ్యాపారంతో పాటు సమాజసేవను చేస్తూ అనేక రూపాల్లో అవసరార్థులకు చేయూత ఇస్తున్నామన్నారు. ఇలాంటి సెంటర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు, విద్యార్థులకు పుస్తకాలు, చెప్పులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీధర్, నగర అధ్యక్షుడు దాసరి రాంబాబు, నాయకులు శివారెడ్డి, రాజేంద్ర, రమేష్, క్రెడాయ్ సీఎస్సార్ కన్వీనర్ సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలూరులో పూరిల్లు దగ్ధం



కంకిపాడు: విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఉప్పలూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతుభరోసా కేంద్రం చైర్మన్ నెరుసు శ్రీమన్నారాయణ కుటుంబం రాతి గోడల పూరింటిలో నివాసం ఉంటోంది. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లారు. ఆ సమయంలో ఇంటికి మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోయింది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు మంటలు అదుపుచేసే యత్నం చేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న గన్నవరం అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే ఇల్లు, అందులో ఉన్న సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో రూ.1.50 లక్షలు ఆస్తినష్టం వాటిల్లింది. తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరింది.

చంద్రబాబుకు పెన్షనర్ల ఉసురు తగులుతుంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నాయకులు

- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- టీడీపీ నాయకుల తీరు సిగ్గుచేటు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ద్వేషంతో 66 లక్షల మందికి పింఛన్ అందకుండా చంద్రబాబు చేస్తున్నారని.. రాష్ట్రంలోని దివ్యాంగులు, వృద్ధుల ఉసురు చంద్రబాబుకు కచ్చితంగా తగులుతుందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు మండిపడ్డారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. వలంటీర్ల వ్యవస్థ అంటేనే చంద్రబాబు అండ్ కో భయపడిపోతున్నారని, ఓ వైపు వలంటీర్ల ద్వారా పెన్షన్లు పంచడానికి వీలులేదంటూ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ చేత సీఈసీకి లేఖలు రాయించి మరోవైపు పింఛన్ల పంపిణీ చేయకపోతే ఆందోళనలు చేస్తామని చెప్పడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత ఐదేళ్లుగా టీడీపీ నాయకులు నిద్ర లేవక ముందే గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు రాష్ట్రవ్యాప్తంగా అవ్వాతాతలు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులకు తెల్లవారుజామునే పింఛన్లు డోర్ డెలివరీ చేస్తున్నారని, కానీ ఈరోజు సీఎం జగన్‌మీద కోపంతో మీరు చేసిన ఈ కుట్రల కారణంగా నేడు రాష్ట్రంలోని పెన్షన్‌దారులంతా మండుటెండల్లో సచివాలయాలకు వెళ్లి ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొందని దుయ్యబట్టారు.

మాయకూటమి కుదేలైంది..

పింఛన్లపై మాట్లాడే నైతికత టీడీపీ నాయకులకు లేదని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లల్లో 2024 ఫిబ్రవరి నాటికి 44,480 మందికి రూ.3 వేలు చొప్పున ప్రతి నెలా రూ. 12.21 కోట్లు అందిస్తున్నామని టీడీపీ హయాంలో పోలిస్తే దాదాపు 4 రెట్లు అధికమని వివరించారు. రాయలసీమ ద్రోహి ముమ్మాటికీ చంద్రబాబేనని.. ఆనాడు రాయలసీమకు నీళ్లు వెళ్లకుండా టీడీపీ నేతలు దేవినేని ఉమా, కోడెల శివప్రసాద్‌లు చంద్రబాబు డైరెక్షన్‌లో ప్రకాశం బ్యారేజీ వద్ద ధర్నా చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏర్పడిన బీజేపీ, టీడీపీ, జనసేన మాయకూటమి కుదేలైందని ఈ విషయాన్ని స్వయంగా పరిపూర్ణానంద స్వామే స్పష్టంగా చెబుతున్నారన్నారు. రాష్ట్ర అప్పులు గురించి మాట్లాడే ముందు కేంద్ర ప్రభుత్వానికి ఎన్ని లక్షల కోట్ల అప్పులు ఉన్నాయో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమాధానం చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జాబితాలో అనేక బీజేపీ పాలిత రాష్ట్రాల అప్పులు.. ఆంధ్రప్రదేశ్ కన్నా ఎక్కువ ఉన్నాయని పురందేశ్వరి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్ శర్వాణీమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు అఫ్రోజ్, ఆదినారాయణ, మేడా రమేష్, శనగశెట్టి హరిబాబు, సౌమ్య, బాబు తదితరులు ఉన్నారు.

దాడులకు పాల్పడిన 9 మంది అరెస్ట్

డీసీపీ శ్రీనివాసరావు



పెనుగంచిప్రోలు పీఎస్‌లో మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాసరావు, పక్కన ఏసీపీ రవికిరణ్, సీఐ జానకిరామ్

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో శనివారం రాత్రి నలుగురు వ్యక్తులపై దాడికి పాల్పడి గాయపరిచిన ఘటనలో 9 మందిని అరెస్ట్ చేశామని విజయవాడ పోలీస్ కమిషనరేట్ డీసీపీ కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన ఘర్షణ ఎస్సీ, బీసీ కాలనీలోని రెండు సమూహాల మధ్య పెరిగి దాడులకు దారి తీసిందన్నారు. దాడిలో ఎస్సీ కాలనీకి చెందిన నందికోలు రాజేష్, గేర నవీన్, ఐదుమళ్ల గోపాలరావు, విఘ్నేష్‌లు గాయపడగా ముగ్గురు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ కాగా, ఒకరు చికిత్స పొందుతున్నారన్నారు. దాడులకు పాల్పడిన జి.యాదగిరి, మక్కాల శ్రీకాంత్, గుంజి గోపి, బాలతోటి నరసింహారావు, గుంజి గణేష్, మక్కాల శ్రీనివాసరావు, పరగటి రామ్‌ప్రసాద్, దేరంగుల ఉపేంద్ర, తోక చైతన్య అనే 9 మందిని అరెస్ట్ చేశామని చెప్పారు. వీరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున 144 సెక్షన్, ఎంసీసీ అమలులో ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బైండోవర్‌తో పాటు రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. దాడి జరిగిన వెంటనే స్పందించిన స్థానిక పోలీసులను ప్రశంసిస్తున్నామని, 24 గంటల్లో దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేశామని చెప్పారు. సమావేశంలో నందిగామ ఏసీపీ రవికిరణ్, జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్ఐ పి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

‘పేట’ టీడీపీలో కుమ్ములాట

- శ్రీరాం వర్సెస్ రఘురాం
- శ్రీరాం తాతయ్యకు టికెట్ కేటాయింపుపై కమ్మ సామాజికవర్గం గుర్రు
- రెండు వర్గాలుగా చీలిన పార్టీ
- కినుక వహించిన నెట్టెం రఘురాం
- బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేసిన బొల్లా రామకృష్ణ
- తమ సామాజికవర్గాన్ని పార్టీకి దూరం చేస్తున్నారని ఆగ్రహం

పెనుగంచిప్రోలు: జగ్గయ్యపేట తెలుగుదేశం పార్టీలో కుమ్ములాటలు తారాస్థాయికి చేరాయి. గత ఎన్నికల్లో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)కు టీడీపీ ఈసారి కూడా టికెట్ కేటాయించడం టీడీపీలోని అంతర్గత విభేదాలను తారాస్థాయికి చేర్చింది. ఇది కాస్తా పార్టీలో సవాళ్లు, ప్రతి సవాళ్లకు దారి తీసింది. టీడీపీ టికెట్ ఆశించి భంగపడిన మాజీమంత్రి నెట్టెం రఘురాం, బీఆర్కే చానల్ యజమాని, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లా రామకృష్ణ వర్గాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి. టీడీపీ ఆవిర్భావం నుంచి పేట నియోజకవర్గంలో పార్టీకి పట్టుకొమ్మగా ఉన్న తమకు గత నాలుగు దఫాలుగా టీడీపీ టికెట్ లభించకపోవడంపై కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతలు పార్టీ అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు.

వివాదాస్పదంగా తాతయ్య తీరు..

వరుసగా నాలుగోసారి టీడీపీ టికెట్ సాధించిన మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తీరుపై కమ్మ సామాజికవర్గ నేతలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 40 వేల ఓటుబ్యాంకు కలిగిన కమ్మ సామాజికవర్గానికి గత నాలుగు పర్యాయాలుగా టికెట్ కేటాయించకుండా టీడీపీ అధిష్టానం నిర్లక్ష్యంగా వ్యవహరించగా, టికెట్ తెచ్చుకున్న శ్రీరాం తాతయ్య సైతం తమను పరిగణనలోకి తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటాన్ని ఆ సామాజిక వర్గ నేతలతో పాటు కొందరు పార్టీ కార్యకర్తలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి 2009 వరకు ఆపార్టీ జగ్గయ్యపేట టికెట్‌ను కమ్మ సామాజికవర్గానికే కేటాయించింది. తొలిసారిగా అక్కినేని లోకేశ్వరరావు గెలుపొందగా, ఆ తర్వాత 1985 నుంచి 1994 వరకు నెట్టెం రఘురాం మూడుసార్లు గెలుపొందారు. మంత్రిగా కూడా పనిచేశారు. అనంతరం 1999, 2004 ఎన్నికల్లో నెట్టెం రఘురాం, ప్రస్తుత విప్ సామినేని ఉదయభాను చేతిలో వరుసగా రెండు సార్లు ఓటమి పాలయ్యారు. దీంతో 2009లో సామినేని అనుచరుడిగా, కాంగ్రెస్ పార్టీ తరఫున మున్సిపల్ చైర్మన్‌గా పనిచేస్తున్న శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను నెట్టెం రఘురాం టీడీపీలోకి తీసుకువచ్చి పార్టీ టికెట్ ఇప్పించారు. 2009, 2014 ఎన్నికల్లో గెలుపొందిన శ్రీరాం తాతయ్య, 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. ఇలా వరుస ఆరు ఎన్నికల్లో కమ్మ సామాజికవర్గానికి సీటు దక్కగా, 2024 ఎన్నికలను కలుపుకుని వరుసగా నాలుగు ఎన్నికల్లో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన శ్రీరాం తాతయ్యకు సీటు దక్కింది. టీడీపీ గెలుపులో కీలకంగా ఉంటున్న కమ్మ సామాజికవర్గం నేతలు గత ఎన్నికల్లో తనకు సరిగా సహకరించకపోవడంతోనే తాను ఓటమి పాలైనట్లు శ్రీరాం తాతయ్య వర్గీయులు ప్రచారం చేయడం కూడా ప్రస్తుతం టీడీపీలో రాజకీయ దుమారానికి ప్రధాన కారణమైంది. దీంతో శ్రీరాం తాతయ్యపై కమ్మ సామాజికవర్గ నేతలు గుర్రుగా ఉన్నారు. గతంలో తాము మద్దతు ఇవ్వకుండానే శ్రీరాం తాతయ్య రెండుసార్లు గెలిచాడా? అని ప్రశ్నిస్తున్నారు. పార్టీ ఓడితే తమ సామాజికవర్గాన్ని బలిపశువును చేయాలని చూడటం తగదని తెగేసి చెబుతున్నారు.

ఆజ్యం పోసిన చంద్రబాబు..

గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా శ్రీరాం తాతయ్య ఓడినప్పటి నుంచి పార్టీలో విభేదాలు పొడచూపాయి. దీంతో శ్రీరాం తాతయ్య ఓ వర్గం, నెట్టెం రఘురాం మరోవర్గంగా కొనసాగుతున్నారు. తెలుగు యువత అధికార ప్రతినిధి బొల్లా రామకృష్ణ కూడా రఘురాం వర్గీయులుగానే కొనసాగుతున్నారు. రఘురాం ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయితే ఆ మధ్య జగ్గయ్యపేట పర్యటన సందర్భంగా స్టేజీపై పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాం తాతయ్య మినహా మిగిలిన అందరూ దిగిపోవాలని టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించడం కూడా అగ్నికి ఆజ్యం పోసినట్లయిందని ఆ పార్టీ క్యాడర్ విమర్శిస్తోంది. చంద్రబాబు వ్యాఖ్యలతో పార్లమెంటరీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, నియోజకవర్గంలో సీనియర్ రాజకీయనాయకుడైన నెట్టెం రఘురాం సైతం స్టేజీ దిగిపోవాల్సి రావడం శ్రీరాం తాతయ్య, రఘురాం వర్గీయుల మధ్య దూరాన్ని మరింత పెంచిందనే చెప్పవచ్చు.

తాతయ్య సైతం బాబులానే..

టీడీపీ అధినేత చంద్రబాబులాగే మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సైతం అవసరానికి వాడుకుని.. అనంతరం వదిలేస్తారనే విమర్శలు ఆపార్టీ క్యాడర్ నుంచి వినిపిస్తున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో బీఆర్కే చానల్ అధినేత బొల్లా రామకృష్ణను జగ్గయ్యపేటలోని 14 వార్డుల బాధ్యతలు అప్పగించి, అతనిచే రూ.కోటికి పైగా ఖర్చు చేయించిన శ్రీరాం తాతయ్య ఆ తర్వాత అతన్ని పార్టీకి దూరం చేసే దుశ్చర్యకు పాల్పడటమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. అందుకే బొల్లా రామకృష్ణ ఇటీవల విలేకరుల సమావేశం పెట్టి మరీ శ్రీరాం తాతయ్యపై బహిరంగ విమర్శలు చేయడం ఆపార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేర్చింది. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని బొల్లా రామకృష్ణ ప్రకటించడం టీడీపీ శ్రేణులను కలవరపాటుకు గురిచేస్తోంది. పార్టీలో రోజురోజుకు లుకలుకలు పెరుగుతుండటంపై టీడీపీ అధిష్టానం సైతం దిక్కుతోచని స్థితికి చేరుకుంది. నెట్టెం రఘురాం తన అసంతృప్తిని బయటపడనీయకుండా గుంభనంగా ఉన్నప్పటికీ ఆ ప్రభావం రానున్న ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలపై పడుతుందనే సందేహం ఆ పార్టీ అభ్యర్థి శ్రీరాం తాతయ్యతోపాటు క్యాడర్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోందని చెప్పవచ్చు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ




దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సుముహూర్తాన ఒక్కటైన నూతన వధూవరులు పెళ్లి దుస్తులపై అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. నూతన వధూవరులతో పాటు వారి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం కనిపించింది. పలు ఆర్జిత సేవల్లో ఉభయ దాతలతో పాటు నూతన వధూవరులు పాల్గొన్నారు. ఖడ్గమాలార్చన, శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణంతో పాటు చండీహోమంలో ఉభయ దాతలు విశేషంగా పాల్గొన్నారు.

సాయంత్రం విశేష సేవలు..

ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైన రద్దీ ఉదయం 10 గంటల వరకు కొనసాగింది. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అర గంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మళ్లీ పెరిగింది. 12.20 గంటలకు మళ్లీ దర్శనాలు ప్రారంభం కాగా భక్తులతో క్యూలైన్లలో రద్దీ కనిపించింది. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు మహా మండపం రెండో అంతస్తులో అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ, పల్లకీ సేవలో ఉభయ దాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. దాత బొబ్బ లోహిత, దుర్గగుడి ఏఈ సునీల్ కుమార్ కుటుంబం పేరిట 5 క్యాన్ల మజ్జిగను పంపిణీ చేశారు. అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో భక్తులు మజ్జిగను స్వీకరించేలా దేవస్థానం ఏర్పాట్లు చేసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మజ్జిగ వితరణ చేశారు.

సాహితీ సృజనకారుడు కేవీఆర్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమణమూర్తి, చెంచయ్య, రాధిక, వసుంధర తదితరులు

విజయవాడకల్చరల్: సాహితీ సృజనకారుడు కేవీ రమణారెడ్డి అని కవి, చరిత్ర విశ్లేషకుడు కొప్పర్తి వెంకట రమణమూర్తి అన్నారు. కేవీఆర్, శారదాంబ స్మారక కమిటీ ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో కవి, రచయిత, విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యుడు కేవీ రమణారెడ్డి జయంతి సందర్భంగా ‘చరిత్రతో సంభాషణ – వర్తమానం’ అంశంగా ప్రసంగం, లూసన్ జీవితం, అడవులు మండుతున్నాయి గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కేవీఆర్ జీవితమంతా పోరాటాలే..

వెంకట రమణమూర్తి మాట్లాడుతూ కేవీఆర్ అభ్యుదయ, ప్రగతిశీల భావాల వ్యాప్తికి సాహిత్యకారునిగా తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. 2011లో స్మారక కమిటీ ఏర్పాటు చేశారని నాటి నుంచి కేవీఆర్ జయంతి సందర్భంగా పుస్తక ఆవిష్కరణలు, సమావేశాలు సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జనసాహితీ సాంస్కృతిక సంస్థ బాధ్యులు రాధిక అడవులు మండుతున్నాయి గ్రంథాన్ని, సాహితీవేత్త విఘ్నేష్ లూసన్ జీవితం సాహిత్యం గ్రంథాన్ని ఆవిష్కరించారు. విప్లవ రచయితల సంఘం సీనియర్ సభ్యుడు చెంచయ్య మాట్లాడుతూ.. కేవీ రమణారెడ్డి తన సాహిత్యం ద్వారా ఎందరో యువకులను ప్రభావితం చేశారన్నారు. కేవీఆర్ ప్రగతిశీల రచయిత మాత్రమే కాదని తన జీవితమంతా పోరాటలతో పెనవేసుకుందన్నారు. కేవీఆర్ కుమార్తె డాక్టర్ వసుంధర తండ్రితో అనుబంధం– సాహితీ జీవన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విరసం అధ్యక్షుడు అరవవిల్లి కృష్ణ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పిఠాపురానికి చెందిన భక్తులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. పిఠాపురంకు చెందిన ఎస్. సత్యనారాయణ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ పర్యవేక్షకులు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందచేశారు.

దేశ రాజకీయాల్లో యువత ప్రముఖ పాత్ర పోషించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు):దేశ రాజకీయాల్లో యువత ప్రముఖ పాత్ర పోషించాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఐఓ) రాష్ట్ర అధ్యక్షుడు రోషన్ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఎస్ఐఓ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్వర్యంలో ఆదివారం ఎస్ఐఓ గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోషన్ మాట్లాడుతూ దేశంలో యువత ఎక్కువగా ఉందన్నారు. దేశ రాజకీయాలను శాసించే స్థాయిలో ఉన్న యువత ఓటు ద్వారా ప్రభుత్వం ఏర్పాటులో భాగస్వాముల కావాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హయాంలో దేశంలోని ముస్లింలపై దాడులు పెరిగాయని, వాటిని అరికట్టేందుకు బీజేపేతర ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఓ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కరిముద్దీన్, ఏపీసీసీ నాయకులు జానేద్, శివాజీ, ఎస్ఐఓ కార్యదర్శులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

149 మద్యం సీసాలు స్వాధీనం



జగ్గయ్యపేట: తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తీసుకువస్తున్న ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి ఆదివారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం..ఎస్ఈబీ పోలీసులు మండలంలోని తక్కెళ్లపాడు గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ ఆటోలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం 149 సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మైలవరం మండలం జీ కొండూరు గ్రామానికి తరలిస్తున్నట్లు గుర్తించారు. కొండూరుకు చెందిన తాతా రాజేష్, గోపి, బళ్ల ఫణింద్రలను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ. 1.62 లక్షలు ఉంటుందని ఎస్ఈబీ సీఐ తెలిపారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి : డీసీపీ



పెనుగంచిప్రోలు:సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు విజయవాడ రూరల్ డీసీపీ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టంచేశారు. ఆయన వెంట నందిగామ ఏసీపీ రవికిరణ్, సీఐలు జానకీరామ్, పి.చంద్రశేఖర్, ఎస్ఐ పి.రాంబాబు తదితరులు ఉన్నారు.

ఫ్యాక్టరీ డంపింగ్ యార్డులో అగ్ని ప్రమాదం

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామ సమీపంలోని సిమెంట్ కర్మాగారంలోగల డంపింగ్ యార్డులో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. డంపింగ్ యార్డులో మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో కర్మాగారం సిబ్బంది జగ్గయ్యపేట అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫైర్‌సిబ్బంది మంటలను అదుపు చేశారు. డంపింగ్ యార్డులో పాత సామాగ్రి దగ్ధమైందని ఫైర్ సిబ్బంది తెలిపారు.

రిటైనింగ్‌వాల్‌తో సురక్షితంగా ప్రజలు

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్, దేవినేని అవినాష్



ప్రచారంలో భాగంగా టిఫిన్ సెంటర్‌లో దోసె వేస్తున్న అవినాష్, చిత్రంలో ఎంపీ కేశినేని నాని

ఆటోనగర్(విజయవాడతూర్పు): రిటైనింగ్‌వాల్ నిర్మాణంతో కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు సురక్షితంగా ఉన్నారని ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) తెలిపారు. 15 డివిజన్ రామలింగేశ్వర నగర్‌లోని గాంధీకాలనీలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ కేశినేని నాని, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజలకు చేసిన మేలు వెలకట్టలేనిదని చెప్పారు. ముంపు ప్రాంతంలోని సుమారు 1.50 లక్షల మంది ప్రజలకు భద్రత కల్పించారని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని అవినాష్ అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. జవాబుదారీతనంపై పవన్ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. పోతిన మహేష్‌కు సీటు ఇవ్వకుండా అన్యాయం చేసిన పవన్ నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత చరిత్రలో నిలిచేలా ఎన్నో సంక్షేమ పథకాలు పేదలకు అందించారని వెల్లడించారు. తూర్పు నియోజకవర్గంలోని (గత 14 వ డివిజన్), ప్రస్తుత 15 వ డివిజన్‌ను దత్తత తీసుకున్న ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అభివృద్ధి చేయకపోగా ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. షో రాజకీయాల కేరాఫ్ చిరునామాగా గద్దె ఉన్నారని విమర్శించారు. నాడు వలంటీర్లను అరెస్ట్ చేయిస్తానని... నేడు అదే వలంటీర్లపై అతి ప్రేమ చూపించడం ఏమిటని చంద్రబాబును ప్రశ్నించారు. ప్రతి నెలా ఒకటో తేదీన అవ్వా, తాతలకు, వలంటీర్లు పింఛన్ ఇవ్వకుండా చంద్రబాబు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. నాడు ఇంగ్లీష్ మీడియం విద్యను కూడా ఇలాగా కోర్టులను అడ్డం పెట్టుకొని ఆపారన్నారు. ఇప్పుడు నిమ్మగడ్డతో కలిసి వలంటీర్ల సేవలను అడ్డుకోవడం దుర్మార్గ చర్యని చెప్పారు. వీటన్నింటిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, సీనియర్ నాయకులు ఆళ్ల చెల్లారావు, డివిజన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, నరశింహారావు, అకీరా, రెహమాన్, కలాం, దుర్గారావు, భుజింగరావు, మురళీ, సుబ్రహ్మణ్యం, రాజు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం





యావే ప్రేయర్ హౌస్‌లో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ యేసుభక్త ; ఈస్టర్ వేడుకలకు హాజరైన అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): ఈస్టర్ పండుగ అందరి జీవితాలలో వెలుగులు నింపాలని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని స్టెలా ఆడిటోరియంలో క్రైస్ట్ టెంపుల్, విశాలాంధ్ర రోడ్డులోని పవర్ ఆఫ్ జీసస్ చర్చ్, గుణదల మెట్రోపాలిటన్ చర్చ్‌లలో నిర్వహించిన ఈస్టర్ పండుగ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ మానవాళిని రక్షించేందుకు దైవ కుమారుడైన ఏసుక్రీస్తు ఈ లోకానికి అరుదెంచారని తెలిపారు. ఆయన శిలువ మరణం ద్వారా మనకు పాప క్షమాపణ లభించిందన్నారు. క్రీస్తు మార్గాన్ని అనుసరించాలని తద్వారా మన జీవితాల్లో శాంతి సమాధానాలు వెల్లివిరుస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరికీ ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం ఆయా చర్చి పాస్టర్లు అవినాష్‌ను ఆశీర్వదిస్తూ ప్రార్థనలు చేశారు.

శాంతి మార్గంలో నడుచుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, శాంతి, అహింసా మార్గంలో మానవాళి యావత్తు నడుచుకోవాలని పాస్టర్ పీటర్ చెప్పారు. స్థానిక సున్నపు బట్టీల సెంటర్ సమీపంలో ఉన్న క్రైస్ట్ బేతేల్ మినిస్ట్రీస్ ఆవరణలో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం నిర్వహించారు. క్షమాగుణాన్ని, త్యాగం, కరుణ, సత్యానికి ఏసుక్రీస్తు ప్రతిరూపమన్నారు. అధిక సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని యావే ప్రేయర్ హౌస పాస్టర్ యేసుభక్త అన్నారు. యావే ప్రేయర్ హౌస్‌లో ఈస్టర్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరిలో ప్రేమ, అప్యాయతను పెంచుతాయని చెప్పారు. మొగల్రాజపురం పరిధిలోని ఆర్‌సీఎం,సీఎస్ఐ,ఏజేఎం, క్రీస్తు సైన్యం చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు.

నేత్ర పర్వంగా సాగిన కూచిపూడి నృత్యాలు



స్వర్ణకమలాలు నాటకంలోని సన్నివేశం



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: దృశ్యవేదిక నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు నేత్ర పర్వంగా సాగాయి. కూచిపూడి నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. గణపతి స్తుతితో ప్రారంభించి ఆనందనర్తనం, రామచంద్రుని ప్రార్థిస్తూ రాముడు రాఘవుడు, భామనే సత్యభామనే, సూర్యాష్టకం అంశాలను ప్రదర్శించారు. జాహ్నవీసుస్మ, నవ్యసువర్ణ, షేక్ బింబిత, భానుశ్రీ, తానియాసిరి, పుష్కర సౌమ్య, చైత్ర, శ్రీదేవి, మృదుల, మేఘన నృత్య కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా హర్ష క్రియేషన్స్ విజయవాడ వారి స్వర్ణకమలాలు సాంఘిక నాటికను ప్రదర్శించారు. అభ్యుదయ భావాలు కలిగిన ఓ రచయిత తన భావాలకు దగ్గరగా ఉండే పల్లెటూరి అమ్మాయిని వివాహం చేసుకుంటాడు. ఆమెకు శిక్షణనిచ్చి ఒక రచయిత్రిగా తయారు చేస్తాడు. సహజంగా ప్రతిభ కలిగిన ఆ రచయిత్రి సమాజంలో గుర్తింపు తెచ్చుకుంటుంది. అది సహించలేని ఆ రచయిత ఆమెను వేధింపులకు గురి చేస్తాడు. ఆమె అతడిలోని మానవత్వాన్ని మేలుకొలిపి సమాజంలో బాధ్యత కలిగిన రచయితగా నిలబెడుతుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవినేని కిషోర్‌కుమార్ దృశ్యవేదిక కార్యక్రమాలను అభినందించారు. సంస్థ సభ్యులు నాట్యాచారిణి పద్మశ్రీ హేమంత్, రమేష్, బొర్రా నరేన్ కార్యక్రమాలను నిర్వహించారు.

నేటి నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులు

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 1 నుంచి 25వ తేదీ వరకు పాలిసెట్-2024 ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ. పద్మావతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం ఈ నెల 27న పాలిసెట్ పరీక్ష జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.20 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

పెనమలూరు: తన కుమార్తె ఇంటి నుంచి అదృశ్యమయిందని తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు జెండా చెట్టు ప్రాంతానికి చెందిన షేక్ హజరాబి కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె భర్త మస్తాన్‌వలి ఆటో డ్రైవర్‌గా పని చేస్తాడు. ఆమె కుమార్తె (19) గతంలో అదే ప్రాంతానికి చెందిన వ్యక్తితో వెళ్లి పోగా తిరిగి ఇంటికి తీసుకు వచ్చారు. కాగా మార్చి 29 తేదీన హజరాబి కుమార్తె ఇంటి నుంచి అదృశ్యమయింది.

హలీం... టైం



రంజాన్ మాసం నేపథ్యంలో విజయవాడలోని వించిపేట పరిసరాలు హలీం సెంటర్లతో రద్దీగా మారాయి. సాయంత్రం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు సందర్శకులతో హలీం కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. హలీం ప్రియుల రాకతో ఈ ప్రాంతమంతా సందడిగా మారుతుంది. పాతబస్తీలో పెద్ద సంఖ్యలో హలీం దుకాణాలు ఏర్పాటుచేశారు. హలీమ్, కబాబ్, ఫలుదా, వివిధ రకాల బిర్యానీలను నగరవాసులు ఆస్వాదిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి



ఇఫ్తార్‌లో వడ్డిస్తున్న దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): ముస్లిం మైనారిటీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎనలేని కృషి చేసిందని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ తెలిపారు. ఏపీఐఐసీకాలనీలోని కౌసర్ మసీద్‌లో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అవినాష్ మాట్లాడుతూ గతంలో రోడ్డు విస్తరణ నేపథ్యంలో పాత మసీద్ ను తీసివేయాలని ఒత్తిడి చేశారన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మసీద్‌కు స్థలం కేటాయించే విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సంప్రదించినట్టు చెప్పారు. దీంతో రూ.కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాన్ని మసీద్‌కు కేటాయించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్‌లు మీర్ హుస్సేన్, 11వ డివిజన్ ఇన్‌చార్జి పర్వతనేని బాబీ, జమాక్ కార్యదర్శి జాన్‌పాడ్, ఏటీపీ అధ్యక్షుడు రాజనాల వేంకటరమణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు షాబాద్, అహ్మద్, హబీబ్, షౌకత్ పాల్గొన్నారు.

జగనన్న హయాంలో సంక్షేమ పాలన



కరపత్రాలు అందజేస్తున్న దేవినేని సుధీర

గుణదల (విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేశారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ పేదల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటున్నారని దేవినేని సుధీర అన్నారు. 4వ డివిజన్ వరలక్ష్మీ నగర్‌లో గడప గడపకు మన అవినాష్ అన్న హామీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందన్నారు. కుల మతాలకు అతీతంగా పేదల అభ్యున్నతి కోసం జగనన్న కృషి చేస్తున్నారని తెలిపారు. తూర్పు నియోజకవర్గం పరిధిలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు చేరువ చేయటంలో అవినాష్ నిబద్ధతగా పనిచేశారని పేర్కొన్నారు. అన్ని డివిజన్‌లలో సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్‌ను గెలిపించే దిశగా బాధ్యత తీసుకోవాలని కోరారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ అధ్యక్షుడు గల్లా రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని విడనాడాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మురళీకృష్ణ

కృష్ణలంక(విజయవాడ తూర్పు): రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సౌత్ డివిజన్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వై.రాంబాబు సూచించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఆవరణంలో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లుకు ఆదివారం ఆయన సీఐ ఎ.మురళీకృష్ణతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ షీట్స్ ఉన్న ప్రతి ఒక్కరూ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా నేరం జరుగుతున్నట్లు గానీ, గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు గానీ తెలిస్తే సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలా చేస్తే నగదు బహుమతి ఇస్తామన్నారు. ప్రతి ఆదివారం కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, గొడవల్లో తలదూర్చిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షీటర్లపై పోలీసులు నిఘా నిరంతరం ఉంటుందని, ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు షరీఫ్, రంభ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులు సాంస్కృతిక రాయబారులు



మాట్లాడుతున్న టీవీ నటుడు అప్పారావు, వేదిక మీద చిట్టిబాబు, దేవిడ్‌రాజు, వీరభద్రరావు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక రాయబారులని టీవీ నటుడు అప్పారావు అన్నారు. జేఎమ్ఎస్ సరాగాలు ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదికమీద ఆదివారం సినీ సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన అప్పారావు మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. సీనియర్ గాయకుడు కే డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయనీ గాయకులకు, కళాకారులకు వేదిక కల్పించాలని సూచించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు డీవీ వీరభద్రరావు, చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గాయని ఝాన్సీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

పెనుగంచిప్రోలులో ఉద్రిక్తత

పరిస్థితిని అదుపుచేసిన పోలీసులు



ఎస్సీకాలనీలో ఉద్రికతను అదుపులోకి తెస్తున్న పోలీసులు

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. డౌన్ సెంటర్‌లో శనివారం రాత్రి జరిగిన దాడిలో నలుగురికి గాయాలవ్వగా, వీరిలో ఓవ్యక్తి తీవ్రగాయాలతో విజయవాడలో చికిత్స పొందుతున్నాడు. అర్ధరాత్రి వరకు దాడికి పాల్పడిన వ్యక్తులను తక్షణం అరెస్ట్ చేయాలని కోరుతూ ఎస్సీ కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈక్రమంలో ఆదివారం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులపై దాడి చేయడంతో తిరిగి ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో నందిగామ ఏసీపీ రవికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు నిర్వహిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక బలగాలు, సాయిధ పోలీసులతో ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలో కవాతు నిర్వహించారు. విజయవాడ రూరల్ డీసీపీ కె శ్రీనివాసరావు, ఏసీపీ రవికిరణ్, సీఐలు జానకిరామ్, పి.చంద్రశేఖర్, ఐవీ నాగేంద్రకుమార్, ఎస్ఐ పి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. పలువురు యువకుల మత్తుపానియాలు, పదార్థాలకు అలవాటుపడి స్పీడ్ డ్రైవింగ్ చేస్తూ యువతులను అల్లరి చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

కంకిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని, అతనికి మద్యం అమ్మిన వైన్‌షాపు సేల్స్‌మ్యాన్‌ను కంకిపాడు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. కోలవెన్ను గ్రామంలో బెల్టుషాపు నిర్వాహకుడు పిట్టా నారాయణరావును తనిఖీ చేయగా అతని వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 70 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి విచారించగా, కంకిపాడు ప్రధాన సెంటర్‌లో ఉన్న వైన్‌షాపు లో తెల్లవారుజామున మద్యం కొనుగోలు చేసినట్లుగా నిర్ధారించారు. మద్యం అక్రమంగా విక్రయించిన మద్యం దుకాణం సేల్స్‌మ్యాన్ లాం రాకేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఇరువురినీ అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

క్లుప్తంగా...

వక్ఫ్ స్థలం ఆక్రమించిన వసంత అనుచరుడు

అల్తాఫ్ రజా ఫిర్యాదు

సాక్షి, అమరావతి: వక్ఫ్ స్థలాన్ని ఆక్రమించిన టీడీపీ నేతల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ఆహెల్లే సున్నత్ జమాత్ కో–కన్వీనర్ అల్తాఫ్ రజా కోరారు. మైలవరం టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ అనుచరుడు కరణం సుధీర్‌పై వక్ఫ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరత్ మూర్తుజా ఆలీ పంజా భూమిలో సుధీర్ అక్రమ భవనం నిర్మిస్తున్నాడని తెలిపారు. తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి పీర్ల పంజా స్థలాన్ని ఆక్రమించినట్టు పేర్కొన్నారు. ఈ అంశం న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉండగా సర్వే నంబర్ 293 పీర్ల పంజా స్థలంలో బ్యానర్లు, కటౌట్లు పెట్టడం దారుణమన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న కరణం సుధీర్‌పై చర్యలు తీసుకోవాలని వక్ఫ్ బోర్డు అధికారులకు అల్తాఫ్ రజా విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబు వల్లే ప్రత్యక్ష రాజకీయాల్లోకి..




గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): స్థానిక పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరి తన మనసులో మాట బయటపెట్టారు. తెలుగుదేశం పార్టీ, చంద్రబాబుతో తనకు ఉన్న అవినాభావ సంబంధాన్ని మీడియా సాక్షిగా వెల్లడించారు. పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత తొలిసారిగా ఆయన నియోజకవర్గానికి వచ్చారు. ఆదివారం రాత్రి భవానీపురం క్రాంబే రోడ్డులో ఏర్పాటుచేస్తున్న పార్టీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సుజనా మీడియాతో మాట్లాడారు. 'ఎప్పటి నుంచో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఆలోచిస్తున్నా.. ఇప్పటివరకు అవకాశం రాలేదు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు వల్ల తనకు ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనే అవకాశం దక్కింది' అంటూ తన మనసులో మాట బహిర్గతం చేశారు. ఏప్రిల్ ఐదో తేదీ నుంచి నియోజకవర్గంలో ప్రచారం ప్రారంభిస్తానని ప్రకటించారు. బీజేపీ తరఫున కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన మీడియా సమావేశంలో సొంత పార్టీ పేరు ప్రస్తావించకపోవడంతో అక్కడ ఉన్న బీజేపీ నేతలు అవాక్కయ్యారు. తన వ్యాఖ్యలతో చంద్రబాబు, తాను వేర్వేరు కాదని మరోసారి నిరూపించుకున్నారని అక్కడ ఉన్న బీజేపీ నేతలే చెవులుకొరుక్కున్నారు. జనసేన సీనియర్ నాయకులెవరూ సుజనా నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది.

నేడు ఏపీ కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు

సాక్షి, న్యూఢిల్లీ : వచ్చే సార్వత్రిక ఎన్నికలతో పాటు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాపై ఏపీ కాంగ్రెస్ కసరత్తు పూర్తిచేసింది. ఇక్కడి ఏఐసీసీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరగనున్న కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో స్క్రీనింగ్ కమిటీ ఖరారు చేసిన తుది జాబితాపై చర్చించి ఆమోదముద్ర వేయనున్నారు. ఆదివారం రాత్రి ఢిల్లీలో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మధుసూధన్ మిస్త్రీ నేతృత్వంలో జరిగిన సమావేశంలో లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల తుది జాబితాపై చర్చించారు. ఇందులో స్క్రీనింగ్ కమిటీ సభ్యులు సూరజ్ హెగ్డే, షఫీ పరంబిల్‌లతో పాటు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మాణిక్కం ఠాగూర్, రఘువీరారెడ్డి, కొప్పుల రాజు పాల్గొన్నారు. దాదాపు అన్ని స్థానాలకు సంబంధించిన తుది జాబితాను ఖరారు చేయగా.. ఆశావహులు ఎక్కువగా ఉన్న స్థానాల్లో మాత్రం రెండు, మూడు పేర్లతో కూడిన జాబితాను కేంద్ర ఎన్నికల కమిటీ ముందు ఉంచనున్నారు.

సీఎం జగన్‌ను చూసి నేర్చుకోవాలి

తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు



నిజామాబాద్ నాగారం : మెజారిటీ రాజకీయ పార్టీలు డబ్బున్న మారాజులు, పార్టీలు మారే ఆయారాం గయారాంలకు పెద్దపీట వేస్తూ.. సామాజికంగా వెనకబడిన తరగతులను మోసం చేస్తున్నాయని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు విమర్శించారు. అలాంటి పార్టీలు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. ఆయన ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో అగ్రవర్ణాలు, వారసత్వ రాజకీయాలకు పెద్దపీట వేస్తుంటే.. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సమన్యాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. సీఎం జగన్ బీసీలకు ఆంధ్రలో 48 అసెంబ్లీ, 11 పార్లమెంట్ సీట్లు కేటాయించడాన్ని గుర్తు చేశారు. బీసీ కులగణన పేరుతో కాలయాపన చేయకుండా.. ముందు కనీస స్థాయిలోనైనా రాజకీయంగా ఉన్నత స్థానాల్లో ప్రాతినిధ్యం ఇచ్చి నిజాయితీని నిరూపించుకోవాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు.

పర్యాటకంపై రామోజీ నాటకం

దేశంలోనే పర్యాటక ఆకర్షణలో అగ్రగామి రాష్ట్రాల్లో ఏపీ ఒకటి

- వీటిల్లో సుమారు రూ.3వేల కోట్లకు పైగా పనుల్లో ముందడుగు
- ఇవి చూసి ఓర్వలేకే ఈనాడులో రామోజీ కుట్రపూరిత రాతలు
- పైగా ఏపీటీడీసీ ఆదాయం పెరిగితే నష్టాలంటూ కనికట్టు రాతలు
- చంద్రబాబు ప్రచార పిచ్చితో రూ.కోట్లు ప్రజాధనం వృధాచేస్తే అది రామోజీకి అభివృద్ధి?
- మీ బాబు పాలనలో ఎవరికి పడితే వారికి అద్దె సూట్లు తొడిగేసి చేసుకున్న దొంగ ఒప్పందాలు మర్చిపోతే ఎలా రామోజీ?
- అప్పట్లో బీచ్‌లలో అశ్లీలత ప్రోత్సాహానికి బరితెగించలేదా?
- వాస్తవాలకు 'పచ్చ' గంతలు కట్టి రామోజీ పిచ్చి రాతలు



సంవత్సరాల వారీగా ఏపీటీడీసీ రాబడి ఇలా.. (రూ.కోట్లలో)

ఏడాది	ఆదాయం
2015-16	89.13
2016-17	101.41
2017-18	105.99
2018-19	128.07
2019-20	127.17
2020-21	77.03*
2021-22	147.35
2022-23	162.25

* (కరోనాలో తగ్గింది)

సాక్షి, అమరావతి : నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు ఈనాడు రామోజీరావు. నిత్యం తన క్షుద్ర పత్రికలో వండివారుస్తున్న అశుద్ధ కథనాలు చూసి పాఠకులు ఛీకొడుతున్నా ఆయన సిగ్గూఎగ్గూ లేకుండా బాబు పల్లకిని మోయడమే పనిగా పెట్టుకున్నారు. గ్రాఫిక్స్ బొమ్మలు, కనికట్టు కథనాలతో అప్పట్లో ప్రజల్ని మభ్యపెట్టిన బాబు మాదిరిగా రామోజీ కూడా ఉన్నవి లేనట్లు.. లేనివి ఉన్నట్లు రంగరించి తన ఈనాడులో అభూతకల్పనలను అచ్చోస్తున్నారు. తాజాగా.. రాష్ట్రంలో టూరిజం రంగంపై ఆయన కక్కింది కూడా అక్షరాల విషమే. దేశీయ పర్యాటకులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచినా.. జాతీయ స్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రామంగా 'లేపాక్షి' ఘనత సాధించినా.. అలాగే, ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో తాత్కాలిక జాబితాలోనూ ఏపీ చోటు దక్కించుకున్నా.. విశాఖలోని రుషికొండ బీచ్‌కు వరల్డ్ ఫేమస్ 'బ్లూఫ్లాగ్' సర్టిఫికేషన్ రావడంతో అక్కడ వరుసగా నాలుగేళ్లుగా బ్లూఫ్లాగ్ జెండా రెపరెపలాడుతున్నా.. అలాగే.. గతేడాది జీఐఎస్ సదస్సుల్లో ఏకంగా రూ.17వేల కోట్లకు పైగా పెట్టుబడులు పర్యాటక పెట్టుబడులు వెల్లువెత్తినా బాబు జాకీ లిఫ్టర్ రామోజీకి ఇవేమీ కనపడవు. నిజానికి.. ఇదంతా దేశంలోనే అత్యుత్తమ పర్యాటక పాలసీని సీఎం వైఎస్ జగన్ తీసుకురావడంవల్లే పెట్టుబడిదారులు క్యూ కట్టారనేది ఎవరూ కాదనలేని సత్యం. కరోనా రెండేళ్ల కాలం మినహా.. మిగిలిన మూడేళ్లలోనే ఇది సాధ్యపడింది. కానీ, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి ఏపీ పర్యాటకానికి దక్కిన దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో.. ప్రపంచ పర్యాటకం మొత్తం ఏపీ వైపు చూస్తుంటే.. కళ్లకు టీడీపీ గంతలు కట్టుకున్న గురవింద రామోజీ మాత్రం కళ్లుండీ కబోదిలా నటిస్తున్నారు. సీఎం జగన్ ప్రభుత్వం చేస్తున్న ఏ ఒక్క మంచిని చెప్పకపోగా.. ప్రజల మెదళ్లలో విషాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక అంశాన్ని భుజానకెత్తుకుని టన్నుల కొద్దీ అసత్యాలతో 'ఈనాడు'లో నింపి పారేస్తున్నారు. ఇందులో భాగమే శుక్రవారం 'పర్యాటకం.. పక్కా నాటకం' అంటూ ఈనాడు వండిన ఓ ఫక్తు నాటకీయ కథనం.

అప్పట్లో బీచ్‌లలో అశ్లీలత ప్రోత్సాహానికి కుట్ర

ఇక అప్పట్లో పర్యాటకం ముసుగులో చంద్రబాబు సంప్రదాయలకు పాతరేశారు. విశాఖ బీచ్‌లో లవ్ ఫెస్టివల్ పేరుతో అశ్లీలతను ప్రోత్సహించే కుట్రకు తెరతీశారు. దీనిపై ప్రజలు, మేధావుల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో వెనక్కి తగ్గారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తేనే రామోజీకి పర్యాటకాభివృద్ధిగా కనిపిస్తుందంటే అంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉండదు. చంద్రబాబు బీచ్‌లను బహిరంగ అశ్లీలతకు వాడుకోవాలని చూస్తే ప్రస్తుత ప్రభుత్వం అద్భుతంగా అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా 288 బీచ్‌లను గుర్తించి అత్యాధునిక మౌలిక వసతులు కల్పించి కోస్టల్ జోన్ టూరిజాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. ఇందులో భాగంగా విశాఖలో క్రూయిజ్ టెర్మినల్‌ను సైతం అందుబాటులోకి తెచ్చింది. కానీ, చంద్రబాబు ప్రచార పిచ్చితో రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథాగా ఖర్చుచేయడాన్ని రామోజీ ఒక్కసారి కూడా ప్రశ్నించిన పాపాన పోలేదు.

రికార్డు స్థాయిలో ఏపీటీడీసీ ఆదాయం..

ప్రపంచ పర్యాటకం మొత్తం కరోనాతో కుదేలైన రోజుల్లోనూ ఏపీ పర్యాటకం అత్యంత వేగంగా బలోపేతమైంది. ఏపీటీడీసీ ఆదాయాన్ని టీడీపీ ఐదేళ్ల పాలనతో పోలిస్తే రికార్డు స్థాయి వృద్ధిని నమోదు చేసింది. 2022–23లో ఏకంగా రూ.162.25 కోట్ల టర్నోవర్ సాధించింది. 2021–22తో పోలిస్తే 10.82 శాతం వృద్ధిని నమోదు చేసింది. విచిత్రంగా 2017–18లో టీడీపీ హయాంలో మాత్రం రూ.1.99 కోట్ల లోటుతో ఆర్థిక సంవత్సరాన్ని ముగించడం గమనార్హం. మరి రామోజీ చెబుతున్న పర్యాటకం కుంటుపడితే ఒక్క హరిత హోటళ్లు, బోటింగ్ ద్వారా ఇంత వృద్ధి ఎలా సాధ్యపడుతుందో రామోజీనే చెప్పాలి. మరోవైపు.. నాస్తికత్వపు వాసనలు పోని రామోజీ టీటీడీ టూర్ ప్యాకేజీల పైనా విషం చిమ్మారు. సెంట్రలైజ్డ్‌గా అత్యాధునిక సౌకర్యాలతో ఉత్తమ రవాణా మార్గాల్లో సేవలందిస్తుంటే.. పర్యాటక సంస్థ ఆదాయానికి గండి కొట్టేస్తున్నట్లు ఆయన గుండెలు బాదుకున్నారు.

కేంద్రం మెచ్చిన ఏపీ..

ఇక రూ.200 కోట్లతో అరకు, గండికోట అభివృద్ధి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో గండికోట ప్రాంతంలో 4,336 ఎకరాల్లో పర్యాటక సిటీని అభివృద్ధి చేయనున్నారు. అరకు లోయలోనూ సుందర హోటళ్లు, అడ్వెంచర్, ఎకో పర్యాటకానికి ప్రణాళిక సిద్ధమయ్యాయి. సింహాచలం, అన్నవరం, శ్రీశైలం, విజయవాడ దేవాలయాలను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. అహోబిళం, నాగార్జునసాగర్‌ను కూడా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించింది.

రూ.3వేల కోట్ల పనులకు శ్రీకారం..

జీఐఎస్‌లో చేసుకున్న ఒప్పందాల్లో దాదాపు రూ.3,049.90 కోట్ల విలువైన సివిల్ వర్క్స్ ప్రారంభమయ్యాయి. ఇవి పూర్తయితే 9,022 మందికి ఉపాధి రెడీగా ఉంటుంది. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం కింద రూ.600 కోట్లతో 7వేల మందికి ఉద్యోగాలు వచ్చేలా అగ్రిమెంట్లు పూర్తయ్యాయి. మరో రూ.3,757 కోట్లతో 2,750 మందికి ఉపాధి కల్పించేలా 15 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద (ఓ అండ్ ఎం) 87 ప్రాజెక్టులను పట్టాలెక్కించింది.

ఆతిథ్య ఆంధ్ర..

మరోవైపు.. సీఎం జగన్ సారథ్యంలో ఆతిథ్య రంగం అభివృద్ధి బాట పడుతోంది. అంతర్జాతీయ స్థాయి లగ్జరీ హోటల్ రంగ సంస్థలైన ఒబెరాయ్, హయత్, తాజ్ గ్రూప్‌తో పాటు దేశీయ సంస్థలైన గ్యారిసన్ కన్‌స్ట్రక్షన్, మేఫెయిర్ హోటళ్లు వచ్చాయి. అత్యాధునిక సౌకర్యాలతో రిసార్ట్స్ (ఇండిపెండెంట్ విల్లా), స్టార్ హోటళ్ల నిర్మాణంతో ఈ రంగంలో మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలోని ఐదు ప్రదేశాల్లో రూ.1,350 కోట్ల అంచనాతో 7–స్టార్ సౌకర్యాలతో లగ్జరీ రిసార్ట్స్ నిర్మాణానికి ఒబెరాయ్ ముందుకొచ్చింది. ఇప్పటికే విశాఖ (అన్నవరం), తిరుపతి (పేరూరు), గండికోటలో నిర్మాణాలకు ఒప్పందాలు పూర్తయ్యాయి. ఇక్కడ శంకుస్థాపనలు జరగ్గా త్వరలో పనులు ప్రారంభంకానున్నాయి. ఒక్క ఒబెరాయ్ సంస్థల ద్వారానే సుమారు 11వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. తిరుపతిలో నోవోటెల్ సంస్థ రూ.125 కోట్లతో మూడువేల మందికి ఉపాధి, విశాఖపట్నంలో మేఫెయిర్ సంస్థ రూ.525 కోట్లతో, మరో రూ.404 కోట్లతో హయత్ రీజెన్సీ ఫైవ్‌స్టార్ హోటళ్ల నిర్మాణానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే విజయవాడలో సుమారు రూ.100 కోట్లతో హయత్ న్యూ లగ్జరీ స్టార్ హోటల్, గుంటూరులో ఐటీసీ హోటళ్లు తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. చంద్రబాబు హయాంలో ఇలాంటి అభివృద్ధి లేకపోగా విదేశీయులను తీసుకొచ్చి పర్యాటకంలో విపరీతమైన దుబారా ఖర్చులు చేశారు. బహుశా రామోజీకి రూపాయి రాక కంటే.. రూపాయి ఖర్చు చేయడమే అభివృద్ధిగా కనిపించినట్లుంది.

అప్పట్లో అద్దె సూట్లు తొడిగేసి..

వాస్తవానికి.. చంద్రబాబు హయాంలో ప్రచార పిచ్చి పీక్స్‌లో ఉండేది. గ్రాఫిక్స్ బొమ్మలు, కనికట్టు సదస్సులతో ప్రజలను నిరంతరం మభ్యపెడుతూనే ఉండేవారు. విశాఖలో పెట్టుబడుల సదస్సు పేరుతో రోడ్ల పక్కన కనిపించిన ప్రతి ఒక్కరికీ అద్దె సూట్లు తొడిగేసి మరీ వారికి పెట్టుబడిదారుల కలరింగ్ ఇచ్చేశారు. రూ.వేల కోట్ల పెట్టుబడులు తీసుకొస్తున్నట్లు వారితో దొంగ ఒప్పందాలు చేసుకున్నారు. ఇదంతా జగమెరిగిన సత్యం. అప్పట్లో పర్యాటక రంగంలో తన అనుయాయులకు తప్ప మిగిలిన ఎవరికీ ఒక్క కాంట్రాక్టు, లేదా ఒక్క ఉద్యోగం కూడా రాలేదంటే చంద్రబాబు పాలనంతా పైన పటారం లోన లొటారం అనే స్పష్టమైంది. ఇక వీటినే రామోజీరావు గొప్పగా కీర్తిస్తూ పతాక శీర్షికల్లో బాబుకు నిర్లజ్జగా భజన చేసి ప్రజలను దగా చేశారు. కానీ, సీఎం జగన్ దార్శనిక పిలుపుతో గతేడాది విశాఖ వేదికగా గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ (జీఐఎస్)లో మొత్తం రూ.13.11 లక్షల కోట్లు పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకుంటే.. ఒక్క పర్యాటక రంగంలోనే 117 ఒప్పందాల ద్వారా రూ.17,127 పెట్టుబడులు వచ్చాయి. తద్వారా 39,170 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వచ్చేలా ప్రణాళిక రచించారు. కానీ, చంద్రబాబు దొంగ ఒప్పందాలను అడ్డగోలుగా కీర్తించిన అదే రామోజీరావు.. సీఎం జగన్ పాలనలో వాస్తవాలకు పాతరేస్తూ దుష్ప్రచారానికి తెగబడడం సిగ్గుచేటు.

మాస్ లీడర్

58 నెలలుగా తమకు కాపు కాసిన నాయకుడి కోసం జనం ఆరాటం

రామగోపాల్ ఆలమూరు – సాక్షి, అమరావతి



మార్చి 27వతేదీ మిట్ట మధ్యాహ్నం.. 42 డిగ్రీల మండుతున్న ఎండలో వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం వీరన్నగట్టుపల్లె క్రాస్ వద్ద సీఎం జగన్‌ను చూసేందుకు ఏడాదిన్నర వయసున్న చంటిబిడ్డను చంకనేసుకుని ఓ మహిళ పొలాల్లో నుంచి పరుగెత్తుతూ వచ్చింది. రోడ్ షోలో జననేతను చూసి సంతోషం వ్యక్తం చేసింది. యాత్ర ముందుకు కదులుతుంటే ఐదారు వందల మీటర్ల దూరం బస్సు వెంట పరుగులు తీసింది. చంటిబిడ్డను చంకలో వేసుకుని అలా పరుగెత్తుతున్నావ్..! కిందపడతావన్న భయం లేదా అక్కా? అని పలకరిస్తే.. ''నేను నిరుపేదను. జానెడు భూమి లేదు. కూలీనాలీ చేసుకుని బతికేవాళ్లం. మాకు జగనన్న ఇంటి స్థలం ఇచ్చి కట్టిచ్చినాడు. నా పెద్ద బిడ్డకు అమ్మ ఒడి కింద, నాకు ఆసరా కింద డబ్బులు ఇచ్చినాడు. వాటితో కుట్టు మిషన్ కొనుక్కుని బట్టలు కుట్టుకుంటూ ఇబ్బంది లేకుండా బతుకుతున్నాం. మాకు జీవితం ఇచ్చిన జగనన్నను ఎంత చూసినా తనివి తీరలేదు. అందుకే పరుగెత్తుతున్నా' అని బదులిచ్చింది.

మార్చి 28 మధ్యాహ్నం 12 గంటలు.. సూర్యుడు చుర్రుమంటున్నాడు. నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల వద్ద దివ్యాంగ దంపతులు అపర్ణ, ప్రసాద్‌లు రోడ్డుపై కూర్చున్నారు. వేడికి తారు రోడ్డు కాలిపోతోంది. ఎందుకన్నా రోడ్డుపై కూర్చున్నారని అడిగితే.. 'నేను, నా భార్య ఇద్దరూ దివ్యాంగులం. మాకు జగనన్న ఇంటి స్థలం ఇచ్చి పక్కా ఇంటిని నిర్మించి ఇచ్చారు. మా ఇద్దరికీ కలిపి పెన్షన్ నెలకు రూ.6 వేలు ఇస్తున్నారు. ఆ డబ్బులతో జీవనం సాగిస్తూ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) పాసయ్యాం. టీచర్ ఖాళీల భర్తీ కోసం జగనన్న నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ పరీక్షలు రాస్తే మాకు ఉద్యోగాలు వస్తాయి. మమ్మల్ని ఇంటివాళ్లను చేయడంతోపాటు జీవితాన్ని ఇచ్చిన జగనన్న చూసేందుకు ఎంత ఎండలోనైనా కూర్చుంటాం' అని చెప్పారు. ఇంతలో బస్సు యాత్రతో అటువైపు వచ్చిన సీఎం జగన్ వారిని చూసి బస్సు నుంచి కిందకు దిగి ఆప్యాయంగా పలకరించడంతో దివ్యాంగ దంపతులు ఆనందపరవశులయ్యారు.

మార్చి 29 మధ్యాహ్నం 2 గంటలు.. ఎండ నిప్పుల కొలిమిని తలపిస్తోంది. 70 ఏళ్ల పార్వతమ్మ రోడ్డుపై నిలుచుని ఉంది. అవ్వా.. ఎండ కాలిపోతోంది.. రోడ్డుపై నిలబడితే వడదెబ్బ తగులుతుందన్న భయం లేదా? అని పలకరిస్తే.. 'నా భర్త చనిపోయినాడు.. నాకు పిల్లలు లేరు.. ఈ వయసులో ఏ పనీ చేయలేను.. నెలకు రూ.3 వేల చొప్పున జగనన్న ఇచ్చే పింఛన్‌తోనే బతుకుతున్నా.. మనవడిలా నన్ను ఆదరిస్తున్న జగనన్న మా ఊరికి వస్తున్నాడు. నా మనవడిని చూడటానికి ఎంత ఎండలోనైనా నిలబడే ఉంటా' అని ఆ అవ్వ చెప్పింది.

మార్చి 30 రాత్రి 10.40 గంటలు.. అనంతపురం జిల్లా రాప్తాడు వద్ద పెద్దక్క తన ఇద్దరు పిల్లలతో కలిసి నిలబడింది. ముగ్గురి చేతుల నిండా బంతి పువ్వులు ఉన్నాయి.. అక్కా రాత్రయింది.. పిల్లలతో కలిసి రోడ్డుపై ఎందుకు నిలబడ్డారు? అని పలకరిస్తే.. 'నా భర్త 2019 ఫిబ్రవరిలో చనిపోయినాడు. నా అత్తింటి వాళ్లు, పుట్టింటివాళ్లు నన్ను పట్టించుకోలేదు. ఇద్దరు పిల్లలతో కలసి ఆత్మహత్య చేసుకుందామనుకున్నా.. జగనన్న అధికారంలోకి వచ్చాక నాకు ఇంటి స్థలం ఇచ్చి, ఇళ్లు కట్టించి ఇవ్వడంతోపాటు వితంతు పెన్షన్, అమ్మ ఒడి, ఆసరా, చేయూత, రైతు భరోసా పథకాల ద్వారా సొంత అన్నలా అండగా నిలిచినాడు. నాకున్న రెండు ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ.. జగనన్న ఇచ్చిన డబ్బులతో రెండు పాడి పశువులు కొనుక్కుని పాలు అమ్ముకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నా. జగనన్న గవర్నమెంట్ బడిలో ఇంగ్లిషు మీడియంలో నా ఇద్దరు పిల్లలకు చదువులు చెప్పిస్తున్నాడు. నాకు అండగా నిలిచిన జగనన్న కోసం అర్ధరాత్రైనా వేచి ఉంటా' అని ఆత్మస్థైర్యంతో చెప్పింది.

మార్చి 28 మిట్ట మధ్యాహ్నం.. నంద్యాల జిల్లా శిరివెళ్లలో హుస్సేన్ బాష మండే ఎండలో నిలబడ్డాడు.. ఇంత ఎండలో రోడ్డుపై ఎందుకు ఉన్నావన్నా? అని అడిగితే.. 'నేను ప్రైవేట్ ఉద్యోగిని. నా కుమారుడు అనారోగ్యం పాలైతే ఆస్పత్రికి తీసుకెళ్లా. డాక్టర్లు చాలా పెద్ద సమస్య అని చెప్పారు. జగనన్న ఉన్నాడనే ధైర్యంతో ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని తిరుపతి ఆస్పత్రికి వెళ్లా. రూ.5 లక్షల విలువైన సర్జరీలలో ఇప్పటికే రెండు సర్జరీలు చేశారు. మంచానికే పరిమితమైన నా కుమారుడు ఇవాళ లేచి నిలబడగలుగుతున్నాడు. ఇప్పుడు ఆరోగ్యశ్రీ పరిమితిని జగనన్న రూ.25 లక్షలకు పెంచాడు. మూడో సర్జరీ కూడా త్వరలో జరగబోతోంది. నా బిడ్డ ప్రాణాన్ని నిలబెట్టిన దేవుడు జగనన్న. పైన ఉన్న యముడికి, కింద ఉన్న ప్రజలకు అడ్డుగా నిలబడే నాయకుడు జగనన్న. పేదల పక్షాన నిలిచిన సీఎం జగనన్న వెంటే నడుస్తా' అని చెప్పాడు.

''మేమంతా సిద్ధం...'' పేరుతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న బస్సు యాత్రలో కనిపించిన దృశ్యాల్లో ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. సూరీడు నిప్పులు గక్కుతున్నా.. ఎండ మండుతున్నా.. రాత్రి పొద్దుపోయినా చిన్నపిల్లలు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, అన్నాదమ్ములు బస్సు యాత్ర జరిగే రహదారి వెంబడి కిలోమీటర్ల కొద్దీ బారులు తీరుతున్నారు. సీఎం జగన్ తమ వద్దకు చేరుకోగానే పూల వర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. జనం కోసం నిలబడ్డ నాయకుడికి జననీరాజనం పలుకుతున్నారు. ఆత్మీయ నేత కోసం అర్ధరాత్రయినా అభిమానం ఉప్పొంగుతోంది. ఐదేళ్లు తమను కాపు కాసిన నాయకుడిని చూసేందుకు జనం ఆరాటపడుతున్నారు. తమ నాయకుడిని కళ్ల నిండా నిలుపుకొనేందుకు తాపత్రయ పడుతున్నారు. జననేత తమకు చేసిన మంచిని గుర్తు చేసుకుంటూ ఎన్నికల మహాసంగ్రామంలో పెత్తందార్ల పీచమణిచేందుకు 'మేమంతా సిద్ధం' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తున్నారు. పేదలకు మరింత గొప్ప భవిష్యత్తు కోసం.. రాష్ట్రాన్ని సమున్నతంగా నిలిపేందుకు సామాన్యులతో కలిసి అసమాన్యుడు సీఎం జగన్ బస్సు యాత్ర ద్వారా చేస్తున్న యుద్ధ కవాతు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నేతృత్వంలోని కూటమిలో వణుకు పుట్టిస్తోంది. ఇచ్చిన మాటకు కట్టుబడి నిజాయితీ, నిబద్ధతతో సేవ చేసే నాయకుడిని ప్రజలు తమ గుండెల్లో పెట్టుకుంటారనేందుకు ఇవన్నీ తార్కాణమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. జైత్రయాత్రను తలపిస్తున్న సీఎం జగన్ బస్సు యాత్రను చూస్తుంటే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సృష్టించే ప్రభంజనం ముందుగానే కనిపిస్తోందని స్పష్టం చేస్తున్నారు. సీఎం జగన్ ప్రొద్దుటూరు, నంద్యాల, ఎమ్మిగనూరులో నిర్వహించిన ఎన్నికల సభలకు కుంభమేళాను తలపిస్తూ జనం పోటెత్తారు. బస్సు యాత్రలో భాగంగా అక్కడ నిర్వహించిన సభలు మూడు జిల్లాల చరిత్రలో అతి పెద్ద ప్రజాసభలుగా రికార్డు సృష్టించాయి. ఇక వైఎస్సార్ కడప, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో నిర్వహించిన రోడ్ షోలలో ప్రతి చోటా జనం బారులు తీరారు. చంటిబిడ్డలను ఎత్తుకున్న మహిళలు, అవ్వాతాతలు కదలివచ్చారు. చంద్రబాబు లాంటి మోసగాళ్ల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి నేను సిద్ధం.. మీరంతా సిద్ధమైతే సెల్‌ఫోన్‌లో టార్చ్ లైట్ ఆన్ చేయాలని సీఎం జగన్ కోరడంతో ఒక్కసారిగా లక్షల మంది సెల్‌ఫోన్లలో టార్చ్ లైట్ వెలిగించడంతో ఎమ్మిగనూరులో సభా ప్రాంగణం ఆకాశంలో చుక్కలను తలపించింది. చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు, ఎత్తులు, జిత్తులను చిత్తు చేసేందుకు తామంతా సిద్ధమేనంటూ పిడికిళ్లు బిగించి దిక్కులు పిక్కటిల్లేలా సింహనాదం చేశారు.

అవకాశవాద నాయకులకు చెంపపెట్టు

విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో జనసేన, బీజేపీతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జట్టు కట్టారు. తాము అధికారంలోకి వస్తే వ్యవసాయ రుణాలు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని.. ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతిగా ఇస్తానని.. ఆడపిల్ల పుడితే రూ.25 వేలు డిపాజిట్ చేస్తానని.. అర్హులందరికీ 3 సెంట్ల స్థలం, పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తానని.. చేనేత, పవర్ లూమ్స్ రుణాలు మాఫీ చేస్తానని ప్రధానమైన హామీలు ఇస్తూ మోదీ, పవన్ కళ్యాణ్‌లతోపాటు తన ఫోటో కూడా ముద్రించి, తాను సంతకం చేసిన లేఖను చంద్రబాబు ప్రతి ఇంటికీ పంపించారు. ఇవికాకుండా మరో 650 హామీలు ఇచ్చారు. ఆ ఎన్నికల్లో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో చంద్రబాబు కూటమి అధికారంలోకి వచ్చింది. అధికారం దక్కించుకున్నాక హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా చంద్రబాబు దారుణంగా మోసం చేశారు. అనంతరం 2019 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా అధికారంలోకి వచ్చేందుకు జనసేన, బీజేపీతో చంద్రబాబు వేరుపడ్డారు. ఆ ఎన్నికల్లో చంద్రబాబు కుట్రలను పసిగట్టిన ప్రజలు టీడీపీని 23 శాసనసభ స్థానాలకే పరిమితం చేసి గట్టి గుణపాఠం నేర్పారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు అదే కూటమితో పొత్తులతో ఎన్నికలకు సిద్ధమయ్యారు. సూపర్ సిక్స్ అంటూ హామీలిస్తూ ఊదరగొడుతున్న చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభకు, ప్రధాని మోదీని రప్పించి చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభకు జనం మొహం చాటేయడం ద్వారా అవకాశవాద పొత్తులను ఛీకొట్టారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. చంద్రబాబు మోసం చేస్తారనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోవడం వల్ల ప్రజాగళం పేరుతో ఆయన నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారాన్ని జనం పట్టించుకోవడం లేదని.. అందుకే ఆ సభలు అట్టర్ ఫ్లాప్ అవుతున్నాయని పేర్కొంటున్నారు చంద్రబాబు కోసమే పవన్ కళ్యాణ్ కాల్‌షీట్ రాజకీయాలు చేస్తారని గుర్తించిన ప్రజలు ఆయన నిర్వహించే ప్రచారం, సభలకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని స్పష్టం చేస్తున్నారు.

మాట కోసం ఎందాకైనా..

ప్రజలకు ఇచ్చిన మాట కోసం ఎందాకైనా పోరాడాలన్నది సీఎం జగన్ సిద్ధాంతం. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణం అనంతరం పదేళ్లు ఆయన ఆశయాల కోసం ప్రజల తరఫున పోరాడారు. రాజకీయంగా వైరిపక్షాలైన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఏకమై అక్రమ కేసులు బనాయించి 16 నెలలపాటు జైల్లో నిర్బంధించినా తల వంచలేదు. తమ తరఫున నిలబడిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీకి 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు అఖండ విజయాన్ని కట్టబెట్టారు. 2019 మే 20న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపై నుంచే నేను పాలకుడిని కాదు సేవకుణ్ని అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. గత 58 నెలలుగా అదే పంథాతో సేవలు అందిస్తున్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 95 శాతం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే అమలు చేసిన సీఎం జగన్ ఇప్పటి వరకు 99 శాతం నెరవేర్చి చిత్తశుద్ధి చాటుకున్నారు. నవరత్నాలు పథకాల ద్వారా అర్హతే ప్రామాణికంగా ఎలాంటి వివక్ష చూపకుండా, లంచాలకు తావు లేకుండా 87 శాతం పేద కుటుంబాల ఖాతాల్లోకి రూ.2.70 లక్షల కోట్లను డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో జమ చేశారు. 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇంటి స్థలాలు లాంటి నాన్ డీబీటీ పథకాల ద్వారా మరో రూ.1.79 లక్షల కోట్ల మేర లబ్ధి కలిగింది. డీబీటీ, నాన్ డీబీటీ కలిపి మొత్తం రూ.4.49 లక్షల కోట్ల దాకా ప్రయోజనాన్ని చేకూర్చారు. దేశ చరిత్రలో ఇదో రికార్డు. కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సింహభాగం పదవులు ఇచ్చి సామాజిక న్యాయమంటే నినాదం కాదు అమలు చేయాల్సిన విధానమని చాటి చెప్పి ఆ వర్గాల రాజకీయ సాధికారతకు బాటలు వేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో సంస్కరణల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్‌వ్యవస్థీకరణ ద్వారా ప్రభుత్వ సేవలను ఇంటి గుమ్మం వద్దకే చేరవేశారు. కరోనాతో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా కొనసాగించారు. విపత్తు వేళ ఉచితంగా వైద్య సేవలు అందించి ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించారు. దాంతో సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం బలంగా నాటుకుపోయింది. మండుటెండైనా.. అర్ధరాత్రైనా సీఎం జగన్ బస్సు యాత్రలో ప్రజలు లెక్క చేయకుండా నీరాజనాలు పలకడానికి ఇదే కారణమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. నాయకుడంటే జగన్‌లా ఉండాలని ప్రజలే చాటిచెబుతున్నారని, దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇదో మహోజ్వల ఘట్టమని ప్రశంసిస్తున్నారు.

అధికారమే లక్ష్యంగా జెండాలు జతకట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ సీట్ల కేటాయింపుతో బొక్కబోర్లా పడ్డాయి. రాష్ట్రంలో ప్రధానంగా గోదావరి జిల్లాలపై గంపెడాశలు పెట్టుకున్న ఆ కూటమికి ఇప్పుడు చుక్కలు కనిపిస్తున్నాయి. పొత్తులు, సీట్ల సిగపట్లతో బలహీనపడి అసలు ఉనికికే ముప్పు తెచ్చుకున్నాయి. ఈ జిల్లాల్లో కాపు, శెట్టిబలిజ సామాజిక వర్గాలే రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ సామాజిక వర్గాలు కూటమి వెంట ఉంటాయని లెక్కలేసుకుని జనసేన, టీడీపీలు తమదే గెలుపంటూ బీరాలు పలికాయి. అదే సమయంలో సీట్ల పంపకాల్లో ఆ పార్టీలు తమకు ప్రాధాన్యమిస్తాయని ఆయా సామాజిక వర్గాలు కూడా ఆశలు పెట్టుకున్నాయి. తీరా టికెట్ల కేటాయింపులో అటు టీడీపీ, ఇటు జనసేన పార్టీలు సరైన ప్రాధాన్యం కల్పించకపోవడంతో వాటి నుంచి కూటమికి ఎదురు దెబ్బ తప్పదన్న సంకేతాలు అందుతున్నాయి.

- సాక్షి ప్రతినిధి, కాకినాడ

కూటమికి గోదారిలో ఎదురీతే!



అధికారమే లక్ష్యంగా జత కట్టిన మూడు పార్టీలు

సీట్ల కేటాయింపులో తప్పటడుగులు.. రెండు ప్రధాన సామాజిక వర్గాలకు మొండిచేయి

జనసేనలో శెట్టిబలిజలకు ప్రాతినిధ్యం నిల్.. కాపులను విస్మరించిన కమలనాథులు.. ఆ రెండు వర్గాలకూ వైఎస్సార్‌సీపీ పెద్దపీట

శెట్టిబలిజలను విస్మరించిన జనసేన



పితాని బాలకృష్ణ



సరోజ

జనసేన బలం, బలహీనత గోదావరి జిల్లాలే అన్న ధీమా అన్నివర్గాల్లో ఉండేది. తీరా సీట్ల కేటాయింపులో ప్రధానమైన శెట్టిబలిజ సామాజికవర్గాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జనసేన పూర్తిగా పక్కన పెట్టేసింది. ఉమ్మడి తూర్పులో ఒక్కటంటే ఒక్కటికూడా వారికి కేటాయించలేదు. ఈ జిల్లాలో జనసేన ఆరు అసెంబ్లీ, కాకినాడ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తుండగా పి.గన్నవరం, రాజోలు ఎస్సీ రిజర్వుడ్ స్థానాలు పోను నిడదవోలు, రాజానగరం, కాకినాడ రూరల్, పిఠాపురం టికెట్లను సొంత సామాజిక వర్గానికే పవన్‌కళ్యాణ్ ఇచ్చుకున్నారు. శెట్టిబలిజలను విస్మరించారు. పార్టీ ఆవిర్భావం నుంచీ ముమ్మిడివరంలో సొంత సొమ్ము తగలేసుకుని అహోరాత్రులు శ్రమిస్తున్న ఆ సామాజికవర్గానికి చెందిన పితాని బాలకృష్ణకు సీటు ఇస్తామని నమ్మించి మోసం చేశారు. బీసీల తోక కత్తిరిస్తానంటూ చిన్నచూపు చూసే చంద్రబాబుతో జతకట్టి శెట్టిబలిజలకు సీటు లేకుండా మోసం చేశారని ఆ సామాజికవర్గం పవన్‌పై నిప్పులు చెరుగుతోంది. ఈ అవమానాన్ని భరించలేకే బాలకృష్ణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్‌పై నమ్మకంతో శనివారం ఆ పార్టీలో చేరారు. సీట్ల కేటాయింపులో వివక్షను తట్టుకోలేక కాకినాడ మాజీ మేయర్ సరోజ సైతం జనసేనను వీడారు.

టీడీపీకి తప్పని తిప్పలు

కూటమిలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న చంద్రబాబు మూడు పార్టీల కూటమితో బాగా బలపడ్డామని సంబరపడ్డారు. కానీ ఆయన అంచనాలు తూర్పులో తలకిందులయ్యాయి. ఓటమి సంకేతాలు అందిస్తున్నాయి. పొత్తులో సీట్లు కోల్పోయిన నిడదవోలు, రాజోలు, పి.గన్నవరం, పిఠాపురం, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో టీడీపీ నేతల మధ్య అంతర్గత పోరు, అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. వీటితో పాటు తుని, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, అమలాపురం, కొవ్వూరు, గోపాలపురం స్థానాల్లో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. పనిలో పనిగా పలువురు నేతలు టీడీపీకి దూరమవుతున్నారు. ఈ పరిణామాలను చక్కదిద్దలేక చంద్రబాబు తలపట్టుకుంటున్నారు.

ఆ రెండు వర్గాలకు బీజేపీ మొండిచేయి



సోము వీర్రాజు



పురందేశ్వరి



శివరామకృష్ణంరాజు

ఈ జిల్లాలో సంఖ్యాపరంగా అత్యధికంగా ఉన్న కాపు, శెట్టిబలిజలను బీజేపీ పూర్తిగా విస్మరించిందని ఆ సామాజికవర్గాలు నిప్పులు చెరుగుతున్నాయి. పొత్తులో భాగంగా బీజేపీకి దక్కిన రాజమహేంద్రవరం లోక్‌సభ నియోజకవర్గం, అనపర్తి అసెంబ్లీ స్థానాలను సామాజికంగా బలం లేని వర్గాలకు కేటాయించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన సీనియర్ నాయకుడు, కాపు సామాజికవర్గానికి చెందిన సోము వీర్రాజు రాజమహేంద్రవరం పార్లమెంటరీ స్థానం గానీ రాజమహేంద్రవరం సిటీ, రూరల్ అసెంబ్లీ స్థానాల్లో ఒక్కటైనా ఇవ్వాలని కోరారు. కానీ ఆయనకు కాదని స్థానికేతరురాలైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం కేటాయించారు. అనపర్తి అసెంబ్లీ స్థానాన్ని కూడా సామాజికంగా బలం లేని శివరామకృష్ణంరాజుకు కేటాయించడాన్ని వారు తప్పుపడుతున్నారు. దాంతో వారు కూటమికి దూరమవుతున్నారు.

వైఎస్సార్‌సీపీలో బీసీలకే పెద్దపీట

వైఎస్సార్‌సీపీ మొదటినుంచీ బీసీలపై ఆదరణ చూపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానాన్ని శెట్టిబలిజ సామాజికవర్గం నుంచి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు, రాజమహేంద్రవరం రూరల్‌ను రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు, రామచంద్రపురాన్ని పిల్లి సూర్యప్రకాశ్‌కు కేటాయించింది. వీటితో పాటు బీసీల్లో గౌడ సామాజికవర్గం నుంచి ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను రాజమహేంద్రవరం సిటీ నుంచి బరిలోకి దింపింది. జనసేనలో తమకు జరిగిన అవమానాన్ని భరించలేక ఈ జిల్లాల్లోని శెట్టిబలిజలతో పాటు చేనేత, మత్స్యకార వర్గాలు రాజకీయంగా బీసీలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపుతున్నాయి. ఇక్కడ కాపు సామాజిక వర్గానికి కూడా వైఎస్సార్‌సీపీ సముచిత ప్రాధాన్యమే కల్పించింది. ఉమ్మడి జిల్లాలోని 21 అసెంబ్లీ స్థానాల్లో తొమ్మిదింటితో పాటు సంప్రదాయంగా ఇస్తున్న కాకినాడ లోక్‌సభ స్థానాన్ని కూడా ఆ వర్గానికే కేటాయించింది. దీంతో ఆ సామాజికవర్గం వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తోంది.

రాష్ట్రానికే తలమానికంగా దామవరం ఎయిర్‌పోర్టు

- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

కావలి: నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గ పరిధిలోని దగదర్తి మండలం దామవరం వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్రానికే తలమానికంగా ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టనున్నట్లు రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి తెలిపారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న సమస్యలన్నీ సమసిపోయాయని, ఎన్నికలు అయిన వెంటనే నిర్మాణం ప్రారంభమవుతుందని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆదివారం దగదర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తయి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో శంషాబాద్ తరహాలో రాష్ట్రానికే తలమానికంగా నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రయాణికుల రాకపోకలు మాత్రమే కాకుండా సరుకు రవాణా, ఎగుమతులు, దిగుమతుల కోసం కార్గో విభాగాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. అవసరమైతే ఎయిర్‌క్రాఫ్టల మరమ్మతుల విభాగం కూడా ప్రారంభించేందుకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విమానాశ్రయంతోపాటు ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్), ఇండస్ట్రియల్ కారిడార్‌లతో రానున్న కాలంలో దగదర్తి మండలం పట్టణ హోదా సంతరించుకోనుందని తెలిపారు. దగదర్తి–ముంగమూరు కాలువ, దగదర్తి–రాచర్లపాడు కెనాల్ పనులను కూడా రానున్న ఐదేళ్లలో పూర్తి చేసే బాధ్యత తమదేనని స్పష్టం చేశారు. దగదర్తి–బుచ్చి రోడ్డు నిర్మాణాన్ని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయనున్నట్టు తెలిపారు. నెల్లూరు జిల్లా అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో రూపొందించినట్టు చెప్పారు. మాట ఇచ్చి వెనక్కి వెళ్లే వ్యక్తిత్వం తమది కాదని, చెప్పిన ప్రతి పని కచ్చితంగా చేసి తీరుతామని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయడం ద్వారా ఎంపీగా తనను, కావలి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

దేశానికే ఆదర్శం జగన్‌మోహన్‌రెడ్డి

- అసెంబ్లీ, ఎంపీ టికెట్లలో బీసీలకు పెద్దపీట వేశారు
- ఎంపీ ఆర్.కృష్ణయ్య



కాచిగూడ(హైదరాబాద్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు పెద్దపీట వేస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 11 ఎంపీ సీట్లు ఇచ్చారని, అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో 60 సీట్లు కేటాయించి దేశానికే ఆదర్శవంతంగా నిలిచారని కృష్ణయ్య కొనియాడారు. జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సభలో ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు జనాభా ప్రాతిపదికన ఎంపీ టికెట్లు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేశాయని, ఏ పార్టీ కూడా బీసీలకు సరైన న్యాయం చేయలేదని అన్నారు. ఈ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటూ మోసం చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నేతలు నీలం వెంకటేశ్, నంద గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

‘మేమంతా సిద్ధం’తో జగన్ ప్రభంజనం

రేపు మదనపల్లెలో సభ • మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మేమంతా సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు

మదనపల్లె: ‘మేమంతా సిద్ధం’ పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న బస్సుయాత్రలకు ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందనతో రాష్ట్రవ్యాప్తంగా జగన్ ప్రభంజనం కనిపిస్తోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మదనపల్లె టిప్పుసుల్తాన్ మైదానంలో ఏప్రిల్ 2న జరగనున్న ‘మేమంతా సిద్ధం’ సభ ఏర్పాట్లను ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి.. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీం అస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సభలకు పెద్దసంఖ్యలో జనం హాజరవుతున్న నేపథ్యంలో ర్యాంప్, గ్యాలరీ, సభావేదికలో చేయాల్సిన మార్పులపై మంత్రి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 27న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ప్రారంభమైన బస్సుయాత్ర.. ప్రొద్దుటూరు, నంద్యాల, ఎమ్మిగనూరు, పత్తికొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో సభలు పూర్తిచేసుకుని, అనంతపురం జిల్లా రాప్తాడు, ధర్మవరం మీదుగా సోమవారం సాయంత్రం కదిరి చేరుకుంటుందన్నారు. అక్కడ ఇఫ్తార్ విందులో పాల్గొన్న అనంతరం వైఎస్ జగన్ తనకల్లు మండలంలో రాత్రి బసచేస్తారన్నారు. 2వ తేదీ ఉదయం తిరిగి బయల్దేరి, సాయంత్రానికి మదనపల్లెకు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి పుంగనూరు నియోజకవర్గంలో రాత్రి బస తర్వాత 3న చిత్తూరు పార్లమెంటరీ పరిధిలోని పూతలపట్టు నియోజకవర్గంలో సభ తర్వాత 4న తిరుపతి జిల్లా నాయుడుపేటలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. దీంతో రాయలసీమలోని అన్ని జిల్లాల్లో బస్సుయాత్ర పూర్తిచేసుకుని నెల్లూరు జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. ఈ బస్సుయాత్ర వైఎస్సార్‌సీపీ విజయావకాశాలను ప్రభావితం చేస్తోందన్నారు. ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ స్పందనతో యాత్ర షెడ్యూల్ ఆలస్యం అవుతోందన్నారు. ఇక రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమన్నారు.

పేదోడి ఆకలితో కూటమి కుటిల రాజకీయం

- పింఛన్ల పంపిణీకి వలంటీర్లు వద్దని ఫిర్యాదు చేశారు.. డీఎస్సీ పరీక్షలపైనా దిగజారుడు రాజకీయం
- 25 ఎంపీ స్థానాల్లో 70 శాతం బీసీలకే వైఎస్సార్‌సీపీ సీట్లు ఇచ్చింది
- టీడీపీలో బీసీలకు సీట్లేవి?
- జనసేన, బీజేపీ కూడా టీడీపీ బాటలోనే
- మంత్రి బొత్స సత్యనారాయణ ధ్వజం



సాక్షి, విశాఖపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాకే బీజేపీ, టీడీపీ, జనసేన విశాఖలో ఓట్లు అడగాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. రైల్వే జోన్ నుంచి రాష్ట్ర విభజన హామీల వరకూ బీజేపీ తూట్లు పొడిచిందని మండిపడ్డారు. రాష్ట్ర విభజనలో బీజేపీకి భాగస్వామ్యం ఉందని పార్లమెంట్ సాక్షిగా అప్పటి ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్ అంగీకరించారని గుర్తు చేశారు. విశాఖ ఏయూ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాక్షిగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని సీఎం వైఎస్ జగన్ వెల్లడించారన్నారు. అప్పటికీ, ఇప్పటికీ వైఎస్సార్‌సీపీ స్టాండ్ ఒక్కటేనని కుండబద్దలు కొట్టారు. ఈ మేరకు మంత్రి బొత్స సత్యనారాయణ ఆదివారం విశాఖపట్నం లాసన్స్‌బే కాలనీలో మీడియాతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీట్ల కేటాయింపులో సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. 25 పార్లమెంట్ స్థానాల్లో 70 శాతం సీట్లు బడుగు, బలహీనవర్గాలకే ఇచ్చారని గుర్తు చేశారు. బలహీనవర్గాలు ఎక్కువగా ఉన్న ఉత్తరాంధ్రలో ఐదింటిలో ఒక ఎస్సీ స్థానం పోగా.. మిగిలిన నాలుగు స్థానాలనూ బీసీలకే ఇచ్చారని చెప్పారు. టీడీపీ బీసీలకు కేవలం 2 సీట్లే ఇచ్చిందని.. మిగతా స్థానాలన్నీ ఓసీలకే కట్టబెట్టిందని విమర్శించారు. అది కూడా స్థానికులు కాని వారికి సీట్లు ఇచ్చిందని మండిపడ్డారు. బీజేపీ, జనసేన సైతం టీడీపీ బాటనే అనుసరించాయని ధ్వజమెత్తారు. జనసేన పోటీ చేస్తున్న రెండు ఎంపీ స్థానాల్లో బీసీలు లేరన్నారు. అలాగే బీజేపీ 6 స్థానాల్లో పోటీచేస్తుంటే.. ఇందులో ఒకటి ఎస్సీకి పోయిందని.. మిగతా సీట్లన్నీ ఓసీలకే ఇచ్చిందని విమర్శించారు. పెత్తందారులకు పట్టంకట్టడమే కూటమి లక్ష్యమన్నారు.

ఇంతకంటే దుర్మార్గం ఉంటుందా?

వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను వలంటీర్లు ఇవ్వవద్దని చంద్రబాబు పిటిషన్ వేయించారని.. ఇంతకంటే దుర్మార్గం ఉంటుందా అని ప్రశ్నించారు. లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి తెచ్చుకోవాలంటే ఇబ్బందులు తప్పవన్నారు. ప్రభుత్వం డీబీటీ ద్వారా చెల్లించాలంటే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు అవసరమని.. ఇప్పటికిప్పుడు ఇది సాధ్యమయ్యే పనేనా అని ప్రశ్నించారు. అదే వలంటీర్లు ఉండి ఉంటే లబ్ధిదారుల ఇళ్లకెళ్లి పింఛన్లు ఇచ్చేవారన్నారు. పేదోడి ఆకలితో కూటమి పార్టీలు కుటిల రాజకీయాలు చేస్తున్నాయన్నారు.

ఎన్నికల కోడ్ ముగిశాక డీఎస్సీ పరీక్షలు


నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం 6,100 పోస్టులతో డీఎస్సీ ప్రకటిస్తే.. దాన్ని కూడా నిర్వహించకూడదంటూ ఎన్నికల కమిషన్‌కు కూటమి పార్టీలు ఫిర్యాదు చేశాయని మండిపడ్డారు. దీన్నిబట్టి చూస్తే అవి ఎంతకు దిగజారాయో అర్థమవుతోందన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకే డీఎస్సీ తేదీలను ప్రకటించామని గుర్తు చేశారు. ఈసీ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ ముగిశాక డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే వచ్చే ఏడాది నుంచి ఏటా డీఎస్సీ ఉంటుందని ఆయన చెప్పారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు గురువులు పాల్గొన్నారు.

‘సీమ’కు జగన్ చేసిందేమీ లేదు: బాబు

- రూ.60 ఉన్న క్వార్టర్‌ను జగన్ రూ.200 చేశాడు
- జగన్ కన్నా బీసీలకు ఎక్కువ సీట్లిచ్చాం
- ఎమ్మిగనూరు, మార్కాపురం, బాపట్ల సభల్లో చంద్రబాబు
- జనం లేకపోవడంతో మార్కాపురంలో రోడ్‌షో రద్దు



బాబు కాన్వాయ్ వెంబడి కార్యకర్తలు లేని దృశ్యం



ఎమ్మిగనూరు/సాక్షి ప్రతినిధి, ఒంగోలు/సాక్షి ప్రతినిధి బాపట్ల: రాయలసీమకు సీఎం జగన్ చేసింది ఏమీలేదని.. తాము సీమ కోసం రూ.12వేల కోట్లు ఖర్చుచేస్తే, జగన్ రూ.2వేల కోట్లు మాత్రమే ఖర్చుచేశాడని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆరోపించారు. ఈ ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం రేట్లు పెంచి దోచుకున్నారని, అదే తానున్నప్పుడు రూ.60 ఉండే క్వార్టర్ ధరను రూ.200 చేశాడంటూ ఆయన ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ఆదివారం ఎమ్మిగనూరు, ప్రకాశం జిల్లా మార్కాపురం, బాపట్లలో జరిగిన ప్రజాగళం సభల్లో ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల్లో ఎక్కువ మంది బీసీలకు టికెట్లు ఇచ్చింది టీడీపీయేనని, ఒకే సామాజికవర్గానికి 49 సీట్లిచ్చి జగన్ పెత్తందారి వ్యవస్థను ప్రోత్సహించాడని ఆరోపించారు. ఇక ఆర్టీసీలో స్త్రీలకు ఉచిత ప్రయాణం, అమ్మఒడి కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ.15వేల చొప్పున ఇస్తానని, మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తానని చెప్పినా జనం నుంచి స్పందన కరువైంది. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తనదేనని చెప్పారు. అనంతరం.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు.

బాబు మాటలకు నవ్వుకున్న జనం..

బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతో ముస్లింల ఆగ్రహానికి గురైన చంద్రబాబు దానిని సరిదిద్దుకునే ప్రయత్నంలో భాగంగా వచ్చే ఎన్నికల్లో మతాలు, కులాలు చూడొద్దంటూ మాట్లాడటంతో ప్రజలు విసుక్కున్నారు. ఇక టీడీపీలో చేరకముందు వరకు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని ఢిల్లీ లిక్కర్ స్కాం విషయంలో విమర్శించిన చంద్రబాబు, ఇప్పుడు మంచోడంటూ పొగడటంపట్ల.. 3 సార్లు పార్టీ మారిన మాగుంటది సేవాభావం అన్నప్పుడు ప్రజలు గట్టిగా నవ్వుకున్నారు. అలాగే, అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు పశ్చిమ ప్రకాశం వైపు కన్నెత్తి కూడా చూడని బాబు ఇప్పుడు నీళ్లిస్తానని చెప్పడంతో వారంతా ఆశ్చర్యపోయారు. ఎందుకంటే.. ఇటీవలే వెలిగొండ ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ జాతికి అంకితం చేసిన విషయం కూడా చంద్రబాబుకు తెలీదా అని వారంతా చర్చించుకున్నారు. రైతులు అంటే కనీసం గౌరవంలేదని, ధాన్యం కొనుగోలు చేసే దిక్కులేదని బాపట్లలో అన్నారు. ఈ ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచిందన్నారు. ఇదిలా ఉంటే.. మార్కాపురంలో ప్రజలు లేకపోవడంతో బాబు రోడ్‌షో రద్దుచేసుకున్నారు. ఎప్పటిలాగే ఈ మూడుచోట్లా తక్కువగా హాజరైన జనం సభలు జరుగుతుండగానే జారుకున్నారు.

బీసీలకు కూటమి వెన్నుపోటు

- విజయనగరం లోక్‌సభ పరిధిలో బీసీలకు బాబు దగా
- వైఎస్సార్‌సీపీ 4 సీట్లు ఇవ్వగా.. 2 సీట్లతో సరిపెట్టిన కూటమి
- సింహభాగం బీసీలే ఉన్నా.. పెత్తందారులకే పెద్దపీట
- ఒక్క సీటు ఇవ్వలేదని కొప్పుల వెలమల ఆగ్రహం

నియోజకవర్గం	కూటమి	వైఎస్సార్‌సీపీ (అసెంబ్లీ అభ్యర్థులు)
బొబ్బిలి	బేబీ నాయన (ఓసీ వెలమ)	శంబంగి వెంకటచిన్న అప్పలనాయుడు (బీసీ కొప్పులవెలమ)
నెల్లిమర్ల	లోకం మాధవి (ఓసీ బ్రాహ్మణ)	బడ్డుకొండ అప్పలనాయుడు (బీసీ తూర్పుకాపు)
ఎచ్చెర్ల	నడికుదిటి ఈశ్వరరావు (ఓసీ కమ్మ)	గొర్లె కిరణ్‌కుమార్ (బీసీ తూర్పుకాపు)
విజయనగరం	పూసపాటి అదితి గజపతిరాజు (ఓసీ క్షత్రియ)	కోలగట్ల వీరభద్రస్వామి (ఓసీ వైశ్య)
గజపతినగరం	కొండపల్లి శ్రీనివాస్ (బీసీ తూర్పుకాపు)	బొత్స అప్పలనర్సయ్య (బీసీ తూర్పుకాపు)
చీపురుపల్లి	కిమిడి కళా వెంకటరావు (బీసీ తూర్పుకాపు)	బొత్స సత్యనారాయణ (బీసీ తూర్పుకాపు)
రాజాం (ఎస్సీ)	కోండ్రు మురళీమోహన్	డాక్టర్ తలే రాజేశ్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ‘బీసీలు మా పార్టీకి బ్యాక్ బోన్’ అంటూ వెనుకబడిన తరగతుల వారికి దశాబ్దాలుగా చంద్రబాబు అరచేతిలో వైకుంఠం చూపిస్తూనే ఉన్నారు. బీసీలకు వెన్నుపోటు పొడుస్తున్నారు. ఇందుకు విజయనగరం లోక్‌సభ నియోజకవర్గమే ప్రత్యక్ష నిదర్శనం. తమకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడంతో కొప్పుల వెలమలు కూటమిపై కత్తులు నూరుతున్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతామని ప్రెస్‌మీట్లు పెట్టిమరీ హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో బీసీ సామాజిక వర్గాలదే అగ్రభాగం. వాటిలో తూర్పుకాపు, కొప్పుల వెలమ సామాజికవర్గాలు అత్యంత ప్రధానమైనవి. కానీ చంద్రబాబు అత్యంత స్వల్ప సంఖ్యలో ఉన్న పెత్తందారులకే పెత్తనం ఇస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాలు నాలుగూ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలే అయినప్పటికీ అక్కడ బీసీ సామాజిక వర్గాలు నిర్ణాయక శక్తిగా ఉన్నాయి. విజయనగరం జిల్లాలో ఎస్సీ రిజర్వ్‌డ్ రాజాం అసెంబ్లీ నియోజకవర్గం మినహా మిగతా ఆరు ఎచ్చెర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, గజపతినగరం, నెల్లిమర్ల, విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీసీ సామాజిక వర్గాలే అధిక శాతం ఉన్నారు. తూర్పుకాపులు రాజాం, ఎచ్చెర్ల, చీపురుపల్లి, నెల్లిమర్లలో, కొప్పుల వెలమలు బొబ్బిలి, గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికంగా ఉన్నారు. తమ పార్టీకి బీసీలే వెన్నెముక అంటూ వారిని అవసరానికి ఉపయోగించుకోవడం.. ఎన్నికలు వచ్చేసరికి పెత్తందారులకే పెద్దపీట వేయడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య.

‘కాపు’లకు ‘కమ్మ’ని దెబ్బ...

టీడీపీ సీనియర్ నాయకుడు కిమిడి కళావెంకటరావు ఈ సారి కూడా ఎచ్చెర్ల నుంచే సీటు ఆశించారు. స్థానిక టీడీపీ నాయకుడు కలిశెట్టి అప్పలనాయుడు కూడా టికెట్ కోసం విశ్వప్రయత్నాలు చేశారు. వారిద్దరూ తూర్పు కాపు సామాజికవర్గానికి చెందినవారే. కానీ చాపకింద నీరులా కమ్మ సామాజికవర్గానికి చెందిన నడికుదుటి ఈశ్వరరావు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చలువతో ఎచ్చెర్ల సీటు ఎగురేసుకుపోయారు. ఆ నియోజకవర్గంలో కమ్మ సామాజికవర్గం వారు పట్టుమని వెయ్యి మంది లేకపోవడం విశేషం. కిమిడి కళావెంకటరావును చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి పంపించారు. అక్కడ పదేళ్లుగా టీడీపీ కోసం పనిచేస్తున్న ఆయన సొంత సోదరుడి కుమారుడు కిమిడి నాగార్జున రాజకీయ భవిష్యత్తును నాశనం చేయించారు.

సామాజిక న్యాయం హుష్‌కాకి

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా పోటీచేస్తున్న విజయనగరం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో టికెట్ల కేటాయింపులో సామాజిక న్యాయం కనిపించలేదు. కొప్పుల వెలమ సామాజికవర్గం అత్యధికంగా ఉన్న బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ టికెట్‌ను పట్టుమని వెయ్యి మంది జనాభా కూడా లేని వెలమ (ఓసీ) సామాజికవర్గానికి చెందిన బేబీనాయనకు చంద్రబాబు ఇచ్చారు. గజపతినగరం టికెట్ కొప్పుల వెలమకు చెందిన మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుకి ఇస్తామని అక్కడా మొండిచేయిచూపారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో తూర్పుకాపు నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే మీసాల గీతను అక్కడి నుంచి తప్పించేందుకు చీపురుపల్లి టికెట్ ఇస్తామని ఒకసారి, గజపతినగరం సీటు కేటాయిస్తామని మరోసారి చెబుతూ ఆశలపల్లకిలో ఊరేగించారు. తీరా టికెట్ల కేటాయింపు వచ్చేసరికి ఆమెకు ఝలక్ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో పోటీచేయబోనని అశోక్ గజపతిరాజు చేతులెత్తేసిన నేపథ్యంతో తనకు విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో టికెట్ వస్తుందని మీసాల గీత ఆశించారు. అయితే గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన అశోక్ కుమార్తె అదితికే చంద్రబాబు మళ్లీ టికెట్ ఇచ్చారు. నెల్లిమర్లలో జనసేనతో పొత్తు ధర్మం పేరుతో బ్రాహ్మణ (ఓసీ) సామాజిక వర్గానికి చెందిన లోకం మాధవికి టికెట్ ఇచ్చి అక్కడ తూర్పుకాపులను దెబ్బకొట్టారు.



లోకం నాగమాధవి



బేబీనాయన



ఎన్.ఈశ్వరరావు



కలిశెట్టి అప్పలనాయుడు



తెంటు లక్ష్మునాయుడు



అదితి గజపతిరాజు



కిమిడి నాగార్జున



మీసాల గీత



కళా వెంకటరావు



మయామి ఓపెన్ చాంపియన్ కోలిన్స్

ఈ ఏడాది ఆటకు వీడ్కోలు పలకనున్న అమెరికా టెన్నిస్ ప్లేయర్ డానియల్ కోలిన్స్ అద్భుతం చేసింది. మయామి ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టోర్నీలో చాంపియన్‌గా నిలిచింది. ఫ్లోరిడాలో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో 30 ఏళ్ల కోలిన్స్ 7-5, 6-3తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ రిబాకినా (కజకిస్తాన్)పై గెలిచింది. కోలిన్స్‌కు 11 లక్షల డాలర్ల (రూ. 9 కోట్ల 16 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. మార్టినా నవ్రతిలోవా, క్రిస్ ఎవర్ట్, వీనస్ విలియమ్స్, సెరెనా విలియమ్స్, స్లోన్ స్టీఫెన్స్ తర్వాత మయామి ఓపెన్ టైటిల్ నెగ్గిన ఆరో అమెరికన్ ప్లేయర్‌గా కోలిన్స్ గుర్తింపు పొందింది.

బాబర్ ఆజమ్‌కు మళ్లీ పాక్ జట్టు పగ్గాలు



మరో రెండు నెలల్లో టి20 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో... పాకిస్తాన్ క్రికెట్ జట్టు వన్డే, టి20 జట్లకు కెప్టెన్‌గా మళ్లీ బాబర్ ఆజమ్‌ను నియమించారు. గత ఏడాది వన్డే ప్రపంచకప్‌లో పాక్ జట్టు విఫలమయ్యాక బాబర్ కెప్టెన్సీ కోల్పోయాడు. టి20 జట్టుకు షాహీన్ అఫ్రిదిని, టెస్టు జట్టుకు షాన్ మసూద్‌ను కెప్టెన్‌లుగా నియమించారు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌ను పాక్ జట్టు 1-4తో చేజార్చుకుంది. దాంతో సెలెక్టర్లు కెప్టెన్సీ విషయంలో బాబర్ వైపు మొగ్గారు.



రిత్విక్-నిక్కీ జోడీకి టైటిల్

సాక్షి, హైదరాబాద్: సాన్ లూయిస్ ఓపెన్ అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) చాలెంజర్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. మెక్సికోలో జరిగిన ఈ టోర్నీలో రెండో సీడ్ రిత్విక్-నిక్కీ కలియంద పునాచా (భారత్) ద్వయం చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో రిత్విక్-నిక్కీ జంట 6-3, 6-2తో ఆంటోనీ బెలీర్-మార్క్ హ్యుస్లెర్ (స్విట్జర్లాండ్) జోడీపై గెలిచి 4,665 డాలర్ల (రూ. 3 లక్షల 88 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 75 ర్యాంకింగ్ పాయింట్లను సొంతం చేసుకుంది. రిత్విక్ కెరీర్‌లో ఇది రెండో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్. గత ఏడాది అక్టోబర్‌లో ఇటలీలో జరిగిన ఒల్బ్లా ఓపెన్‌లో అర్జున్ ఖడేతో కలిసి రిత్విక్ తొలిసారి చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను గెలిచాడు.

శ్రీలంక 531 ఆలౌట్


కామిందు మెండిస్


చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 159 ఓవర్లలో 531 పరుగులు చేసి ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 314/4తో రెండో రోజు ఆట కొనసాగించిన శ్రీలంక మరో 217 పరుగులు సాధించి మిగతా ఆరు వికెట్లు కోల్పోయింది. రెండో రోజు దినేశ్ చండీమల్ (59; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), ధనంజయ డిసిల్వా (70; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), కామిందు మెండిస్ (92 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. ఓవరాల్‌గా లంక ఇన్నింగ్స్‌లో ఆరుగురు బ్యాటర్లు అర్ధ సెంచరీలు చేశారు. ఈ క్రమంలో ఇన్నింగ్స్‌లో ఒక్క సెంచరీ నమోదు కాకుండా అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా శ్రీలంక రికార్డు నెలకొల్పింది. గతంలో ఈ రికార్డు భారత జట్టు (1976లో కాన్పూర్‌లో న్యూజిలాండ్‌పై 524/9 డిక్లేర్డ్) పేరిట ఉంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ కోల్పోయి 55 పరుగులు చేసింది.

మెరుపుల్లేని సన్‌రైజర్స్!

- ఏడు వికెట్లతో హైదరాబాద్ ఓటమి
- మోహిత్ శర్మ అద్భుత బౌలింగ్
- రాణించిన మిల్లర్, సాయి సుదర్శన్
- గుజరాత్ టైటాన్స్‌కు రెండో గెలుపు

అహ్మదాబాద్: గత బుధవారం ఉప్పల్ స్టేడియంలో సిక్సర్ల మోతతో... బౌండరీల జాతరతో అదరగొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ఈసారి అలాంటి ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయారు. ఒక్కరు కూడా భారీ ఇన్నింగ్స్ ఆడకపోవడంతో ఐపీఎల్ 17వ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు రెండో ఓటమి ఎదురైంది. గత ఏడాది రన్నరప్ గుజరాత్ టైటాన్స్ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అలరించి సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 162 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మోహిత్ శర్మ 25 పరుగులకు 3 వికెట్లు పడగొట్టి సన్‌రైజర్స్‌ను కట్టడి చేశాడు. అనంతరం గుజరాత్ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసి ఈ టోర్నీలో రెండో విజయాన్ని అందుకుంది.

ముంబై ఇండియన్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 277 పరుగులు సాధించిన సన్‌రైజర్స్ ఈసారి మెరిపించలేకపోయింది. ముంబైపై చెలరేగిపోయిన ట్రావిస్ హెడ్ (14 బంతుల్లో 19; 3 ఫోర్లు), అభిషేక్ శర్మ (20 బంతుల్లో 29; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), క్లాసెన్ (13 బంతుల్లో 24; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఈసారీ దూకుడుగా ఆడినా క్రీజులో ఎక్కువసేపు నిలువలేకపోవడం సన్‌రైజర్స్‌ను దెబ్బ తీసింది. మోహిత్ శర్మ బౌలింగ్‌లో గిల్‌కు క్యాచ్ ఇచ్చి అభిషేక్ అవుటవ్వడంతో... 10 ఓవర్లు ముగిసేసరికి సన్‌రైజర్స్ 3 వికెట్లు కోల్పోయి 74 ఇబ్బందుల్లో పడింది. చివర్లో అబ్దుల్ సమద్ (14 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరిశాడు. మెహిత్ శర్మ వేసిన చివరి ఓవర్లో హైదరాబాద్ 3 పరుగులు మాత్రమే చేసి 3 వికెట్లు కోల్పోయింది. 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. ఓపెనర్లు సాహా (13 బంతుల్లో 25; 1 ఫోర్, 2 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (28 బంతుల్లో 36; 2 ఫోర్లు, 1 సిక్స్) 10 ఓవర్లలోపే పెవిలియన్ చేరాయి. అయితే సాయి సుదర్శన్ (36 బంతుల్లో 45; 4 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ మిల్లర్ (27 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడు కొనసాగిస్తూ మూడో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. సాయి సుదర్శన్ అవుటైనా... విజయ్ శంకర్ (11 బంతుల్లో 14 నాటౌట్; 2 ఫోర్లు), మిల్లర్ సంయమనంతో ఆడి ఐదు బంతులు మిగిలి ఉండగానే టైటాన్స్‌ను విజయ తీరాలకు చేర్చారు.



అభిషేక్ శర్మ


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మోహిత్

ఐపీఎల్‌లో నేడు

ముంబై X రాజస్తాన్
వేదిక: ముంబై
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	2	2	0	4	1.047
చెన్నై	3	2	1	4	0.976
రాజస్తాన్	2	2	0	4	0.800
గుజరాత్	3	2	1	4	-0.738
హైదరాబాద్	3	1	2	2	0.204
లక్నో	2	1	1	2	0.025
ఢిల్లీ	3	1	2	2	-0.016
పంజాబ్	3	1	2	2	-0.337
బెంగళూరు	3	1	2	2	-0.711
ముంబై	2	0	2	0	-0.925

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (బి) నూర్ 19; మయాంక్ (సి) నల్కండే (బి) అజ్మతుల్లా 16; అభిషేక్ శర్మ (సి) గిల్ (బి) మోహిత్ 29; మార్క్‌రమ్ (సి) రషీద్ (బి) ఉమేశ్ 17; క్లాసెన్ (బి) రషీద్ 24; షహబాజ్ (సి) తెవాటియా (బి) మోహిత్ 22; సమద్ (రనౌట్) 29; సుందర్ (సి) రషీద్ (బి) మోహిత్ 0; కమిన్స్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 162.** **వికెట్ల పతనం:** 1-34, 2-58, 3-74, 4-108, 5-114, 6-159, 7-159, 8-162. **బౌలింగ్:** అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 3-0-24-1, ఉమేశ్ యాదవ్ 3-0-28-1, రషీద్ ఖాన్ 4-0-33-1, నూర్ అహ్మద్ 4-0-32-1, మోహిత్ శర్మ 4-0-25-3, దర్శన్ నల్కండే 2-0-18-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) కమిన్స్ (బి) షహబాజ్ 25; గిల్ (సి) సమద్ (బి) మార్కండే 36; సాయి సుదర్శన్ (సి) అభిషేక్ శర్మ (బి) కమిన్స్ 45; మిల్లర్ (నాటౌట్) 44; విజయ్ శంకర్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (19.1 ఓవర్లలో 3 వికెట్లకు) 168.** **వికెట్ల పతనం:** 1-36, 2-74, 3-138. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-27-0, షహబాజ్ అహ్మద్ 2-0-20-1, జైదేవ్ ఉనాద్కట్ 3.1-0-33-0, వాషింగ్టన్ సుందర్ 3-0-27-0, మయాంక్ మార్కండే 3-0-33-1, కమిన్స్ 4-0-28-1.

ఢిల్లీ గెలుపు బోణీ...

- మెరిసిన పంత్, వార్నర్, పృథ్వీ షా
- చెన్నై జట్టుకు తొలి పరాజయం


వార్నర్
ఖలీల్, మార్ష్, ముకేశ్
పంత్

సాక్షి, విశాఖపట్నం: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఐపీఎల్ 17వ సీజన్‌లో గెలుపు బోణీ కొట్టింది. డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో ఆదివారం ఇక్కడి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగుల భారీ స్కోరు చేసింది. 192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసి ఓడిపోయింది.

ఓపెనర్ల దూకుడు...

ఢిల్లీ జట్టుకు ఓపెనర్లు పృథ్వీ షా (27 బంతుల్లో 43; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), డేవిడ్ వార్నర్ (35 బంతుల్లో 52; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) శుభారంభం అందించారు. వీరిద్దరు చెన్నై బౌలర్ల భరతం పట్టి తొలి వికెట్‌కు 9.3 ఓవర్లలో 93 పరుగులు జోడించారు. ముస్తఫిజుర్ బౌలింగ్‌లో వార్నర్ రివర్స్ స్కూప్ షాట్ ఆడగా... పతిరణ డైవింగ్ చేస్తూ ఒంటిచేత్తో కళ్లు చెదిరేలా క్యాచ్ అందుకోవడంతో వార్నర్ ఇన్నింగ్స్ ముగిసింది. పది పరుగుల తర్వాత పృథ్వీ షా కూడా నిష్క్రమించాడు. ఈ దశలో మార్ష్ (12 బంతుల్లో 18; 2 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి కెప్టెన్ రిషభ్ పంత్ (32 బంతుల్లో 51; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. అయితే ఇన్నింగ్స్ 15వ ఓవర్లో పతిరణ మూడు బంతుల వ్యవధిలో అద్భుత యార్కర్‌లతో మార్ష్, స్టబ్స్ (0)ను పెవిలియన్‌కు పంపించాడు. మరో ఎండ్‌లో పంత్ తన దూకుడు కొనసాగించి 31 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకొని చెన్నైకు భారీ లక్ష్యాన్ని నిర్దేశించడంలో కీలకపాత్ర పోషించాడు.

దెబ్బ కొట్టిన ఖలీల్, ముకేశ్

క్లిష్టమైన లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన చెన్నై జట్టును 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఖలీల్ అహ్మద్ దెబ్బ కొట్టాడు. ఓపెనర్లు రుతురాజ్, రచిన్‌లను ఖలీల్ వెంటవెంటనే అవుట్ చేశాడు. దాంతో చెన్నై 7 పరుగులకే ఓపెనర్లను చేజార్చుంది. ఈ దశలో రహానే (30 బంతుల్లో 45; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిచెల్ (26 బంతుల్లో 34; 1 ఫోర్, 2 సిక్స్‌లు) మూడో వికెట్‌కు 68 పరుగులు జోడించి ఆదుకున్నారు. అయితే అక్షర్ బౌలింగ్‌లో మిచెల్ వెనుదిరగడంతో చెన్నై మళ్లీ ఇబ్బందుల్లో పడింది. ఇన్నింగ్స్ 14వ ఓవర్లో ముకేశ్ రెండు వరుస బంతుల్లో రహానే, రిజ్వీ (0)లను... ఆ తర్వాత 17వ ఓవర్లో దూబే (17 బంతుల్లో 18; 1 ఫోర్)ను అవుట్ చేయడంతో చెన్నై విజయ సమీకరణం క్లిష్టంగా మారింది. చివర్లో జడేజా (17 బంతుల్లో 21 నాటౌట్; 2 ఫోర్లు), ధోని (16 బంతుల్లో 37 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా ఫలితం లేకపోయింది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) ధోని (బి) జడేజా 43; వార్నర్ (సి) పతిరణ (బి) ముస్తఫిజుర్ 52; పంత్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 51; మిచెల్ మార్ష్ (బి) పతిరణ 18; స్టబ్స్ (బి) పతిరణ 0; అక్షర్ పటేల్ (నాటౌట్) 7; అభిషేక్ పోరెల్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 191.** **వికెట్ల పతనం:** 1-93, 2-103, 3-134, 4-134, 5-178. **బౌలింగ్:** దీపక్ చహర్ 4-0-42-0, తుషార్ దేశ్‌పాండే 4-0-24-0, ముస్తఫిజుర్ 4-0-47-1, జడేజా 4-0-43-1, పతిరణ 4-0-31-3.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) పంత్ (బి) ఖలీల్ 1; రచిన్ రవీంద్ర (సి) స్టబ్స్ (బి) ఖలీల్ 2; రహానే (సి) వార్నర్ (బి) ముకేశ్ 45; మిచెల్ (సి అండ్ బి) అక్షర్ పటేల్ 34; దూబే (సి) స్టబ్స్ (బి) ముకేశ్ 18; సమీర్ రిజ్వీ (సి) ఖలీల్ (బి) ముకేశ్ 0; జడేజా (నాటౌట్) 21; ధోని (నాటౌట్) 37; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 171;** **వికెట్ల పతనం:** 1-3, 2-7, 3-75, 4-102, 5-102, 6-120. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-1-21-2, ఇషాంత్ 3-0-23-0, నోర్జే 4-0-43-0, అక్షర్ పటేల్ 3-0-20-1, రసిఖ్ సలామ్ 2-0-25-0, మార్ష్ 1-0-14-0, ముకేశ్ 3-0-21-3.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ లాసెట్/పీజీ ఎల్‌సెట్-2024

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి.. ఏపీ లా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ లాసెట్)/పోస్ట్ గ్రాడ్యుయేట్ లాసెట్(ఏపీ పీజీఎల్‌సెట్)-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం/ఎంఎల్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ పరీక్షను గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నిర్వహిస్తుంది.

» **కోర్సులు:** మూడేళ్ల/ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ(ఏపీ లాసెట్), ఎల్‌ఎల్‌ఎం(ఏపీ పీజీ లాసెట్).
» **అర్హత:** కోర్సును అనుసరించి 45 శాతం మార్కులతో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎల్‌ఎల్‌బీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పరీక్ష విధానం:** ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఎల్‌ఎల్‌బీ కోర్సులకు పరీక్ష ఇంగ్లిష్, తెలుగు రెండు మాధ్యమాల్లో ఉంటుంది. ఎల్‌ఎల్‌ఎం పరీక్ష ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆలస్య రుసుం లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.04.2024.
» **హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభం:** 03.06.2024
» **ఏపీ లాసెట్/ఏపీ పీజీ లాసెట్ ప్రవేశ పరీక్షతేది:** 09.06.2024.
» **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

ఏపీ పీజీఈసెట్-2024

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ).. ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పీజీఈసెట్)-2024 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫుల్‌టైం ఎంఈ,ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మ్.డి(పీబీ) కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.ఈ పరీక్షను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ నిర్వహించనుంది.

» **కోర్సులు:** ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మ్.డి(పీబీ)
» **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, బయోఇన్ఫర్మేటిక్స్, బయో టెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, జియో-ఇన్ఫర్మేటిక్స్ తదితరాలు.
» **అర్హత:** కోర్సును అనుసరించి బీఈ, బీటెక్, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) విధానంలో జరుగుతుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తులకు చివరితేది:** 20.04.2024.
» **హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభం:**22.05.2024
» **ప్రవేశ పరీక్షతేదీలు:** 29.05.2024 నుంచి 31.05.2024 వరకు
» **వెబ్‌సైట్:**https://cets.apsche.ap.gov.in

ఐఐఎఫ్‌టీ కాకినాడలో ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ), కాకినాడ క్యాంపస్.. 2024-29 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం) (బీబీఏ-బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఎంబీఏ-ఇంటర్నేషనల్ బిజినెస్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** 60 శాతం మార్కులతో ఆర్ట్స్/కామర్స్/సైన్స్ స్ట్రీమ్‌లో 10+2/పన్నెండో తరగతి(ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులకు 55శాతం) 2022, 2023, 2024లో ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాథమేటిక్స్ లేదా బిజినెస్ మ్యాథమేటిక్స్ ఒక సబ్జెక్ట్ చదివి ఉండాలి. **వయసు:** 01.07.2004 తర్వాత జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:**ప్రవేశ పరీక్ష, విద్యార్హతలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.04.2024.
» **వెబ్‌సైట్:** https://applyadmission.net/iift2024ipm

బీసీసీఎల్‌లో 37 మెడికల్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

జార్ఖండ్‌లోని కోల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్(బీసీసీఎల్).. మెడికల్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37
» **విభాగాలు:** సర్జన్,జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్ అండ్ అబ్‌స్టెట్రీషియన్, ఆర్థోపెడిషియన్, పీడియాట్రిషియన్, సైకియాట్రిస్ట్, పాథాలజిస్ట్, డెర్మటాలజిస్ట్,పల్మాలజిస్ట్/చెస్ట్ స్పెషలిస్ట్,ఆప్తాల్మాలజిస్ట్, ఎమర్జెన్సీ మెడిసిన్, రేడియాలజిస్ట్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్ పోస్టులకు 42 ఏళ్లు, మెడికల్ స్పెషలిస్ట్/సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్ పోస్టుకు రూ.70,000 నుంచి రూ.2,00,000, మెడికల్ స్పెషలిస్ట్/సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు రూ.60,000 నుంచి రూ.1,80,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ జీఎం/హెచ్‌వోడీ(ఈఈ), భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ దగ్గర, కోయలా భవన్, కోయలా నగర్, ధన్‌బాద్, జార్ఖండ్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.04.2024.
» **వెబ్‌సైట్:** www.bcclweb.in

కోల్ ఇండియా లిమిటెడ్‌లో 32 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

కోల్ ఇండియా లిమిటెడ్(సీఐఎల్) వివిధ విభాగాల్లో మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 34
» **పోస్టుల వివరాలు:** సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్-26, సీనియర్ మెడికల్ ఆఫీసర్-08.
» **విభాగాలు:** సర్జన్, జనరల్ ఫిజీషియన్/మెడిసిన్, జీ-వో అనెస్తీషిస్ట్, పీడియాట్రిషియన్, సైకియాట్రిస్ట్, పాథాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, పల్మాలజిస్ట్, చెస్ట్ స్పెషలిస్ట్, ఆప్తాల్మాలజిస్ట్, ఈఎన్‌టీ, రేడియాలజిస్ట్, జీడీఎంవో, డెంటిస్ట్.
» **అర్హత:** జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ అండ్ పల్మనరీ మెడిసిన్, ఎంబీబీఎస్, పీజీ, బీడీఎస్ ఉత్తీర్ణులవ్వాలి.**వయసు:**పోస్టును అనుసరించి 31.01.2024 నాటికి 35 నుంచి 42 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** సీనియర్ మెడికల్ ఆఫీసర్ స్పెషలిస్ట్ పోస్టులకు నెలకు రూ.70,000 నుంచి రూ.2,00,000, మెడికల్ స్పెషలిస్ట్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు రూ.60,000 నుంచి రూ.1,80,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆఫీస్ ఆఫ్ డిప్యూటీ జనరల్ మేనేజర్, రిక్రూట్‌మెంట్ డిపార్ట్‌మెంట్, ఎన్‌సీఎల్‌హెచ్‌క్యూ, సింగ్రౌలీ(మధ్యప్రదేశ్) చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.04.2024.
» **వెబ్‌సైట్:** https://www.nclcil.in

ఐఐఎస్ఈఆర్, తిరుపతిలో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్).. ఆగస్టు 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమేటిక్స్, ఎర్త్ అండ్ క్లైమేట్ సైన్సెస్ ఇతర అనుబంధ సబ్జెక్టులు.
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణతతో పాటు జేజీఈఈబీఐఎల్ఎస్ 2023 లేదా డీబీటీ-జేఆర్ఎఫ్-ఏ/ఐసీఎంఆర్-జేఆర్ఎఫ్/డీబీటీ-బీఐఎన్‌సీ/యూజీసీ-సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/డీఎస్‌టీ-ఇన్‌స్పైర్-జేఆర్ఎఫ్ లేదా ఇన్‌స్పైర్ పీహెచ్‌డీ/ఎన్‌బీహెచ్ఎం పీహెచ్‌డీ/గేట్/జెస్ట్/నెట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.04.2024.
» **వెబ్‌సైట్:** www.iisertirupati.ac.in/admissions

ఇండియన్ బ్యాంక్‌లో.. ఎస్ఓ కొలువు

» మొత్తం 146 స్పెషలిస్ట్ ఆఫీసర్ కొలువులు
» డిగ్రీ, ఎంబీఏ, సీఏ అర్హతతో దరఖాస్తుకు అవకాశం
» రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక

బ్యాంకు కొలువుల అభ్యర్థులకు శుభవార్త! తాజాగా ప్రభుత్వ రంగ సంస్థ.. ఇండియన్ బ్యాంకు.. స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. నిర్దేశిత ప్రొఫెషనల్ డిగ్రీలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నియామకాలు ఖరారైతే.. స్కేల్-1, 2, 3, 4 వేతనం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. ఇండియన్ బ్యాంకు స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు, ఎంపిక విధానం, రాత పరీక్ష, సిలబస్ అంశాలు తదితర వివరాలు..

ప్రభుత్వ రంగ బ్యాంకులు.. ఇటీవల కాలంలో తాజా టెక్నాలజీ ఆధారంగా చేసుకుని సేవలందిస్తున్నాయి. సంప్రదాయ విభాగాలుగా భావించే క్రెడిట్ మేనేజర్ మొదలు ఐటీ, క్లౌడ్ టెక్నాలజీల్లోనూ ఆఫీసర్లు/మేనేజర్ల నియామకం చేపడుతున్నాయి. ఆయా అర్హతలు ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

మొత్తం 146 పోస్టులు

ఇండియన్ బ్యాంకు.. తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా మొత్తం 146 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ చేపట్టనుంది.

అర్హతలు వేర్వేరుగా

- వేర్వేరు విభాగాల్లో పోస్టులను పేర్కొన్న క్రమంలో.. అర్హతలను కూడా వేర్వేరుగా నిర్దేశించారు. అంతేకాకుండా పని అనుభవం కూడా ఉండాలని పేర్కొన్నారు. ఆయా పోస్టులను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్/సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎఫ్‌ఏ/ ఎంబీఏ ఉత్తీర్ణత ఉండాలి. వీటితోపాటు ఆయా పోస్టులను అనుసరించి మూడు నుంచి పదేళ్ల అనుభవం ఉండాలి. అన్ని పోస్టులకు ఎంబీఏ/పీజీడీఎం ఉంటే ప్రాధాన్యం లభిస్తుంది.



- **వయసు:** పోస్టులను అనుసరించి వయసు 21-45 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఇస్తారు.

స్కేల్-1, 2, 3, 4 వేతనాలు

అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను స్కేల్-1 (వేతన శ్రేణి రూ.36,000-రూ.63,840), మేనేజర్ పోస్టలను స్కేల్-2(వేతన శ్రేణి రూ.48,170-రూ.69,810), సీనియర్ మేనేజర్ పోస్టులను స్కేల్-3 (వేతన శ్రేణి రూ.63,840-రూ.78,230), చీఫ్ మేనేజర్ పోస్టులను స్కేల్-4(రూ.76,010-రూ.89,890)గా పేర్కొన్నారు.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టల భర్తీకి ఇండియన్ బ్యాంక్ రెండంచెల ఎంపిక విధానాన్ని అనుసరించనుంది. ఇందులో రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి. తొలిదశ రాత పరీక్షను మూడు విభాగాల్లో 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రొఫెషనల్ నాలెడ్జ్ /సంబంధిత సబ్జెక్ట్ (60 ప్రశ్నలు-60 మార్కులు); ఇంగ్లిష్ లాంగ్వేజ్ (20 ప్రశ్నలు - 20 మార్కులు); బ్యాంకింగ్ ఇండస్ట్రీ ప్రాధాన్యంగా జనరల్ అవేర్‌నెస్ (20 ప్రశ్నలు - 20 మార్కులు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక గంట 45 నిమిషాల వ్యవధిలో పరీక్ష ఉంటుంది.

ఇంటర్వ్యూకు 100 మార్కులు

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. అన్ రిజర్వ్‌డ్ కేటగిరీలో ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పున (1:3 నిష్పత్తిలో), రిజర్వ్‌డ్ కేటగిరీలో ఒక్కో పోస్ట్‌కు అయిదుగురిని చొప్పున (1:5 నిష్పత్తిలో) ఎంపిక చేసి.. పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. మొత్తం 100 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది.

తుది జాబితా.. వెయిటేజీ విధానం

నియామకాలను ఖరారు చేసే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. రాత పరీక్షలో మార్కులకు 80 శాతం వెయిటేజీ, ఇంటర్వ్యూ మార్కులకు 20 శాతం వెయిటేజీ కల్పిస్తారు. దానికి అనుగుణంగా తుది జాబితా రూపొందించి.. అందులో చోటు సాధించిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

ప్రొబేషన్ నిబంధన

నియామకాలు ఖరారు చేసుకున్న వారికి ప్రొబేషనరీ పీరియడ్ ఉంటుంది. స్కేల్ 1 హోదాలో నియమితులైన వారు రెండేళ్లు, స్కేల్-2, 3, 4 హోదాల్లో నియమితులైన వారికి ఏడాది ప్రొబేషన్ ఉంటుంది. అదే విధంగా రెండేళ్ల పాటు బ్యాంకులో విధులు నిర్వర్తించేలా సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.

సీజీఎం స్థాయికి

ఆయా పోస్టలలో నియమితులైన వారు.. భవిష్యత్తులో జీఎం, సీజీఎం స్థాయికి పదోన్నతులు పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా ఐటీ, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి స్పెషలైజ్డ్ విభాగాల్లో సీనియర్ మేనేజర్ హోదాలో నియమితులైన వారు జీఎం స్థాయికి, చీఫ్ మేనేజర్స్ హోదాలో చేరిన వారు సీజీఎం స్థాయికి చేరుకోవచ్చు. అసిస్టెంట్ మేనేజర్స్‌గా నియామకం పొందిన వారు ఏజీఎం స్థాయి వరకు చేరుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 1
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.indian-bank.in/career

ఎంపిక ప్రక్రియలో సక్సెస్ ఇలా

- ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగం కోసం ఎంచుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి.. బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. అంతేకాకుండా ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో మార్కుల కోసం బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- బ్యాంకింగ్ రంగం ప్రాధాన్యంగా ఉండే జనరల్ అవేర్‌నెస్ విభాగంలో రాణించడానికి కరెంట్ అఫైర్స్‌తోపాటు బ్యాంకింగ్ రంగంలో ఇటీవల కాలంలో పరిణామాలు, బ్యాంకింగ్ విధానం, టెర్మినాలజీ, రెపో రేటు, రిస్క్ రికవరీ విధానాలు తదితర అంశాలపై దృష్టి సారించాలి.
- పర్సనల్ ఇంటర్వ్యూలో ప్రధానంగా అభ్యర్థుల అకడమిక్, వర్క్ ప్రొఫైల్‌పై ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి ఇప్పటి వరకు చేస్తున్న పనిలో సాధించిన విజయాలు, అవి సంస్థల అభ్యున్నతికి తోడ్పడిన తీరు, తమ నైపుణ్యాలను బ్యాంకింగ్ రంగంలో అన్వయించే తీరుపై సమాధానాలు ఇచ్చే విధంగా సన్నద్ధమవ్వాలి.

స్టాక్ మార్కెట్లు		
దేశీ సూచీలు (గురువారం ముగింపు)		
సెన్సెక్స్ ▲	655	73,651
నిఫ్టీ ▲	203	22,327

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	16,379	▽ 20
డోజోన్స్	39,807	▲ 47
ఎఫ్‌టీఎస్ఈ 100	7,953	▲ 21
డాక్స్	18,505	▲ 27
షాంఘై	3,041	▲ 30
నికాయ్	40,369	▲ 201

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.95	93.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.23	106.78
€	యూరో	ఎస్‌బీఐ	89.30	91.68
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.64	55.75
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.64	55.56
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.64	64.35
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.30	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.78	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49


ఎక్కడైనా నగదు రహిత వైద్యం!



- అత్యవసరాల్లో అనుకూలం
- సమీపంలోని ఆస్పత్రిలోనే చికిత్స
- హాస్పిటల్ బ్లాక్ లిస్ట్‌లో ఉండకూడదు
- షరతుల మేరకే క్లెయిమ్ ఆమోదం
- లేదంటే రీయింబర్స్‌మెంట్‌కు వెళ్లాల్సిందే
- వీలున్నంత వరకు నెట్‌వర్క్‌కే ప్రాధాన్యం

ఆస్పత్రిలో చేరాల్సి వస్తే ఆదుకునే సాధనం హెల్త్ ఇన్సూరెన్స్. ఇందులో ఉన్న ముఖ్యమైన సదుపాయాల్లో ఒకటి నగదు రహిత వైద్యం. ముందస్తు ప్రణాళికతో లేదా అత్యవసర సమయాల్లో ఆస్పత్రిలో చేరాల్సి వచ్చినా ఈ సదుపాయం ఎంతో అక్కరకు వస్తుంది. సాధారణంగా బీమా సంస్థ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనే ఈ నగదు రహిత వైద్యం అందుబాటులో ఉండేది. నెట్‌వర్క్ జాబితాలో లేని ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకుంటే, సొంతంగా చెల్లింపులు చేసి తర్వాత రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ దాఖలు చేయాల్సి వచ్చేది. ఈ ఇబ్బందిని తప్పిస్తూ.. ఏ ఆస్పత్రిలో అయినా నగదు రహిత వైద్యం పొందేందుకు వీలుగా జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ఈ ఏడాది జనవరి నుంచి 'ఎక్కడైనా నగదు రహితం' పేరుతో కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించి విధి విధానాలేమిటో చూద్దాం.

బీమా సంస్థ నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లోనూ నగదు రహిత చికిత్స పొందడమే నూతన విధానంలోని సౌలభ్యం. ప్రతి బీమా సంస్థ నెట్‌వర్క్ హాస్పిటల్స్ పేరుతో ఒక జాబితా నిర్వహిస్తుంటుంది. ఆ జాబితాలోని ఏ హాస్పిటల్‌లో చికిత్స పొందినా బీమా సంస్థే నేరుగా చెల్లింపులు చేస్తుంది. కానీ, అన్ని సందర్భాల్లోనూ నెట్‌వర్క్ ఆస్పత్రిలోనే చికిత్స పొందాలంటే సాధ్యపడకపోవచ్చు. ప్రమాదానికి గురైనప్పుడు వేగంగా సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లడం వల్ల విలువైన ప్రాణాన్ని కాపాడుకోవచ్చు. ఆ ఆస్పత్రి బీమా నెట్‌వర్క్‌లో భాగంగా లేకపోతే? బిల్లు భారీగా వస్తే..? ఆ మొత్తాన్ని రోగి సంబంధీకులు సర్దుబాటు చేసుకోవాల్సి వస్తుంది. అలాగే, వర్షాల కారణంగా ట్రాఫిక్ జామ్ అయి, సత్వర వైద్యం అందాల్సిన సందర్భాల్లోనూ ఇదే పరిస్థితి ఎదురవుతుంది. అలాంటి తరుణంలో సమీపంలోని హాస్పిటల్‌కు వెళ్లక తప్పదు. ఆ సమయంలో ఎక్కడైనా నగదు రహితం ఉపయోగపడుతుంది. అత్యవసరమనే కాదు, ముందుగా అనుకుని నిర్ణీత సమయానికి తీసుకునే చికిత్సలకు సైతం నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు వెళ్లొచ్చు. కాకపోతే ఎక్కడైనా నగదు రహితం విధానం ఎలా పనిచేస్తుందో తెలుసుకోవడం అవసరం.



నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సిందే..

జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ తీసుకున్న తాజా నిర్ణయం అమల్లోకి రావడానికి ముందు కూడా కొన్ని బీమా సంస్థలు నాన్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యానికి అవకాశం కల్పించాయి. ఇప్పుడు ఐసీఐసీఐ లాంబార్డ్, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో, నేషనల్ ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరాలి, రిలయన్స్ జనరల్, బజాజ్ అలియాంజ్ జనరల్ సైతం నాన్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యానికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేశాయి. ముందస్తుగా నిర్ణయించుకుని, తీసుకునే చికిత్స విషయంలో బీమా సంస్థ లేదంటే థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్ (టీపీఏ)కు రెండు నుంచి మూడు రోజుల ముందు (48–72 గంటలు) తెలియజేయడం తప్పనిసరి. ఈ మెయిల్ లేదంటే ఇతర ఆన్‌లైన్ మార్గాల ద్వారా లేదంటే లిఖిత పూర్వకంగా బీమా సంస్థకు తెలియజేయవచ్చు. అత్యవసరంగా చికిత్స తీసుకోవాల్సి వస్తే కనుక నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో చేరిన 24 నుంచి 48 గంటల్లోపు (బీమా సంస్థ ఆధారంగా వేర్వేరు) విషయాన్ని తెలియజేయాలి.


నెట్‌వర్క్–నాన్ నెట్‌వర్క్

బీమా సంస్థ నగదు రహిత వైద్యం అందించేందుకు వీలుగా పలు ఆస్పత్రులతో ఒప్పందాలు కుదుర్చుకుంటుంది. ఇలా ఒప్పందానికి వచ్చిన ఆస్పత్రులు నెట్‌వర్క్ జాబితాలో ఉంటాయి. ఇలా ఒప్పందం చేసుకునే సమయంలోనే చికిత్సల ధరల విషయంలో బీమా సంస్థ ఆస్పత్రులతో సంప్రదింపులు నిర్వహిస్తుంది. దీనివల్ల బీమా సంస్థకు కొంత భారం తగ్గుతుంది. నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌తో ఈ అనుకూలత బీమా సంస్థలకు ఉండదు.

15 పడకలు తప్పనిసరి..

నగదు రహిత వైద్యం పొందేందుకు ఎంపిక చేసుకునే ఆస్పత్రిలో కనీసం 15 పడకలు (బెడ్స్) ఉండాలన్నది నిబంధన. హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ నిబంధనలకు అనుగుణంగా, హాస్పిటల్ అనే నిర్వచనానికి అనుగుణంగా నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్ పనిచేస్తూ ఉండాలి. గుర్తింపు కార్డులు, పాలసీ డాక్యుమెంట్లు, మెడికల్ రిపోర్ట్‌లు, ప్రిస్క్రిప్షన్లు, బిల్లులు నిర్దేశిత ఫార్మాట్‌లో బీమా సంస్థకు పంపించాల్సి ఉంటుంది. నగదు రహిత వైద్యానికి అనుమతించే ముందు నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్ నుంచి ఆమోద లేఖను చాలా బీమా సంస్థలు కోరుతున్నాయి. ఆస్పత్రి బిల్లులు నిజమైనవేనా? ప్రామాణిక అడ్మిషన్ ప్రక్రియ విధానాన్నే అనుసరిస్తున్నారా? ప్రమాణాలకు అనుగుణంగానే చికిత్సా విధానాలు ఉన్నాయా? అని బీమా సంస్థలు పరిశీలిస్తాయి. ఇక పాలసీకి సంబంధించి వెయిటింగ్ పీరియడ్ (కొన్ని వ్యాధుల చికిత్సా క్లెయిమ్‌లో వేచి ఉండాల్సిన కాలం), కోపే క్లాజ్, మినహాయింపులు, ముందస్తు వ్యాధుల నిబంధనల్లో ఎలాంటి మార్పు ఉండదని గమనించాలి. కొన్ని చికిత్సలకు సంబంధించి (ఉదాహరణకు కేటరాక్ట్) ఉప పరిమితులు ఉంటే, వాటి విషయంలోనూ నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్ పరంగా ఎలాంటి మార్పు ఉండదు. పాలసీలో ప్రత్యేకమైన రైడర్ తీసుకుంటే తప్ప కాటన్, ఫేస్ మాస్క్‌లు, సర్జికల్ గ్లోవ్‌లు, నెబ్యులైజేషన్ కిట్‌లకు పరిహారం రాదు. ఏవైనా అదనపు చార్జీలు (కవరేజీలోకి రానివి) విధిస్తే, పాలసీదారు సొంతంగా చెల్లించుకోవాలి.

చార్జీల పట్ల అవగాహన



నెట్‌వర్క్ ఆస్పత్రులు వివిధ రకాల చికిత్సలకు వసూలు చేసే చార్జీల వివరాలు బీమా సంస్థ రికార్డుల్లో ఉంటాయి. దీనివల్ల పాలసీదారు సొంత పాకెట్‌పై భారం పడదు. నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో చికిత్సలకు ఎంత చార్జీ వసూలు చేస్తారన్నది కీలకం అవుతుంది. నెట్‌వర్క్ హాస్పిటల్‌కు మించి నాన్ నెట్‌వర్క్ ఆస్పత్రి చార్జీ చేస్తే, అప్పుడు క్లెయిమ్ పూర్తిగా రాకపోవచ్చు. పైగా ఆస్పత్రి పడకలు, ఏ ప్రాంతంలో ఉందన్న దాని ఆధారంగా చికిత్సల ధరలు ఉంటాయి. ఉదాహరణకు ఒక చికిత్సకు నెట్‌వర్క్ హాస్పిటల్‌లో రూ.50,000 పరిమితి ఉందనుకోండి. అదే నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో ఇదే చికిత్సకు రూ.70,000 వేలు చార్జ్ చేస్తే, పాలసీదారు తాను సొంతంగా రూ.20,000 చెల్లించాల్సి వస్తుంది. అందుకని నగదు రహిత వైద్యం కోరుకునే వారు తమ పాకెట్ నుంచి పెద్దగా చెల్లించొద్దని భావిస్తే, అప్పుడు బీమా సంస్థ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు వెళ్లడం మంచిది. కొన్ని సందర్భాల్లో నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో నగదు రహిత వైద్యానికి సంబంధించి క్లెయిమ్ తిరస్కరణకు గురికావచ్చు. అలాంటప్పుడు పాలసీదారు సొంతంగా చెల్లించి, డిశ్చార్జ్ తర్వాత రీయింబర్స్‌మెంట్‌కు వెళ్లాల్సి వస్తుంది. రోగికి శరవేగంగా చికిత్స అవసరమైతే తప్పించి, మిగిలిన వాటికి నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌ను ఎంపిక చేసుకోకపోవడం మంచిది.

బ్లాక్ లిస్ట్‌లో ఉండకూడదు

అన్నింటికంటే ముఖ్యమైనది.. చికిత్స కోసం ఎంపిక చేసుకునే నాన్ నెట్‌వర్క్ ఆస్పత్రి బీమా సంస్థ బ్లాక్ లిస్ట్‌లో ఉండకూడదు. బ్లాక్ లిస్ట్‌లోని ఆస్పత్రిలో చేరడం వల్ల నగదు రహిత వైద్యం అందదు. రీయింబర్స్‌మెంట్‌కు కూడా అవకాశం ఉండదు. దీనివల్ల మొత్తానికే నష్టపోవాల్సి వస్తుంది. అందుకే అత్యవసరంగా చికిత్స అవసరమైనప్పుడు కూడా బీమా సంస్థ పోర్టల్‌కు వెళ్లి బ్లాక్ లిస్టెడ్ హాస్పిటల్స్ జాబితాను ఓ సారి పరిశీలించడం ఎంతో మంచిది. ఇక ముందస్తు ప్రణాళికతో తీసుకునే చికిత్సలకు బీమా సంస్థ నెట్‌వర్క్‌లోని హాస్పిటల్‌కు వెళ్లడమే మేలు. ఎందుకంటే నెట్‌వర్క్ ఆస్పత్రులు బీమా సంస్థ నిబంధనలకు అనుగుణంగా సేవలు అందిస్తుంటాయి. కనుక క్లెయిమ్ విషయంలో ఎలాంటి సమస్యలు దాదాపుగా ఎదురుకావు.

నెట్‌వర్క్ హాస్పిటల్‌తో లాభాలు



- నెట్‌వర్క్ (ఎంపానెల్డ్) ఆస్పత్రుల్లో టారిఫ్‌లు బీమా సంస్థతో కుదిరిన అంగీకారం మేరకు ఉంటాయి. చికిత్సల చార్జీలు నిర్దేశిత పరిమితుల పరిధిలోనే ఉంటాయి. దీంతో క్లెయిమ్‌కు సత్వర ఆమోదం లభిస్తుంది. వేగంగా డిశ్చార్జ్ కావచ్చు.
- నెట్‌వర్క్ హాస్పిటల్‌లో నగదు రహిత వైద్యానికి సంబంధించి క్లెయిమ్ పరిష్కారం సాఫీగా, వేగంగా జరుగుతుంది.
- నెట్‌వర్క్ ఆస్పత్రులు అన్నింటిలోనూ చికిత్సల నాణ్యత ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయి. దీంతో రోగులకు చికిత్సల తర్వాత సమస్యల రిస్క్ తగ్గుతుంది.
- ఆస్పత్రి, బీమా సంస్థ మధ్య విశ్వసనీయమైన బంధం వల్ల చికిత్సల బిల్లులను మరీ పెద్దవి చేసి చూపించడం ఉండదు. అనవసర ప్రక్రియలు, ఔషధాల వినియోగం ఉండదు. మోసాల రిస్క్ తగ్గుతుంది.

పీజీఐఎం ఇండియా రిటైర్మెంట్ ఫండ్..



పీజీఐఎం ఇండియా మ్యుచువల్ ఫండ్ తాజాగా రిటైర్మెంట్ ఫండ్‌ను ఆవిష్కరించింది. దీనికి సబ్‌స్క్రిప్షన్ ఏప్రిల్ 9న ముగుస్తుంది. సమీకరించిన నిధులను ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సాధనాలు, రీట్స్, ఇన్విట్స్, ఫిక్సిడ్ ఇన్‌కం సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మదుపుదారుల పదవీ విరమణ లక్ష్యాలకు అనుగుణంగా మెరుగైన రాబడులు అందించేందుకు ఫండ్ ప్రయత్నిస్తుంది. ఇందులో 5 ఏళ్లు లేదా పదవీ విరమణ వయస్సు వరకు (ఏది ముందైతే అది) లాకిన్ పీరియడ్ ఉంటుంది. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఈక్విటీ విభాగాన్ని వినయ్ పహాడియా .. డెట్, రీట్స్, ఇన్విట్స్ విభాగంలో పెట్టుబడులను పునీత్ పాల్ నిర్వహిస్తారు.

బీవోఐ రుణ వడ్డీ రేట్ల పెంపు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) రుణాలపై వడ్డీ రేట్లను 10 బేసిస్ పాయింట్లు (0.10 శాతం) పెంచింది. దీంతో రెపో ఆధారిత లెండింగ్ రేటు (ఆర్‌బీఎల్ఆర్) 9.35 శాతంగా ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఇవి ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని వివరించింది. రిజర్వ్ బ్యాంక్ ఏప్రిల్ 5న పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు బేస్ రేటు ఆధారిత వడ్డీ రేటు, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటును 5 బేసిస్ పాయింట్ల మేర పెంచుతున్నట్లు ఇండియన్ బ్యాంకు తెలిపింది. కొత్త రేట్లు ఏప్రిల్ 3 నుంచి అమల్లోకి వస్తాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	415–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403–00
విజయవాడ	403–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	380–00
వరంగల్	382–00
రిటైల్ ధర	4.40

ఖజానాకు అంచనాలను మించి డివిడెండ్లు

రూ. 63వేల కోట్లు చెల్లించిన ప్రభుత్వ రంగ సంస్థలు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ సంస్థల (సీపీఎస్ఈ) నుంచి ఖజానాకు బడ్జెట్ అంచనాలను మించిన స్థాయిలో డివిడెండ్లు అందాయి. 2023–24లో కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, పవర్ గ్రిడ్, గెయిల్ వంటి దిగ్గజాలు ఏకంగా రూ. 63,000 కోట్లు చెల్లించాయి. సవరించిన బడ్జెట్ అంచనాలకన్నా ఇది 26 శాతం అధికం. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రకారం 2023–24లో సీపీఎస్ఈల నుంచి రూ. 50,000 కోట్ల డివిడెండ్లు రావొచ్చని అంచనాలను సవరించారు. అయితే, పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం దీపమ్ వెబ్‌సైటు ప్రకారం కేంద్రానికి మొత్తం రూ. 62,929.27 కోట్లు వచ్చాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో (2022–23)లో డివిడెండ్ వసూళ్లు రూ. 59,952.84 కోట్లకు పరిమితమయ్యాయి. మార్చి నెలలో ఓఎన్‌జీసీ రూ. 2,964 కోట్లు, కోల్ ఇండియా రూ. 2,043 కోట్లు, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూ. 2,149 కోట్లు, ఎన్ఎండీసీ రూ. 1,024 కోట్లు, హెచ్ఏఎల్ రూ. 1,054 కోట్లు, గెయిల్ రూ. 1,863 కోట్లు చెల్లించాయి. సీపీఎస్ఈలు అధిక మొత్తంలో డివిడెండ్ల చెల్లించడమనేది వాటి పటిష్టమైన పనితీరును ప్రతిబింబిస్తుంది. ఇది రిటైల్, సంస్థాగత వాటాదారులకు లబ్ధి చేకూర్చడంతో పాటు ఆయా సంస్థల షేర్లపై ఆసక్తిని పెంచేందుకు కూడా ఉపయోగపడగలదు.



'టెలికం' కాల్స్‌తో జాగ్రత్త: డాట్ హెచ్చరిక



న్యూఢిల్లీ: కనెక్షన్లను డిస్‌కనెక్ట్ చేస్తామంటూ టెలికం శాఖ అధికారుల నుంచి వచ్చినట్లుగా అనిపించే ఫోన్ కాల్స్ విషయంలో జాగ్రత్త వహించాలని టెలికం శాఖ (డాట్) హెచ్చరించింది. ఇలాంటి మోసపూరిత కాల్స్ .. వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేసేందుకు, ఆర్థిక మోసాలు చేసేందుకు ఉద్దేశించినవై ఉంటున్నాయని తెలిపింది. అలాగే, విదేశీ నంబర్లతో ప్రభుత్వాధికారులు చేస్తున్నట్లుగా మోసపుచ్చే వాట్సాప్ కాల్స్‌కి సంబంధించి కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తమ తరఫున కాల్స్ చేయడానికి ఎవరికీ అనుమతినివ్వలేదని స్పష్టం చేసింది. ఇలాంటి మోసపూరిత కాల్స్ ఏమైనా వస్తే సంచార్ సాథీ పోర్టల్‌లోని 'చక్షు – రిపోర్ట్ సస్పెక్టెడ్ ఫ్రాడ్ కమ్యూనికేషన్స్'లో ఫిర్యాదు నమోదు చేయాలని డాట్ పేర్కొంది.

స్టాక్స్ వ్యూ

గల్ఫ్ ఆయిల్	ఐసీఐసీఐ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 939 టార్గెట్: రూ. 1,250

ఎందుకంటే: ప్రయివేట్ రంగంలోని పెట్రోలియం లూబ్రికెంట్స్ విభాగంలో దేశీయంగా గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా లిమిటెడ్ రెండో పెద్ద కంపెనీ. ప్రధానంగా ఆటోమోటివ్, ఇండస్ట్రియల్ లూబ్రికెంట్స్‌కు ప్రాధాన్యత నిస్తున్న కంపెనీ సుమారు 7–8 శాతం మార్కెట్ వాటాను ఆక్రమిస్తున్నట్లు అంచనా. గత మూడేళ్లుగా మార్కెట్ వాటాను పెంచుకోవడంపై దృష్టిపెట్టి ముందుకు సాగుతోంది. ఇదే కాలంలో లూబ్రికెంట్స్ పరిశ్రమ కొంతమేర మందగించినప్పటికీ కంపెనీ పురోభివృద్ధిని సాధించడం ప్రస్తావించదగ్గ అంశం! బ్రాండింగ్, పంపిణీలకు దన్నుగా నిలవడం ద్వారా అమ్మకాలను విస్తరిస్తోంది. అంతేకాకుండా డైవర్సిఫై ప్రణాళికల్లో భాగంగా ఇటీవల జోరు చూపుతున్న ఎలక్ట్రిక్ వాహన అనుబంధ విభాగాలపై కన్నేసింది. తద్వారా బ్యాటరీ, ఈవీ ఫ్లూయిడ్స్, చార్జర్ల విభాగాల్లోకి ప్రవేశించింది. వెరసి రానున్న మూడేళ్ల(2024–27)లో పరిశ్రమను మించిన పురోగతిని అందుకోగలదని భావిస్తున్నాం. వార్షిక ప్రాతిపదికన షేరువారీ ఆర్జన(ఈపీఎస్) 11.4 శాతం చొప్పున మెరుగుపడే వీలుంది. గతేడాది షేరు ధరలో ర్యాలీ వచ్చినప్పటికీ గ్లోబల్ కంపెనీలతో పోలిస్తే గల్ఫ్ ఆయిల్ సహేతుక స్థాయిలోనే ట్రేడవుతోంది. ఇక దేశీ చమురు, గ్యాస్ కంపెనీలతో పోలిస్తే భవిష్యత్‌లో షేరు రీరేటింగ్‌కు అవకాశముంది. అయితే లూబ్రికెంట్స్‌కు డిమాండ్ తగ్గడం, ఎగ్జిక్యూషన్‌లో జాప్యాలు, ప్రత్యర్థి కంపెనీల నుంచి పోటీపరమైన ఒత్తిడి వంటి అంశాలు షేరుపై ప్రతికూల ప్రభావాన్ని చూపవచ్చు.



వెల్‌స్పన్ లివింగ్	షేర్‌ఖాన్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 138 టార్గెట్: రూ. 181

ఎందుకంటే: గత కేలండర్ ఏడాది(2023)లో భారత్ నుంచి యూఎస్‌కు హోమ్ టెక్స్‌టైల్ ఎగుమతులు భారీగా బలపడ్డాయి. ప్రధానంగా దుప్పట్లు(బెడ్‌షీట్స్) 46 శాతం, టెర్రీ టవల్స్ 38 శాతం చొప్పున ఆక్రమించాయి. అంతక్రితం ఏడాది(2022)లో ఇవి వరుసగా 34 శాతం, 36 శాతంగా నమోదయ్యాయి. వెరసి గ్లోబల్ హోమ్ టెక్స్‌టైల్స్ విభాగంలో లభిస్తున్న అవకాశాల ద్వారా లబ్ది పొందుతున్న దిగ్గజాలలో వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ ముందు వరుసలో నిలుస్తోంది. మధ్యకాలానికి కంపెనీ యాజమాన్యం ఆశావహంగా స్పందిస్తోంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికల్లా రూ. 15,000 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు ఈ ఏడాది(2023–24) క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో 34 శాతం వాటాను సాధించిన ఎమర్జింగ్ బిజినెస్ 45 శాతానికి జంప్‌చేయగలదని అంచనా వేస్తోంది. అయితే ఇటీవల బలపడిన పత్తి(కాటన్) ధరలు, రెడీసీ ప్రాంతంలోని అలజడులు సమీప కాలంలో మార్జిన్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపే వీలుంది. కంపెనీకి కీలకమైన హోమ్ టెక్స్‌టైల్స్‌సహా ఫ్లోరింగ్ బిజినెస్ విస్తరణ కారణంగా 2025–26కల్లా 15 శాతం మార్జిన్లు సాధించవచ్చు. యాజమాన్యం సైతం ఈ రెండు విభాగాలలో ధరలు మెరుగుపడటం ద్వారా లాభదాయకత పుంజుకోగలదని ఆశిస్తోంది. ముడివ్యయాలు తగ్గడానికితోడు విదేశీ మార్కెట్ల నుంచి హోమ్ టెక్స్‌టైల్స్‌కు పెరగనున్న డిమాండ్ భవిష్యత్‌లో కంపెనీ పటిష్ట పనితీరుకు దోహదపడనున్నట్లు అంచనా వేస్తోంది. కంపెనీ సామర్థ్య విస్తరణ రానున్న కాలంలో చైనా+1 అవకాశాలకు దారి చూపనుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

అంతర్జాతీయ మ్యూచువల్ ఫండ్స్ ఎంపిక ఎలా?

నేను యూఎస్ లేదా గ్లోబల్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టాలని అనుకుంటున్నాను. ఫండ్స్ ఎంపిక విషయంలో ఎటువంటి విధానాన్ని అనుసరించాలి? వాటిల్లో ఎంత మేర ఇన్వెస్ట్ చేయాలి?

– వరుణ్ శర్మ

అంతర్జాతీయంగా పలు దేశాల్లో (భారత్ కాకుండా) ఇన్వెస్ట్ చేసే వాటిని ఇంటర్నేషనల్ ఫండ్స్ అని పిలుస్తారు. దేశీ ఫండ్స్ మంచి రాబడులను ఇస్తున్నప్పటికీ.. మంచి రాబడినిచ్చే అంతర్జాతీయ పథకాల్లోనూ కొంత మేర పెట్టుబడులు పెట్టుకోవడాన్ని పరిశీలించొచ్చు. దీనివల్ల పెట్టుబడులకు వైవిధ్యం ఏర్పడుతుంది. పిల్లలను ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపాలనుకునే తల్లిదండ్రులు ముందు నుంచే ఇంటర్నేషనల్ ఫండ్స్‌కు కొంత మేర పెట్టుబడులు కేటాయించుకోవాలి. దీనివల్ల విదేశీ కరెన్సీ రూపంలో ఎదురయ్యే రిస్క్‌లను అధిగమించొచ్చు. ఈ తరహా ఫండ్స్ ఎంపిక కోసం.. వివిధ రంగాలు, కంపెనీల్లో పెట్టుబడుల వైవిధ్యంతో ఉన్నవాటిని ఎంపిక చేసుకోవాలి. కేవలం ఒకే రంగంలో పెట్టుబడులు పెట్టే ఇంటర్నేషనల్ ఫండ్స్ దూరంగా ఉండాలి. ఇంటర్నేషనల్ ఫండ్స్ థీమ్యాటిక్ ఫండ్ లేదా కమోడిటీ ఫండ్ లేదా ఓ దేశానికే సంబంధించి పెట్టుబడులతో కూడిన పథకంలో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి. వీటిల్లో రిస్క్ ఎక్కువ. అప్పటి వరకు సానుకూలంగా ఉన్న రాబడులు ప్రతికూలంగా మారిపోవచ్చు. అందుకని వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోతో ఉన్న పథకాలను ఎంపిక చేసుకోవాలి.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

అంతర్జాతీయ కరెన్సీ మార్కెట్లో డాలర్ ఏటేటా బలపడుతోంది. 2017లో యూఎస్ డాలర్ రూపాయితో 65 దగ్గర ఉంటే, ఇప్పుడు 83కు చేరింది. ఐదేళ్లలో ఏటా 4 శాతానికి పైనే డాలర్ బలపడింది. అందుకుని డాలర్ మారకంలో విదేశీ ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం వల్ల రూపాయి క్షీణత నుంచి ప్రయోజనం పొందొచ్చు. మెరుగైన రాబడి అందుకోవచ్చు. ఇంటర్నేషనల్ ఫండ్స్‌ను మన ఆదాయపన్ను చట్టం నాన్ ఈక్విటీ పథకాలుగా పరిగణిస్తుంది. కనుక డెట్ పథకాలకు మాదిరే మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి వస్తుంది.

ఫండ్స్‌లో దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష లోపు ఉంటే పన్ను చెల్లించక్కర్లేదు. అయినా ఈ లాభాన్ని ఆదాయపన్ను రిటర్నుల్లో చూపించాలా?

– వివేక్

మీరు పన్ను రిటర్నులను నిబంధనల ప్రకారం దాఖలు చేయాల్సి ఉంటే, అందులో లాభ, నష్టాలను వెల్లడించాలి. స్టాక్స్, లేదా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను ఏడాదికి మించి కొనసాగించినప్పుడు వచ్చేవి దీర్ఘకాల లాభాలు. దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష వరకు ఉంటే పన్ను లేదు. అంతకుమించిన లాభం పైనే 10 శాతం పన్ను చెల్లించాలి. పన్ను రిటర్నులు దాఖలు చేయాల్సిన వారు ఈ వివరాలను విధిగా పేర్కొనాలి. వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)లో మూలధన లాభాల పన్ను వివరాలు ఉంటే, అవి పన్ను రిటర్నుల్లో ముందుగానే నింపి ఉంటాయి. ఒకవేళ మీ ఆదాయం బేసిక్ ఆదాయపన్ను మినహాయింపు పరిధిలోనే ఉంటే, అప్పుడు మీరు రిటర్నులు దాఖలు చేయక్కర్లేదు. కనుక మూలధన లాభాలను చూపించక్కర్లేదు. పాత పన్ను విధానంలో రూ.2.5 లక్షల వరకు పన్ను లేదు. 60 ఏళ్లు నిండిన వారికి ఇది రూ.3 లక్షలు, 80 ఏళ్లు నిండిన వారికి రూ.5 లక్షలుగా ఉంది.

క్లుప్తంగా...

నేటి నుంచి పాలిసెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల పెంపు లక్ష్యంగా విద్యార్థులకు ఉచితంగా పాలిసెట్–2024 శిక్షణ అందిస్తున్నట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి విద్యార్థులకు సమగ్ర శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. 2023–2024 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులతో పాటు సప్లిమెంటరీ పరీక్షలలో టెన్త్ పాసైన వారికి సైతం ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. 87 ప్రభుత్వ, 182 ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో ఏప్రిల్ 25 వరకు ఉచిత శిక్షణ కొనసాగుతుందన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో శిక్షణతోపాటు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేయనున్నట్టు వివరించారు.

ఆర్టీసీపై తప్పుడు రాతలు కట్టిపెట్టు రామోజీ

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి



సాక్షి, అమరావతి: ఈనాడు రామోజీరావు ఆర్టీసీపై తప్పుడు రాతలు మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కె.వెంకటరామిరెడ్డి చెప్పారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉద్యోగులు నష్టపోయారని ఈనాడు తప్పుడు వార్తలు రాయడాన్ని ఆయన ఆదివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్లే ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతోందన్నారు. ప్రతి నెలా జీతాల కోసం ప్రభుత్వం రూ.300 ఖర్చు చేస్తుండటంతో ఆర్టీసీపై ఆర్థికభారం తప్పి లాభాల బాటలోకి వచ్చిందన్నారు. దాంతోనే సీసీఎస్ బకాయిలు రూ.272 కోట్లు, పీఎఫ్ బకాయిలు రూ.900 కోట్లు, 2017 పీఆర్సీ బకాయిలు రూ.1,330 కోట్లు చెల్లించగలిగిందని చెప్పారు. ప్రభుత్వంలో విలీనం చేయడంతోనే ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ ఉద్యోగులు కూడా డీఏలు పొందుతున్నారన్నారు. కరోనా సమయంలో తెలంగాణ ఆర్టీసీలో పనిచేసిన రోజులకే ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలు చెల్లించారని, ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క రోజు కూడా జీతం కోత పెట్టకుండా పూర్తి జీతాలు చెల్లించారని గుర్తు చేశారు. 2016 తరువాత చనిపోయిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వం కారుణ్య నియామకాలు ఇవ్వలేదని, కానీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత వందల మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించారన్నారు. విలీనానికి ముందు నైట్ అవుట్ కింద డీఏ, టీఏ రూ.70 నుంచి రూ.100 ఉండేదని, ఇప్పుడు రూ.300 నుంచి రూ.500కు పెరిగాయన్నారు.

తెలంగాణ

ఫోన్ ట్యాపింగ్ కేసులో టీవీ-5 సాంబశివరావుపై ఫిర్యాదు

- ప్రణీత్‌రావు, ప్రభాకర్‌రావు, భుజంగరావులపై కూడా..
- తనను వేధించారన్న సంధ్య కన్వెన్షన్ అధినేత శరణాల శ్రీధర్‌రావు

బంజారాహిల్స్ (హైదరాబాద్): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులైన ప్రణీత్‌రావు, ప్రభాకర్‌రావు, భుజంగరావుతోపాటు టీవీ–5 యాంకర్ సాంబశివరావు తనను వేధింపులకు గురిచేశారని.. వారిపై చర్యలు తీసుకోవాలంటూ ప్రముఖ వ్యాపారవేత్త, సంధ్య కన్వెన్షన్ అధినేత శరణాల శ్రీధర్‌రావు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్‌లో నివసించే శరణాల శ్రీధర్‌రావు పలు వ్యాపార సంస్థలు నిర్వహిస్తున్నారు. 2017–18 మధ్య టీవీ–5 సాంబశివరావు.. శ్రీధర్‌రావు వద్దకు వచ్చి 'మీకు వ్యాపారంలో కావాల్సిన సహాయం చేస్తా.. ఆర్థిక కష్టాల్లో ఉన్న నన్ను ఆదుకోవాలి' అని కోరాడు. అందుకు శ్రీధర్‌రావు ఒప్పుకొని సాంబశివరావు ఉంటున్న ఇంటికి సైతం నెలనెలా కిరాయి చెల్లిస్తూ వచ్చారు. అలాగే సాంబశివరావు జీవన భృతి కోసం తనకు చెందిన కమర్షియల్ ప్లాట్లలో ఒక దాన్ని పెట్రోల్ బంకు పెట్టుకోవడానికి ఇచ్చారు. అయితే సాంబశివరావు కొన్ని సెటిల్‌మెంట్ల వ్యవహారంపై పోలీస్ అధికారి భుజంగరావు వద్దకు శ్రీధర్‌రావును తీసుకువెళ్లగా ఆ వాతావరణం నచ్చక ఆయన వెనక్కి వచ్చేశారు. దీంతో వ్యాపారం ఎలా చేస్తావో చూస్తామంటూ శ్రీధర్‌రావును బెదిరించారు. ఆయన వ్యాపారాల్లో తలదూర్చడం, పోలీస్‌స్టేషన్లలో తప్పుడు ఫిర్యాదులు చేసి నమోదు చేయించడం వంటివి చేశారు. తద్వారా శ్రీధర్‌రావును దారికి తెచ్చుకొని ఆర్థిక లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేశారు. వ్యాపార లావాదేవీల గురించి శ్రీధర్‌రావు ఎవరితో మాట్లాడినా వారి ఫోన్ నంబర్లు సేకరించడం, ఆపై శ్రీధర్‌రావుకు, వారికి మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరించడం వంటి చర్యలకు సాంబశివరావు, భుజంగరావు పాల్పడుతూ వచ్చారు. సెల్‌ఫోన్‌ను ట్యాప్ చేయించి శ్రీధర్‌రావు ప్రతి కదలికను తెలుసుకొని తదనుగుణంగా ఆయన్ను మానసికంగా హింసించారు. ఈ వ్యవహారంలో సాంబశివరావు, భుజంగరావు, ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు హస్తం ఉన్నట్లు శ్రీధర్‌రావు పోలీసులను ఆశ్రయించారు.

కూటమిలో కుతకుత

రాష్ట్రంలో ఎక్కడా నేతల మధ్య కనిపించని ఐక్యత

క్షేత్రస్థాయిలో నాయకుల అసంతృప్తి ప్రకంపనలు

- అభ్యర్థులకు సహకరించేందుకు అసంతృప్తులు ససేమిరా
- జగ్గయ్యపేటలో తాతయ్యకు టికెట్‌పై మండిపడుతున్న కేడర్
- అధిష్టానంపై అసంతృప్తితో టీడీపీకి మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషా రాజీనామా
- పాడేరులో అభ్యర్థి ఎంపికపై శ్రేణుల వ్యతిరేకత
- అనంతపురం అర్బన్‌లో టీడీపీ రెబల్‌గా పోటీ చేయనున్నట్టు ప్రభాకర చౌదరి వెల్లడి
- రంపచోడవరంలో మిరియాల శిరీషకు తమ్ముళ్ల నుంచి నిరసన సెగ
- నందిగామ అభ్యర్థి తంగిరాల సౌమ్యను అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- గుంతకల్లులో గుమ్మనూరుపై దేశం శ్రేణుల గుర్రు
- మార్కాపురంలో టీడీపీ, బీజేపీల మధ్య ఫ్లెక్సీల చిచ్చు
- అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటిపై జనసేన నాయకుల ఆగ్రహం
- అరకు బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతపై స్వపార్టీలోనే నిరసన

సాక్షి నెట్‌వర్క్: క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో కుమ్ములాటలు చల్లారడం లేదు. టికెట్ ఆశించి భంగపడినవారు అక్కడి అభ్యర్థులకు సహకరించడానికి ససేమిరా అంటున్నారు. టికెట్ దక్కించుకున్నవారితో నేరుగా వాదులాటకు దిగుతున్నారు. కొందరు నాయకులు అభ్యర్థిత్వాల ఎంపికకు నిరసనగా రాజీనామా చేస్తుండగా... మరికొందరు ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల ప్రచారాన్ని అడ్డుకుంటున్నారు. తమకు నచ్చని వ్యక్తులకు అధిష్టానం టికెట్ ఖరారు చేయడంతో వారిని ఎలాగైనా ఓడించాలనే పట్టుదలతో పావులు కదుపుతున్నారు. జరుగుతున్న పరిణామాలు కూటమి నేతలకు శిరోభారంగా మారుతున్నాయి. పరిస్థితులు ఇలానే కొనసాగితే ఆయా అభ్యర్థులకు ఎదురుగాలి తప్పదని శ్రేణులు ఖరాకండీగా చెబుతున్నాయి. జగ్గయ్యపేట తెలుగుదేశం పార్టీలో అంతర్గత కుమ్ములాటలు తారస్థాయికి చేరాయి. అక్కడ గత ఎన్నికల్లో ఓడిపోయిన శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)కు టికెట్ ఇవ్వడాన్ని మాజీమంత్రి నెట్టెం రఘురాం, బీఆర్కే చానల్ యజమాని, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లా రామకృష్ణ వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. నియోజకవర్గంలో సుమారు 40 వేల ఓటుబ్యాంకు కలిగిన కమ్మ సామాజికవర్గానికి గడచిన నాలుగు పర్యాయాల నుంచి టికెట్ కేటాయించకుండా అవమానిస్తోందని ఆ సామాజికవర్గ నేతలు మండిపడుతున్నారు.



పెద్దాపురంలో తంగిరాల సౌమ్య కారును అడ్డగించి నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు

పాడేరు అసెంబ్లీ టికెట్‌పై కొనసాగుతున్న టీడీపీ నిరసన

పాడేరు అసెంబ్లీ టీడీపీ టికెట్ కిల్లు రమేష్‌నాయుడుకు కేటాయించడంపై ఆ పార్టీ శ్రేణులు నిరసన కొనసాగిస్తున్నారు. జీసీసీ మాజీ చైర్మన్ ఎం.వి.ఎస్.ప్రసాద్‌కు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కొయ్యూరులో ఆదివారం ఆ పార్టీ నేతలు పార్టీ జెండాలతో నిరసన తెలిపారు. రెండు దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న ప్రసాద్‌కు అన్యాయం చేయడం తగదని అధిష్టానం నిర్ణయంపై మండిపడ్డారు. రమేష్ నాయుడు ఎవరో కనీసం కార్యకర్తలకు కూడా తెలియదని, అలాంటి వ్యక్తికి సీటు ఇవ్వడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇండిపెండెంట్‌గా బరిలో దిగేందుకు ప్రభాకర్ చౌదరి నిర్ణయం

అనంతపురం అర్బన్ నుంచి అభిమానులు కోరితే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు సిద్ధమని టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర చౌదరి వెల్లడించారు. ఆదివారం ఆయన అనంతపురంలోని కమ్మభవన్‌లో పార్టీ కార్యకర్తలు, తన వర్గీయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ అక్కడ టీడీపీ అభ్యర్థిగా దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను ఎంపిక చేయడం సరికాదన్నారు. ఐదేళ్లు పార్టీ కోసం కష్టపడి ఆస్తులు కోల్పోయానని, కేసుల్లో ఇరుక్కున్నానని, అయినా అధిష్టానం తన శ్రమను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



కొయ్యూరులో నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

- అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిని మిరియాల శిరీషా దేవిని తక్షణమే మార్చాలని రాజవొమ్మంగి మండలంలోని 19 పంచాయతీలకు చెందిన టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రాజవొమ్మంగిలో వారు సమావేశమై అభ్యర్థిని మార్చకుంటే రాజీనామా చేస్తామని హెచ్చరించారు.
- ఎన్టీఆర్ జిల్లా నందిగామ కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామంలో ఆదివారం రాత్రి 'మన పల్లెకు మన సౌమ్య' కార్యక్రమం ముగించుకుని వస్తుండగా కార్యకర్తలు అడ్డగించారు. గ్రామంలో నిర్వహించే కార్యక్రమాలకు పార్టీ అధ్యక్షుడికి సమాచారం ఇవ్వకపోవడంపై మహిళలు మండిపడ్డారు.
- అనంతపురం జిల్లా గుంతకల్లు అసెంబ్లీ టీడీపీ టికెట్ గుమ్మనూరు జయరామ్‌కు కేటాయించడాన్ని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.జితేంద్రగౌడ్ తప్పు పట్టారు.
- గుంతకల్లులోని తన కార్యాలయంలో పార్టీ క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అధినేత పునరాలోచన చేయకపోతే దేనికైనా సిద్ధంగా ఉండాలని తన వర్గీయులకు పిలుపునిచ్చారు.



మార్కాపురంలో పురందేశ్వరి ఫొటోలు లేని టీడీపీ ప్రచార వాహనం

టీడీపీ, బీజేపీ మధ్య ఫ్లెక్సీల రగడ

ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఆదివారం నిర్వహించిన చంద్రబాబు ప్రజాగళం యాత్ర సభ టీడీపీ, బీజేపీల మధ్య చిచ్చుపెట్టింది. టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఫొటో లేకపోవడంపై ఆ పార్టీ బీజేవైఎం రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ జి.వి.రెడ్డి, టీడీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఇన్‌చార్జి కె.వి.రమణారావు కూడా టీడీపీ నేతల తీరును ఎండగట్టారు. పేరుకే కూటమిలో ఉన్నప్పటికీ తమకు ఏమాత్రం టీడీపీ నాయకులు విలువ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

- అరకు ఎంపీ టిక్కెట్ ఆర్థిక నేరస్తురాలైన కొత్తపల్లి గీతకు ఎలా ఇచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిపై ఆ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు నిమ్మక జయరాజ్ మండిపడ్డారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గీత నిజమైన ఎస్టీ కాదని కూడా చెప్పారు.
- అద్దంకి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ జనసేన కార్యకర్తలను విస్మరిస్తున్నారని పార్టీ అద్దంకి మండల కార్యదర్శి సాధు వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సంతమాగులూరు మండలంలో ఎన్నికల ప్రచారంలో ఉద్దేశ పూర్వకంగానే జనసైనికులను దూరం పెడుతున్నారని ఆరోపించారు.

టీడీపీకి మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషా రాజీనామా



తన రాజీనామా లేఖను చూపుతున్న కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా

కదిరి: తెలుగుదేశం పార్టీకి కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా రాజీనామా చేశారు. ఈ మేరకు ఆదివారం కదిరిలో తన రాజీనామా లేఖను మీడియాకు విడుదల చేశారు. చంద్రబాబునాయుడుకు ముస్లింలంటే మొదటినుంచీ పొసగడం లేదనీ ఆయన మాటలు నమ్మి 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన టీడీపీలో చేరితే మంత్రి పదవి ఇస్తానని చెప్పి మోసగించారని మండిపడ్డారు. ఇప్పుడు కదిరి అసెంబ్లీ టికెట్ ఇస్తానని చెప్పి మాట తప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీలో ఎన్నో అవమానాలు భరించాననీ, ఇక ఆ పార్టీలో కొనసాగలేననీ స్పష్టం చేశారు. సోమవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు వెల్లడించారు. స్థానికంగా తనతో పాటు తనను నమ్ముకున్న ఎంతోమంది కార్యకర్తలను అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు కొందరు ఇబ్బందులకు గురిచేస్తుంటే.. ఆ క్లిష్ట పరిస్థితుల్లో తనను నమ్ముకున్న వారికి న్యాయం చేసేందుకు ఆనాడు తాను టీడీపీలో చేరాల్సి వచ్చిందని చాంద్‌బాషా వివరించారు. టీడీపీలో తనకు అడుగడుగునా అవమానాలు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల చంద్రబాబు కదిరిలో ఇఫ్తార్ విందులో పాల్గొంటే తనకు ఆహ్వానం కూడా లేదన్నారు. లోకేశ్ కదిరిలో పాదయాత్రకు వచ్చినప్పుడు కూడా మైనార్టీల సదస్సులో తనకు కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



మోపిదేవిలో స్వామివారి చిత్రపటం అందుకుంటున్న జస్టిస్ మల్లికార్జునరావు దంపతులు

మోపిదేవి: కృష్ణాజిల్లా మోపిదేవిలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన న్యాయమూర్తి నాగపుట్టలో పాలుపోసి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా, ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

వడగాడ్పుల వార్నింగ్ బెల్..

- వచ్చే నాలుగు రోజులూ 3–5 డిగ్రీలు పెరిగే అవకాశం
- రాయలసీమలో నెలరోజుల ముందే ప్రభావం
- కోస్తాంధ్రలోనూ పెరగనున్న ఉష్ణతాపం
- పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోనూ తీవ్రతరం



సాక్షి, విశాఖపట్నం: మునుపెన్నడూ లేనివిధంగా నెలరోజుల ముందుగానే రాష్ట్రంలో వడగాడ్పులు వార్నింగ్ బెల్ మోగిస్తున్నాయి. తొలుత ఇవి రాయలసీమతోనే మొదలుకానున్నాయి. దీని ఫలితంగా ఏప్రిల్ ఆఖరి నాటి ఉష్ణోగ్రతలు ఆరంభంలోనే నమోదు కానున్నాయి. సాధారణంగా మార్చి ఆఖరు, ఏప్రిల్ మొదటి వారం వరకు రాష్ట్రంలో సాధారణంగా పగటి ఉష్ణోగ్రతలు 34–39 డిగ్రీలకు మించవు. కానీ, రాష్ట్రంలో పలుచోట్ల అప్పుడే 38–42 డిగ్రీల మధ్య రికార్డవుతున్నాయి. అంటే.. ఇవి సాధారణంకంటే 3–4 డిగ్రీలు అధికం. ఈ నేపథ్యంలో.. సోమవారం నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింతగా తీవ్రం కానున్నాయి. ముఖ్యంగా రాయలసీమలో వీటి తీవ్రత అధికంగా ఉండనుంది. రానున్న నాలుగు రోజులు వైఎస్సార్, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40–43 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆదివారం నాటి బులెటిన్‌లో వెల్లడించింది. అలాగే, ఉత్తరాంధ్రలోని పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోనూ 40–44 డిగ్రీలకు చేరుకోవచ్చని తెలిపింది. వీటి ఫలితంగా ఆయా జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయని, ఆ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇంకా పల్నాడు జిల్లాలో 40–42, ప్రకాశం, శ్రీకాకుళం, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో 40–41 డిగ్రీల చొప్పున రికార్డయ్యే అవకాశం ఉంది. ఇక దక్షిణ, ఉత్తర కోస్తాంధ్రల్లో ఉష్ణతాపం, తేమతో కూడిన అసౌకర్య వాతావరణం ఉంటుందని ఐఎండీ తెలిపింది.

ఉత్తర, కోస్తాంధ్రలో..

మరోవైపు.. వడగాడ్పుల ప్రభావం ఆదివారం నుంచే మొదలైంది. రాష్ట్రంలో అత్యధికంగా నంద్యాల, అనంతపురం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 42 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇంకా కర్నూలు, కడప, తూర్పు గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో 41, నందిగామ, జంగమహేశ్వరపురం, విజయనగరం, ఏలూరు, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రానున్న రోజుల్లో ఇవి మరింతగా పెరుగుతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆదివారం తెలిపింది.

'ప్రగతి' రథంపై 'పచ్చ' బురద

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం హయాంలో నెలనెలా అప్పులు చేస్తూ, డొక్కు బస్సులతో ముక్కుతూ మూలుగుతూ నడిచే రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి బాటలో నడిపించారు. ఉద్యోగులకు ఇచ్చిన మాటను నెరవేరుస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా సిబ్బందికి మేలు చేయడమే కాకుండా, సంస్థపై పెను ఆర్థిక భారాన్ని తొలగించారు. సీఎం వైఎస్ జగన్ చర్యలతో ఆర్టీసీ ఇప్పుడు కొత్త బస్సులతో కళకళలాడుతోంది. ఉద్యోగులందరూ నెలనెలా సక్రమంగా జీతాలు, అలవెన్సులు పొందుతూ సంతోషంగా ఉన్నారు. రాష్ట్రంలో ఏ ఆర్టీసీ ఉద్యోగిని అడిగినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వారికి చేసిన మేలును వివరిస్తారు. కానీ, రామోజీ నేతృత్వంలోని పచ్చ మీడియా, పచ్చ పార్టీలకు కావాల్సింది ఇది కాదు. ఆర్టీసీ ఉద్యోగులు, ఆ సంస్థ నిత్యం సమస్యలతో సతమతమవుతుంటే చూసి ఆనందించే బ్యాచ్ ఇది. సహజంగానే వారికి మంచి అనేది నచ్చదు కాబట్టి ఈనాడులో రామోజీ ఆర్టీసీపై ఓ కుట్రపూరిత బురద కథనాన్ని అచ్చేశారు. అవాస్తవాలు, అభూతకల్పనలతో ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించారు. ఆర్టీసీ సాధించిన ప్రగతి ఏమిటో ఓ సారి చూద్దాం..



1,406 కొత్త బస్సులు కొనుగోలు

దశాబ్దాలుగా ఆర్టీసీ కొత్త బస్సులు కొనలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీ కొత్త బస్సుల కొనుగోలు వేగవంతం చేసింది. 2019 – 20లో 406 బస్సులు కొనుగోలు చేసింది. పాత బస్సుల స్థానంలో 900 సరికొత్త డీజిల్ బస్సులను ప్రవేశపెట్టింది. అంతేకాదు రాష్ట్రంలో తొలిసారిగా ఇ–బస్సులను ప్రవేశపెట్టింది. తిరుమల – తిరుపతి ఘాట్‌రోడ్డుతో పాటు తిరుపతి సమీప పట్టణాల్లో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టిన ఘనత కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే. రెండేళ్లపాటు కోవిడ్ ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ 2019 నుంచి 2023 మధ్య ఆర్టీసీ 1,406 కొత్త బస్సులను కొనుగోలు చేసింది. తాజాగా 1,500 కొత్త డీజిల్ బస్సుల కొనుగోలు ప్రక్రియను చేపట్టింది. ఆర్డర్లు కూడా జారీ చేసింది. మరో 1,125 డీజిల్ బస్సుల కొనుగోలు చేయనుంది. మరో వేయి విద్యుత్ బస్సుల కొనుగోలుకు నిర్ణయించింది. 2024 – 25లో 950 విద్యుత్ బస్సులతోపాటు రానున్న ఐదేళ్లలో దశలవారీగా 7వేల విద్యుత్ బస్సుల కొనుగోలు ప్రణాళికను ఆర్టీసీ ఆమోదించింది. మరోవైపు కొత్త బస్సుల తయారీకి బిల్డింగ్ యూనిట్లు ప్రారంభించింది.

ఉన్నత ప్రమాణాలతో బస్సుల నిర్వహణ

బస్సుల సక్రమ నిర్వహణపై ఆర్టీసీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 15 ఏళ్లు పూర్తి చేసుకున్న 214 పాత బస్సులను తొలగించింది. మరోవైపు బస్సుల మెరుగైన నిర్వహణకు ఉన్నత ప్రమాణాలను పాటిస్తోంది. బస్సుల విడిభాగాల కొనుగోలు, ఇతర నిర్వహణ వ్యయం కోసం గత నాలుగేళ్లలో ఆర్టీసీ పూర్తిస్థాయిలో నిధులు కేటాయించింది. గత ఐదేళ్లలో నిర్వహణ నిధులిలా..

సంవత్సరం	కేటాయించిన నిధులు
2019 - 20	రూ. 163.11 కోట్లు
2020 - 21	రూ. 91.65 కోట్లు
2021 - 22	రూ. 168.51 కోట్లు
2022 - 23	రూ. 231.29 కోట్లు
2023 - 24	రూ.258.32 కోట్లు

2020–21, 2021–22లో కోవిడ్ మొదటి, రెండో వేవ్‌లలో ఆర్టీసీ బస్సు సర్వీసులను బాగా కుదించింది. దాంతో స్పేర్ పార్టుల కోసం బడ్జెట్ ప్రతిపాదనలు తగ్గాయి. 2021–22, 2022–23, 2023–24లో పూర్తిస్థాయిలో బస్సులను పునరుద్ధరించింది. అందుకు తగ్గట్టుగా ప్రత్యేక నిర్వహణ వ్యయం కింద రూ.50 కోట్లు ఖర్చు చేసింది.

ఉద్యోగుల జీవితాల్లో నవోదయం

2019కి ముందు ఆర్టీసీ చరిత్ర మొత్తం జీతాల కోసం నెలనెలా అప్పులు చేయడమే అన్నట్టుగా ఉండేది. ఉద్యోగుల జీతాల కోసం నెలకు అయ్యే ఖర్చు దాదాపు రూ.300 కోట్లు అప్పు చేస్తేనే చెల్లింపులు అన్నట్లుగా ఉండేది. ఆ అప్పుల మీద ఏడాదికి వడ్డీల భారమే దాదాపు రూ.350 కోట్లు. కానీ సీఎం వైఎస్ జగన్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో సంస్థ దశ, దిశ మారిపోయాయి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే ఆర్టీసీ ఉద్యోగులకు కూడా ప్రభుత్వం నంబర్లు కేటాయించి సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు నెలనెలా సక్రమంగా చెల్లిస్తోంది. ఇందుకోసం ఏడాదికి రూ.3,600 కోట్ల భారాన్ని మోస్తోంది. కరోనా కారణంగా రెండేళ్లపాటు ఆర్టీసీ రాబడి గణనీయంగా తగ్గినప్పటికీ, ఉద్యోగుల జీతాల చెల్లింపుల్లో ఎటువంటి లోటు రాలేదు. జీతాల భారం లేకపోవడంతో ఆర్టీసీ క్రమంగా నష్టాల ఊబి నుంచి బయటపడుతోంది. 2020 జనవరి నాటికి ఆర్టీసీకి దాదాపు రూ.4 వేల కోట్ల అప్పులుండగా, ప్రభుత్వం జీతాలు చెల్లిస్తుండటంతో ఇప్పటికే ఆర్టీసీ రూ.2 వేల కోట్ల అప్పులు తీర్చేసింది.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం అందిస్తున్న మరిన్ని ప్రయోజనాలు

- పీఎఫ్ చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయి.
- ఆర్టీసీ ఉద్యోగుల పరపతి సహకార సొసైటీకి 2014 నుంచి ఉన్న బకాయిలు రూ.200 కోట్లను యాజమాన్యం చెల్లించింది. దాంతో సొసైటీ ద్వారా ఉద్యోగులు కొత్తగా రుణాలు పొందుతున్నారు.
- ఆర్టీసీ ఉద్యోగులకు కార్పొరేట్ శాలరీ (ప్రమాద బీమా) ప్యాకేజీని మొదట రూ.45 లక్షలకు, ఆ తర్వాత ఏకంగా రూ.1.10 కోట్లకు ప్రభుత్వం పెంచడం విశేషం.
- ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచింది.
- 2020 జనవరి తరువాత రిటైరైన ఉద్యోగుల గ్రాట్యుటీ కోసం రూ.23.25 కోట్లు, ఉద్యోగ విరమణ ప్రయోజనాల కోసం రూ.271.89 కోట్లు ప్రభుత్వం కేటాయించింది.
- ఏపీ గవర్నమెంట్ ఇన్స్యూరెన్స్ స్కీమ్ ద్వారా 55 ఏళ్లకంటే ఎక్కువ వయసు ఉన్న 44,500 మందికి ప్రయోజనం కలుగుతోంది. ఈ పథకాన్ని ఆర్టీసీ ఉద్యోగులకూ వర్తింపజేశారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను కూడా ఉద్యోగులు పొందుతున్నారు.
- 2016 నుంచి పెండింగులో ఉన్న కారుణ్య నియామకాలను ప్రభుత్వం చేపట్టింది.
- 2020 జనవరి 1 తరువాత అనారోగ్య సమస్యలతో ఉద్యోగ విరమణ చేసిన 100 మంది ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో అర్హులకు ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.
- 2016 జనవరి 1 నుంచి 2019 డిసెంబర్ 31 మధ్య మరణించిన 845 మంది ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో అర్హులకు, 2020 జనవరి 1 తరువాత మరణించిన 955 మంది ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులకు కారుణ్య ఉద్యోగాలిచ్చింది.
- ఉద్యోగుల డిమాండ్ మేరకు ఆర్టీసీలో రెండు కేటగిరీలుగా పదోన్నతుల విధానాన్ని ఆమోదించింది. ప్రభుత్వంలో విలీనానికి ముందు ఉన్న ఉద్యోగులకు ఆర్టీసీ సర్వీసు నిబంధనల ప్రకారం, ఆ తరువాత చేరిన ఉద్యోగులకు ప్రభుత్వ సర్వీసు నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పిస్తారు.
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ, ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రం జీతంతోపాటే అలవెన్స్‌లను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.